వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

VEEKSHANAM, TELUGU MONTHLY

సంపుటి : 20 సంచిక : 4 హైదరాబాద్ 245 ఏప్రిల్ 2022 పేజీలు : 68 రు. 25

- అప్పులు, అమ్మకాలు కలిస్తే తెలంగాణ బడ్జెట్
- సంక్షేమం పేరిట రుణం ఆంధ్రప్రదేశ్ బడ్జెట్
- హిజాబ్ వివాదం లౌకిక వాదానికి సవాల్
- పుస్తకం జప్తు చెల్లదన్న హైకోర్టు తీర్పు
- ఎన్నికల ఫలితాలు హిందుత్వకు ఆమోదమేనా?
- కార్ల్ మార్క్స్ 'కాపిటల్' నిత్య ప్రాసంగికత
- మన కాలపు సామ్రాజ్యవాద యుద్ధం

పోస్టులో వీక్షణం అందుకుంటున్న మిత్రులకు...

పోస్టల్ సర్వీస్ ద్వారా వీక్షణం అందుకుంటున్న మిత్రుల నుంచి చాలా ఫిర్యాదులు వస్తున్నాయి. చాలా నెలలుగా పత్రిక రావడం లేదనీ, ఈ నెల పత్రిక అందలేదనీ, ఆలస్యంగా అందిందనీ, చిరిగిపోయి, చదువుకోవడానికి వీల్లేని స్థితిలో అందిందనీ రకరకాల ఫిర్యాదులు. ఈ సందర్భంలో పాఠక మిత్రులతో పంచుకోవలసిన విషయాలున్నాయి:

♦ ప్రపంచీకరణ తర్వాత పోస్టల్ సర్వీసులో సిబ్బంది కొరత విపరీతంగా పెరిగిపోయింది. గతంలో ఉన్న సిబ్బందిలో సగమో, మూడో వంతో మాత్రమే ఇప్పుడు పని చేస్తున్నారు. వారి మీద పని భారం వల్ల మొట్టమొదట దెబ్బతినేది పత్రికలే.

♦ కరోనా తర్వాత పోస్టల్ సిబ్బంది మీద పని భారం మరింత పెరిగి, వారి పని తీరు విచారకరమైన స్థితికి చేరింది.

♦ ఆ క్రమంలో మొదటి గొడ్డలివేటు పత్రికల మీద పడింది. గతంలో ఉండిన భారీ రాయితీలను బాగా తగ్గించారు, పత్రికలు ఎప్పుడు పోస్ట్ చేస్తే రాయితీ వర్తిస్తుందో, ఎలా ప్యాక్ చేయాలో నిబంధనలను కఠినం చేశారు. పత్రిక ప్యాక్ చేయకుండా దానికదిగానే ఉంచి, చివరి అట్ట మీద అడ్రస్ రాసి, అతికించి పోస్ట్ చేయాలంటున్నారు. ప్యాక్ చేయకుండా పత్రికను దానికదిగా పోస్ట్ చేయడం వల్ల మధ్య దారిలో పత్రిక నలిగిపోతున్నది, చివరి అట్ట చిరిగిపోయి, చిరునామాదారు ఎవరో తెలియక ఒక్కొక్కసారి వెనక్కి తిరిగి వస్తున్నది. పోస్టల్ సేవలు సరిగా లేవని విసుగు పుట్టించి పత్రికలవారిని ప్రైవేటు కొరియర్ సర్వీసుల వైపు వెళ్లగొట్టడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉంది.

♦ ఏ నెల అయినా 29,30 తేదీల్లో మరుసటి నెల పోస్ట్ చేయాలని వీక్షణంకు పోస్టల్ శాఖ ఇచ్చిన ఆదేశం. కనుక ఏ నెల సంచిక ఆ నెల 1, 2 తేదీలకల్లా మీకు అందే అవకాశం ఉంది. పోస్టల్ సిబ్బందిని కనుక్కుంటూ ఉండండి. 7వ తేదీ వరకు కూడా అందకపోతే వెంటనే వీక్షణం కార్యాలయానికి ఫోన్ చేసి చెపితే, వెంటనే మరొక కాపీ పంపుతాం.

245 ISSN 2231-6892

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాస పత్రిక

ఏప్రిల్ 2022
సంపుటి : 20
సంచిక : 04

'వీక్షణం' పేరిట రచనలు, ఎం.ఓలు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం VEEKSHANAM

మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫోన్ : 7330795849
Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : నవ్య ప్రింటర్స్
అంబర్‌పేట్, హైదరాబాద్.

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 25	రు. 25
సంవత్సరం	రు. 300	రు. 250
మూడు సంవత్సరాలు	రు. 900	రు. 650
ఐదు సంవత్సరాలు	రు. 1500	రు. 1100
పది సంవత్సరాలు	రు. 3000	రు. 2000

ఆన్‌లైన్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా డబ్బులు పంపేవారు బ్యాంక్ స్లిప్‌లపై **'VEEKSHANAM'** అని రాసి తమ పేరు కూడా రాయాలి. వీక్షణం అకౌంట్ నెంబర్-**013911011002175** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **IFSC code :UBIN0801399** నెంబర్‌తో పాటు మీ పేరు కూడా రాసి వేయాలి.

వీక్షణం ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ చేసిన విజ్ఞప్తికి స్పందిస్తూ వీక్షణంను నిలబెట్టుకోవాలనే తపనతో ఆర్థిక సహాయం అందించిన వి. దేవదాస్, కామారెడ్డి – రు. 1,000; పి. శివలక్ష్మి, హైదరాబాద్ – రు. 3,000; బి. రామాచారి, కోదాడ – రు. 1,000; సంగమేశ్వర్, సంగారెడ్డి – రు. 5,000; ఎం. నందకుమార్, హైదరాబాద్ – రు. 5,000; పి. రాజిరెడ్డి, ఆదిలాబాద్ – రు. 5,000; మిత్రులకు కృతజ్ఞతలు – సం.

వీక్షణంలో భిన్నాభిప్రాయాలకు, వామపక్ష, ప్రగతిశీల ఆలోచనల్లోనే వేరు వేరు ధోరణులకు అవకాశం ఇవ్వటం, వేదిక కల్పించటం ప్రశంసనీయమే. ప్రస్తుత పరిస్థితిలో అవసరమైనదే. ఇటువంటి విశాల దృష్టితో పత్రిక నడుపుతున్నందుకు నిర్వాహకులకు అభినందనలు. కాని, విశాల దృష్టి అనేది మూలసూత్రాలను మరిచిపోయి కుదుర్చుకునే అవకాశవాద కలయిక కాగూడదు. బెంగాల్ లో సిపిఎం అనుసరించిన రాజకీయాలను, ప్రస్తుత చైనా నాయకులు అనుసరిస్తున్న విధానాలను సమర్థించే వ్యాసాలు ఇటీవలి కాలంలో పత్రిక మూలసూత్రాలను సడలిస్తున్నదా అనే అనుమానం కలిగిస్తున్నాయి. అయితే అవి బైటి నుంచి రచయితలు రాసినవి గనుక నిర్వాహకవర్గానికి ఆమోదం లేకపోయినా ప్రజాస్వామిక దృష్టితో అచ్చువేసిందేమో అని సర్ది చెప్పుకున్నాం. కాని మార్చ్ సంచికలో వీక్షణం కలెక్టివ్ సభ్యులు అనువాదం చేసిన ఖారిన్ తత్వశాస్త్ర పుస్తకంలో కొన్ని మాటలు చూసి మీరు కూడ ఇవి ఆమోదిస్తున్నారా అని అడగాలని అనిపిస్తున్నది. యూరీ ఖారిన్ రాసిన తత్వశాస్త్ర పుస్తకం తప్పనిసరిగా మంచి పుస్తకాలలో ఒకటి. అయితే సోవియట్ యూనియన్ నుంచి వచ్చిన పుస్తకాలలో 1956 తర్వాత వచ్చినవాటిని కొంచెం జాగ్రత్తగా చూడవలసి ఉంటుంది. పెట్టుబడిదారీ విధానానికీ సోషలిజానికీ మధ్య శాంతియుత పోటీ, పాలక, పాలిత వర్గాల మధ్య శాంతియుత సహజీవనం, పెట్టుబడిదారీ విధానం నుంచి సోషలిజానికీ, కమ్యూనిజానికీ శాంతియుత పరివర్తన అనే సిద్ధాంతాలు ప్రకటించిన సోవియట్ కమ్యూనిస్టు పార్టీ ఇరవయో కాంగ్రెస్ (1956) వర్గపోరాటాన్ని వదిలివేసింది, మార్క్సిజం మూలసూత్రాలనే వదిలివేసింది. సోషల్ సామ్రాజ్యవాదిగా మారింది. ఆ తర్వాత సోవియట్ యూనియన్ నుంచి వచ్చిన పుస్తకాలలో వీలైనంతవరకు ఈ కొత్త వర్గ సామరస్య సిద్ధాంతాలను జొప్పించడానికి ప్రయత్నించారు. మార్క్సిస్టు సిద్ధాంత గ్రంథాలకు ఆ రోజుల్లో సోవియట్ యూనియనే, ప్రోగ్రెస్ పబ్లిషర్సే ప్రధాన వనరు గనుక అవి చదవక తప్పదు. ఆ దశలో, 1956 నుంచి సోవియట్ యూనియన్ కూలిపోయిన 1990 దాకా వచ్చిన పుస్తకాలలో అద్భుతమైన పుస్తకాలు ఎన్నో ఉన్నాయి. కాని ఎంత మంచి పుస్తకంలోనైనా ఎక్కడో ఒకచోట ఒక వర్గసామరస్య విషపు చుక్క ఉండనే ఉంటుంది. ఇప్పుడు ఆ నాటి పుస్తకాలను పరిచయం చేసే వారెవరైనా ఆ జాగ్రత్తలు తీసుకుని, విమర్శనా దృష్టితో ఆ పుస్తకాలు చదవాలని కూడ చెప్పవలసి ఉంటుంది. ఖారిన్ పుస్తకం అనువాదం మొదలైనప్పుడు, దాన్ని మొత్తానికి మొత్తం తర్జుమా చేయటం కాకుండా, అందులోని మంచి విషయాలు మాత్రం తెలుగు పాఠకులకు పరిచయం చేస్తారని, ఉన్నది ఉన్నట్టు చేయక తప్పనిచోటనైనా, అనువాదకులో, పత్రిక వారో పాఠకులకు అవసరమైన హెచ్చరికలు, సూచనలు చేస్తారని ఆశించాను. ప్రస్తుతానికి వస్తే, ఖారిన్ పుస్తకంలో లెనిన్ ను గౌరవించడానికి నెహ్రూ మాటలు అరువు తెచ్చుకోవటం, సోవియట్ కమ్యూనిస్టు పార్టీ 26వ కాంగ్రెస్ లో లియొనిద్ బ్రెజ్నెవ్ మాటలు ప్రస్తావించటం జరిగింది. వీక్షణం వంటి పత్రికకు ఇది తగునా ఆలోచించగలరు. లెనిన్‌ను ప్రపంచ పీడిత ప్రజలందరూ గౌరవిస్తారు, అందుకోసం నెహ్రూ వంటి ఒక దుర్మార్గ పాలకవర్గ ఏజెంట్ సమర్థన అవసరం లేదు. ఇక సోవియట్ కమ్యూనిస్టు పార్టీ ఇరవయో కాంగ్రెస్ తర్వాత జరిగిన ప్రతి ఒక్క కాంగ్రెసూ మార్క్సిజాన్ని మాటల్లో జపిస్తూ, మార్క్సిజానికి మరింత దూరం జరిగినవి. అందులోనూ బ్రెజ్నెవ్ కాలంలోనే సోవియట్ రివిజనిజం, సోషల్ సామ్రాజ్యవాదం మరింతగా పెరిగిపోయాయి. వీక్షణం లో అనువాదమైనా సరే, ఒక రచన బ్రెజ్నెవ్ ను మార్క్సిస్టుగా పాఠకులకు పరిచయం చేయడం ఉచితమేనా ఆలోచించగలరు.

– ఎస్ జనార్దన్
గరికపర్రు

కొన్ని నెలలుగా వీక్షణంలో వస్తున్న వ్యాసాలు చాల బాగుంటున్నాయి. అవసరమైన సమాచారంతో పాటు అవగాహన ఇచ్చే ఉంటున్నాయి. అయితే ఇప్పటికీ ఉన్న ఇబ్బందులు చెప్పాలంటే వ్యాసాల నిడివి కొంత తగ్గిస్తే బాగుంటుంది. అట్లాగే చైనా కమ్యూనిజం దారిలో ఉన్నదా లేదా అనే అనవసరమైన చర్చలకు ఎక్కువ పేజీలు వృథా చేయకండి. వాళ్లు కమ్యూనిజం నుంచి ఆమడ దూరం పోయారని, పోతున్నారని అందరికీ తెలుసు. ఇంకా ఎవరైనా వాళ్లు కమ్యూనిస్టులే అని నమ్మదలచుకున్న వాళ్లు ఉంటే ఉండనివ్వండి. కాని వాళ్లు రాసే చాంతాడు పొడుగు వ్యాసాలతో ఈ విలువైన పత్రికను నింపకండి. మరొక మాట, మార్చ్ సంచికలో బడ్జెట్ మీద బైటి పత్రికలు రాసినట్టే అంకెలు, అంకెలు గుప్పించారు. ఆ అంకెలు మా జీవితాలకు ఎట్లా వర్తిస్తాయో చెప్పండి. బైట కూచుని సలహాలు చెప్పటం సులభమే కావచ్చు, పత్రిక నడపటంలో మీ కష్టాలు మీకు ఉండవచ్చు. ఇంత మంచి పత్రిక ఒక్క నలుసు కూడా లేకుండా వస్తే ఎంత బాగుండును అనే అభిప్రాయంతో మాత్రమే రాస్తున్నాను. తప్పులుంటే క్షమించగలరు.

– పి. కిషన్ రావు
కరీంనగర్

కోవిడ్ వల్ల పత్రికలలో సాధారణ వార్తలు రావడం లేదు గనుక అసహజ మరణాల సూచి సమగ్రంగా తయారు చేయడం సాధ్యం కావడం లేదు. కొద్దికాలంగా అసహజ మరణాల సూచి వేయలేకపోతున్నందుకు చింతిస్తున్నాం. సం.

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; వరంగల్ – ఓరగంటి ఎల్లయ్య

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – కె.ఎస్. ప్రకాష్‌రావు; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత; విశాఖపట్నం – పి.వి. రమణ

న్యాయ వ్యవస్థకు ఎక్కుతున్న హిందుత్వ విషం

హిజాబ్ వివాదంలో కర్ణాటక హైకోర్టు పూర్తిగా తప్పుడు తీర్పు ప్రకటించడం, తాను జవాబు చెప్పవలసినది విద్యార్థినుల విద్యాహక్కును భంగపరిచే నిర్ణయం మీద అని మరిచిపోయి, ఎవరూ అడగకుండానే ఆ విద్యార్థినుల మతాచారాలను వ్యాఖ్యానించే అనవసరపు పనికి దిగడం ఆ తీర్పు వెనుక దాగిన వేయిపడగల హిందుత్వ విషాన్ని చెప్పకనే చెపుతున్నది. అంత అనుచితమైన, చట్టవ్యతిరేకమైన, సహజ న్యాయసూత్రాలకు వ్యతిరేకమైన హైకోర్టు తీర్పు మీద వెంటనే స్టే ఇచ్చి, ఆ తర్వాత విచారించి కొట్టివేయవలసిన సుప్రీం కోర్టు మొదట సమయం లేదని తాత్సారం చేసింది. తర్వాత తొందరేముందని వ్యాఖ్యానించి కేసు వినడానికే నిరాకరించింది. దేశంలోని సర్వోన్నత న్యాయస్థానం అటువంటి అన్యాయమైన వైఖరి తీసుకుంటున్న సమయంలోనే ఆ రాజధానిలోనే రెండంచెల కింది న్యాయస్థానం ఒకటి విచారణ జరపకుండానే ప్రాసిక్యూషన్ ఆరోపణలను పునరుక్తం చేసి నిందితుల జైలు నిర్బంధాన్ని పొడిగిస్తున్నది. ఇవేవో న్యాయవ్యవస్థలో పైనుంచి కిందిదాకా అనుకోకుండా, యాదృచ్ఛికంగా జరిగిన, జరుగుతున్న పనులు కావు. ఇవి ఈ దేశ న్యాయవ్యవస్థ నరనరాల్లో హిందుత్వ విషం ఎక్కుతున్నదనడానికి సూచికలు.

పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ సక్రమంగా నడవాలంటే శాసన నిర్మాణ వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయవ్యవస్థ అనే మూడు అంగాల మధ్య సక్రమమైన అధికార విభజన ఉండాలనీ, మిగిలిన రెండు వ్యవస్థల పని తీరు మీద న్యాయవ్యవస్థకు సమీక్షాధికారం, సవరించే అధికారం ఉండాలని రాజనీతిశాస్త్ర పాఠ్యపుస్తకాలు చెపుతాయి. మిగిలిన రెండు వ్యవస్థలు అవినీతి మయమై, తమ విధ్యుక్త ధర్మాన్ని నెరవేర్చకపోయినా, చట్టబద్ధపాలనకు మాత్రమే కట్టుబడి ఉండే న్యాయవ్యవస్థ వాటిని సమీక్షించడానికీ, సవరించడానికీ నిలబడి ఉంటుందనీ, అది ప్రజలందరినీ, పౌరులందరినీ సమానంగా చూస్తుందనీ ఈ పాఠ్యపుస్తకాల అవగాహన. కాని శాసన నిర్మాణ వ్యవస్థలు తప్పుడు చట్టాలను తయారుచేస్తే చట్టబద్ధపాలన అనే మాటకే అర్థం మారిపోతుంది. ఒకవేళ చట్టం సరిగ్గా తయారైనా, అంటే సహజ న్యాయసూత్రాలను గౌరవిస్తూ తయారైనా, న్యాయవ్యవస్థ గనుక ఆ చట్టాన్ని తలకిందులుగా వ్యాఖ్యానిస్తే కూడ చట్టబద్ధపాలన అనే మాటకు అర్థం పోతుంది.

సంఘ్ పరివార్ పాలనలో జరుగుతున్న పని సరిగ్గా అదేననిపిస్తున్నది. అసలు వర్గ సమాజంలో న్యాయవ్యవస్థ తప్పనిసరిగా యథాస్థితిని కాపాడడానికే, పాలకవర్గ దోపిడీ పీడనలకు 'చట్టబద్ధ పాలన', 'చట్టం ఎదుట అందరూ సమానమే' అనే మేలి ముసుగులు కప్పడానికే ఉంటుందనే మౌలిక అవగాహన ఉన్నా, ఎప్పుడో ఒకసారి ఏదో ఒక న్యాయస్థానం, ఏదో ఒక ప్రజానుకూల తీర్పు ఇవ్వగానే, న్యాయవ్యవస్థ ప్రజల ప్రయోజనాల కోసం పనిచేసే అవకాశం ఉందనే భ్రమలు కలుగుతాయి. కాంగ్రెస్ పాలనా కాలంలో ఎమర్జెన్సీలో న్యాయవ్యవస్థ దుర్మార్గంగా ప్రవర్తించినా, ఆ తర్వాత జుడిషియల్ ఆక్టివిజం (క్రియాశీల న్యాయవ్యవస్థ) అనే సంచలనం ఆ భ్రమలను పెంచడానికి ఉపయోగపడింది. ఆ తర్వాత దశాబ్దాలకు ఇప్పుడు సంఘ్ పరివార్ శక్తులు, సంఘ్ పరివార్ భావజాలం ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ న్యాయవ్యవస్థను పూర్తిగా ప్రతికూల దిశలో క్రియాశీలంగా మారుస్తున్నట్టు కనబడుతున్నది. నిజంగానే ఈ పరిణామం వెనుక సంఘ్ పరివార్ శక్తులు దశాబ్దాల పాటు సాగించిన రహస్య కృషి ఉంది. సరస్వతి శిశుమందిర్ లలో, ఆర్ ఎస్ ఎస్ శాఖలలో మెదళ్లలో విషవిద్వేష బీజాలు సాగించిన తర్వాత ఆ పిల్లలే పెరిగి పెద్దయి అఖిల భారత విద్యార్థి పరిషత్ మీదుగా న్యాయవాద వృత్తిలో స్థిరపడి, వారి దృష్టి న్యాయమూర్తి పదవుల మీద కేంద్రీకరించడం ఎప్పటి నుంచో జరుగుతూ వస్తున్నది. చట్టం ఎదుట అందరూ సమానమే అని, చట్టం తప్ప మరే ప్రమాణమూ లేదని భావించవలసిన న్యాయమూర్తి స్థానంలోకి ఒక మతం మీద, కొన్ని కులాల మీద, కొన్ని ప్రాంతాల మీద విషవిద్వేషాలు నింపుకున్న వ్యక్తులు వచ్చి కూచున్నారు. చట్టమే ప్రజావ్యతిరేకమైనదైతే దాన్ని యథావిధిగా అనుసరించడం, చట్టంలో ఎక్కడైనా ఒక మంచి ఉన్నా దాన్ని అనుసరించకపోవడం ఈ న్యాయమూర్తుల వర్గానికి శిశుమందిర్ లో, శాఖలో నేర్పిన విద్యగా అమలవుతున్నది. అలా కాక, చట్టాన్ని సామాజిక న్యాయంతో, రాజ్యాంగ ప్రవేశికతో, ప్రాథమిక హక్కులతో, ఆదేశిక సూత్రాలతో కలిపి చదువుకుని, ఏ మాత్రమైనా చట్టబద్ధంగా ప్రవర్తిద్దామని ప్రయత్నించిన న్యాయమూర్తులకు ఈ ప్రభుత్వం రాగానే ఎన్నో సవాళ్లు వచ్చాయి. న్యాయమూర్తి బ్రిజ్ మోహన్ లోయాను హత్య చేసి, అనుమానాస్పద మరణంగా మసి పూసి మారేడు కాయ చేసి మొత్తం న్యాయవ్యవస్థకే భయం పెట్టారు. తమ ఆదేశాలను అంగీకరించని, వెన్నెముక ఉన్నదని చూపుకునే న్యాయమూర్తులను, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులను రాత్రికి రాత్రి బదిలీ చేయడం, వారి మీద తప్పుడు కేసులు తవ్వి తీయడం, బెదిరించడం, వారి పదోన్నతులకు అడ్డుపడడం ఈ ఎనిమిది సంవత్సరాల పాలనలో మోషాలు న్యాయవ్యవస్థను ఎంత దిగజార్చారో చూస్తే ఆశ్చర్యమూ విచారమూ కలుగుతాయి. మోషాల కుట్రలకు సహకరించిన అత్యున్నత స్థానాల న్యాయమూర్తులు కూడ ఉన్నారు. అందరికందరూ కలిసి ఈ దేశంలో న్యాయవ్యవస్థ లక్ష్యం అన్యాయాన్ని పరిరక్షించడమనీ, నిరపరాధులను శిక్షించడమనీ, రాజ్యాంగ ప్రవేశిక ఆదర్శాలను భూస్థాపితం చేయడమనీ, సహజ న్యాయసూత్రాలను రద్దు చేయడమనీ, ఒక్కమాటలో మధ్యయుగాల హిందూ బ్రాహ్మణీయ వర్ణాశ్రమ ధర్మాన్ని ఇరవయో శతాబ్దపు హిట్లర్, ముస్సోలినీల ఫాసిజంతో రంగరించి అమలు చేయడమనీ చెప్పదలచుకున్నారు. పాలకులూ, వారిని ఔదల దాలుస్తున్న కార్యనిర్వాహక యంత్రాంగమూ, భయానికో, భక్తికో వారు గీచిన గీత దాటడానికి సాహసించలేని న్యాయవ్యవస్థా తాము చేయదలచిన పని గురించి చిత్తశుద్ధితో, పూర్తి అవగాహనతో ఉన్నారు. వాయువేగ, మనోవేగాలతో సమాజాన్ని తిరోగమనం వైపు నడుపుతున్నారు. ఈ రథచక్రం కింద పడి నలిగిపోతున్న, ప్రాణాలు పోగొట్టుకుంటున్న ఈ దేశ అశేష ప్రజానీకం, ఆదివాసులు, దళితులు, స్త్రీలు, ముస్లింలు, బహుజనులు, మత మైనారిటీలు, ప్రగతిశీలవాదులు, విప్లవకారులు ఈ ప్రమాదాన్ని గుర్తించారా, ప్రతిఘటించడానికి తమ తమ శక్తిసామర్థ్యాల మేరకు ప్రయత్నిస్తున్నారా అనేదే ఇవాళ అసలు ప్రశ్న. వీ

సంపాదకీయ వ్యాఖ్య - తెలంగాణ

కొలువుల జాతరేనట గద ఇగ...

అబ్బ, ఎనిమిదేండ్ల శెర ఒదిలిందట గద. ఇగ కొలువులే కొలువులు మత్తడి బడ్డట్టు పొంగి పొర్లుతానయట గద. గిన్నాల్లు బేరోజ్గారి ఉన్న మన పడుసు పోరగాండ్లందరు ఇగ కొలువుల్లకెక్కుడేనట గద. ఎహె, పడుసు పోరగాండ్లేంది, గీ సర్కార్ వచ్చిన కాన్నించి ఎదురుసూసి ఎదురుసూసి ముసలోల్లే అయిపోయిరి. అవు నిచ్చమే. ముసలి అయితేంది ముతక అయితేంది, కొలువుంటె మొహం కళకళలాడ్తది, శిన్నదో పెద్దదో కొలువుండాలె, నెల దిరిగేటాల్లకు శేతులు కొత్తలు బడాలె. గందుకే దొర ఆలిశెం జేశినా మళ్ల కొలువులిత్తాండంటె మస్తు సంబురమాయె. కని సామెత జెప్పినట్టు అనుమానాలు కాలబడ్తాండె. కొలువులు ఇచ్చుడు సచ్చెమేనా, గది గింత అల్కగ అయ్యేటిదయితె గిన్నాళ్లు గా పని జెయ్యకుంట ఎవలు గొట్టిరి? ఎందుకు జెయ్యకపాయె? అని ఎవడైన అఖలున్నోడు అడుగుతడు గద. సరె పోనీ, నిన్న మన్ను బెట్టలె, ఇయాల్నె తెలివొచ్చింది అనుకుందాం. కని వోట్ల పండుగ వత్తాంది గనుక బులపరిచ్చుటానికేనట గద గీ జాతర. మస్తు మంది సోరసోర పోరగాండ్లు కొలువులు రాక, బొచ్చెడు బొచ్చెడు పైసలు గట్టి పరీచ్చల కోసం కొండకెదిరిసూశినట్టు సూస్తాండ్రు గద. గవాళ్లంత దొర మీద నారాజు గున్నరు, ఆల్లు నారాజుగున్నరు గనుక ఆల్ల అవ్వయ్యలు గుడ, అన్నదమ్ములు, అక్కశెల్లెండ్లు గుడ నారాజు గున్నరు. దొర మీద గుస్స జేస్తాండ్రు. ఆల్లు గట్లనే ఉంటెనా గిప్పుడు వోట్ల పండుగొస్తె దొర దండుగే అని ఎవలో ఒగ పెద్ద మారాజు జెప్పిండట. మరి గా నారాజెట్ల దీశెయ్యాలె, గుస్స లేకుంటెట్ల జెయ్యాలె అనంటె ఏమున్నది మారాజ శెరువుల బియ్యం బొయ్యి, తూముల మంట బెట్టు, తలకొక్క శింతాకు ఎయ్యి, బంతిల బోయినానికి గూసోబెట్టు అని గా మారాజు సలా జెప్పిండట. ఇగ శెర్ల బియ్యం ఉడుకుతాంటె ఆసన అత్తాంటె, గా ఆసన పీల్సుకుంట శింతాకు ముంగట గూసుంటరా, గప్పుడు ఓట్ల పెట్టె ముంగట బెట్టినవనుకో, గుద్దుడే గుద్దుడు అన్నడట గా మారాజు. కత మస్తుగున్నది శిన్నప్పుడిన్న టుపాకి ఎంకట్రామని కత లెక్కనె ఉన్నది అని దొర గుడ మస్తు కుశి అయిండట. జెప్పున పత్రికలోల్లను పిలిశి ఇగో గిప్పటికే లచ్చన్నర కొలువులిచ్చిన, గిప్పుడు ఎనుపై ఏల కొలువులిత్తాన, ఇగ సప్పుడు జెయ్యకుర్రి అన్నడట. కని ఖిలాఫోల్లు ఊకుంటరా, గా మొన్న రెండు లచ్చల కొలువులున్నయంటివి, గిప్పుడు సగానికి సగం ఎట్ల తగ్గిపాయె అని రొకాయించిన్రట. కొలువులిచ్చిన్నని మాదండిగ జెప్తానవు గని గదంత కాకి లెక్కేనని అన్నరట. అరే, ఏం లొల్లి పాడైందిరో అని నాకు పరెషాన్ బట్టుకునె. గప్పుడు మా ఊరి పెద్దమనిషోచ్చి ఇంకో మాట జెప్పె. కొలువులిత్తాన అనంగనె అయిపోదట. ఊదుగాలదట, పీరి లేవదట. పోరగాండ్లొచ్చి కొలువులెక్కుటానికి గిదేమి పాతకాలపు దొర కొలువు గాదు, ఖజాన్ల పైసలున్నయా లేవా సూస్కోవాలె, ఎవలకిచ్చేది ఆల్లకిత్తానమా లెక్కలు సక్కగ దీయాలె. గప్పుడు పరీచ్చ బెట్టాలె. ఆ పరీచ్చల నెగ్గినోల్లతోటి మాటముచ్చట జెయ్యాలె. ఎంత లేదన్న గిదంత ఏడాది ఏడాదిన్నర ముచ్చట ఎరికేనా అని నిలదీసిండు. అవ్వో, టుపాకి ఎంకట్రామని కత లెక్కనే ఉన్నది గద. వీ

సంపాదకీయ వ్యాఖ్య - ఆంధ్రప్రదేశ్

అమరావతి తీర్పు పర్యవసానాలు


ఆంధ్రప్రదేశ్ రాజధాని వివాదం మరొక కొత్త మలుపు తిరిగింది. మార్చ్ మొదటివారంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రాజధానిని మార్చాలనే ప్రభుత్వ నిర్ణయం చెల్లదనీ, పాత ప్రభుత్వ నిర్ణయం ప్రకారం అమరావతి నిర్మాణంతో ముందుకు సాగవలసిందేననీ, రాజధాని నిర్మాణాన్ని ఆరు నెలల లోపల పూర్తి చేయాలనీ ఆదేశించింది. గతంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అమరావతి ప్రాంత రైతులతో చేసుకున్న ఒప్పందాన్ని అమలు చేయవలసిన బాధ్యత ఉన్నదనీ, ఆ బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పించుకోజాలదనీ, అలాగే అప్పుడు రాజధాని కోసం చేసిన చట్టాన్ని రద్దు చేసే అధికారం కొత్త ప్రభుత్వానికి లేదనీ ప్రకటించింది. కోర్టు తీర్పులో సాంకేతికంగా, చట్టపరంగా సక్రమమైన అంశాలు ఉన్నప్పటికీ దాని ఆచరణ సాధ్యత అనుమానాస్పదంగానే ఉన్నది. మూడు ప్రాంతాలలో ఇప్పటికే మొదలయిన ప్రయత్నాల మీద ఈ తీర్పు ప్రభావం ఎలా ఉంటుంది? ఒక బృహత్తర కార్యక్రమాన్ని ఆరు నెలల లోపు పూర్తి చేయమని ఆదేశించే అధికారం న్యాయస్థానానికి ఉందా, ఒకవేళ ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం దాన్ని అమలు చేయగలదా, చేయకపోతే ఏం జరుగుతుంది? అసలు ప్రజల మౌలిక సమస్యలు వదిలి రాజధానిని ఒక వివాదంగా మార్చడం ద్వారా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కోరుకున్న వ్యూహాన్నే న్యాయస్థానం ఉద్దేశపూర్వకంగానో, అనాలోచితంగానో సమర్థిస్తున్నదా? ఇటువంటి ప్రశ్నలు ఎన్నో ఉండగానే ముఖ్యమంత్రి అసలు ఇటువంటి తీర్పు ఇచ్చే అధికారం హైకోర్టుకు లేనే లేదని మరొక కొత్త వివాదానికి తెరతీశారు. ఇది ప్రభుత్వానికీ న్యాయవ్యవస్థకూ అధికార పరిధుల గురించి తగాదాగా, అంటే రాజ్యాంగ సంక్షోభంగా మారుతున్న సూచనలు ఉండగా, ఈ పైపై తగాదాల్లో అసలు అంశాలు మరుగున పడి పోతున్నాయి. పదవీకాలం సగం గడిచినా రాష్ట్రపు మౌలిక సమస్యలు తీర్చలేకపోయిన ప్రభుత్వం, విపరీతమైన ఆర్థిక సంక్షోభంలో, సామాజిక ఘర్షణలో, రాజకీయ వివాదాల్లో చిక్కుకున్న ప్రభుత్వం ఆ సమస్యల నుంచి పక్కకు తప్పుకోవడానికి వేసిన అనేక ఎత్తుగడల్లో రాజధాని వివాదం ఒకటి. అధికార వికేంద్రీకరణ అనే ఆకర్షణీయమైన పదాడంబరంతో ఆ వివాదాన్ని ముందుకు తెచ్చినప్పటికీ, మూడు రాజధానుల ప్రతిపాదన వల్ల జరిగిన, జరగబోయిన అధికార వికేంద్రీకరణ ఏమీ లేదు. అది కేవలం ఆయా ప్రాంతాల రియల్ ఎస్టేట్ వ్యాపార ప్రయోజనాల కోసం చేసినదే. అమరావతి రియల్ ఎస్టేట్ ప్రయోజనాలను దెబ్బతీయడానికి చేసినదే. రాజధాని అమరావతిలో ఉన్నా, ఆ మూడు చోట్లకు మారినా ప్రజలకు ఒరగబోయిన మేలేమీ లేదు. ఎక్కడా ఉద్యోగ కల్పన లేదు, జీవన ప్రమాణాల మెరుగుదల లేదు, రాజ్యాంగబద్ధ పాలన లేదు, ప్రజా ప్రయోజనాల దృష్టి లేదు. రాజధాని ఎక్కడ ఉన్నా ప్రజల హక్కుల మీద, ఉద్యోగుల హక్కుల మీద దాడులు జరుగుతూనే ఉంటాయని మూడు సంవత్సరాల పాలన నిత్యమూ చూపింది. అమరావతా, మూడు రాజధానులా అనే అనవసర వివాదంలో చిక్కుకోకుండా, ప్రజల మౌలిక సమస్యలు, ఆర్థిక వెసులుబాటు, ఉద్యోగకల్పన, పన్నుల భారం తగ్గింపు, పౌరహక్కుల అమలు వంటి సమస్యల మీద పోరాడడమే ప్రజాశక్తుల కర్తవ్యం. వీ


సామ్రాజ్యవాద కూటములు - బడుగు దేశాలపై యుద్ధాలు

- ఎ. నర్సింహారెడ్డి


సామ్రాజ్యవాదం అంటే ఆర్థికంగా, సైనికంగా బలమైన దేశం బడుగు దేశాలపై తన పాలనను విస్తరించే విధానం. రాజకీయ, ఆర్థిక నియంత్రణను విస్తరించడం కోసం బలమైన దేశం బడుగు దేశంపై సైనిక శక్తిని ప్రయోగిస్తుంది. కాలానుగుణంగా అగ్రరాజ్యాలు మారుతూ వచ్చాయి. మొదటి ప్రపంచ యుద్ధం నాటికి అగ్ర రాజ్యాలుగా జర్మనీ, రష్యా, ఆస్ట్రో-హంగేరి, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, అమెరికాలున్నాయి. రెండవ ప్రపంచ యుద్ధం నాటికి అగ్ర రాజ్యాలుగా జర్మనీ, ఇటలీ, జపాన్, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, అమెరికాలు ఉన్నాయి. 1945 తర్వాత అమెరికా ఏకైక అగ్రరాజ్యంగా మిగిలింది. దీనికి ధీటుగా సోవియట్ యూనియన్ నిలిచింది. ప్రపంచ దేశాల మధ్య కూటములు మారుతూ వచ్చాయి. మొ.ప్ర.యుద్ధ సమయాన యూరప్ దేశాలు రెండు కూటములుగా ఏర్పడ్డాయి. ఒకటి 1882లో జర్మనీ, ఇటలీ, హంగేరీలలో త్రైపాక్షిక కూటమిగా ఏర్పడ్డాయి. దీనికి దీటైన శక్తిగా 1907లో ఇంగ్లాండ్, రష్యా, ఫ్రాన్స్‌లు త్రైపాక్షిక ఒడంబడిక చేసుకున్నాయి. మొ.ప్ర. యుద్ధం తర్వాత నానాజాతి సమితి(1920)ని, పారిస్ శాంతి ఒప్పందం(1919) చేసుకున్నప్పటికి 1939లో రెం.ప్ర.యుద్ధం ప్రారంభమైంది. రెం.ప్ర.యుద్ధం తర్వాత పశ్చిమ దేశాలు 1949లో 'నాటో'ను, 2021లో అమెరికా రెండు సైనిక సహకార కూటములను ఏర్పాటు చేసింది. చైనాను ఎదుర్కొవడానికి 'క్వాడ్', రష్యాను ఎదుర్కొవడానికి 'ఆకస్'. అమెరికాను ఎదుర్కొవడానికి రష్యా-చైనాల మధ్య ఫిబ్రవరి 4న సైనిక సహకార అవగాహన కుదిరింది.

లెనిన్ రచించిన 'సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ విధానం యొక్క అత్యున్నత దశ' అనే పుస్తకంలో 1870 నాటికి బ్యాంకు-పారిశ్రామిక మూలధనాన్ని పరస్పరం కలుపడం ద్వారా పాలనలో అలిగార్కి, ఉత్పత్తిలో అలిగోపోలీ ఏర్పడడంతో ఉత్పత్తిదారుల మధ్య పోటీ ఏర్పడుతుందని వివరించాడు. అమెరికా సామ్రాజ్యవాదం కొరియా, క్యూబా, వియత్నాం, ఇరాక్, లిబియా, సిరియా, గ్రెనెడా, పనామా, ఆఫ్ఘానిస్తాన్ సహా మొత్తం 102 దేశాలలో సైనిక జోక్యం చేసుకుంది. స్టాలిన్ మరణాంతరం సోవియట్ యూనియన్ జెకొస్లవేకి, ఆఫ్ఘానిస్తాన్‌లపై, సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం తరువాత రష్యా చెచెన్యా, సిరియా, క్రిమియా, జార్జియా, యుక్రెయిన్‌లపై యుద్ధానికి పూనుకుంది. సామ్రాజ్యవాదానికి స్వాభావికంగా ఉండే శ్రమదోపిడీ, వనరుల దోపిడీ, మార్కెట్లను కైశవం చేసుకోవడం, పర్యావరణ విధ్వంసానికి పాల్పడడం, దేశాలపై ఆధిపత్యం చలాయించడం చూస్తూనే ఉన్నాం. అవే యుద్ధానికి దారి తీస్తున్నాయి. భూగోళపు సమస్త వనరులు, మార్కెట్లు తమవేనని, వాటిపై గుత్తాధిపత్యం స్థాపించడానికి యుద్ధభేరీలు మోగిస్తూ ఉంటాయి. 'లాభాల కొరకు ఉత్పత్తి' అనే విధానంపై పెట్టుబడిదారీ విధానం ఆధారపడి ఉంది. 'పడిపోతున్న లాభాలరేటు' పెట్టుబడిదారీ ఆర్థిక సంక్షోభాలకు మూలం. పడిపోతున్న లాభాల రేటును ఎదుర్కొనడానికి విపరీతమైన సాంకేతికీకరణ పెంచి లాభాలు పెంచుకుంటారు. మార్కెట్, శ్రామికులు, వనరుల కోసం పేద దేశాలకు పెట్టుబడులను తరలించడం, అంతర్యుద్ధాలు సృష్టించి ఆయుధాలు అమ్ముకోవడం దాని నైజం. సామ్రాజ్యవాద శక్తులను ఓడించకుండా శాంతిని సాధించలేమన్నది చరిత్ర చెబుతున్న సత్యం. వీ






❖ **మంటో క్లాసిక్స్** – సాదత్ హసన్ మంటో కథా సంపుటి – అనువాదం: మెహక్ హైదరాబాదీ – మెహక్ ప్రచురణలు – 190 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు: నవోదయ బుక్ హౌస్, ఆర్య సమాజ్ ఎదురు లైన్, కాచిగూడ, హైదరాబాద్ – 500027, ఫోన్ : 90004 13413




❖ **మంటో కథలు** – సాదత్ హసన్ – అనువాదం: మెహక్ హైదరాబాదీ – నవచేతన పబ్లిషంగ్ హౌస్ ప్రచురణ – 204 పేజీలు, 1/8 డెమీ, రు. 160,




❖ **గుప్పిట జారే ఇసుక** – జీలానీ బానూ కథలు – అనువాదం: మెహక్ హైదరాబాదీ – నవచేతన పబ్లిషంగ్ హౌస్ ప్రచురణ – 168 పేజీలు, 1/8 డెమీ, రు. 120,




❖ **అంతా నిజమే చెప్తా...** – జీలానీ బానూ కథలు – అనువాదం: మెహక్ హైదరాబాదీ – నవచేతన పబ్లిషంగ్ హౌస్ ప్రచురణ – 228 పేజీలు, 1/8 డెమీ, రు. 150, పై మూడు ప్రతులకు: నవచేతన పబ్లిషంగ్ హౌస్, గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), జిఎస్ఐ పోస్ట్, హైదరాబాద్ – 500068, ఫోన్ : 040–24224453




❖ **తెరిచిన పుస్తకం** – చిన్ననాటి జ్ఞాపకాలు – జీలానీ బానూ – అనువాదం: మెహక్ హైదరాబాదీ – నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా ప్రచురణ – 91 పేజీలు, 1/8 డెమీ, రు. 105, ప్రతులకు: నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా, నెహ్రూ భవన్, 5, ఇనిస్టిట్యూషనల్ ఏరియా, ఫేజ్–11, వసంత్ కుంజ్, న్యూ ఢిల్లీ–110070




❖ **ఇప్పుడే వస్తా** – కథలు – హనీఫ్ – ఆసిఫ్ ప్రచురణలు – 120 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: హనీఫ్ సయ్యద్, డి బ్లాక్, ఫ్లాట్ నెం. 402, స్కైలా గేటెడ్ కమ్యూనిటి, పెప్పులగూడ, మణికొండ, హైదరాబాద్ – 500089, ఫోన్ : 9247580946




❖ **మనం కుశలమేనా?** – సైన్సు – సమాజ సంక్షేమంపై వ్యాసాలు – డా.పి. రామమోహనరావు – పాటిబండ్ల పబ్లికేషన్స్ ప్రచురణ – 168 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు: డా.పి. రామమోహనరావు, ఇ.నెం. 5–7–143, సంజీవి క్లినిక్ గంగా ల్యాబ్ పక్కన, ఖలీల్‌వాడి, నిజామాబాద్ – 503003, ఫోన్ : 08462–232035, సెల్ : 98480 71049




❖ **మా అగ్రహారం (కరివేన)** – కథలు – 2వ భాగం – విద్వాన్ నిడిచెనమెట్ల శేషఫణిశర్మ – 124 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: యస్. శేషఫణిశర్మ, ఇ.నెం. 87–106, శ్రీలక్ష్మీ నగర్, బి. క్యాంపు దగ్గర, కర్నూలు – 518002, ఫోన్ : 9440554184




❖ **ప్రకృతి–ప్రియురాలు–మానవత** – కవిత్వం – గులాబీల మల్లారెడ్డి – 127 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: గులాబీల మల్లారెడ్డి, ఇ.నెం. 3–1–706, వావిలాలనల్లి, కరీంనగర్ – 505001, ఫోన్ : 94400 41351




❖ **రామరాజ్యంలో... సీత** – నవల – కన్నడం: డా. ప్రభాకర్ శిశిల – అనుసృజన: వేలూరి కష్ణమూర్తి – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 176 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు: పాలపిట్ట బుక్స్, 16–11–20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీమ్‌నగర్, మలక్‌పేట, హైదరాబాద్ – 500036, ఫోన్ : 9848787284



❖ **నేరం..! – ఘోరం..! – మతోన్మాదులారా.. మీ దాష్టీకం కట్టిపెట్టండి** – విజయవిహారం రమణమూర్తి – జైభారత్ పబ్లికేషన్స్ ప్రచురణ – 82 పేజీలు, 1/8 డెమీ, రు. 35, ప్రతులకు: విజయవిహారం బుక్ సెంటర్, ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్ భవన్, 3–8–420, సూర్యోదయ కాలనీ, ఎల్.బి.నగర్, హైదరాబాద్ – 500068. ఫోన్ : 98480 30089



❖ **దక్కన్ దస్తూరి** – (సాహిత్య వ్యాసాలు) – వి.ఆర్. విద్యార్థి – ప్రత్యూష ప్రచురణలు – 144 పేజీలు, 1/8 డెమీ, రు. 200,



❖ **ఓరుగల్లు చేవ్రాలు** – (పీఠికలు) – వి.ఆర్. విద్యార్థి – మిత్రమండలి, హన్మకొండ ప్రచురణ – 60 పేజీలు, 1/8 డెమీ, రు. 100, పై రెండు ప్రతులకు: శ్రీమతి వేలూరి రత్నమాల, ఇ.నెం. 2–7–1083, కనకదుర్గ కాలనీ, వడ్డెపల్లి, హన్మకొండ, వరంగల్ – 506370, ఫోన్ : 9000283672



❖ **ఏలూరు రోడ్ ఆత్మగీతం** – తాడి ప్రకాశ్ – అన్వీక్షికి పబ్లిషర్స్ ప్రై.లి. ప్రచురణ – 296 పేజీలు, 1/8 డెమీ, రు. 250, ప్రతులకు: అన్వీక్షికి పబ్లిషర్స్ ప్రై.లి., ఆజ్రా హౌస్, 59/సి/డి, ఎంఎల్ఎ కాలనీ, బంజారాహిల్స్, హైదరాబాద్ – 500034, ఫోన్ : 9705972222, అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో

సీనియర్ జర్నలిస్టు విద్యారణ్య కామ్లేకర్ గుండెపోటుతో హైదరాబాద్ లో మార్చ్ 16న మరణించారు. సాహిత్యంలో కూడ మంచి ప్రవేశం ఉన్న విద్యారణ్య ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, హిందుస్తాన్ సమాచార్, హిందీ మిలాప్ తదితర పత్రికల్లో పనిచేసి, ప్రస్తుతం మరాఠీ సకాల్ పత్రికలో పని చేస్తున్నారు.

అప్పులు, అమ్మకాలు కలిస్తే తెలంగాణ బడ్జెట్

భారీ అంకెలతో, అమలు కాని కేటాయింపులతో సకల రంగాల లోనూ ప్రగల్బాల మయంగా ఉన్న బడ్జెట్‌ను సమగ్రంగా విశ్లేషిస్తున్నారు **డా. ఎ. పున్నయ్య**

రాష్ట్ర అవతరణ తర్వాత, తొలిసారి సంప్రదాయానికి భిన్నంగా గవర్నర్ ప్రసంగం లేకుండా ప్రారంభమైన బడ్జెట్ సమావేశంలో ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగమంతా స్వయం స్తుతి – పరనిందతో కొనసాగింది. ప్రతిపాదిత బడ్జెట్ వివిధ రంగాలకు ఎంతమేరకు ఉపయుక్తం కానున్నదో చెప్పకుండా రాజకీయ విమర్శా ప్రసంగంలా కేంద్రాన్ని విమర్శించడానికే ప్రాధాన్యతనివ్వడం జరిగింది. పాలక పక్షం సభ్యుల బల్ల చరుపులు, చప్పట్ల నడుమ అప్పులు, ఆస్తుల అమ్మకాలతో సమకూర్చుకునే అసహజ బడ్జెట్ బాగోతం తో ప్రజల్ని మరోసారి భ్రమల్లో ముంచే ప్రయత్నం చేశారు.

భారీ బడ్జెట్ ఓ జిమ్మిక్కు :

ప్రతిపాదిత బడ్జెట్ కేటాయింపులో సంక్షేమం, అభివృద్ధి అనేవి తమ ప్రభుత్వానికి రెండు కండ్ల లాంటివని బాకాలూదారు. వాస్తవ కేటాయింపులో మాత్రం అభివృద్ధి కార్యక్రమాలకంటే సంక్షేమ రంగానికి అధిక నిధులు కేటాయించారు. స్వీయ ఆదాయంతో పాటు కేంద్రపన్నుల్లో రాష్ట్ర వాటా కలిపి సమకూరుతున్న 1లక్ష 26 వేల కోట్ల రూపాయలలో 90 శాతం అంటే సుమారు 1 లక్షా 15 వేల కోట్ల రూపాయలకు పైగా సంక్షేమ పథకాలపై ఖర్చు చేయాలనీ నిర్ణయించారు. సంక్షేమ పథకాలకు ఆర్థిక కోణం కాకుండా రాజకీయ, సామాజిక కోణాలున్నాయి. ఈ పథకాలు రాజకీయ వ్యూహాల్లో ప్రధాన భాగాలు. నిజానికి ఈ సంక్షేమ పథకాలు ప్రభుత్వాలు ప్రజల ఆగ్రహం నుంచి తప్పించుకునేందుకు తయారుచేసుకున్న రక్షణ కవచాలు మాత్రమే. స్థూలార్థిక విశ్లేషణ ననుసరించి దీర్ఘకాలంలో ఆర్థిక వ్యవస్థ స్థిరంగా అభివృద్ధి చెందాలంటే అభివృద్ధి కార్యక్రమాల మీద వ్యయం అధికంగా ఉండాలి. అందుకు ప్రతిపాదిత బడ్జెట్‌లో మూలధన వ్యయం అధికంగా ఉండాలి. కానీ దేశవ్యాప్తంగా పాలక వర్గాలు రాబోయే ఓట్లు దృష్టిలో పెట్టుకొని సంక్షేమ పథకాలకు ప్రాధాన్యం ఇవ్వడం ఆనవాయితీగా మారింది.

బడ్జెట్ కేటాయింపుల్లో మానవీయ కోణం ఉండాలి :

ప్రతిపాదిత బడ్జెట్ కేటాయింపులు నిర్దిష్టంగా ఉండాలి. ప్రజా కోణాన్ని ఆవిష్కరిస్తూ మెజారిటీ ప్రజల జీవితాలలో ప్రతిబింబించే విధంగా ఫలితాలు ఉండాలి. బడ్జెట్ అంకెల సముదాయం కోసం కాకుండా ప్రజల ఆశలు, ఆకాంక్షల వ్యక్తీకరణగా ఉండాలి. కానీ ఈ బడ్జెట్లో అంకెలే చూపించారు తప్ప ప్రజల ఆకాంక్షలు, ఆశలు ప్రతిబింబింప లేకపోయారు. ఈ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గత బడ్జెట్లను నిశితంగా పరిశీలిస్తే బడ్జెట్ కేటాయింపులకు, వాస్తవంగా చేసే ఖర్చులకు పొంతనలేదు. ఫలితంగా బడ్జెట్లో నిర్ణయించుకున్న లక్ష్యాలు సంవత్సరాలుగా చేరుకోలేకపోతున్నామనేది చారిత్రక సత్యం.

బడ్జెట్‌కు భూమిక వాస్తవ రాబడులే :

ప్రతిసారీ మాదిరిగానే ఈ సారి కూడా వాస్తవాల ఆధారంగా బడ్జెట్ ప్రవేశపెడుతున్నామని పాలకులు వల్లెవేసినప్పటికీ ఎప్పట్లాగే, వాస్తవ రాబడి, వ్యయాలతో సంబంధం లేకుండా భారీ బడ్జెట్ ప్రవేశపెట్టినారు. గతేడాదికి రు. 2.30 లక్షల కోట్ల అంచనాలతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. కానీ ఆశించిన రీతిలో రాబడి రాలేదు. జనవరి నాటికి చేసిన వాస్తవ వ్యయం కేవలం రు. 1,42,688.79 కోట్లు మాత్రమే. ఫిబ్రవరి, మార్చి నెలల వ్యయాన్ని కూడా కలిపితే గరిష్టంగా రు. 1.65 లక్షల కోట్లకు చేరవచ్చునని ప్రభుత్వం చెపుతుంది. సాధ్యంకాని ఈ వ్యయాన్ని ప్రభుత్వం కొంచెం ముందుకు జరిపి రు. 1.80 లక్షల కోట్లకు చేరుతుందని ప్రకటించింది. అసాధ్యమైన ఈ ప్రభుత్వ ప్రకటనను పరిగణనలోకి తీసుకున్నా రు. 2.30 లక్షల కోట్ల బడ్జెట్‌లో రు. 1.80 లక్షల కోట్లను ఖర్చు చేస్తే ఇంకా రూ.50 వేల కోట్లకు కోత పడినట్లే. ఈ విషయం అక్షరాలా సర్కారు తన బడ్జెట్ పుస్తకంలోనే ప్రకటించింది. నిజానికి, గత బడ్జెట్ ప్రకారం మొత్తం రాబడులు రు. 2,29,876.94 కోట్లుగా అంచనా వేసింది. సవరించిన బడ్జెట్లో దానిని 2,09,876.94 కోట్లకు కుదించింది. వాస్తవానికి రు. 1.80 లక్షల కోట్లకు చేరుతుందని ప్రకటించింది. నిజానికి ఆర్థిక సంవత్సర రాబడులు రు. 1.50 లక్షల కోట్లకు అటుఇటుగా ఉంటాయి. ప్రతి బడ్జెట్లో కేటాయింపులు భారీగా పెంచినట్లు చూపించినా వాస్తవ వ్యయం భారీగా తగ్గిపోతోంది. ప్రజలను మభ్యపెట్టడానికి ఇలా భారీ బడ్జెట్‌ను పెట్టి, ఆ తర్వాత కోతలతో కుదించడం తెలంగాణ ప్రభుత్వానికి పరిపాటిగా మారింది. అందుకే, వాస్తవ రాబడుల ఆధారంగా బడ్జెట్ పెడితే ఇలాంటి కోతలకు అవకాశం ఉండదు. కానీ రాని ఆదాయాన్ని వస్తున్నట్లు చూపించడమే సమస్య. ఇది పాలకులకు తెలియంది కాదు, పాలకులు వారి పాలనా కొనసాగింపు కొరకు ఈ జిమ్మిక్కుకు తెగబడుతారు.

బడ్జెట్ పరిమాణం పెంచడానికే పాట్లు :

ఏడాదికేడాది బడ్జెట్ పరిమాణాన్ని పెంచుకోవడానికి సర్కారు జిమ్మిక్కులు చేస్తోంది. కేంద్రం నుంచి స్వల్పంగా వచ్చే గ్రాంట్లు భారీగా వస్తాయని అంచనా వేయడం ఇందులో భాగమే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి అంచనా వేసిన గ్రాంట్ల నుండి కేవలం 18 శాతం మాత్రమే వచ్చాయి. కానీ, ఆశ్చర్యంగా సవరించిన అంచనా కంటే కూడా 69 శాతం పెంచేసింది. రెండున్నర లక్షల కోట్లకు బడ్జెట్ ప్రవేశపెడితే అందులో సింహభాగం రు. 50 వేల కోట్లు కేంద్ర గ్రాంట్లు, రు. 60 వేల కోట్లు అప్పులు. ఈ రెండింటి ద్వారానే రు. 1.10 లక్షల

కోట్లను అంచనా వేసింది. అందుకే, ఈ రెండింటినీ నమ్ముకుని భారీ బడ్జెట్ ప్రవేశపెట్టడం ఆర్థిక క్రమశిక్షణను ఉల్లంఘించినట్లే అవుతుంది. ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకాలకు నిధులను భారీగా కేటాయిస్తున్నట్లు చూపడానికే బడ్జెట్ పరిమాణాలను అమాంతం పెంచేస్తున్నారు.

మూలధన వ్యయమే అభివృద్ధికి మూలం :

సుస్థిర ఆర్థికాభివృద్ధికి మూలధన వ్యయమే కీలకం. పేరుకు భారీ బడ్జెట్‌ను ప్రతిపాదిస్తూ మూలధన వ్యయం విషయంలో నామమాత్రంగా వ్యవహరిస్తున్నారు. గత బడ్జెట్లో మూలధన వ్యయం కింద రు. 29,046 కోట్లు కేటాయించారు. సవరించిన బడ్జెట్లో 4 వేల కోట్లు తగ్గించి రు. 25,959 కోట్లకు కుదించారు. ఈ కేటాయింపుల్లో వాస్తవంగా ఖర్చు చేసింది సగానికి తక్కువే. అయినప్పటికీ తాజా బడ్జెట్లో గత బడ్జెట్ కేటాయింపు కన్నా రు. 700 కోట్లు అధికంగా పెంచి రు. 29,728 కోట్లను ప్రతిపాదించింది. ఇది కేవలం అభివృద్ధి కాముకులమని మభ్యపెట్టడం తప్ప మరొకటి కాదు. ఉద్యోగుల, పింఛన్ దారుల, సబ్సిడీ దారుల, పేద, మధ్యతరగతి ప్రజల నుండి పెట్టుబడి వ్యయం వెంటనే పాలకవర్గాలకు ఓట్లు రాల్చదు. పైగా ప్రతిపాదిత బడ్జెట్లో ఉద్యోగుల జీతాలు, పింఛన్లు, వడ్డీ చెల్లింపులపై కోతలు విధించడానికి వీల్లేదు. కనుక మిగిలింది సంక్షేమ పథకాలు. వీటికి కోత పెడితే పాలకులకు వాత పెడతారు. గనుక ప్రతిపాదిత పెట్టుబడి వ్యయాన్ని తగ్గించి సంక్షేమ పథకాలకు భారీగా పెంచడం, కొత్త వాటిని జోడించడం పరిపాటైంది. సంక్షేమ పథకాలలో వచ్చినంత కమిషన్ క్యాపిటల్ వ్యయంలో రాదు కనుక దీర్ఘకాలిక సుస్థిరాభివృద్ధికి మూలమైన మూలధన వ్యయం కేటాయింపు కన్నా కమిషన్లు దండుకునే సంక్షేమ పథకాలకు ప్రాధాన్యత ఇవ్వడమే భారీ బడ్జెట్ ప్రతిపాదనల్లోని అసలు రహస్యం. ఆర్థికాభివృద్ధి సూత్రాలను అనుసరించి మూలధన వ్యయం మీద చిత్తశుద్ధి ఉన్నప్పుడే క్రమంగా రుణ రహిత రాష్ట్రంగా దీర్ఘకాలంలోనైనా సాధ్యమవుతుంది.

భూముల అమ్మకం - ప్రభుత్వ లక్ష్యం :

ఈసారి పన్నేతర రాబడిని రు. 25,422 కోట్లుగా అంచనా వేసి, ఇందులో భూముల అమ్మకం ద్వారానే రూ.15,500 కోట్లు వస్తాయని ఆశిస్తోంది. ప్రతి ఏటా భూముల అమ్మకం ద్వారా బడ్జెట్లో భారీ అంచనాలు వేయడం ఆ తర్వాత సాంకేతిక కారణాలవలన అవి సాకారం కాకపోవడం మామూలే. అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ సర్కారు అంచనాలు నిజం కాలేదు. అంచనా వేసిన స్థాయిలో భూములను అమ్మలేకపోతోంది. గత ఆర్థిక సంవత్సరంలో పన్నేతర రాబడుల కింద రు. 30,557.35 కోట్లను అంచనా వేసినారు. అందులో భూముల అమ్మకం ద్వారా దాదాపు రూ.20 వేల కోట్లు వస్తాయని అంచనా వేసిశారు. కానీ జనవరి నాటికి పన్నేతర రాబడి కింద రు. 5,600 కోట్లే వచ్చాయి. అందుకే, సవరించిన బడ్జెట్లో భూములపై ఆదాయాన్ని రు. 16 వేల కోట్లకు కుదించారు. తాజా బడ్జెట్లో మరో రు. 500 కోట్లు తగ్గించారు. ఇటీవలే భూముల అమ్మకానికి హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇటీవల 8 జిల్లాల్లో భూముల అమ్మకాన్ని ప్రారంభించినా అది కూడా ఆశాజనకంగా లేకపోవడం గమనార్హం. కేవలం బడ్జెట్ పరిమాణాన్ని పెంచడానికే భూముల అమ్మకాలపై రాబడిని కూడా వాడుకుంటున్నారనడంలో అతిశయోక్తి లేదు. మరోవైపు భూముల అమ్మకాల ద్వారా గత ఏడేండ్ల కాలంలో వచ్చింది నామమాత్రమే. 2021-22లో కూడా ఇందుకు సంబంధించి ఇప్పటిదాకా వచ్చింది కేవలం రు. 0.13 కోట్లే. అయినా ఈ వాస్తవాన్ని పట్టించుకోకుండా రాబోయే బడ్జెట్లో భూముల అమ్మకాల ద్వారా భారీ స్థాయిలో రు. 15 వేల కోట్లు వస్తాయంటూ అతి అంచనాకు పోయారు. ఇదెలా సాధ్యమనే ప్రశ్నలు ఇప్పుడు ఉత్పన్నమవుతున్నాయి. ఇలా రాష్ట్ర ప్రభుత్వం ఊహల పల్లకిలో ఊరేగుతూ ప్రజల్ని కూడా ఊహల్లో విహరింపజేయటం రాష్ట్రానికి అంత మంచిది కాదు.

కేంద్రాన్ని దుమ్మెత్తిపోసే రాజకీయవ్యూహం :

ఒకవైపు తెలంగాణ పట్ల తీవ్రమైన వివక్ష చూపుతున్నదని చెపుతూనే, మరొకవైపు వ్యూహాత్మకంగా కేంద్ర సర్కారుపై గంపెడాశలు పెట్టుకుని అతి అంచనాలకు పోయారు. ఉన్న నిధులకే దిక్కు లేదని మొత్తుకుంటూనే ప్రత్యేక ప్యాకేజీ కింద కేంద్రం రు. 25 వేల కోట్లు ఇస్తుందంటూ బడ్జెట్లో రాసుకున్నారు. ఇందులో ఒక్క రూపాయినైనా కేంద్రం విదుల్చుతుందా అన్నది ఇప్పటికైతే మిలియన్ డాలర్ల ప్రశ్న. గతంలో అంతగా రాని పద్దులైన కేంద్ర గ్రాంట్లను ఈసారి కూడా భారీగా పెంచి గ్రాంట్స్-ఇన్-ఎయిడ్ కింద రు. 41,001 కోట్లు, కేంద్ర సౌజన్య పథకాలు కింద రు. 9,443 కోట్లు వస్తాయని బడ్జెట్‌లో చూపింది. అంటే, కేంద్రం నుంచి రు. 50 వేల కోట్లకుపైగా వస్తాయని చూపించింది. తన ఇష్టం వచ్చినట్లు అంచనాలకు పోయి బడ్జెట్ గణాంకాలకు అనుగుణంగా గ్రాంట్లను కేంద్రం విడుదల చేయడం లేదని నిందించడానికి, రచించుకున్న రాజకీయవ్యూహం ఇది. బడ్జెట్ పరిమాణాన్ని భారీగా పెంచుకొని చూపించడానికి తప్ప ఈ లెక్కల్లో వాస్తవం లేదు.

బడ్జెట్‌కు అప్పులే ఆధారం :

సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం నంబర్ వన్‌గా ఉన్నదని ప్రభుత్వం చెపుతుంది. అప్పుల్లో మాత్రం నంబర్ వన్‌గా కొనసాగుతోంది. రాష్ట్రం ఏర్పడేనాటికి రు. 67 కోట్లు ఉన్న ప్రజారుణం ఎనిమిదేళ్ల ప్రయాణంలో ఐదు రెట్లు పెరిగింది. 2016-17 గణాంకాలతో పోలిస్తే దాదాపు 3 రెట్లు పెరిగింది. ఈ సారి ప్రవేశ పెట్టిన మొత్తం బడ్జెట్లో దాదాపు పావు వంతు అప్పుల ద్వారానే ఆర్థికవనరులను సమకూర్చుకోవాల్సి వస్తోంది. రాష్ట్రం సొంతంగా ఆర్జిస్తున్న ఆదాయంలో దాదాపు సగానికి సగం అప్పుతీసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఏడేళ్ల ఆర్థిక నిర్వహణ పరిశీలిస్తే ఏటేటా ఎంత అప్పు పెరిగింది స్పష్టమౌతుంది. బడ్జెట్ రూపకల్పనకు ప్రభుత్వం అప్పులనూ ఆధారంగా చేసుకుంటోంది. ప్రతి బడ్జెట్లో దాదాపు రు. 50 వేల కోట్లు అప్పులే తాజా బడ్జెట్లో కూడా రు. 59,672 కోట్లు అప్పులు చేస్తామని ప్రతిపాదించింది. ఈ అప్పులు మరింత పెరుగుతాయేమో తెలియదు. ఎందుకంటే, గత బడ్జెట్లో రు. 45,509 కోట్లు అప్పులు చేస్తామని అంచనా వేశారు. కానీ, ఇప్పటికే రు. 49 వేల కోట్ల వరకూ అప్పులు చేశారు. దీనితో కలిపి మొత్తం అప్పులు రు. 3.30 లక్షల కోట్లు అని బడ్జెట్లోనే ప్రకటించారు. ఇది జిడిపిలో 25 శాతం ఏటేటా బడ్జెట్ లో అప్పులు పెరగడం ఆర్థిక క్రమశిక్షణకు సూచిక కాదు. గతంలో చేసిన అప్పులకు వడ్డీలు సుమారు రు. 11,601 కోట్లను ఈ ఏడాది చెల్లించేలా బడ్జెట్లో కేటాయింపు చేసింది. ఇప్పటివరకు చేసిన అప్పులను రానున్న సంవత్సరంలో వడ్డీల చెల్లింపుల కోసం రు. 18,921

కోట్లు చెల్లించనున్నది. ఆర్థిక క్రమశిక్షణ లేని రాష్ట్రప్రభుత్వ ఆర్థిక అరాచకత్వం పరాకాష్టకు చేరుకుంది. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా అప్పు రు. 3 లక్షల కోట్ల మార్కును దాటింది. నిజానికి రాష్ట్రాభివృద్ధికి చాలినన్ని వనరులు ఉన్నాయి. వాటిని గరిష్టంగా వినియోగించుకోవాలి.దానితో పాటుగా స్వీయ వనరులను దుబారా కాకుండా ఖర్చుపెట్టుకునే చిత్తశుద్ధి ఉండాలి. ఇంకా కాస్త ముందుకు వెళ్లి చూస్తే అసలు అప్పులు అభివృద్ధి కార్యక్రమాలకు కాకుండా వ్యక్తిగత కీర్తిని పెంచుకోవడానికి చేస్తున్నవే అధికంగా ఉంటున్నాయి.

భారీగా పన్నుల వసూలే లక్ష్యం :

రాష్ట్ర ప్రభుత్వం సొంత పన్నుల ద్వారా గత ఏడాది సుమారు రు. 93 వేల కోట్లు అంచనా వేసి లక్ష్యం చేరడంలో విఫలమైంది. అయినప్పటికీ ప్రజలపై మరింత భారం మోపి ఈసారి బడ్జెట్లో రు. 1 లక్ష 8 వేల కోట్లు సమీకరించుకునేలా ప్రణాళిక వేసుకుంది. ప్రధానంగా, ఈసారి మద్యం, ప్రభుత్వ భూముల అమ్మకాల ద్వారా భారీగా ఆదాయాలను పెంచుకోవాలనే ఉద్దేశంతో గత ఏడాదికంటే రు. 15 వేల కోట్లను అధికంగా సమకూర్చుకోవాలనుకుంటుంది. ఎక్సైజ్, స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, విలువ ఆధారిత పన్ను (వ్యాట్), భూముల అమ్మకం ద్వారా రాబడులు భారీగా పెరుగుతాయని బడ్జెట్లో సర్కారు అంచనా వేసింది. అంటే భూముల మార్కెట్ విలువలు, రిజిస్ట్రేషన్ చార్జీలను మళ్లీ పెంచే అవకాశమున్నట్లు చెప్పకనే చెప్పింది.ఇందులో తెలంగాణ ప్రాంతంలో మద్యాన్ని ఏరుగా పారించి రు. 19,720 కోట్లు సమకూర్చుకోవాలని అంచనా వేసింది. దానికోసం విస్తృతంగా మద్యం దుకాణాలను ప్రారంభించారు. మద్యం వల్ల అనేక పేద కుటుంబాలు విధ్వంసం అవుతున్నా పాలకులు గుర్తించడం లేదు.

భారీగా విద్యారంగ నిధుల్లో కోత :

విద్యారంగానికి నిధుల కేటాయింపుల్లో ప్రభుత్వం కోత విధించింది. ఈ బడ్జెట్లో ఈ రంగానికి రు. 16,085.69 (6.26 శాతం) కోట్లు ప్రతిపాదించింది. ఇందులో పాఠశాల విద్యకు రు. 13,727.97 కోట్లు, సాంకేతిక విద్యకు రు. 394.93 కోట్లు, ఉన్నత విద్యకు రు. 1,962.78 కోట్లు కేటాయించింది. 2021-22 బడ్జెట్లో విద్యారంగానికి సర్కారు రు. 15,608 (6.76 శాతం) కోట్లను ప్రతిపాదించింది. అంటే గత బడ్జెట్ కంటే ఇప్పుడు 0.5 శాతం నిధులను తగ్గించింది. కానీ అంకెల్లో మాత్రం విద్యారంగ కేటాయింపులు పెరిగినట్టుగా కనిపిస్తుంది. గత బడ్జెట్ కంటే ఇప్పుడు రు. 477 కోట్లు మాత్రమే పెరిగాయి. మొత్తం బడ్జెట్ రు. 2,56,958 కోట్లలో విద్యారంగానికి రు. 16,085 (6.76 శాతం) కోట్లు మాత్రమే కేటాయించడం గమనార్హం. కొఠారి కమిషన్ సిఫారసుల ప్రకారం రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి. ఆ లెక్కన ఈ బడ్జెట్లో 77,087.4 కోట్లు ప్రతిపాదించాలి. తెలంగాణ ఆవిర్భావం నుంచి విద్యారంగ కేటాయింపులు ఆ దిశగా లేవు. ఆ సిఫారసులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. 2014-15లో రు. 1,00,637 బడ్జెట్ ప్రతిపాదించగా, విద్యారంగానికి రు. 10,956 (10.88 శాతం) కేటాయించింది. ఆ లెక్కన 10.88 శాతం నిధులను ఈ బడ్జెట్లో కేటాయించినా 27,957 కోట్లు ప్రతిపాదించాల్సి ఉంటుంది. కానీ ఆ దిశగా చర్యల్లేవు. 2014-15లో 10.88 శాతం, 2015-16లో 9.69 శాతం, 2016-17లో 8.23 శాతం, 2017-18లో 8.49 శాతం, 2018-19లో 7.61 శాతం, 2019-20లో 6.76 శాతం, 2020-21లో 6.63 శాతం, 2021-22లో 6.76 శాతం, ఇప్పుడు 6.26 శాతం నిధులను కేటాయించింది.క్రమంగా విద్యారంగానికి నిధులను తగ్గిస్తున్న ప్రభుత్వం విద్యారంగంలో పెను మార్పులకు శ్రీకారం చుట్టినట్టు, రెసిడెన్షియల్ వ్యవస్థకు తామే సృష్టికర్తల మన్నట్లు గొప్పలు చెప్పుకుంటూ కాలం వెళ్లదీస్తోంది. ఆచరణలో విద్యారంగం విధ్వంసానికి ప్రభుత్వమే కారణం అవుతుంది. ప్రచార ఆర్భాటంలో ఉన్న శ్రద్ధ ఆచరణలో ఉండడం లేదు.

పాత అప్పుల చెల్లింపుల కోసం కొత్త అప్పులు :

సంపద సృష్టి కోసం అప్పులు కుప్పలుగా కుమ్మరిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కాగ్ తలగడిగింది. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టడానికే ప్రభుత్వం మళ్లీ అప్పులను చేస్తుందని ఆర్థిక క్రమశిక్షణ లేని తనాన్ని తూర్పారబట్టింది. విచ్చలవిడి అప్పులు ప్రణాళికారహిత ప్రభుత్వ వ్యయాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ చివరికి శాసనసభ సాధికారత కోల్పోతోందని ప్రభుత్వం మీద విమర్శలు చేసింది.

వెనుకబడిన వర్గాలకు నిధుల కేటాయింపు తగ్గింది :

రాష్ట్ర జనాభాలో యాభై రెండు శాతంకు పైగా ఉన్న వెనుకబడిన వర్గాల సంక్షేమానికి ఈ బడ్జెట్లో కేవలం మూడు శాతం కంటే తక్కువ నిధులు కేటాయించారు. బిసిల సంక్షేమానికి 5,693 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్తో పోలిస్తే 170 కోట్లు అధికంగా కేటాయించారు. కానీ బిసి కార్పోరేషన్లకు, ఎంబీసీ కార్పొరేషన్కు 400 కోట్ల రూపాయల నిధులు తగ్గించారు. ఓట్ల కోసం పన్నెండు బిసి ఫెడరేషన్లు విభజించినారు కానీ ఒక్కొక్క ఫెడరేషన్కు సింగిల్ డిజిట్లో నిధులు కేటాయించారు.

అన్ని రంగాలకు అరకొర నిధులే :

తమది రైతు ప్రభుత్వమని సర్కారు చెబుతుంది కానీ, వ్యవసాయ రంగానికి గత బడ్జెట్లో రు. 25 వేల కోట్లు కేటాయిస్తే ఈసారి దాదాపు రు. 750 కోట్లు తగ్గించింది. ధాన్యం కొనుగోళ్ల ఊసు లేదు. పంటల బీమా ముచ్చట లేదు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకం డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణం. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం ఇరవై ఆరు లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆరు సంవత్సరాల క్రితం ప్రభుత్వం 2.96 లక్షల గృహాల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసింది. కానీ ఇప్పటి వరకు పూర్తి చేసింది కేవలం ఒక లక్షా డెభై వేలు మాత్రమే. ఇక డబుల్ బెడ్ రూం పథకంలో సొంత జాగా ఉంటే ఇల్లు కట్టుకోవడానికి రు. 5 లక్షలు ఇస్తామని ఇప్పటి వరకూ చెప్పింది. ఇప్పుడు దానిని రు. 3 లక్షలకు పరిమితం చేసింది. సొంత జాగా ఉన్న 4 లక్షల మందికి రు. 3 లక్షల చొప్పున ఇస్తామని ప్రకటించింది. పెరిగిన ధరల ప్రకారం ప్రభుత్వం ఇచ్చే మూడు లక్షల రూపాయలతో డబుల్ బెడ్రూమ్ ఇండ్లు పూర్తి చేయడం సాధ్యమా అనే సందేహం ఉంది. తమకు నిధులివ్వండి మహా ప్రభో అని ఆర్టిసి వేడుకుంటుంటే దానికిచ్చే నిధుల్లోనూ కోత పెట్టింది. గత బడ్జెట్లో రు. 3,000 కోట్లు కేటాయిస్తే ఈసారి అందులో సగమే. వెరసి, ప్రజా సంక్షేమానికి సర్కారు భారీగా కోతలు పెట్టింది.

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్‌లో రుణం - సంక్షేమం

రానున్న ఆర్థిక సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన బడ్జెట్ వాస్తవమైన, అవసరమైన కేటాయింపుల కన్న మిన్నగా అంకెల గారడీ చేసిందని అంటున్నారు **సంతోష్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 2022-23 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆసాంతం అంకెల విన్యాసాలకే పరిమితమైంది. ఊహల పల్లకిలో విహరించింది. బడ్జెట్ సమావేశాల ప్రారంభంలో గవర్నర్ ప్రసంగంలోనే సర్కారుకు దశ దిశ లేదని తేలిపోగా బడ్జెట్‌లో అదే ధోరణి ఆవిష్కృతమైంది. మానవ సామర్థ్యాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, భద్రమైన జీవనోపాధి, సామాజిక భద్రత అనే నాలుగు అంశాలను రాష్ట్రాభివృద్ధికి పునాదులుగా అభివర్ణిస్తూ, తమ బడ్జెట్‌కు అవే అంతర్లీన సూత్రాలని, ఆధారభూతాలని గొప్పగా చెప్పుకున్నారు. కానీ, గత మూడేళ్ల ఆచరణను పరిశీలిస్తే మాటల్లోని డొల్లతనం విదితమవుతుంది.

ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మార్చి 11న అసెంబ్లీలో 2022-23 వార్షిక బడ్జెట్ మొత్తంగా రు. 2,56,256.56 కోట్ల ఖర్చును ఘనంగా ప్రతిపాదించినప్పటికీ ఏ కోణంలో చూసినా అది సాకారం కావడం దుర్లభమని ప్రభుత్వం వెల్లడించిన అంకెలే చెబుతున్నాయి.

నిరుడు ప్రతిపాదించిన బడ్జెట్‌లో 83 శాతమే ఖర్చు చేశారు. దాదాపు 37 వేల కోట్లు ఖర్చు చేయలేదు. ప్రస్తుత ఏడాదికి 2.29 లక్షల కోట్లు ప్రతిపాదించి సవరించిన అంచనాల్లో 2.09 లక్షల కోట్లకు తగ్గించారు. అనుభవం ఇలా ఉండగా వచ్చే ఏడాది భారీ బడ్జెట్ అన్నా వాస్తవ వ్యయం ఎంత ఉంటుందో తెలీదు. ఆదాయం అంచనాలు కోటలు దాటుతుండగా వాస్తవ లభ్యత గడపలు దాటట్లేదు. నిరుడు రెవెన్యూ ఆదాయం 1.61 లక్షల కోట్లు ఆశించగా 1.17 లక్షల కోట్లొచ్చింది. జరుగుతున్న ఏడాదిలో 1.77 లక్షల కోట్లు ఆశించగా జనవరి నాటికి 1.11 లక్షల కోట్లే లభించింది. పరిస్థితి ఇంత అధ్వాన్నంగా ఉన్నా వచ్చే ఏడాది ఏకంగా రెవెన్యూ ఆదాయం 1.91 లక్షల కోట్లుగా పేర్కొనడాన్ని అత్యాశ అనాలో, భ్రమ అనాలో అర్థం కాదు. రెవెన్యూ లోటు రు. 17,036 కోట్లుగా, ద్రవ్యలోటు రు. 48,724 కోట్లుగా చూపారు. మొత్తంగా బడ్జెట్‌లో అంకెలకు ప్రాధాన్యత, కచ్చితత్వం లేకుండా పోయింది.

తమది నాలుగు స్తంభాల పాలనగా అభివర్ణించారు ఆర్థికమంత్రి బుగ్గన. మౌలిక వసతుల కల్పన స్తంభం పటిష్టంగా ఉండాలంటే కేపిటల్ పద్దు పెరగాలి. అదేమీ మచ్చుకైనా కనిపించదు. ఈ కాలంలో ప్రజలపై పన్నులకు హద్దే లేదు. స్టేట్ ట్యాక్స్ నిరుడు 57 వేల కోట్లొచ్చింది. ఈ ఏట 85 వేల కోట్లనుకొని 73 వేల కోట్లకు సవరించారు. వచ్చే ఏట 91 వేల కోట్లంటున్నారు. ఏకంగా 18 వేల కోట్లు అదనంగా రావాలంటే అదనపు పన్నులేస్తారన్నమాట. పన్నేతర ఆదాయం 11 వేల కోట్లు వస్తుందంటున్నారు. 'బిల్డ్ ఎపి'ని పరుగులు పెట్టించి ప్రభుత్వ భూములు అమ్ముతారన్నమాట. ఇంత చేసినా రెవెన్యూ ఆదాయ లోటు 17 వేల కోట్లు. ద్రవ్యలోటు 48 వేల కోట్లు అనడంతో ఆర్థిక స్థితి గాడి తప్పిందనే భావించాలి. పథకాల ఫలాలు ఎలా ఉన్నా, ప్రజానీకంపై, ప్రత్యక్ష, పరోక్ష భారాల మోత తప్పని పరిస్థితి ఏర్పడనుంది.

కేంద్రం నుండి రావాల్సిన నిధులు సరిగ్గా అందకపోయినా బడ్జెట్‌లో గొప్పలకు పోవడం వింతల్లో వింత. వచ్చే ఏడాది బడ్జెట్‌లో అప్పులే రూ.64 వేల కోట్లు. వాటిలో బహిరంగ రుణాలు రూ.55 వేల కోట్లు. ఏ పూటకాపూట రుణాలపై ఆధారపడి ప్రభుత్వాన్ని నడపడం ఆర్థిక స్థితికి ప్రమాద సంకేతం. ప్రతి నెలా 10 వేల కోట్ల అప్పులు ఈ సర్కారుకు అత్యవసరంగా మారింది. ఇన్ని అప్పులూ చేసి అభివృద్ధి చేశారా అంటే అదీ లేదు. ఏ రాష్ట్రమైనా అది చేసే మూలధన వ్యయమే సుస్థిర అభివృద్ధికి గీటురాయి. నిరుడు కేపిటల్ వ్యయం పద్దు కింద నికరంగా ఖర్చు పెట్టింది 18 వేల కోట్లు. ఈ ఏటా ఘనంగా 31 వేల కోట్లన్నా, అదే 18 వేల కోట్లకు సవరించారు. వచ్చే ఏటా 30 వేల కోట్లంటే ఎలా నమ్మేది?

గతేడాది రూ.28 కోట్లు మాత్రమే ఖర్చుచేసిన బిసి-ఇ కార్పొరేషన్‌కు ఈసారి రు. 346 కోట్లు కేటాయించడం, రాష్ట్ర జనాభాలో అత్యధికంగా ఉన్న కాపుల కార్పొరేషన్‌కు రెడ్డి కార్పొరేషన్ కంటే ఓ ఐదువందల కోట్లు మాత్రమే ఎక్కువ కేటాయించడం సామాన్యులకు అర్థం కాని విన్యాసాలు. గత ఏడాది రెండంకెల ఖర్చు మాత్రమే చేసిన కార్పొరేషన్లకు ఈ మారు మూడంకెల కేటాయింపులు జరగడంతో ప్రభుత్వం అంకెలతో ఆడుకుంటున్నదన్న విమర్శలు తప్పడం లేదు. గత ప్రభుత్వం ఎస్‌సి విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన విదేశీవిద్య పథకం, వైఎస్‌ఆర్ విద్యోన్నతి

ముగింపు :

తెలంగాణ రాష్ట్ర ఆర్థికాభివృద్ధి పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందాన తయారైంది. పేరుకు లక్షల కోట్ల బడ్జెట్. అధిక ఆదాయం గల రాష్ట్రమని, రాష్ట్ర అవతరణ తర్వాత ఏడేండ్లలోనే ఏడేడు తరాల సరిపోను నిధులను, వనరులను సమకూర్చినట్లు జబ్బలు చరుచుకుంటున్న ఈ ప్రభుత్వ హయాంలో ఒకటో తారీఖున ఉద్యోగులు జీతాలు అందుకునే స్థితిలో లేరు. పెన్షన్ కోసం వికలాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలు నెల అంతా ఎదురు చూడడం తప్పడం లేదు. ఎప్పటికప్పుడు అప్పులు చేస్తూ కాలం గడుపుతూనే గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటు. కేవలం ఓట్ల కోసం, అధికారం కోసం ప్రజలను మభ్యపెట్టడానికి ఒకవైపు మాటల గారడీ మరోవైపు అంకెల గారడీతో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపుతున్నారు. నిరుద్యోగం తాండవిస్తున్న తెలంగాణలో ప్రభుత్వం చేపడుతున్న చర్యలు శూన్యం. సుస్థిర అభివృద్ధికి బాటలు వేయకుండా తాత్కాలిక మరమ్మత్తుల కోసం ప్రయత్నం చేయడం అత్యంత హేయమైంది. ఆర్థిక క్రమశిక్షణ లేకుండా ఆదాయ వనరుల సృష్టికి కృషిచేయకుండా వ్యవహరిస్తూ ప్రజలను రుణగ్రస్తులను చేయడం క్షమించరాని నేరం.

(రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలంగాణ విశ్వవిద్యాలయం) వీ

వంటివి రద్దుచేయలేదని ఒక పక్కన చెబుతున్న పాలకులు బడ్జెట్‌లో మాత్రం కేటాయింపులు చేయలేదు.

'ఏపి రాజధాని అమరావతి అభివృద్ధిని పక్కన పెట్టవద్దు' అని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో అమరావతికి కాస్తయినా బడ్జెట్‌లో ప్రాధాన్యత ఉంటుందని ఆశించిన వారికి నిరాశే మిగిలింది. రాజధాని అమరావతిలో నెల రోజుల్లో మౌలిక వసతులు కల్పించాలని, మూడు నెలల్లో రైతులకు లే అవుట్‌లు అభివృద్ధి చేసి స్థలాలు అప్పగించాలని, మాస్టర్ ప్లాన్ ప్రకారం ఆరు నెలల్లో రాజధాని నిర్మాణం పూర్తిచేయాలని హైకోర్టు విస్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేదు. హైకోర్టు చెబితేనేమి? మా ధోరణి మాదే అన్న వైఖరి ప్రదర్శిస్తోంది. బడ్జెట్‌లో రాజధానికి సంబంధించిన రు. 1,329 కోట్లు కేటాయించి అంకెల గారడీ చేసింది. కేంద్రం రు. 800 కోట్లు ఇస్తుందని ఊహించి పెట్టింది. మిగితాది రాజధానికి భూములిచ్చిన రైతులకు, గతంలో తెచ్చిన అప్పుల వడ్డీలకు తప్ప రాజధాని తక్షణ పనులకు కేటాయించింది శూన్యం. అమరావతి మాటెలా ఉన్నా అక్కడి రైతులకు సంబంధించిన అంశాలపై మాటమాత్రంగానైనా ప్రస్తావన చేయకపోవడం పలు సందేహాలకు తావిస్తున్నది. కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్‌లో అమరావతి అభివృద్ధికి నిధులు కేటాయించినా రాష్ట్రం మాత్రం ఆ ఊసెత్తకపోవడం విచారకరం.

కొత్త జిల్లాల ఏర్పాటుకయ్యే ఖర్చులకు సంబంధించి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. ఈ బడ్జెట్‌లో అభివృద్ధి ఊసేలేదు. నవరత్నాలు, ఉచిత పథకాలు తప్ప వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, గ్రామీణ-పట్టణ అభివృద్ధికి బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు తగ్గాయి. మద్య నిషేధం అమలు చేస్తానని అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం మూడేళ్లుగా అమలు చేయలేదు. పైగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఎక్సైజ్ నుంచి రూ. 16,500 కోట్లు ఆదాయం పిండుకోవాలని నిర్ణయించడంతో నాలుగో ఏడాది మద్యనిషేధం అమలు అటకెక్కినట్లే కన్పిస్తోంది. మనబడి నాడు-నేడు పథకం నిధుల్లో కోత విధించింది. వైఎస్ఆర్ పెళ్లికానుక పథకానికి ఒక్కపైసా కేటాయించలేదు. ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు నిరాశనే మిగిల్చింది. అభివద్ధిపై దృష్టి సారించలేదు.

రెండో దశ మనబడి నాడు- నేడు పథకానికి రు. 3,500 కోట్లు కేటాయించింది. 16,000 పాఠశాలలు ఈ పథకం రెండవ దశలో అప్‌గ్రేడ్ చేయడానికి సిద్ధంగా ఉన్నాయి. రు. 6,107.36 కోట్ల అమ్మ బడి పథకానికి కేటాయించింది, ఇందులో తల్లులకు వారి పిల్లల చదువుల కోసం సంవత్సరానికి రు. 15,000 ఇస్తారు. ఉన్నత విద్యకు బడ్జెట్‌లో రు. 1,973.16 కోట్లు కేటాయించారు. ఉన్నత విద్యలో స్థూల నమోదు నిష్పత్తిని 2018-19లో 32.4 శాతం నుంచి 2024-25 నాటికి 70 శాతానికి, 2035 నాటికి 90 శాతానికి పెంచేందుకు వ్యూహాత్మక ప్రణాళికను ప్రకటించింది. 2022-23లో జగనన్న విద్యా దీవన కోసం రు. 2,500 కోట్లు, జగనన్న వసతి దీవన కోసం రు. 2,223.15 కోట్ల కేటాయించారు. ఈ పథకాలు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అందించడం ద్వారా, వారి ఆహారం, హాస్టల్ ఖర్చులను భరించడం ద్వారా ఆర్థికంగా బలహీన కుటుంబాల విద్యార్థులకు ఉన్నత విద్యకు సార్వత్రిక అవకాశాలను అందిస్తాయి.

ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని చేసే ప్రచారం పాక్షికత్వంతో కూడుకున్నది. సర్కారీ వ్యయంలో నగదు బదిలీల వాటా కాస్త ఎక్కువగానే ఉన్నప్పటికీ కోతలూ కొనసాగుతున్నాయి. వివిధ నగదు బదిలీలకు ఈ సంవత్సరం 48 వేల కోట్లు ప్రతిపాదించి 39 వేల కోట్లకు సవరించారు. ఏడెనిమిది వేల కోట్లు కోసేశారు. బిజెపి కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యా విధానాన్ని, విద్యుత్ రంగంలో గత ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలను రాష్ట్ర సర్కారు వేగంగా అమలు చేస్తోంది. ఇది నష్టదాయకం. యువతకు స్వయం ఉపాధి కల్పించాల్సిన కార్పొరేషన్ల నిధులు నగదు బదిలీల కిందే చూపుతున్నారు. వ్యవసాయ బడ్జెట్ అంకెల గారడీకి పరాకాష్ట. ఉపాధి హామీ, ఉచిత విద్యుత్, ఇరిగేషన్ పద్దులు కలిపేశారు. వ్యవసాయ సంక్షోభం సమయాన వ్యవసాయ పద్దుకు రు. 1,400 కోట్లు తగ్గాయి. వాస్తవంగా భూమిపై శ్రమించే కౌలు రైతుల ఊసే లేదు. పైపెచ్చు డ్రోన్లంటూ కేంద్రం మార్గదర్శకత్వంలో కార్పొరేటీకరణ మంత్రం జరిపించారు.

ఎప్పటి మాదిరిగానే వ్యవసాయ బడ్జెట్‌లో ఇతర శాఖల పద్దులు చేర్చారు. గతంలో ఉపాధిహామీ, ఉచిత విద్యుత్ చేర్చగా ఈ తడవ అదనంగా ఇరిగేషన్ పద్దును కలిపారు. దాంతో 2021-22 వ్యవసాయ బడ్జెట్ రు. 31.256.36 కోట్లు కాగా వచ్చే ఏడాది రు. 43,052.78 కోట్లకు పెరిగింది. ఇరిగేషన్ బడ్జెట్ రు. 11,450.94 కోట్లు పోతే పెరిగిందేమీ లేదు. ఇదిలా ఉండగా వ్యవసాయ అనుబంధ రంగాల మట్టుకు 2021-22లో రు. 13.517 కోట్లు (5.88 శాతం) ప్రతిపాదించి 11,942 కోట్లకు (5.74 శాతం) తగ్గించారు. వచ్చే ఏట 13,630 కోట్ల (5.3 శాతం) ప్రతిపాదించారు. గత బడ్జెట్ ప్రతిపాదన కంటే 1,437 కోట్లు (0.5 శాతం), సవరించిన బడ్జెట్ కంటే 1,077 కోట్లు (0.42 శాతం) కోత పెట్టారు. ధరల స్థిరీకరణ నిధి రు. 3 వేల కోట్లు అంటూనే 500 కోట్లు పెట్టారు. సున్నా వడ్డీకి అవసరం మేర ప్రతిపాదించలేదు.

అమరావతి, పోలవరం సహా ఇరిగేషన్, గృహనిర్మాణం, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి కీలక రంగాలన్నింటికీ నిధులు తక్కువే. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని వదిలేసి వికేంద్రీకరణ అనడం తప్పుదారి పట్టించడమే. విభజన సమస్యలు, మాంద్యం, కరోనా ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్నాయి. అభివృద్ధి, ఉపాధి, మౌలిక వసతుల కల్పన సాగునీటి ప్రాజెక్టులు వంటి నిర్మాణాత్మకమైన కార్యక్రమాలకు నామమాత్రపు కేటాయింపులతోనే సరిపెట్టేశారు. అయినా స్థూలోత్పత్తి, తలసరి ఆదాయాలు గణనీయంగా వృద్ధి చెందాయనడం విశ్వసించేలా లేవు. సంపద పెరుగుతున్నా అది ప్రజలకు పంపిణీ కావడం లేదన్నది మన అనుభవంలో ఉన్న యథార్థం. జనాకర్షణ పథకాలకు నిధులు కేటాయింపులు తప్ప, ఆర్థిక ఎదుగుదల, శాశ్వత ఉపాధి, స్థిరాస్థి ఏర్పాటు చేసుకుని సుస్థిర అభివృద్ధిని సాధించే అవకాశాలు బడ్జెట్‌లో లేవు.

ఇప్పటివరకు చేసిన రుణాలు కొండలా పేరుకుపోతున్నా కొత్త అప్పులను, రాని ఆదాయాన్ని లెక్కల్లో చూపుతూ అప్పుల కుప్పల్ని మరింత పెంచేస్తూ బడ్జెట్ అంచనాల్ని ఘనంగా చూపిస్తూ అంకెల గారడీ చేశారు. వాస్తవ రాబడిని అంచనాల్లో పేర్కొనకుండా కేంద్రం నుంచి, ఇతర రూపాల్లో వచ్చే నిధుల్ని భారీగా ఊహిస్తూ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. మొత్తంగా ఈ బడ్జెట్ ఆర్థిక క్రమశిక్షణ లేకుండా, అప్పుల మీద ఆధారపడి రూపొందించినదిగా కనిపిస్తోంది. చేసిన కేటాయింపులు ఖర్చు అవుతాయన్న నమ్మకం కూడ కలగడం లేదు. రాష్ట్రంలో అప్పులు అంచనాలకు మించి పోతున్నాయి. ప్రజారుణం రూపంలో వినియోగించుకుంటున్న అప్పులే హద్దులు దాటుతుండగా, అంతకుమించి కార్పొరేషన్లకు గ్యారంటీలు ఇవ్వడం ద్వారా ప్రభుత్వం అనేక రుణాలు పొందుతోంది. ఒక్క ప్రజా రుణమే 2023 మార్చి నాటికి రు. 4,39,394 కోట్లకు చేరుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. వీ

(రచయిత ఉపాధ్యాయులు)

ఎన్నికల ఫలితం - హిందుత్వకు ఆమోదమేనా?

ఐదు రాష్ట్రాల ఎన్నికలలో భాజపా నాలుగు రాష్ట్రాలు గెలుచుకోవడం ఏయే ప్రత్యక్ష, పరోక్ష కారణాల ఫలితమో విశ్లేషిస్తున్నారు **చుంచు శ్రీశైలం**

దేశంలో పరిహాసానికి గురవుతూ వస్తున్న ప్రజాస్వామ్యాన్ని ఇటీవల 5 రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల తీరుతెన్నులు, వాటి ఫలితాలు మరింత వెక్కిరింపుకు గురి చేశాయి. అధికారాన్ని చేజిక్కించు కోవడానికి రాజకీయ పార్టీలు, నాయకులు అవలంబిస్తున్న అనైతిక పద్ధతులకు, కుట్రలకు, కుతంత్రాలకు రాజకీయ వ్యూహాలుగా, నేర చరితులకు గెలుపు గుర్రాలుగా పేరు పెడుతున్నారు. అక్రమాలకు పాల్పడిన వారిని ఎన్నికల వ్యూహకర్తలుగా, అమోఘమైన వ్యక్తులుగా, భవిష్యత్తు దేశాధినేతలుగా, అభివృద్ధి ప్రదాతలుగా కీర్తిస్తూ ప్రజల మెదళ్లను కలుషితం చేసి మానసిక వశీకరణకు పాల్పడుతున్నారు. ఈ ప్రక్రియను నిర్వహించడానికి దేశంలో ఉన్న ప్రధాన మీడియా పోటీ పడుతూ స్వామి భక్తిని చాటుకుంటోంది. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, మణిపూర్, గోవా ఎన్నికల్లో, వాటి ఫలితాల్లో వెల్లడైన అంశాలు ఇవి.

ప్రజా సమస్యలు, అసమానతల నిర్మూలన, జీవన ప్రమాణాల మెరుగుదల లక్ష్యంగా ఉండవలసిన ఎన్నికలను, రాజకీయాలను ఉద్రేకాలు, ఉద్వేగాల, ఊహాజనిత భావాల చుట్టూ 'ప్రదక్షిణలు' చేయించారు. ప్రజాస్వామ్యానికి, ప్రజా జీవితానికి ఉండవలసిన అవినాభావ సంబంధాన్ని తెగ్గొట్టినారు. ఈ అనైతిక పనుల్లో నిస్సిగ్గుగా దూసుకపోయిన పక్షం ఎన్నికల్లో విజయం పొందామనిపించుకుంది. మొత్తం ఓటర్లలో 60 శాతం మంది మాత్రమే ఎన్నికల్లో భాగస్వాములు కాగా, అందులో అత్యధికులు వ్యతిరేకించిన, తిరస్కరించిన పక్షం అధికార పక్షంగా అవతరించి 100 శాతం ప్రజానీకాన్ని పాలించే, వనరులపై అజమాయిషీ చలాయించే విచిత్ర పరిస్థితి మన మేడిపండు ప్రజాస్వామ్యంలో నెలకొంది. ఆ లొసుగుల ఆధారంగా ఎవరు ఎవరి ప్రయోజనం కోసం పోటీలో నిలుస్తున్నారో తేల్చుకోలేని స్థితిలో ప్రజలు మరోసారి ఓడిపోయారు. అంటే ఎప్పటిలాగే ఎన్నికల్లో ప్రజలను ఓడించి పాలకులు గెలిచారు. ప్రజాస్వామ్య విలువలను దిగజార్చి, ప్రజల శ్రమను, వనరులను దోచుకునే అవకాశాన్ని నిలబెట్టుకున్నారు. మరో 5 సంవత్సరాల వరకు ఆ హక్కును పొడిగించుకున్నారు.

దేశంలో హిందూత్వ ఎజెండాతో బహిరంగంగా, నిర్భయంగా రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతున్న భారతీయ జనతా పార్టీ నాలుగు రాష్ట్రాల్లో ప్రజలను పాలించే (పీడించే) హక్కును కొనుక్కుంది. ఉత్తరప్రదేశ్ లో బి.జె.పి. తమ బహిరంగ మిత్రులతో కలిసి 322 స్థానాలను గెలిచింది. ప్రధాన పోటీదారుగా ఉన్న సమాజ్ వాదీ పార్టీ, దాని మిత్ర పక్షాలతో కలిసి 128 స్థానాల్లో గెలుపొంది రాష్ట్రంలో ప్రతిపక్ష స్థానాన్ని పొందింది. యూపీలో తన శక్తికి మించి సుమారు వంద స్థానాల్లో పోటీ చేసిన ఎమ్ఐఎమ్ పార్టీ తన రహస్య (ఇప్పుడది రహస్యమేమీ కాదు) మిత్రుడైన బిజెపి అప్పగించిన పనిని సమర్థవంతంగా నిర్వర్తించిందని, దానితో పాటు బిఎస్‌పి కూడా దానికి బి టీమ్‌గా పనిచేసిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. కేవలం రెండు స్థానాలతో ఆగిపోయిన కాంగ్రెస్ పార్టీ కూడా ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చడం ద్వారా బిజెపికి మేలు చేసింది. 20 శాతం మంది ఓట్లు మాకు అక్కర్లేదని, 80 శాతం ఓట్లు చాలని, ఇది 80 – 20ల మధ్య పోటీ అని మెజారిటీ హిందువుల ఓట్లను పొందడానికి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదిత్య నాధ్ యోగి మత విభజన ద్వారా విద్వేషాన్ని నూరిపోశారు. బలమైన సామాజిక వర్గాలుగా ఉన్న యాదవ, జాతవ, దళిత వంటి వేర్వేరు కులాల ఓట్లను హిందూత్వ ప్రాతిపదికన ఐక్యం చేసే ఆలోచన ఈ ప్రకటనలో దాగి ఉంది. అదే సమయంలో కావాలనే దూరం చేసుకున్న 20 శాతం ముస్లిం ఓట్లు కేంద్రీకృతమై ఒకే పార్టీకి బలంగా నిల్వకుండా తమకు బయట నుంచి మిత్ర పక్షమైన ఎమ్ఐఎమ్‌ను రంగంలోకి దించడం ద్వారా చేసిన చీలిక కుట్ర ఆశించిన దానికి మించి ఫలితాన్నిచ్చింది. ఒక్క స్థానంలో కూడా పోటీకి ముస్లిం అభ్యర్థికి అవకాశం ఇవ్వకపోవడం ఈ విభజన కుట్రాజకీయాన్ని బలోపేతం చేసేందుకే. అందులో భాగంగానే చాలా స్థానాల్లో సమాజ్‌వాదీ పార్టీ అభర్థుల గెలుపుకు అవసరమైన ఓట్లను ఎమ్ఐఎమ్ దూరం చేసింది. ఈ అనైతికతను రాజకీయ వ్యూహంగా, యోగిని వ్యూహ చతురుడిగా కార్పొరేట్ మీడియా పొగడ్తలతో ఎత్తేస్తోంది.

జాతీయ ఎన్నికలకు ముందు అందరూ సెమీ ఫైనల్‌లా భావించిన యూపీ ఎన్నికల్లో ప్రజలు ప్రభుత్వం పట్ల తమ వ్యతిరేకతను మర్చిపోవడానికి బిజెపి అనుసరించిన పద్ధతులు (వ్యూహాలు అనలేం) ప్రజలను ఏమార్చడమే తప్ప మరొకటి కాదు. మహిళలు, దళితులు, ముస్లింలు, రైతుల మీద జరిపిన దాడులను ప్రజల ఆలోచనల్లోంచి తొలగించడానికి లేదా ప్రాధాన్యతను తగ్గించడానికి దేశభక్తి, జాతీయ భద్రత, హిందూత్వ వంటి సున్నితమైన ఉద్వేగభరిత అంశాలను ఆయుధాలుగా మలుచుకున్నారు.

అలాగే ఉత్తరాఖండ్‌లో మొత్తం 70 స్థానాల్లో బిజెపి 47 స్థానాలను గెలుచుకోగా, కాంగ్రెస్ 18 స్థానాలకు పరిమితమైంది. గతంలో కంటే ఓట్ల శాతాన్ని తగ్గించుకున్నా అధికారాన్ని మాత్రం కాపాడుకుంది. మణిపూర్‌లో 60 స్థానాలకు గాను గతంలో కంటే 11 స్థానాలను

పెంచుకొని 32 చోట్ల గెలుపుతో అధికార పీఠాన్ని నిలుపుకుంది. గోవాలో మొత్తం 40 స్థానాల్లో గతం కంటే 7 కొత్త స్థానాలను కలుపుకొని 20 స్థానాల్లో బిజెపి గెలుపొంది ప్రభుత్వాన్ని కొనసాగించనుంది. ఇక్కడ ముఖ్యమంత్రి ప్రమోద్ సవంత్ కేవలం 666 ఓట్ల ఆధిక్యాన్ని పొందడం పాలన పట్ల వ్యతిరేకతకు నిదర్శనం.

ఎన్నికలు జరిగిన 5 రాష్ట్రాల్లో పంజాబ్‌లో వచ్చిన ఫలితం భిన్నమైనది. అధికార కాంగ్రెస్ పార్టీలో ఉన్న అంతర్గత కుమ్ములాటలు, ముఖ్యమంత్రి మార్పు, ప్రభుత్వ వ్యతిరేకత ఆమ్ ఆద్మీ పార్టీకి తిరుగులేని ఆధిక్యాన్ని సాధించిపెట్టాయి. మొత్తం 117 స్థానాల్లో 92 స్థానాలను సాధించి ఢిల్లీ తర్వాత రెండో రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. కాంగ్రెస్ ఇంటిపోరు, విద్య, వైద్యం పట్ల ఆప్ తీసుకున్న వైఖరితో పాటు, బలమైన ప్రత్యామ్నాయం లేకపోవడం కూడా ఆప్‌కు కలిసొచ్చిందని అర్థమవుతుంది. అంతేకాకుండా సంవత్సర కాలం పాటు ఢిల్లీ సరిహద్దుల్లో వ్యవసాయ చట్టాల రద్దుకు రైతాంగం నిర్వహించిన ఉద్యమం కీలక పాత్ర వహించింది. ఈ ఉద్యమంలో పంజాబ్ రైతులు పెద్ద ఎత్తున పాల్గొనగా కేజ్రీవాల్ దీనికి తోడుగా నిలవడం ఈ ఫలితానికి కారణం కావచ్చు. హిందూత్వ భావోద్రేకంతో ప్రజా సమస్యలను పక్కదారి పట్టించే కాషాయం అక్కడ బలంగా పనిచేయకపోవడం కూడా ఆమ్ ఆద్మీ పార్టీ గెలుపుకు ముఖ్య కారణంగా ఉంది.

ఈ ఎన్నికల ఫలితాలతో హిందూత్వ ఎజెండాకు ప్రజలు ఆమోదముద్ర వేశారని బి.జె.పి. దాని అనుకూలురు వాదిస్తున్నారు. దళిత వ్యతిరేకి అని, మతోన్మాద పార్టీ అని, ఉద్రేకాలను రెచ్చగొడుతుందని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను ప్రజలు తోసిపుచ్చారని కూడా కాషాయ సోషల్ మీడియా యూనివర్సిటీ విస్తృత ప్రచారానికి పూనుకుంది. ఈ వాదనను బలంగా తిప్పికొట్టాల్సిన బాధ్యత లౌకిక, ప్రజాస్వామిక, అభ్యుదయ వాదులపై ఉంది. ఈ ఎన్నికల్లో గెలిచామనిపించుకోవడానికి ఆ పార్టీ అనుసరించిన అనైతిక పద్ధతులు, చేసిన అబద్ధపు ప్రచారాలు, కుట్రలు, ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చడానికి అవలంబించిన దిగజారుడు విధానాలను ప్రజలకు వివరించాల్సి ఉంది. యుపిలో బిజెపి కూటమికి వచ్చిన ఓట్ల శాతం 43.82, అంటే 56.18 శాతం ఆ రాష్ట్రంలో ఆ పార్టీని, దాని హిందూత్వ ఎజెండాను తిరస్కరించారని స్పష్టమవుతోంది. ఇవే సమీకరణాలు అన్ని రాష్ట్రాల్లోనూ కనపడుతున్నాయి. అంటే ఎన్నికల రాజకీయాల్లో మెజారిటీ ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా ఆ పార్టీ అధికారాన్నయితే పొందగలిగిందే కానీ అది తన మతోన్మాద విధానాలకు ఆమోదం కాదని అర్థం చేసుకోవాలి.

ఏదేమైనా 4 రాష్ట్రాల్లో అధికారాన్ని కాపాడుకోవడానికి బిజెపి అనుసరించిన విధానాలు, వారికి మేలు చేసిన అంశాలను పరిశీలించడం ద్వారా రాబోయే రోజుల్లో అందుకు దీటుగా ప్రజా క్షేత్రంలోకి చేరువ కావడానికి అవకాశం కలుగుతుంది. ఎన్నికల కోసం బిజెపి దాదాపు సంవత్సరం ముందునుంచే ప్రణాళికాబద్ధంగా పని మొదలుపెట్టడం అత్యంత కీలకంగా మారింది. అలాగే బిజెపి బలమైన పార్టీగా, మోడీ తిరుగులేని నేతగా, యోగి భవిష్యత్ ప్రధానిగా మీడియా చేసిన ప్రచారం కూడా ప్రజల ఆలోచనలను ప్రభావితం చేసింది. అన్నింటికీ మించి సోషల్ మీడియా విభాగంలో బిజెపి ఏర్పరుచుకున్న ప్రత్యేక యూనివర్సిటీ అబద్ధాలను పదే పదే ప్రచారం చేస్తూ నిజాలుగా నమ్మించడం, వాస్తవ విరుద్ధమైన విషయాలను శాస్త్రీయ అంశాలుగా ఏమార్చడం, చరిత్ర వక్రీకరణలకు పాల్పడుతూ తమను తాము హిందూ మతోద్ధారకులుగా ప్రకటించుకోవడం, పాకిస్థాన్, చైనా, తాలిబన్లను అతిపెద్ద శత్రువులుగా, దేశానికి ప్రమాదంగా చిత్రీకరించి, దానిని ఎదుర్కొనే శక్తి ఒక్క తమకే ఉందనే ప్రచారాల ద్వారా ప్రజలు తమ నిత్యజీవిత సమస్యలను, ప్రభుత్వ వ్యతిరేకతను మర్చిపోయేలా చేయడంలో విజయం సాధించడమే ఈ ఫలితాలకు కారణాలుగా ఉన్నాయి. దానికి తోడు ఫేస్ బుక్(మెటా), ట్విట్టర్ వంటి సోషల్ మీడియా గ్రూప్‌లు అధికార బిజెపికి ఇతోధికంగా సాయపడ్డాయని ది రిపోర్టర్స్ కలెక్టివ్ (టిఆర్‌సి) ఎడి.వాచ్ అనే సంస్థ వెల్లడించింది. ఏ చిరునామా లేని, రూపకర్తలు ఎవరో తెలియని (ఘోస్ట్ అడ్వర్‌టైజ్‌మెంట్స్) బిజెపి అనుకూల ప్రకటనలు ఫేస్‌బుక్‌లో వేలాదిగా వెలువడ్డాయని ఆ సంస్థ బహిర్గతం చేసింది.

ఈ ఎన్నికల్లో బిజెపి, మోడీ – యోగి – షా త్రయం అనుసరించిన విధానాలు, చేసిన అక్రమాలు, అబద్ధపు ప్రచారాలు, ప్రలోభాలు, బెదిరింపులు, రెచ్చగొట్టిన ఉద్రేకాలు, ఓట్ల చీలిక కుతంత్రాలు రాబోయే రోజుల్లో దేశవ్యాప్తం కానున్నాయి. ఇది లౌకికవాదానికి, శాస్త్రీయ, ప్రజాస్వామిక విలువలకు గొడ్డలిపెట్టులా మారనుంది. యుపి బ్లూ ప్రింట్‌ను అన్ని రాష్ట్రాల్లో, జాతీయ సార్వత్రిక ఎన్నికల్లో కూడా ఉపయోగించే అవకాశం ఉంది. దీనిని ఎదుర్కోవడం అతిపెద్ద సవాలు. చాపకింద నీరులా విస్తరిస్తున్న ఉద్రేక, ఉద్వేగ, హిందూత్వ భావజాలానికి అడ్డుకట్ట వేసి ఎన్నికలు జరగవల్సింది ప్రజా సమస్యలు, ఆర్థిక, సామాజిక సమస్యల ప్రాతిపదికగానన్న వాస్తవాన్ని విస్తృతంగా ప్రచారం గావించాల్సి ఉంది. బిజెపి ఐటి విభాగం నుంచి విడుదలయ్యే అన్ని అసత్యాలు, వక్రీకరణలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాల్సి ఉంది. అంతకంటే బలంగా గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించేలా సోషల్ మీడియాను ఉపయోగించుకోవాలి. ఆర్థిక అసమానతలకు తోడు రాజకీయ, సాంస్కృతిక, ఆహార, ఆహార్య, ఆచార, భాషా, కుల, మత, ప్రాంత అసమానతలను ఉద్దేశ్యపూర్వకంగా పెంపొందిస్తున్న స్వార్థపూరిత మోసాలను బట్టబయలు చేయాల్సిన అవసరం ఉంది. రైతు ఉద్యమం బలంగా ఉన్న ప్రాంతాల్లో బిజెపికి ఎదురైన వ్యతిరేకతను బట్టి నిరంతర పోరాటాలే ప్రజలను చైతన్యం చేయగలుగుతాయని నిరూపితమైంది. అయితే సమస్యల మీద ప్రజా పోరాటాలు, రాజకీయ ఉద్యమాలతో వాస్తవిక చారిత్రక, సాంస్కృతిక అంశాలను మిళితం చేయాల్సిన అవసరాన్ని ఈ ఫలితాలు నొక్కి చెప్తున్నాయి. అంటే ప్రస్తుతం సాంస్కృతిక విప్లవ ఆవశ్యకత గతం కంటే వంద రెట్లు ఎక్కువ అయింది. ఆ పనికి పూనుకోనంత వరకు, వాదనలో ప్రతిదాడి జరగనంత కాలం హిందూత్వ కోరలకు పదును పెరుగుతూనే ఉంటుంది.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

అమరావతికి అనుకూలంగా హైకోర్టు తీర్పు

***రైతులతో చట్టబద్ధ ఒప్పందం చేసుకుని భూసేకరణ జరిపిన తర్వాత రాజధానిని మార్చడం చట్ట వ్యతిరేకమంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పును వివరిస్తున్నారు* చిమ్మె. జాన్ బర్నబాస్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతి కొనసాగాలంటూ భారత రాజ్యాంగం నిర్దేశించిన మూడు ప్రధానాంగాలైన శాసన నిర్మాణ శాఖ, కార్య నిర్వాహక వ్యవస్థ, న్యాయ శాఖలను వేర్వేరు ప్రాంతాలకు తరలిస్తూ చట్టం చేసే అధికారం రాష్ట్ర శాసనసభకు లేదని రాష్ట్ర హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం (ఫుల్ బెంచ్) మార్చి 3న స్పష్టపరిచింది. సిఆర్‌డిఎ చట్టంలోని సెక్షన్ 58కి లోబడి అమరావతి రాజధాని నగరం, ఆ ప్రాంతంలో మౌలిక సదుపాయాలను నెల రోజుల్లో కల్పించాలని, రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులకు మౌలిక సదుపాయాలన్నీ కల్పించి, నివాసయోగ్యంగా ప్లాట్లను సిద్ధం చేసి మూడు నెలల్లోగా అప్పగించాలని ఆదేశించింది. భూసమీకరణలో భాగంగా రైతులతో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఆరు నెలల్లో అమరావతి రాజధాని నగరాన్ని నిర్మించాలని, రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని తేల్చి చెప్పింది.

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎపి రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఎపిసిఆర్‌డిఎ) రద్దు చట్టం, పాలన వికేంద్రీకరణ – మూడు రాజధానుల ఏర్పాటు చట్టంలను సవాలు చేస్తూ రాజధాని రైతులతో పాటు పలువురు హైకోర్టులో వ్యాజ్యాలు వేశారు. వీటిపై విచారణ కొనసాగుతుండగానే ఆ చట్టాలను రద్దుచేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం కొత్త చట్టం (ఆక్ట్ 11/2021) తీసుకొచ్చింది. మూడు రాజధానుల చట్టాన్ని ప్రభుత్వం రద్దు చేసినా, కొన్ని అంశాలలో తమకు పూర్తిగా విచారణ జరగాలని పిటిషనర్‌ల తరపున న్యాయవాదులు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని కోరారు. రాజధాని అమరావతి బృహత్తర ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) ను అమలు చేయాలని విన్నవించారు.

భూసమీకరణ పథకం కింద భూములిచ్చిన రైతులకు ప్లాట్లు అభివృద్ధి చేసి ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కొందరు కోరారు. రాష్ట్ర హైకోర్టును అమరావతిలో ఏర్పాటు చేస్తూ రాష్ట్రపతి నోటిఫై చేసిన నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును ఇతర ప్రాంతాలకు మార్చకుండా ఆదేశించాలని కొందరు కోరారు. రాష్ట్ర హైకోర్టు శాశ్వత భవన నిర్మాణాన్ని కొనసాగించాలని, సిఆర్‌డిఎ చట్టాన్ని సరైన విధంగా అమలు చేసేలా ఆదేశించాలని న్యాయవాదులు వాదనలు వినిపించారు.

మూడు రాజధానుల చట్టాన్ని ప్రభుత్వం రద్దు చేసినందున ఈ వ్యవహారంపై దాఖలైన వ్యాజ్యాలపై విచారణ అవసరం లేదని ప్రభుత్వం తరపున న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఫిబ్రవరి 4న ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తీర్పును మార్చి 3న రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఫుల్ బెంచ్ ప్రకటించింది.

హైకోర్టు పేర్కొన్న ప్రధాన అంశాలు: 1. రైతులతో చేసుకున్నది చట్టబద్ధమైన ఒప్పందం, దానిని రాష్ట్ర ప్రభుత్వం, సిఆర్‌డిఎ ఉల్లంఘించాయి. కాబట్టి జోక్యం చేసుకొని ఆదేశాలిచ్చే అధికారం కోర్టుకు ఉంది. 2. నిర్మాణాలు చేపట్టడంలో విఫలమవ్వడం, రైతులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ నుంచి వైదొలగడమే. 3. భూములు ఇచ్చిన రైతులకు హామీనిచ్చి దాని నుంచి వైదొలగడానికి వీలులేదు. 4. రైతులకు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండడంలో ప్రభుత్వం, సిఆర్‌డిఎ విఫలమయ్యాయి. కాబట్టి కోర్టు జోక్యం చేసుకొని తగిన ఆదేశాలు ఇచ్చే అధికారం కోర్టుకు ఉంది. 5. జీవనాధారమైన భూములను అప్పగించిన రైతుల ప్రాథమిక హక్కులను రాష్ట్ర ప్రభుత్వం కాలరాసింది. 6. ఒప్పందం ప్రకారం భూములిచ్చిన వారికి అభివృద్ధి చేసిన ప్లాట్లు మూడేళ్లలో ఇవ్వాలి. ఆ గడువు 2018 తోనే ముగిసింది. ప్రభుత్వం మారినంత మాత్రాన విధానాలు మారకూడదు. గత ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులను పూర్తి చేయాల్సిన చట్టబద్ధమైన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉన్నది. 7. ఆర్థిక ఇబ్బందులను కారణంగా చూపుతూ అభివృద్ధి పనులను నిలిపివేయడాన్ని అనుమతించం. చేసిన ఖర్చుకు రాష్ట్ర ప్రభుత్వం, సిఆర్‌డిఎదే బాధ్యత. ఈ నేపథ్యంలో అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయాలని ఆదేశిస్తున్నాం.

గత ప్రభుత్వం నోటిఫై చేసిన రాజధాని బృహత్ ప్రణాళికను ఇప్పటి ప్రభుత్వం, సిఆర్‌డిఎ తమంతట తాముగా సవరించడానికి వీలు లేదు. రాజధానిని మార్చేందుకు, మూడుగా విభజించేందుకు శాసనం చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదు. ఈ అంశాలన్నింటిని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం స్పష్టపరిచింది.

మూడు రాజధానుల చట్టాన్ని రద్దు చేసినా పిటిషనర్‌ల వాదనలు విన్న తర్వాత ఆ విషయంలో శాసనం చేసే అధికారం ప్రభుత్వానికి ఉందా లేదా అనేది తేల్చాల్సింది కోర్టేనని ధర్మాసనం పేర్కొంది. ప్రభుత్వ ఉద్దేశం స్పష్టంగా కనిపిస్తున్నప్పుడు మళ్లీ చట్టం చేసేవరకు వేచి చూడాల్సిన అవసరం లేదు. కోర్టు తీర్పు రాకముందే ప్రభుత్వం మూడు రాజధానుల చట్టం, సిఆర్‌డిఎ చట్టాన్ని రద్దు చేసుకున్నది. భాగస్వాములతో సంప్రదింపులు జరిపి తిరిగి బిల్లులు పెడతామంటున్నారు. ఈ నేపథ్యంలో పిటిషనర్‌లు శాసనాధికారంపై తేల్చాలని కోర్టును కోరుతున్నారు. ఎపిసిఆర్‌డిఎ చట్టం తెచ్చి భూములు సమీకరించాక రాజధాని అమరావతికి 15 వేల కోట్లు ఖర్చు చేశారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్ అధికారాన్ని ఉపయోగించే రాజధానిని

ఏర్పాటు చేశారనే పిటిషనర్‌ల వాదనలతో ఏకీభవిస్తున్నట్లు రాష్ట్ర హైకోర్టు తేల్చి చెప్పింది. ఎపిసిఆర్‌డిఎ చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం నోటిఫై చేసిన రాజధాని నగరం నుంచి హైకోర్టు, రాజధాని, శాఖాధిపతుల కార్యాలయాల తరలింపు, మూడు రాజధానులు తీసుకొచ్చే విషయంలో రాష్ట్రానికి శాసనాధికారం లేదని రాష్ట్ర హైకోర్టు స్పష్టపరిచింది.

మూడు రాజధానుల చట్టాన్ని రద్దు చేస్తూనే, బహుళ రాజధానులు తీసుకొస్తామని ప్రభుత్వం అంటోంది. ఎపి విభజన చట్టంలోని సెక్షన్ 94(3) ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఎపి రాజధాని, రాజభవన్, హైకోర్టు, సచివాలయం, అసెంబ్లీ, మండలి నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించాలని చెబుతోంది. పార్లమెంట్‌లో చేసిన చట్టం ద్వారా అమరావతి రాజధాని ఏర్పడింది. ఈ నేపథ్యంలో దీనిపై రాష్ట్ర ప్రభుత్వం మరోసారి చట్టం చేయలేదు. రాష్ట్రానికి శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలను నిర్ణయించే అధికారం పార్లమెంట్‌కు కూడా ఉంది. దానిని ఉపయోగించి పార్లమెంట్ ఒకసారి 'ఎపి విభజన చట్టం–2014'ను తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో సిఆర్‌డిఎ రద్దు, మూడు రాజధానుల చట్టం తీసుకొని రావడం చట్ట విరుద్ధమని రాష్ట్ర హైకోర్టు అభిప్రాయపడుతున్నట్లు స్పష్టపరిచింది. వివిధ రాష్ట్రాల విభజన చట్టాల్లో రాజధాని ప్రస్తావన లేదు. ఎపి విభజన చట్టంలో మాత్రమే రాజధాని ప్రస్తావన ఉంది. రాజధాని ఏర్పాటు విషయంలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వానికి ఒకేసారి అధికారాన్ని దాఖలు పరిచింది. ఆ అధికారం ప్రకారం ఒకసారి రాజధాని నిర్ణయం జరిగిపోయింది. ఈ నేపథ్యంలో రెండోసారి శాసనం చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదు అని రాష్ట్ర హైకోర్టు స్పష్టపరిచింది.

29,754 మంది రైతులు భూసమీకరణలో 33,771 ఎకరాల భూమిని రాజధాని కోసం ఇచ్చారు. వారికి ఇతర ప్రయోజనాలతో పాటు అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రజా రాజధానిని నిర్మిస్తాం, అందులో నివసిస్తారని ప్రభుత్వం చెప్పింది. ఈ కేసుల్లో 93 శాతం పిటిషనర్‌లు చిన్న, సన్నకారు రైతులు. వారి జీవనాధారం దెబ్బతిన్నప్పుడు 'కోర్టు చూస్తూ ఊరుకోదు' – మౌన సాక్షిగా ఉండాలా? తమ అధికారాన్ని ప్రయోగించాలా? అనేది కోర్టు ముందున్న కర్తవ్యం అంటూ తీవ్రంగా వ్యాఖ్యానించింది. ఈ మొత్తం కేసుల్లో రైతులు హుందాగా 'జీవించే హక్కు'ను ప్రభుత్వం తిరస్కరించింది, గుంజుకున్నది అంటూ వ్యాఖ్యానించింది.

మూడు రాజధానుల చట్టంలో న్యాయ రాజధానిని కర్నూలులో ఏర్పాటు చేస్తామని అంటున్నారు. దీనిని అంగీకరిస్తే, ప్రభుత్వాలు మారినప్పుడల్లా హైకోర్టును నచ్చినట్లు మార్చుకునే వీలు కల్పించినట్లవుతుందంటూ ధర్మాసనం వ్యాఖ్యానించింది. అదే జరిగితే న్యాయ వ్యవస్థకు తీవ్ర నష్టమే కాదు, రాష్ట్ర ఖజానాకు కూడా భారం పడుతుంది. శ్రీకాకుళం నుంచి కర్నూలుకు కక్షిదారులు ప్రయాణించడం భారం అవుతుంది.

సుప్రీంకోర్టు తీర్పు, ఎపి విభజన చట్టం నిబంధనల ప్రకారం హైకోర్టు ప్రధాన స్థానాన్ని రాష్ట్రపతి మాత్రమే నిర్ణయించగలరు. అమరావతిలో హైకోర్టు ఏర్పాటుకు రాష్ట్రపతి ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చి ఉన్నారు కాబట్టి హైకోర్టు ప్రధాన బెంచ్‌ను మరొక చోటికి తరలించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదు. ఎపి గవర్నర్ ఆమోదంతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రాంతీయ ధర్మాసనాలు ఏర్పాటు చేసుకోవచ్చునంటూ రాష్ట్ర హైకోర్టు స్పష్టపరిచింది.

'భూ సమీకరణ పథకం' నిబంధనల ప్రకారం సిఆర్‌డిఎకు, రైతులకు మధ్య కుదిరిన చట్టబద్ధమైన ఒప్పందాన్ని ఏ ఒక్కరూ అతిక్రమించ జాలరు. ఈ ఒప్పందానికి ప్రభుత్వం కట్టుబడి ఉండాలి. కాంట్రాక్టు చట్టం ప్రకారం ప్రస్తుతం కుదిరిన ఒప్పందాన్ని రద్దు చేయడం సాధ్యం కాదు. ఈ ఒప్పందం ప్రకారం సమీకరించిన భూమిని అభివృద్ధి చేసి రాజధానిలో ప్లాట్లను రైతులకు అప్పజెప్పాలి. ఇందుకు గాను ఒక ఎకరాకు 3,400 చదరపు గజాలు సిఆర్‌డిఎ వద్దే ఉంటుంది. ఏదైనా షరతు ఉంటే తప్ప కాంట్రాక్టును రద్దు చేయడానికి వీలు లేదు. ప్రస్తుతం కుదిరిన ఒప్పందంలోని ఫాం 9.14.లో అలాంటి షరతు ఏమీ లేదు.

భూ సమీకరణలో భాగంగా సిఆర్‌డిఎ సంస్థ రోడ్లు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఈ అభివృద్ధి పనుల చేపట్టడానికి ఎలాంటి చెల్లింపులు లేకపోయినప్పటికీ, సిఆర్‌డిఎ దగ్గర భూమి ఉంది కాబట్టి ఇరుపక్షాలు ప్రయోజనం పొందుతున్నందున ఒప్పందం అమలు పరస్పర బాధ్యత. అభివృద్ధి ఒప్పందంలోని నిబంధనలు ఫాం 9.14. ప్రకారం ఒప్పందాన్ని రద్దు చేసుకునే అధికారం ఇరు పక్షాలకూ లేదు. జిపిఎ రద్దుకు అవకాశం లేనందున అభివృద్ధికి సిఆర్‌డిఎ కట్టుబడి ఉండాల్సిందే. భూ సమీకరణ పథకం అమలులో భాగంగా ప్రభుత్వం 2015లో జారీ చేసిన జిఓ ప్రకారం సిఆర్‌డిఎ దశల వారీగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాలి. ఆ పనులను పూర్తిచేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఒప్పందంలోని షరతులను విస్మరిస్తే అది సిఆర్‌డిఎ చట్టానికి, భూ సమీకరణ నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడినట్టే. ఇది ప్రైవేట్ ఒప్పందం కాదు. శాసనం ద్వారా కొన్ని నిబంధనలతో కుదిరింది. ఇందులో సిఆర్‌డిఎకు భూమిని అప్పగించడం స్వచ్ఛందమైనప్పటికీ, అది రైతుల చట్టబద్ధమైన హక్కు. అభివృద్ధి చేసిన ప్లాట్లను రైతుకు అప్పగించడం సిఆర్‌డిఎ బాధ్యత అంటూ రాష్ట్ర హైకోర్టు వ్యాఖ్యానించింది.

రాజధాని కోసం భారీ ఎత్తున భూమి అందుబాటులో ఉన్నందున ప్రభుత్వం రాజధానిని ఇక్కడ నుండి మార్చలేదు. అలాంటి చర్యలు చేపట్టడమంటే అది భూమిలిచ్చిన రైతుల హక్కులను కాలరాయడమే. సమీకరించిన భూముల్లో రాజధాని అమరావతి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం, సిఆర్‌డిఎ కట్టుబడి ఉండాలి. ఆ భూములను పారిశ్రామిక అవసరాల కోసం ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించడం, రుణాలు పొందడానికి తాకట్టు పెట్టడం, ఇతర అవసరాలకు తనఖా పెట్టడం వంటి చర్యలు భూ సమీకరణ పథకానికి విరుద్ధం.

రాజధాని ఏర్పాటు, రాజధాని ప్రాంత అభివృద్ధి కోసమే భూ సమీకరణ జరిగింది. అది చట్టబద్ధమైన ఒప్పందం కావడంతో రాజ్యాంగంలోని అధికరణ 298, 299 పరిధిలోకి రాదు. ఒప్పందాన్ని అమలు చేయడంలో ప్రభుత్వ సంస్థలు విఫలమైనప్పుడు ప్రభుత్వమే బాధ్యత వహించాలి. సిఆర్‌డిఎ ప్రభుత్వ సంస్థ అయినందున

రాజధానిని ప్రభుత్వమే నిర్మించాలి. భూములిచ్చిన రైతులు ప్రభుత్వ చర్యలతో జీవనాధారాన్ని, భవిష్యతును కోల్పోయారు. ప్రభుత్వం, సిఆర్‌డిఎలు రాజ్యాంగంలోని అధికరణలు 21, 300 - ఎ లను ఉల్లంఘించాయి.

శివరామ కృష్ణన్ కమిటీ సిఫారసులలో భాగంగా గ్రీన్ ఫీల్డ్ సిటీగా అమరావతిని గత ప్రభుత్వం ప్రతిపాదించినప్పుడు అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న ఇప్పటి ముఖ్యమంత్రి ఆ ప్రతిపాదనను ఎలాంటి నిరసన వ్యక్తం చేయకుండా ఆమోదం తెలిపారు. దీనితో గత ప్రభుత్వం అమరావతిని రాజధానిగా ప్రకటిస్తూ 2014లో ఉత్తర్వులిచ్చింది. సిఆర్‌డిఎ చట్టం కింద భూ సమీకరణ పథకానికి రూపకల్పన జరిగింది. కార్యనిర్వాహక, న్యాయ, శాసన వ్యవస్థలు అమరావతిలోనే ఉంటాయని రైతులు భావించారు. అయితే కొత్త ప్రభుత్వం అభివృద్ధి వికేంద్రీకరణ పేరుతో మూడు రాజధానుల ప్రతిపాదన తీసుకొచ్చింది. ఒప్పందం ప్రకారం చట్టబద్ధ అంచనాలను అమలు పరచవలసిందే. పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి దాఖలు చేసిన అఫిడవిట్‌లో అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని అంగీకరించారు. అందువల్ల సిఆర్‌డిఎ చట్టం, భూ సమీకరణ నిబంధనల ప్రకారం సిఆర్‌డిఎ తన బాధ్యతలను నెరవేర్చాల్సిందే. మూడు రాజధానుల విధానం వల్ల అమరావతిలో శాసన రాజధాని తప్ప మరేమీ మిగలదు. భవనాల నిర్మాణం తప్ప ఎలాంటి అభివృద్ధీ ఉండదు.

రాజ్యాంగంలోని అధికరణ 163 ప్రకారం సభలను ఎక్కడైనా నిర్వహించే అధికారం గవర్నర్‌కు ఉంది. సంబంధిత ప్రదేశంలో సమావేశాలకు హాజరు కావాలని రెండు సభలనూ ఆదేశించవచ్చు. దీనికి అసెంబ్లీ భవనం ఉండవలసిన అవసరం లేదు. గవర్నర్ బంగళాను కార్యనిర్వాహక రాజధానికి తరలిస్తే ఆయన ఉన్న ప్రాంతంలోనే సభలు జరిగే అవకాశం ఉంది. ఇది ప్రత్యక్షంగా రాజధాని రైతులపై ప్రభావం చూపుతుంది. కాబట్టి 3 రాజధానులపై ప్రభుత్వ నిర్ణయం అసమంజసం అంటూ రాష్ట్ర హైకోర్టు స్పష్టపరిచింది.

ప్రజోపయోగం కోసం భూములను కేటాయించినప్పుడు ఆ భూమిని మరే ఇతర పనుల కోసం, లాభదాయకత కోసం వినియోగించకూడదని సుప్రీంకోర్టు గతంలోనే స్పష్టీకరించింది. సిఆర్‌డిఎ చట్టంలోని నియమ నిబంధనలు 12, 13, 14, ప్రకారం భూ సమీకరణ పథకానికి సంబంధించి తుది నోటిఫికేషన్ విడుదలైన తేదీ నుంచి మూడేళ్ల లోగా ఆ భూముల్లో దశల వారీగా మౌలిక వసతులు అభివృద్ధి చేయాలి. తర్వాత 30 రోజుల లోపు సిఆర్‌డిఎ కమిషనర్ దానిపై నోటీసు ప్రచురించాలి. లే అవుట్ల పూర్తికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం, సిఆర్‌డిఎ ఇప్పటివరకూ ఎలాంటి పనులు చేయకుండా చట్టాన్ని ఉల్లంఘించాయి అంటూ రాష్ట్ర హైకోర్టు స్పష్టపరిచింది.

ప్రభుత్వం, సిఆర్‌డిఎ మితిమీరిన విచక్షణతో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాయి. ఏకపక్ష నిర్ణయాలతో చట్టబద్ధమైన అంచనాలను దెబ్బతీస్తున్నప్పుడు అధికరణ 226 కింద కోర్టులు ఆదేశాలివ్వవచ్చు. రాజధాని నిర్మాణం, అభివృద్ధి చేయని పక్షంలో రైతుల హక్కులను కాలరాసినట్లే. ప్రభుత్వం అమరావతిలో సచివాలయం, హైకోర్టు, ఐఎఎస్/ఐపిఎస్‌ల క్వార్టర్లు, ఎంఎల్‌ల/ ఎంపిల నివాసాల నిర్మాణం చేపట్టింది. శాశ్వత హైకోర్టు భవన నిర్మాణం ప్రారంభమైంది. కార్యదర్శులు, మంత్రుల క్వార్టర్లు పాక్షికంగా దాదాపు పూర్తయ్యాయి. ఇలాంటి సమయంలో 3 రాజధానుల నిర్ణయం ఏకపక్షంగా జరిగినట్లు రాష్ట్ర హైకోర్టు నిర్ధారణకు వచ్చింది. చట్టం రద్దు చేసిన నేపథ్యంలో ప్రస్తుతమున్న నిర్మాణాలను కొనసాగించడం తప్ప మరోచర్య చేపట్టడానికి వీల్లేదు. ఒకవేళ ప్రభుత్వం, సిఆర్‌డిఎ భూమిని వెనక్కి ఇవ్వాలని ప్రయత్నించినా ప్రజల భూములను గుర్తించడం చాలా కష్టం. గత 3 ఏళ్లుగా పొదలు, ముళ్ల కంపలతో నిండిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజి గుంతలు, విద్యుత్ లైన్లు వేయడంతో వ్యవసాయ భూములు ఉనికిని కోల్పోయి, సాగుకు పనికిరాకుండా అయినవి.

ప్రభుత్వానికి చట్టాలంటే చులకన భావం, విపరీతమైన దురహంకారం. క్రూరమైన అణచివేత, పోలీసుల అనుచిత ప్రవర్తనకు చెంపపెట్టు లాంటిది ఈ తీర్పు. రాజధాని రైతుల పోరాటానికి ఈ తీర్పు ఒక నిదర్శనం. ప్రజాస్వామ్య స్ఫూర్తికి, రాజ్యాంగ పరిరక్షణకు ఈ తీర్పు అద్దం పట్టింది.

(రచయిత న్యాయవాది, ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

వచ్చే సంచికలలో...

- ❖ **కరోనా అనంతర పరిణామాలు - లంకా పాపిరెడ్డి**
- ❖ **బెంగాల్‌లో మతతత్వ రాజకీయాలు - కొండూరి వీరయ్య**
- ❖ **ఇండియాలో మూడు సామాజిక విప్లవాలు - డా. పట్టా వెంకటేశ్వర్లు**
- ❖ **మంగల్ పాండేది మొదటి పోరాటమా? స్వాతంత్ర్య సమరమా? - సంగిరెడ్డి హనుమంతరెడ్డి**
- ❖ **కుల అస్తిత్వాన్ని చిత్రించిన నవల: పుట్టుమచ్చ - మెంతబోయిన సైదులు**

హిజాబ్ వివాదం లౌకిక విధానానికి పెను సవాల్

కర్ణాటకలో హిందుత్వ శక్తులు ఉద్దేశ పూర్వకంగా, రాజకీయ ప్రయోజనాల కోసం రెచ్చగొట్టిన హిజాబ్ వివాదాన్ని, న్యాయస్థానం తీర్పును వివరిస్తున్నారు **తండా సదానందం**

భారతదేశం భిన్న సంస్కృతులకు నిలయం. అనేక భాషలు మాట్లాడే వారు ఉన్నారు. రకరకాల వేషధారణ కలిగి ఉన్నారు. ఆచార వ్యవహారాల్లోను, ఆహార్యంలో, ఆహారపు అలవాట్లలో వైవిధ్యాన్ని పాటిస్తున్నారు. విభిన్న మతాలకు, కులాలకు చెందిన ప్రజలు ఒకే దేశంలో జీవిస్తూ, ఒకే చట్టాన్ని అనుసరిస్తూ భిన్నత్వంలో ఏకత్వంగా రాష్ట్రాల సమాఖ్యగా వెలుగొందుతున్న భారతదేశం మత ప్రమేయం లేని లౌకిక, ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యంగా ప్రపంచ దేశాలకు ఆదర్శంగా, అలీన విధానాలతో సార్వభౌమత్వాన్ని ప్రదర్శిస్తున్న దేశం. ఇటీవల మరీ ముఖ్యంగా 2014 తర్వాత మోడీ నాయకత్వంలో భారతీయ జనతా పార్టీ పాలనలోకి వచ్చాక ప్రజల మధ్య విభజన రేఖలు సృష్టించబడుతున్నాయి. సాధారణంగా ప్రజలకు ఉండే ఆహారపు అలవాట్ల విషయంలో, భక్తి భావాలలో, మత ఆచార వ్యవహారాలలో కలగజేసుకుని సంఘ్ పరివార్, హిందుత్వ శక్తులు ఒక వర్గాన్ని ప్రోత్సహిస్తూ, మరో వర్గాన్ని టార్గెట్ చేసి వేధింపులకు గురిచేస్తూ రాజకీయ లబ్ధి కోసం తమ పబ్బం గడుపుకోవాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తుండడం పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి, భారతదేశ సంక్షేమానికి ప్రమాదకరం.

ఒకే దేశం, ఒకే జాతి, ఒకే భాష, ఒకే మతం, ఒకే విద్య అంటూ హిందూ దేశంగా మార్చే ప్రయత్నంలో భాగంగానే ముస్లిం బాలికలు హిజాబ్ ధరించడాన్ని నిషేధిస్తూ కర్ణాటక ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ వివాదం జాతీయంగా, అంతర్జాతీయంగా రచ్చకెక్కింది. ఎంతో కాలంగా ముస్లిం బాలికలు హిజాబ్ ధరించి విద్యా సంస్థలకు విచ్చి విద్యనభ్యసించడం జరుగుతుంది. గతంలో ఎప్పుడు లేని విధంగా యూనిఫామ్ పేరిట హిజాబ్ ధరించడం జాతీయ సమైక్యతకు భంగకరమని విద్యా సంస్థలకు అడుగు పెట్టిన వారిని తిప్పి పంపించడంతో దుమారం చెలరేగింది. జనవరి 2022 ప్రారంభంలో పాఠశాల యూనిఫామ్‌లకు సంబంధించిన వివాదం ఏర్పడింది. హిజాబ్ ధరించి తరగతులకు హాజరు కావాలనుకున్న ముస్లిం బాలికలను కళాశాల నిబంధనలు ఉల్లంఘించారనే కారణంతో కళాశాలలోకి అనుమతించలేదు. రాష్ట్ర వ్యాప్తంగా అది ఇతర పాఠశాలలకు, కళాశాలలకు వ్యాపించింది. హిందూ విద్యార్థుల సమూహాలు కూడా హిజాబ్‌కు వ్యతిరేకంగా కుంకుమ, కాషాయ కండువాలు ధరించాలని డిమాండ్ చేస్తూ పోటీ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. దీంతో కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 5న హిజాబ్‌ను నిషేధిస్తూ కళాశాలలో తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని, హిజాబ్ ధరించడానికి మినహాయింపు ఇవ్వలేమని పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఫలితంగా అనేక విద్యాసంస్థలు ముస్లిం బాలికలను విద్యా సంస్థలలోకి ప్రవేశాన్ని నిరాకరించాయి. తత్ఫలితంగా బాధిత విద్యార్థులు కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. ఫిబ్రవరి 8న హిజాబ్ ధరించడం పై నిరసనలు, వివాదాల కారణంగా ప్రభుత్వం మూడు రోజులపాటు విద్యా సంస్థలను మూసివేసింది. ఫిబ్రవరి 10న విద్యార్థులందరూ మతపరమైన దుస్తులు ధరించరాదని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఫిబ్రవరి 14న విద్యా సంస్థలు పునఃప్రారంభం అయినప్పుడు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు కర్ణాటక లోని అన్ని పాఠశాలలు, కళాశాలలలో అమలు చేయబడ్డాయి. చాలా సందర్భాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులను హిజాబ్, బురఖాలు తొలగించాలని పాఠశాల గేట్ల వెలుపలే కళాశాల యాజమాన్యాలు కోరడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తినాయి. హైకోర్టు విచారణ దాదాపు 23 గంటల పాటు 11 రోజులు పిటిషనర్ల, ప్రభుత్వం, కళాశాల నుండి వాదోపవాదాలు విని ఫిబ్రవరి 25న తమ తీర్పును రిజర్వ్ చేసింది.

ఇప్పటికే ఈ వ్యవహారం కోర్టులో ఉండగా, మరోవైపు ఇదే అంశంపై రాజకీయదుమారం కొనసాగుతుండగా ముస్లిం మహిళలు ఫిబ్రవరి1న హిజాబ్ ధరించడంపై అవగాహన కల్పించడానికి ప్రపంచ హిజాబ్ దినోత్సవాన్ని నిర్వహించారు. చాలామంది ముస్లిం మహిళలు హిజాబ్ కు అనుకూలంగా ప్రదర్శనలు నిర్వహించడంతో ఈ వివాదం మరింత తారాస్థాయికి చేరింది.

ముస్లిం మహిళలకు హిజాబ్ ఎందుకు అవసరం? అలాగే హిజాబ్, బుర్ఖా, నిఖాబ్, దుపట్టలకు తేడా ఏంటో తెలుసుకుందాం.

హిజాబ్ అంటే తెర అని అర్థం. ముస్లిం మహిళలు, తమ జుట్టును పూర్తిగా, తల, మెడను ఏదైనా వస్త్రంతో కప్పి ఉంచడాన్ని హిజాబ్ అంటారు. కానీ ముఖం మాత్రమే కనిపిస్తుంది.

బుర్ఖా అంటే స్త్రీల శరీరం పూర్తిగా కప్పబడి ఉంటుంది. తల నుంచి కాళ్ల వరకూ మొత్తం శరీరాన్ని కప్పి ఉంచుతుంది. కళ్లపై తీయడానికి, వేయడానికి వీలుగా ఒక ముసుగు ఉంటుంది. బుర్ఖా ధరిస్తే శరీరంలోని ఏ భాగం కనిపించదు. చాలా దేశాల్లో దీనిని అభాయ అని కూడా అంటారు.

నిఖాబ్ అంటే ఒక రకమైన వస్త్రపు ముసుగు. ఇది ముఖంపై ఉంటుంది. ఇందులో మహిళ ముఖం కనిపించదు. కానీ కళ్లు మాత్రం కనిపిస్తాయి.

దుపట్టా అంటే చాలా సాధారణమైన వస్త్రం. ఇది ఒక రకమైన పొడవాటి కండువా లాంటిది. ఇది తలపై నుంచి కప్పబడి ఉంటుంది.

దక్షిణ ఆసియాలో ఎక్కువగా ఉపయోగిస్తారు. హిజాబ్ లాగా గట్టిగా ఉండదు.

ఇవన్నీ ముస్లిం మహిళలు తమ సంప్రదాయం ప్రకారం అనాదిగా ధరిస్తూ వస్తున్నారు.

కర్ణాటక విద్యా చట్టం 1983 కింద సెక్షన్ 145(1) ప్రకారం ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యా సంస్థలు తమ విద్యార్థులకు యూనిఫారాలపై నిర్ణయం తీసుకునే అధికారం ఇచ్చింది. పాఠశాల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం యూనిఫారంలను తప్పనిసరి చేసింది. ప్రి యూనివర్సిటీ కళాశాలలకు యూనిఫామ్‌లను ప్రభుత్వం తప్పనిసరి చేయలేదు. కానీ కాలక్రమేణా చాలా కళాశాల అభివృద్ధి కమిటీలు వాటిని స్వీకరించాయి. 2017లో ప్రి యూనివర్సిటీ విద్యార్థులను యునిఫామ్ ధరించమని అడగరాదని అన్ని ప్రి యూనివర్సిటీ కాలేజీలకు ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ఈ ఉత్తర్వులు అమలు చేయబడినట్లు కనిపించడం లేదు.

కర్ణాటక రాష్ట్ర జనాభాలో ముస్లింలు 13 శాతం ఉన్నారు. రాష్ట్రంలో ముస్లిం మహిళలు గతంలో కన్నా ఉన్నత విద్యను అభ్యసించడానికి పెద్ద మొత్తంలో ముందుకు వస్తున్నారు. ఉన్నత విద్యలో ముస్లిం మహిళల స్థూల హాజరు నిష్పత్తి గరిష్ఠంగా పెరుగుతోంది. కర్ణాటకలో 71 శాతం మంది ముస్లిం మహిళలు, 42 శాతం మంది హిందూ మహిళలు ఇంటి వెలుపల తల కప్పుకుంటారు. భారతదేశంలో ముస్లిం స్త్రీలలో 89 శాతం, హిందూ స్త్రీలలో 59 శాతం ఇంటి వెలుపల తల కప్పుకుంటారు. కర్ణాటక లోని అనేక కళాశాలలు తక్కువ సంఖ్యలో ముస్లిం విద్యార్థులు తరగతి గదిలో ఎల్లప్పుడు హిజాబ్ ధరించే వారని నివేదించాయి. 1980లో జనతా పార్టీ ప్రభుత్వంలో కర్ణాటక విద్యా శాఖ మంత్రిగా ఉన్న ఎం. రఘుపతి ప్రభుత్వ యూనిఫామ్ ఆదేశాలు హిజాబ్, క్రిస్టియన్ సన్యాసినిల డ్రెస్ కోడ్‌ను రెండింటిని అనుమతించాయని చెప్పారు. హిజాబ్‌పై భారతీయ జనతా పార్టీ అప్పట్లో అభ్యంతరం చెప్పలేదని అన్నారు. గతంలో కూడా కర్ణాటక తీరప్రాంతంలో ఈ వ్యవహారంపై నిరసనలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. మూడబిద్రీలో రెండవ సంవత్సరం ప్రి యూనివర్సిటీ విద్యార్థి హిజాబ్ ధరించాలని పట్టుబట్టిన కారణంగా 2011-12 విద్యా సంవత్సరంలో తరగతులకు హాజరు కావడానికి అనుమతించలేదు. దక్షిణ కన్నడ, ఉడిపిలోని కొన్ని జిల్లాలలో దశాబ్దాలుగా హిందూ జాతీయవాదం పెరగడంతో మతపరమైన వ్యవహారాలు బలపడుతున్నాయి. బజరంగ్ దళ్, హిందూ జాగరణ వేదిక, విశ్వ హిందూ పరిషత్, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్, పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా, దాని అనుబంధ సంస్థలైన క్యాంపస్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా, సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా లాంటి సంస్థలు బలపడి పోటాపోటీ కార్యక్రమాలు నిర్వహించడం ప్రబలింది. 2019 నుండి కర్ణాటకను బిజెపి పరిపాలిస్తోంది. ఇది గోహత్యను నిషేధించడం, మత మార్పిడి నిరోధక బిల్లును ఆమోదించడం లాంటి హిందూ జాతీయ వాద విధానాలను అవలంబించడం జరిగింది. ఆ కోవలోనే ఈ వివాదం మొదలయింది.

ఉడిపి వివాదం

ఉడిపిలోని బాలికల కోసం ప్రభుత్వం నిర్వహించే ప్రి యూనివర్సిటీ కళాశాలలో హిజాబ్ ధరించడంపై వివాదం చెలరేగింది. ఆరుగురు ముస్లిం మహిళా విద్యార్థినులు తమ కళాశాల యూనిఫారంతో పాటు హిజాబ్ ధరించి కళాశాలకు హాజరవుతామని, హిజాబ్ తమ విశ్వాసంలో భాగమని, రాజ్యాంగ హక్కు అని పేర్కొన్నారు. కళాశాల యాజమాన్యం తల కప్పుకోవడానికి, వారు వేరే రంగు లేదా మెటీరియల్‌తో కూడిన ప్రత్యేక హిజాబ్ ధరించాల్సిన అవసరం లేదని వాదించి, కళాశాలలోకి అనుమతించి, తరగతులలోకి అనుమతించలేదు. ఆ విద్యార్థినిలు కారిడార్‌లో కూర్చొని తరగతులకు హాజరు అయ్యారు. ఈ విషయాన్ని కర్ణాటక రక్షణ వేదిక అనే స్వచ్ఛంద సంస్థ మీడియా దృష్టికి తీసుకెళ్లడం, క్యాంపస్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా, పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియాలు జోక్యం చేసుకొని నిరసన కార్యక్రమాలు నిర్వహించడంతో ఈ వివాదం చిలికి చిలికి గాలి వానలా తయారైంది. యూనిఫామ్ విధానాన్ని రూపొందించే బాధ్యత కలిగిన కళాశాల అభివృద్ధి కమిటీ 21 సభ్యులతో అధికార బిజెపికి చెందిన ఎంఎల్ఎ రఘుపతి భట్ ఆధ్వర్యంలో జనవరి 1న తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించి, హిజాబ్ లేకుండానే యూనిఫామ్ కోడ్ తో కళాశాల సాగుతుందని ప్రకటించారు. క్యాంపస్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా, సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియాలు యూనిఫామ్‌లను ప్రభుత్వం తప్పనిసరి చేయనందున, విద్యార్థుల మతపరమైన హక్కులను ఉల్లంఘించరాదని అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఎమ్మెల్యే రఘుపతి భట్ ఈ విషయం పై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రి యూనివర్సిటీ విద్యా విభాగానికి లేఖ రాశారు. దీంతో ఈ వ్యవహారం రాష్ట్ర ప్రభుత్వ స్థాయికి చేరింది.

ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థులు తమ మతాన్ని పాటించలేరని, యూనిఫామ్ మూడు దశాబ్దాలుగా ఉందని ఇప్పటివరకు లేని ఈ సమస్య రాజకీయమేనని అన్నారు. హోం మంత్రి అరగ జ్ఞానేంద్ర పాఠశాలలు, కళాశాలల్లో మనమంతా భారతీయులం అనే భావన కలిగి ఉండాలని, దీనికి విద్యాసంస్థలు రూపొందించిన యూనిఫామ్ కోడును అనుసరించాలని అన్నారు. జనవరి 27న ఈ సమస్యను అధ్యయనం చేయడానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కమిటీ నిర్ణయం తీసుకునే వరకు యథాతథ స్థితిని కొనసాగించాలని విద్యార్థులను ప్రభుత్వం కోరింది. సిడిసి చైర్మన్‌గా ఉన్న రఘుపతి భట్ సమావేశాన్ని ఏర్పాటు చేసి తరగతి గదిలో హిజాబ్ తొలగించాలని కోరారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై బాధిత విద్యార్థినులు హైకోర్టును ఆశ్రయించారు.

హైకోర్టులో విచారణ-వాదోపవాదాలు

ప్రభుత్వ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఉడిపి ప్రభుత్వ పియుసి కళాశాల విద్యార్థినులు వేసిన పిటిషన్‌పై త్రిసభ్య ధర్మాసనం విచారణ కొనసాగించింది. సదరు విద్యార్థినుల తరపున న్యాయవాది దేవదత్ కామత్ వాదనలు వినిపించారు. ప్రభుత్వ ఆదేశాలను సవాల్ చేయడమే కాదు, యూనిఫామ్ రంగును పోలిన హిజాబ్ ధరించేందుకు అనుమతి ఇవ్వాలని, కేంద్రీయ స్కూల్‌లలో యూనిఫాం రంగు ఉన్న హిజాబ్ వేసుకునేందుకు ముస్లిం బాలికలకు అనుమతి ఇస్తున్నారని, అదే విధంగా ఈ కాలేజీలోనూ అనుమతించవచ్చునని, హిజాబ్‌లు ధరించడం మతాచారమని, తన కక్షిదారులు గత రెండేళ్లుగా అడ్మిషన్ల

సమయం నుంచి హిజాబ్‌లు ధరిస్తున్నారని తెలిపారు. కర్ణాటక ప్రభుత్వం హిజాబ్‌ను లక్ష్యంగా చేసుకుని విద్వేషపూరిత వివక్ష చూపుతుందని ముస్లిం విద్యార్థినులు హైకోర్టులో వాదించారు. ప్రి యూనివర్సిటీ కాలేజీలో యూనిఫామ్ చట్ట వ్యతిరేకమని, ఈ అంశంపై ఎంఎల్‌ఎ ఆధ్వర్యంలోని కాలేజీ డెవలప్‌మెంట్ కమిటీ నిర్ణయం తీసుకునే అధికారం లేదని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు.

భారతీయులు బహిరంగంగా లాకెట్టు, సిలువ, బుర్ఖ, గాజులు, హిజాబ్, బొట్టు, తలపాగా లాంటి పలురకాల మత చిహ్నాలు ధరిస్తారని విద్యార్థినుల తరపు మరో న్యాయవాది రవివర్మ కుమార్ చెప్పారు. 1995 విద్యా శాఖ నిబంధనలో పదకొండవ నిబంధన ప్రకారం విద్యాసంస్థలు యూనిఫాం మార్పుపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు కనీసం ఏడాది ముందు తెలియజేయాలని, ప్రి యూనివర్సిటీ కాలేజీలో యూనిఫామ్ గురించి విద్యాశాఖ నిబంధనలు ఎక్కడా ప్రస్తావించలేదని, ఎక్కడా హిజాబ్‌ను నిషేధించాలని లేనప్పుడు ఏ అధికారంతో పిల్లలను క్లాస్ నుంచి బయటకు పంపుతారని ప్రశ్నించారు. సమాజంలోని భిన్న వర్గాలు భిన్నమతాల చిహ్నాలు ఉపయోగిస్తాయని, గాజులు, సిలువ, టర్బన్లు మతచిహ్నాల కిందికి రావా? ప్రభుత్వ అధికారులు ఇతర మత చిహ్నాలను వదిలి కేవలం హిజాబ్‌ను మాత్రమే ప్రస్తావించారని, ఇది ముస్లిం బాలికలపై వివక్ష చూపడమేనని, ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 ప్రకారం విరుద్ధమన్నారు.

హిజాబ్ ధారణపై ఆంక్షల కారణంగా పేద ముస్లిం బాలికలు బాధపడుతున్నారని, వారి మానసిక ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని, అందుచేత ముస్లింలు పవిత్రంగా భావించే శుక్రవారం నాడు, పవిత్ర రంజాన్ నెలలో అది ధరించేలా ఆదేశాలివ్వాలని న్యాయవాది వినోద్ కులకర్ణి హైకోర్టును అభ్యర్థించారు.

ఇది ఇలా ఉండగా హిజాబ్ ధరించడం అనేది ఇస్లాంలో తప్పనిసరి మతాచారం కాదని కర్ణాటక హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం తన వాదనను వినిపించింది. విద్యాసంస్థల్లో హిజాబ్ ధరించడాన్ని నిలిపి వేస్తే ఆర్టికల్ 25ను ఉల్లంఘించినట్లు కాదని అడ్వకేట్ జనరల్ ప్రభులింగ్ నవడ్గి వాదించారు. భారత్‌లో హిజాబ్ ధరించడంపై ఎలాంటి ఆంక్షలు లేవని విద్యాసంస్థలలో క్రమశిక్షణా పరంగా, కొద్ది రకాల పరిమితులు ఉన్నాయని ప్రభుత్వం హైకోర్టుకు స్పష్టం చేసింది. ఆర్టికల్ 25 ప్రకారం హిజాబ్ ధరించే హక్కు ఉందన్న వాదన సరైంది కాదన్నారు. ఆర్టికల్ 19(1) ఎ ప్రకారం హిజాబ్ ధరించే హక్కుని రాజ్యాంగం కల్పించిందన్నారు. దీని ప్రకారం కొన్ని సంస్థలలో సహేతుకమైన కారణాలతో హిజాబ్ ధరించకూడదు అని చెప్పే అధికారాలు ఉంటాయని తన వాదనలు విన్నవించారు.

ఈ విధంగా వాదోప వాదనలు విన్న హైకోర్టు మార్చ్ 15 మంగళవారం నాడు ప్రకటించిన తుదితీర్పు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. హిజాబ్ ధరించడం తప్పనిసరి మతాచారం లోనికి రాదని నిర్ధారించడంతో పాటు విద్యాసంస్థల్లో రాష్ట్ర ప్రభుత్వం సాంప్రదాయ వస్త్రధారణపై విధించిన నిషేధాన్ని కోర్టు సమర్థించింది. ఈ అంశంపై దాఖలైన అన్ని పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. విద్యాసంస్థల ప్రోటోకాల్‌ను విద్యార్థులంతా తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రితు రాజ్ అవస్థి, జస్టిస్ కృష్ణ ఎస్. దీక్షిత్, జె.ఎం. ఖాజీలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం 129 పేజీల తీర్పు వెలువరించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ముస్లిం బాలికలు వెంటనే సుప్రీంకోర్టులో పిటిషన్లు వేశారు. ఈ తీర్పు మత విశ్వాసాలకు, వ్యక్తిగత స్వేచ్ఛకు, గోప్యతకు భంగం కలిగించేలా ఉందని అన్నారు. హిజాబ్ ధరించడం గురించి ఖురాన్‌లో స్పష్టంగా ఉందని, ఏ ఆధారాలతో హైకోర్టు ఈ తీర్పు ఇచ్చిందో అర్థం కావడం లేదని వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు మౌలానా షఫీ తెలపడం గమనార్హం. ఈ తీర్పు ముస్లిం బాలికల భద్రత, గౌరవం, చదువుపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని, హైకోర్టు తీర్పుపై స్టే విధించాలని కోరుతూ మహిళా సంఘాలు, పౌర హక్కుల సంఘాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. యూనిఫారాలకు సంబంధించి నిర్ణయాలు తీసుకునే హక్కు కాలేజీ అభివృద్ధి కమిటీలకు ఉందని కర్ణాటక హైకోర్టు తన తీర్పులో పేర్కొంది, కానీ కర్ణాటకలోని పలు కాలేజీలు తమ నిబంధనలకు కొన్ని సవరణలు చేసి యూనిఫారాలతో పాటు హిజాబ్ కూడా ధరించవచ్చని తెలియజేస్తున్నాయి. సిక్కు మతస్తులు టర్బన్‌లు, హిందువులు నుదుట సిందూరం, చేతులకు దారాలు ధరిస్తున్న మాదిరిగానే ముస్లిం మహిళలు బాలికలు యూనిఫారాలతో పాటు హిజాబ్ ధరించడాన్ని అనుమతించాలని కాలేజ్ డెవలప్‌మెంట్ కమిటీలకు పలు మహిళా సంఘాలు, పౌర హక్కులసంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. హిజాబ్ ధరించడాన్ని నిషేధించే నిబంధన ఏ కాలేజీలో లేదని, తమ కాలేజీ యూనిఫారాల కనుగుణంగా హిజాబ్ ధరించవచ్చని ఒక కాలేజీ తన నిబంధనావళిలో పేర్కొంది. హిందుత్వం గ్రూపులే దీనిపై వివాదాన్ని సృష్టించాయి. దీనిని పరిష్కరించవలసిన కర్ణాటక హైకోర్టు సమస్యను మరింత జటిలం చేసి మైనారిటీ కమ్యూనిటీలకు చెందిన మహిళలను ప్రమాదంలోకి నెట్టివేసింది. తప్పనిసరిగా పరదా ధరించడం అనే పద్ధతి ముస్లిం మహిళలను ఎలా విభజించి, వేరు చేసిందో అంబేద్కర్ రాసిన వ్యాసంలోని పేరాను ఉటంకించి, వక్రీకరించడం బాధాకరమని, పరదా పద్ధతిని పాటించడంవల్ల మహిళలు, బాలికలు బహిరంగంగా రాకుండా నిరోధించబడుతున్నారని, చదువుకోవడం దగ్గర నుండి, బయట కార్యకలాపాల వరకు అన్నింటిలోనూ ముస్లిం మహిళలు, బాలికలు బలవంతంగా వేరు చేయబడుతున్నరని ప్రస్తావిస్తే హైకోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు హిజాబ్ ధరించిన మహిళ లేదా బాలికను చదువుకు దూరం చేయాలని, ఇంట్లోనే ఏకాకి కావాలనే లేదా ప్రత్యేక ముస్లిం స్కూల్ లేదా కాలేజీలో చదువుకునేలా ఒత్తిడి తేవడం ద్వారా వారిని వేరు చేయాలని చెప్పలేదు. హిందూ బాలిక ముక్కుపుడక ధరించడాన్ని దక్షిణాఫ్రికా స్కూల్ అంగీకరించని కేసులో అక్కడి కోర్టు ఇచ్చిన తీర్పును ఇక్కడ ఉదహరించడం రాజ్యాంగ విరుద్ధమని, అలాగే విముక్తి పేరుతో హిజాబ్ ధరించిన మహిళలు లేదా బాలికలు విద్యా సంస్థలలోకి ప్రవేశించరాదనడం సమర్ధనీయం కాదని పలు సహేతుకమైన ప్రశ్నలను మహిళా సంఘాలు, పౌర హక్కుల సంఘాలు లేవనెత్తుతు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి.

ఈ వివాదం వెనక అసలు మతలబ్ ఏమిటి?

గత రెండు సంవత్సరాలుగా కరోనా మహమ్మారి విజృంభణతో

సామాన్య ప్రజలు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోల్పోయి ఆరోగ్యపరంగా, ఆర్థికంగా తీవ్ర సంక్షోభంలో మునిగి తేలుతుండగా వారిని ఆదుకోవాల్సిన తరుణంలో, అటువంటి ప్రజా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకుండా, కార్పొరేట్ ప్రయోజనాల కోసం పాటుపడుతూ ప్రజల దృష్టి మరల్చడానికి అనాదిగా పాటిస్తున్న ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేనటువంటి విషయాలను సూక్ష్మంగా సంకుచిత మతతత్వ పరిధిలోకి లాగి భావోద్వేగాలను పెంచే వివాదాలను సృష్టించి కాలయాపన చేస్తూ రాజేస్తున్న చిచ్చులో భాగమే హిజాబ్ సమస్య. ఉత్తర భారతంలో ఐదు రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికల్లో లబ్ధి పొందటం కోసం పాలకవర్గ పార్టీ కర్ణాటక రాష్ట్రంలో ఈ వివాదాన్ని సృష్టించడం జరిగింది. ప్రతి ఎన్నికలలో అధికారం చేజిక్కించుకోవడం కోసం మతపరమైన భావోద్వేగాలను రగిలించి ఎన్నికల మేనేజ్‌మెంట్లో విజయం సాధించడం పరిపాటి అయింది. ఆ క్రమంలోనే రెండు వర్గాల మధ్య చిచ్చు పెట్టి ఎన్నికల్లో లబ్ధి పొందడం ఒక ఎత్తయితే, బడుగు బలహీన వర్గాల పిల్లలను చదువుకు దూరం చేయడం మరో ఎత్తు. ఎన్నికల లబ్ధి కోసం మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టడం వివాదాస్పద అంశాలు లేవనెత్తడం, 5 రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, రాబోయే కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని హిజాబ్ వంటి వివాదాలకు బిజెపి ఆజ్యం పోస్తుందని శివసేన పార్టీ అధికార పత్రిక సామ్నా సంపాదకీయంలో విమర్శించడం గమనించదగినది.

కర్ణాటక హైకోర్టు సంచలన తీర్పు ప్రతికూల ప్రభావాలు

హిజాబ్ నిషేధం ముస్లిం మహిళల విద్య ప్రవేశానికి ఆటంకం కలిగిస్తుంది. హిజాబ్ నిషేదం ముస్లింలను విద్యావంతులను చేయడానికి ముప్పు కలిగిస్తుంది. మైనారిటీ వర్గాలకు చెందిన సాధారణ మహిళలు విద్యను అభ్యసించేందుకు చేస్తున్న పోరాటాన్ని నిషేధం పూర్తిగా విస్మరించింది. రాజ్యాంగం ప్రకారం నిష్పక్షపాతంగా అందరికీ అందుబాటులో ఉండే ప్రదేశంలో వారి లక్ష్యాలను సాకారం చేయాలనే ఆకాంక్షలను కూడా పక్కన పెట్టింది. చాలా మంది ముస్లింలు ఆధునిక విద్యా స్రవంతి వెలుపల ఉన్నారు. ఉద్దేశపూర్వకంగా లేదా వారు దానిని కోరుకున్నందున కాదు, వారికి విద్యా మార్గాలు అందుబాటులో లేనందున. నేడు విద్య ఎక్కువ శాతం ప్రైవేట్ కార్పొరేట్ రంగంలో ఉన్నందున సామాజిక, మతపరమైన సమూహాలలో ఆర్థికంగా బలహీన వర్గాల విద్యార్థులను ఆకర్షించేవి ప్రభుత్వ విద్యా సంస్థలు మాత్రమే. ఆ ప్రభుత్వ విద్యా సంస్థలు హిజాబ్ నిషేధం చేయడంవల్ల ముస్లిం బాలికలకు విద్యను అందించడంలో పురోగతి శూన్యం అవుతుంది. ఈ నిషేధం ముస్లిం విద్యార్థినుల విద్యా హక్కుకు వ్యతిరేకం. భారత రాజ్యాంగం ప్రకారం వారికి హామీ ఇచ్చిన విద్యాహక్కును తిరస్కరించడం, అవకాశాలను, గౌరవంగా జీవించే హక్కును కాలరాయడమే. మార్చి ఏప్రిల్లో అన్ని తరగతులకు ఫైనల్ పరీక్షలు జరిగే సందర్భంలో ఈ పరిస్థితి వందలాది మంది ముస్లిం బాలికల భవిష్యత్తును అగమ్యగోచరంగా మారుస్తుంది. మతపరమైన గుర్తింపు, వ్యక్తీకరణ ద్వారా విద్యా హక్కు నిరాకరించడం సాధ్యం కాదు. సామాజిక కట్టుబాట్లు కలిగిన ముస్లిం కుటుంబాల్లో అమ్మాయిలను విద్యాసంస్థలకి పంపి ఉన్నత చదువులు చదివించాలంటే ఎన్నో ప్రతిబంధకాలు ఎదురవుతున్నాయి. ఎన్నో కట్టుబాట్లను అధిగమించి ముస్లిం అమ్మాయిలు ఆధునిక విద్య దిశగా అడుగులు వేస్తుంటే వివక్షాపూరిత విద్వేష రాజకీయాలు వారి భవిష్యత్తును మత విద్యకే పరిమితం చేయాలని కుట్రలు జరుగుతున్నాయి.

దేశంలో ముస్లింల అక్షరాస్యత అంతంతమాత్రంగానే ఉంది. ముస్లిం పురుషుల అక్షరాస్యత 81 శాతం కాగా, ముస్లిం మహిళల అక్షరాస్యత 69 శాతం మాత్రమే. విద్యారంగంలో ఎస్‌సి, ఎస్‌టిల కన్నా ముస్లింలు వెనుకంజలో ఉన్నారని జస్టిస్ రాజేంద్ర సచార్ కమిటీ నివేదిక వెల్లడించింది. దేశంలో సగటున ప్రాథమిక పాఠశాలకు 100 మంది ముస్లిం విద్యార్థులు వెళుతుండగా, ప్రాథమికోన్నత విద్యలో ఆ సంఖ్య 89కి, ఇంటర్‌లో 72కు, డిగ్రీలో 48కి, పిజి నుంచి పిఎచ్‌డి వచ్చేసరికి 14 మంది మాత్రమే చేరుకున్నారని 2020 నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ 75వ నివేదిక పేర్కొంది. పేదరికమే ముస్లింలు ఉన్నత విద్యను అందుకోకుండా ప్రతికూలంగా మారుతుందని ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి.

ముగింపు

హిజాబ్ వివాదం అనవసరపు వివాదం. ఇది పిల్లల చదువుకు సంబంధం లేనిది, పిల్లల జ్ఞాన సముపార్జనకు, విద్యాప్రమాణాల పెంపుదలకు ఏ మాత్రం ఉపయోగపడదు. పిల్లలకుండే నైపుణ్యాల మెరుగుదలకు, ఉపాధికి దోహదపడదు. ఆధునిక విజ్ఞాన వ్యవస్థకు కావాల్సిన మానవ వనరులుగా తీర్చిదిద్దడానికి ఉపయోగపడే వివాదం కాదు. పాలకులు యువతరాన్ని ఏరకమైన అంశాలపై సమీకరిస్తున్నారో, ఏ ఆలోచన విధానాన్ని కల్పిస్తున్నారో, ఈ వివాదం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయో అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. దేశంలో పేదరికం విలయతాండవం చేస్తూ ఉంటే, ఆకలి కేకల ఆర్తనాదాలు మారుమ్రోగుతుంటే, ద్రవ్యోల్బణం దడదడ లాడిస్తుంటే, నిత్యావసరాల సరుకుల ధరలు ఆకాశాన్నంటుతుంటే, అదుపులేని నిరుద్యోగంతో యువత కొట్టుమిట్టాడుతుంటే, మహిళల మానప్రాణాలు మంటగలుస్తుంటే, వాటిని పరిష్కరించలేక మతతత్వ రాజకీయంతో హిందూత్వ నినాదం ఎత్తుకొని సోదరభావంతో మెలుగుతున్న అమాయక ప్రజల మధ్య విభజన రేఖ గీసి విద్వేషాలు పెంచి లాభం పొందే కుట్రలోని భాగమే హిజాబ్ ఉదంతం. ముస్లిం మహిళల కోసమే త్రిపుల్ తలాక్ ఎత్తివేసామని, బేటి బచావో బేటి పడావో అని నినదిస్తున్న పాలకులు మత విద్వేష ఎజెండాకు ముస్లిం బాలికలను బలిపశువులుగా చేస్తుండడం ద్వంద్వ నీతికి నిదర్శనం.

చదువు బతుకునిస్తుందని, సమాజాన్ని జీవితాలను మార్చే సత్తా కలదని, కట్టుబాట్లను ప్రతిబంధకాలను ఎదిరించి చదువుకోడానికి ముందుకు వస్తున్న వారిని వెనక్కి నెట్టి వేయడం అనాగరిక చర్య. లౌకిక విధానానికి తూట్లు పొడిచి మతవిద్వేషాలతో కూడిన అప్రజాస్వామిక పాలనలో మత జోక్యాన్ని తగ్గించాలని, భిన్న సంస్కృతులు ఉన్న దేశాన్ని హిందూ రాష్ట్రంగా మార్చాలన్న శక్తులను, లౌకిక, ప్రగతిశీల ప్రజాస్వామిక శక్తులు ప్రతిఘటించి భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం మనందరిపై ఉంది. వీ

(రచయిత టిపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్, మహబూబాబాద్)

కర్ణాటక హిజాబ్ ఘర్షణ సృష్టికర్తలు ఎవరు?

హిజాబ్ వివాదం మొదలైన ఉడుపి, కుందాపూర్ ప్రాంతాలలో రెండు మతాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులను కలిసి ఘర్షణ మొదలైన క్రమాన్ని వివరిస్తున్నారు **జి. విష్ణు, మీనా కందసామి**

ఉడుపిలో ముస్లిం అమ్మాయిలు తరగతి గదిలో హిజాబ్ ధరించడానికి అనుమతి కోసం చేసిన నిరసనను చాలా మీడియా సంస్థలు హిజాబ్ కూ కాషాయ కండువాలకూ మధ్య జరిగిన వివాదంగా అభివర్ణించాయి. కాషాయ కండువాలు ధరించిన కొంతమంది విద్యార్థులు హిజాబ్, బురఖా ధరించిన తమ క్లాస్ మేట్స్‌కి వ్యతిరేకంగా చేస్తున్న నిరసనలు టీవీ ఛానళ్లకు సులభంగా వ్యాఖ్యానించే అటా ఇటా అనే దృశ్యాలను ఇచ్చాయి.

మొట్టమొదట గత మే లో ఉడుపి లోని ప్రభుత్వ ప్రియూనివర్సిటీ కాలేజ్ అధికారులు ముస్లిం విద్యార్థినులను హిజాబ్ తో క్లాసులోకి రాగూడదని చెప్పినప్పటినుండి ఈ వివాదం మొదలైంది. రంజాన్ తర్వాత కరోనా సెకండ్ వేవ్ కారణంగా కాలేజీలు మూసివేశారు. మళ్లీ సెప్టెంబర్ లో కాలేజీ తెరిచిన తర్వాత అధికారులు మరింత కఠినంగా మారారు. హిజాబ్ ధరించడం తమ హక్కు అని వాదించిన ఎనిమిది మంది ముస్లిం విద్యార్థినులను డిసెంబర్ చివరి వారంలో క్లాస్ రూమ్ నుండి బయటకు పంపించేశారు. డిసెంబర్ 31 నుండి ఈ ఎనిమిది మంది విద్యార్థినులు ఒక్క క్లాస్ కూడా హాజరు కాలేకపోయారు.

ఈ గొడవ ఎలా మొదలయింది?

ఫిబ్రవరి 10 వరకు ఈ ఎనిమిది మంది కాలేజీ బయట నిశ్శబ్దంగా నిరసన తెలియజేశారు. అయితే ఫిబ్రవరి 1న అకస్మాత్తుగా గొడవ వేరే రకంగా మారింది. ఉడుపికి 40 కి.మీ. దూరంలోని కుందాపూర్ జూనియర్ కాలేజీలో వంద మంది విద్యార్థులు అకస్మాత్తుగా కాషాయ కండువాలు వేసుకుని కాలేజీకి వచ్చారు. ఫిబ్రవరి 2న కాషాయ కండువాల సంఖ్య రెట్టింపు అయింది. ఫిబ్రవరి 5న కుందాపూర్ లో ఉన్న ఇంకో నాలుగు కాలేజీలు %--% బండార్కర్ కాలేజ్, బి బి హెగ్డే కాలేజి, ఆర్ ఎన్ శెట్టి కాలేజి, వెంకటరమణ కాలేజి - పెద్ద కాషాయ కండువాల ప్రదర్శనకు సాక్ష్యంగా నిలిచాయి. ఈ కాషాయ నిరసనకారులు కేవలం నిరసన ప్రకటించడమే కాకుండా క్లాస్ రూమ్ లో హిజాబ్ అనుమతిని నిరాకరించాలని డిమాండ్ చేస్తూ తమ ప్రిన్సిపాళ్లకు మెమోరాండం కూడా ఇచ్చారు. అంతే కాకుండా, తమకు అనుకూలంగా ఉండే టీవీ ఛానళ్లను పిలిచి తమ నిరసన గురించి చెప్పడం మొదలుపెట్టారు.

కాషాయ కండువాల నిరసన ఎలా మొదలయింది?

ఫిబ్రవరి 1 వరకు జరిగిన కార్యక్రమాలను దగ్గరగా పరిశీలిస్తే కుందాపూర్ లో వివిధ కాలేజీ అధికారులు తీసుకున్న నిర్ణయాలు చాలా కలవరపరుస్తాయి. కుందాపూర్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్, ఇతర అధికారులు జనవరి 28న ముస్లిం విద్యార్థినులను పిలిచి ఇకనుండి క్లాస్ రూమ్ లోకి హిజాబ్ ధరించి రాకూడదని చెప్పేశారు. ఆ అధికారులు ఒక ప్రభుత్వ ఉత్తర్వును కూడా ఆ విద్యార్థినుల తల్లిదండ్రులకు పంపించారు.

అయితే, వాళ్లు ఏదైతే ప్రభుత్వ ఉత్తర్వు అంటున్నారో అది నిజానికి కేవలం ఉడుపిలో ఒకే ఒక్క కాలేజీకి సంబంధించిన కాలేజి డెవలప్ మెంట్ కమిటీ ఇచ్చిన సర్క్యులర్ మాత్రమే.

గవర్నమెంట్ పియు కాలేజి దగ్గర ముస్లిం అమ్మాయిల నిరసనను చూసిన కాలేజ్ డెవలప్మెంట్ కమిటీ హిజాబ్ ను క్లాస్ లో ధరించడానికి వీలులేదని చెబుతూ, ఒక హైలెవల్ కమిటీ దీని గురించి తీర్మానం చేసేవరకూ అంతా ఒకేలా యూనిఫామ్ ధరించాలని ఆ సర్క్యులర్‌లో రాశారు.

అయితే వింతగా కుందాపూర్ ఎమ్మెల్యే హలాది శ్రీనివాస్ శెట్టి, కాలేజీ అధికారులు ఆ సర్క్యులర్ ను వేరే విధంగా అర్థం చేసుకున్నట్టు కనిపించారు. ఒక కాలేజీ ఇచ్చిన ఉత్తర్వును అన్ని కాలేజీలకు ఇచ్చినట్టు చూపారు.

ఒక లోతైన సామాజిక విభజన

సంఘటనలను తమకు అనుకూలంగా మార్చుకోవడానికి, హిందూ జాగరణ వేదికె ఫిబ్రవరి 1 నుండి కాషాయ కండువాల నిరసనలు ప్రారంభించి ఆ ప్రాంతంలో ఉద్రిక్తతకు దారితీసింది. ఈ నిరసనలను కారణంగా తీసుకుని కర్ణాటక ప్రభుత్వం ఏ కాలేజీలోనూ ఏ విధమైన మతపరమైన కార్యక్రమాలు జరపరాదని, అందరూ ఒకే విధంగా యూనిఫామ్ ధరించాలని, ముఖ్యంగా హిజాబ్ దరించడానికి అనుమతి లేదని ఫిబ్రవరి 5న ఉత్తర్వులు జారీ చేసింది. దీని గురించి మాట్లాడడానికి కుందాపూర్ ఎమ్మెల్యేను సంప్రదించడానికి ప్రయత్నిస్తే ఆయన మా ఫోన్ కాల్స్ కు, మెసేజెస్ కు స్పందించలేదు.

ఫిబ్రవరి 8న ఉడుపిలో పేరుపొందిన ఎంజిఎం కాలేజీలో హిందూ ముస్లిం విద్యార్థుల మధ్య ఉండిన స్నేహపూరిత వాతావరణం దారుణంగా దెబ్బతింది. ముస్లిం అమ్మాయిలు బురఖా వేసుకుని నిరసన తెలియజేస్తున్న కాలేజీ ఆవరణ దగ్గర కాషాయ కండువాలు వేసుకుని జై శ్రీరామ్, జై శ్రీరామ్ అని హిందూ విద్యార్థులు నినాదాలు ఇచ్చారు. ఆ తరువాత దృశ్యాలు సామాజిక మాధ్యమాలలో చాలా వైరల్ అయ్యాయి. అప్పటివరకు వాళ్లలో కొంతమంది అబ్బాయిలు నిరసన చేస్తున్న ముస్లిం అమ్మాయిలతో చాలా స్నేహంగా కూడా ఉండేవారు.

హిందూ జాగరణ వేదికె ఎలా పని చేస్తుంది?

ఉడుపి ఎంజిఎం కాలేజీలో ప్రదర్శనలన్నీ అయిపోయిన వారం రోజుల

తర్వాత మేము ఉడుపి దగ్గరగా ఉన్న ఒక చిన్న పట్టణంలో కాఫీషాపులో కొందరు హిందూ జాగరణ వేదికెకు చెందిన "అనధికార సభ్యులను" కలుసుకున్నాం. ఎంజిఎం కాలేజీకి చెందిన శరత్ (పేరు మార్చడం జరిగింది) అనే జర్నలిజం విద్యార్థి కాషాయ కండువాల ప్రదర్శనకు పథకం ఎలా రచించారో ఏమీ దాపరికం లేకుండా తెలియజేశాడు.

మీసాలు కూడా సరిగ్గా రాని 19 సంవత్సరాల శరత్ గత రెండు సంవత్సరాలుగా హిందూ జాగరణ వేదికెలో పని చేస్తున్నాడు. ఇతను హిందూ జాగరణ వేదికె నాయకుడైనా కార్యకర్తగా పిలిపించుకోవడానికి ఇష్టపడతాడు. ఇతను చెప్పిన మీదటే మరో ఐదుగురు వేరే వేరే కాలేజీల అబ్బాయిలు మాతో మాట్లాడారు.

శరత్ ఎనిమిది సంవత్సరాల క్రితమే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘంలో చేరాడు. కుందాపూర్ బండార్కర్ కాలేజీలో జరుగుతున్నది చూసిన తర్వాత, ఆ అమ్మాయిలు యూనిఫాంలో రావడానికి సిద్ధపడకపోతే తాము దాన్ని ఒక సమస్యగా ఎలా మార్చాలో నిర్ణయం తీసుకున్నామన్నాడు. హిందూ జాగరణ వేదికె నాయకులైన ప్రకాష్ కుక్కేహల్లి, లికేష్ లు వెనకాల ఉంటామని, ఏమీ భయపడాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారని చెప్పాడు. ఫిబ్రవరి 6న వీళ్లు నలుగురు కలిసి ఒక ఒక వాట్సాప్ గ్రూపు తయారు చేశారు. వెంటనే అందులో 201 మంది విద్యార్థులను చేర్చారు. ఇంకా కొన్ని ఇలాంటి వాట్సప్ గ్రూపులు తయారయ్యాయి. కొంతమంది హిందూ అబ్బాయిలు హిందూ అమ్మాయిల్ని వ్యక్తిగతంగా కలిసి మన సంప్రదాయం, సంస్కృతుల పట్ల బాధ్యతను వాళ్లకు తెలియజెప్పారు. తర్వాత కొంతమంది అమ్మాయిలు కూడా వీళ్లతో కలిసి పనిచేసారు.

"ఫిబ్రవరి 7న మేం మా కాషాయ కండువాలను సంచుల్లో పెట్టుకుని ఎంజిఎం కాలేజీ ప్రిన్సిపాల్ దగ్గరికి వెళ్ళాం. ఈ విధంగా రెండు రకాల నియమాలను అనుసరించడం వీలు కాదని, దీన్ని మేం ఏమాత్రం సహించమని చెప్పాం. ప్రిన్సిపాల్, హెడ్స్ ఆఫ్ డిపార్ట్మెంట్స్ మమ్మల్ని ప్రశాంతంగా ఉండమని, సమస్య పరిష్కరిస్తామని అన్నారు. కాని మరుసటిరోజు ఒకవేళ ముస్లిం అమ్మాయిలను హిజాబ్ తో క్లాసులోకి అనుమతిస్తే మేం మా సంచుల్లోంచి కండువాలు బైటికి తీయాలని అనుకున్నాం. మర్నాడు ముస్లిం అమ్మాయిలు హిజాబ్, బురఖా ధరించి రావడమే కాకుండా లేడీస్ వెయిటింగ్ రూం దగ్గర గుమిగూడి 'వి వాంట్ జస్టిస్' అని నినాదాలు ఇవ్వడం మొదలుపెట్టారు. కొంతమంది గేటు అవతల నిలబడి అవే నినాదాలు ఇచ్చారు. దానితో మేం రెచ్చిపోయాం. దాదాపు 350 మంది హిందూ విద్యార్థులం జై శ్రీరామ్ జై శ్రీరామ్ అని అరవడం మొదలుపెట్టాం" అని గర్వంగా చెప్పాడు శరత్.

"తలపాగాలు కుటుంబాలకి వెనక్కి ఇచ్చేశాం"

హిందూ విద్యార్థులకు కాషాయ కండువాలు, తలపాగాలు హిందూ జాగరణ వేదికె సమకూర్చిందనే అభిప్రాయాన్ని శరత్ మొదట అంగీకరించలేదు. కాని తర్వాత తను, తన స్నేహితులు కండువాలు, తలపాగాలు కొన్ని కుటుంబాల దగ్గర తీసుకున్నామని, అవి తిరిగి ఇచ్చేశామని అన్నాడు.

కాని తలపాగాలను తీసుకుని వెనక్కి ఇచ్చేసిన కుటుంబాల పేర్లు చెప్పమంటే మాత్రం ఒక్క పేరు కూడా చెప్పలేకపోయాడు.

ఫిబ్రవరి 8న ఎంజిఎం కాలేజి దగ్గరకు హిందూ జాగరణ వేదికె నాయకులు వచ్చారా అని అడిగితే, "ప్రకాశ్ అన్న మాకు నైతిక మద్దతు తెలపడానికి వచ్చాడు" అని శరత్ అన్నాడు. అదే రోజు ఆ కాలేజీ బయట విద్యార్థులందరూ కాషాయ కండువాలను, తలపాగాలను జాగ్రత్తగా వెనక్కి అప్పగించడం అనేక వీడియోలలో కనబడింది కూడ.

కుందాపూర్ జూనియర్ కాలేజి విద్యార్థి, 17 ఏళ్ల ఆశిష్ ను హిజాబ్ ఎవరికన్నా ఏ విధంగా ఇబ్బంది అని అడిగినప్పుడు "వాళ్లకు మతమే ముందు, దేశం తరువాత. కాని మాకు దేశమే ముందు, మతం దాని తర్వాతే. మేం అడుగుతున్నదల్లా సమానత్వం, అందరూ ఒకే రకంగా ఉండాలని మాత్రమే. వాళ్లు దానికి ఒప్పుకోవడం లేదు" అన్నాడు. "ఉడుపిలో కాషాయ కండువాల నిరసన మొదలుపెట్టింది మేమే. మొదటిరోజు 90 అబ్బాయిలు, అమ్మాయిలు కండువాలు వేసుకుని వచ్చారు. రెండో రోజు 180 మంది కండువాలతో వచ్చారు" అన్నాడు ఆశిష్. హిందూ జాగరణ్ వేదికె తో ఎటువంటి సంబంధమూ లేదని కిరణ్ అన్నాడు. కాని శరత్ తెలుసునని, "ఆయన ఎప్పుడూ కాలేజి దగ్గర తిరుగుతుండే కార్యకర్త" అనీ అన్నాడు.

మేం మాట్లాడిన వాళ్లలో ఇద్దరు అబ్బాయిలు భవన నిర్మాణ కూలీల పిల్లలు. మరొక అబ్బాయి మత్స్యకారుల కొడుకు. మేం మాట్లాడిన ఐదుగురూ ఇతర వెనుకబడిన కులాలకు (ఒబిసి) చెందినవారే. తమ ప్రాంతంలో రామాలయాలలో భజనల్లో పాల్గొనడం తమకు ఇష్టం అని గర్వంగా చెప్పారు.

యువ బ్రిగేడ్ అనే ఆర్ ఎస్ ఎస్ అనుబంధ సంస్థ సమావేశాలకు వలంటీర్లుగా వెళ్లినప్పుడు తమకు కాషాయ శాలువాలు దొరుకుతాయని ఈ అబ్బాయిలు చెప్పారు. ఈ అబ్బాయిల సోషల్ మీడియా అకౌంట్లు చూస్తే వాళ్లు ప్రముఖ హిందుత్వవాదుల రెచ్చగొట్టే ఉపన్యాసాలను క్రమం తప్పకుండా వింటారని తేలింది. వీళ్లలో పత్రికా ప్రపంచం గురించి ఎక్కువగా తెలిసిన శరత్ ను ఏం చదువుతావని అడిగినప్పుడు తనకు సంఘ్ పరివార్ పత్రికా కార్యాలయాలలో ఎవరెవరు తెలుసో గొప్పలు చెప్పాడు. తమకు కాలేజీలో కొందరు లెక్చరర్లు "రహస్యంగా" సహాయం చేస్తారని, అందువల్ల కాలేజిలో భయమేమీ లేదని అన్నాడు. ఈ ఐదుగురు అబ్బాయిలలో ఒక్కరికి కూడ ముస్లిం స్నేహితులు లేరు. "వాళ్లు మాతో మాట్లాడరు, మేం వాళ్లతో మాట్లాడం" అని భుజాలు ఎగరేశారు.

తలుపు తెరవడానికి నిరాకరించిన లెక్చరర్

తనను తాను నిష్పక్షపాతమైన నాయకుడినని చెప్పుకునే ఉడుపి ఎంఎల్ఏ రఘుపతి భట్ ప్రభుత్వ పియు కాలేజి దగ్గర నిరసన తెలిపిన ఎనిమిది మంది హిజాబ్ నిరసనకారుల మీద అన్యాయమైన ఆరోపణలు చేశాడు. "వాళ్లు మొదటి నుంచీ క్రమశిక్షణ లేనివాళ్లే. కాలేజి అంటే క్రమశిక్షణ ముఖ్యం కదా. ఒక విద్యా సంస్థ మత సంస్థలాగ మారగూడదు. ఈ అమ్మాయిలు ఎప్పుడూ టైంకు వచ్చేవారు కాదు, చదువులు కూడ అంతంత మాత్రమే" అన్నాడు.

"అసలు నేను వాళ్లను కూడ తప్పు పట్టను. వాళ్లను కొన్ని సంస్థలు తప్పుదారి పట్టిస్తున్నాయి...నేను ఏ సంస్థల గురించి అంటున్నానో మనందరికీ తెలుసు" అన్నాడాయన సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా అనుబంధ విద్యార్థి సంఘం కాంపస్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా ఈ హిజాబీ నిరసనకారులను తోలుబొమ్మల్లాగ ఆడిస్తున్నదనే తరచుగా వినబడే ఆరోపణను సూచిస్తూ.

అయితే, విద్యార్థులకు కాషాయ కండువాలు సమకూర్చడంలో హిందూ జాగరణ వేదికె పాత్ర మీద వ్యాఖ్యానించడానికి ఆయన నిరాకరించాడు. కాని యాదృచ్ఛికంగా ప్రభుత్వ పియు కాలేజీ బోర్డ్ అధ్యక్షుడు కూడా అయిన ఆయనే ముస్లిం విద్యార్థుల తల్లిదండ్రుల, కాలేజ్ అధికారుల సమావేశంలో

ప్రతీకార చర్యల గురించి మాట్లాడి వాళ్లని భయపెట్టాడని ఆ సమావేశంలో పాల్గొన్నవాళ్లు తెలియజేశారు.

"మీరు హిజాబ్ గురించి మొండివైఖరి అనుకరిస్తే రేపు వాళ్లు కాషాయ కండువాలు, తలపాగాలు ధరించి వస్తారు" అని ఆయన అన్నాడని అక్కడున్న వాళ్లందరూ నిర్ధారించారు.

మేం అక్కడ ఈ గొడవకు గురైన ఇద్దరు ముస్లిం విద్యార్థినులతో కూడ మాట్లాడాం. "మేం క్లాసులోకి వెళ్లగానే, 'మీరు క్లాసు లోంచి బైటికి పోతారా, మేమే మిమ్మల్ని తోసేయాలా' అని వాళ్లు అన్నారు" అని ఆలియా అస్సాది చెప్పింది. తాను హిజాబ్ తో క్లాస్ రూంలోకి వెళ్లగానే, వాళ్లు తలుపు లోపలి నుంచి గడియ పెట్టారని, వాళ్లు ఏం చేస్తారోననే భయంతో తలుపు తెరవమని ఎంత బతిమిలాడినా లెక్చరర్ తలుపు తెరవలేదని ఆమె చెప్పింది.

హిజాబ్ ఘర్షణలో లైంగిక వేధింపులు

మామూలుగా కూడ క్లాసులో హిజాబ్ ధరించినవారిపట్ల వివక్ష చాలా ప్రబలంగా ఉండేదని విద్యార్థినులు అన్నారు. వాళ్లు ఏ ప్రశ్నలు అడిగినా లెక్చరర్లు జవాబు చెప్పేవారు కాదట. లేదా ఇంటర్నల్ పరీక్షలలో వాళ్లకు చాల తక్కువ మార్కులు వేసేవారట. "ఏమైనా సందేహాలు అడగడానికి వెళితే మా లెక్చరర్స్ అయితే 'స్నానం చేసేటప్పుడు కూడా హిజాబ్ వేసుకొని చేస్తావా' అని అడిగే వారు" అని వాళ్లు చెప్పారు. ఇంకా వివరంగా చెప్పమని మేం అడిగినప్పుడు అటువంటి ప్రశ్నలు పురుష లెక్చరర్లే వేసేవారని కూడ అన్నారు.

హిజాబ్ పట్ల తమకున్న అనుబంధాన్ని వాళ్లు భావోద్వేగాలతో వివరించారు. చిన్నతనం నుంచీ ధరించడం అలవాటైన దుస్తుల గురించి హఠాత్తుగా ఇంత రాద్ధాంతం చేయడం, అవి ధరించవద్దని అనడం వాళ్లలో చాల ఆందోళనను నింపింది. "మరి మీ చదువు సంగతి ఏమిటి అని మా అధ్యాపకులు మమ్మల్ని అడుగుతున్నారు. వాళ్లకు మా చదువు మీద నిజంగా శ్రద్ధ ఉంటే, మమ్మల్ని ఎలాగైనా క్లాస్ రూంలలోకి రానిచ్చేవారే" అంది హజ్రా.

విద్యార్థుల మధ్య తలెత్తిన ఈ శత్రుత్వం దేశం మొత్తం దృష్టినీ ఆకర్షించగా, తరగతి గదుల లోపల అధికార సంబంధాలు ఎలా పని చేస్తున్నాయో మనం విస్మరించాం.

హిజాబ్ ధరించిన ముస్లిం విద్యార్థినుల మీద లెక్చరర్లు వెటకారాలు, విసుర్లు వెదజల్లుతుండేవారు. ఒక పురుష లెక్చరర్ తనను "నువ్వు స్నానం చేసేటప్పుడు కూడ హిజాబ్ వేసుకునే ఉంటావా" అని అడిగాడని ఒక విద్యార్థిని మాతో చెప్పింది. ఇది దారుణమైన వ్యాఖ్య. స్పష్టంగా లైంగిక వేధింపు కిందికి వచ్చే ఘటన.

ఒక విద్యార్థిని స్నానం చేయడం గురించి ఒక లెక్చరర్ ఇలా రెచ్చగొట్టేలా అడిగినప్పుడు, ఆ విద్యార్థిని హిందువు అయి ఉంటే, సమస్య హిజాబ్ కు సంబంధించినదీ, ముస్లిం విద్యార్థినులదీ కాకపోయి ఉంటే, అటువంటి సమస్యకు స్త్రీవాదుల నుంచి పెద్ద ఎత్తున నిరసన పెల్లుబికి ఉండేది. తరగతి గదుల్లో ఇటువంటి సాధారణ స్త్రీ వివక్ష పట్ల, వేధింపు వాతావరణం పట్ల మన పౌర సమాజం సమష్టిగానే ఎలుగెత్తి ఉండేది. బోధనాస్థలాలు సురక్షితంగా ఉండడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆందోళన చెలరేగి ఉండేది.

నేరాతీతంగా, విచారణాతీతంగా సాగుతున్న హిందుత్వ దాడులు తమకు తామే ఉద్దీపన పొందే ఔషధాలు కావు, మన సామాజిక నిర్లిప్తతే ఆ ఉద్దీపనను పెంచి పోషిస్తుంది.

ఇక్కడ మనం కర్ణాటక ప్రసార మాధ్యమాల గురించి కూడా ముఖ్యంగా మాట్లాడుకోవాలి. కొన్ని మాధ్యమాలు మినహాయించి మిగిలినవన్నీ కూడా హిందూత్వ గురించి నిలకడగా స్థిరంగా ప్రచారం చేస్తూనే ఉంటాయి. ఈ విషప్రచారం మామూలు మాటల్లోనే మొదలవుతుంది. చాల వార్తాపత్రికలు ముస్లింలను 'ఇతర' సమూహాలు, లేదా 'అన్య కోము' అని ప్రస్తావిస్తాయి. ఒక మతం మీద మరొక మతాన్ని రెచ్చగొట్టడానికి వార్తా ఛానళ్లు ఉవ్విళ్లూరుతుంటాయి. ప్రతి సమస్యనూ 'మనమూ వాళ్లూ' గా విభజిస్తుంటాయి. ఇటువంటి నేపథ్యంలో, హిజాబ్ ను వివాదాస్పదం చేయడం ప్రచారసాధనాలకు ఇష్టమైన దృశ్యంగా మారింది.

కర్ణాటక నమూనా

మంగళూరు, ఉడుపిలలో గత 30 సంవత్సరాలుగా హిందుత్వ పెంచి పోషిస్తున్న ప్రయోగశాలలు నడవడం ఏమాత్రం యాదృచ్ఛికం కాదు. మూడు సార్లు అతి పెద్ద మత ఘర్షణలు జరగడం, వేలసార్లు ముస్లిం ఆవుల వ్యాపారుల మీద హింస జరగడం, మతాంతర వివాహాలు చేసుకున్న జంటలపై హిందుత్వ సమస్థలు, ముస్లిం సంస్థలు దాడులు చేయడం వంటి సింగ్ చేయడం లాంటి అనేకరకాల వివాదాలతో మంగళూరు ఎప్పుడూ వార్తలలో ఉంటుంది. ముఖ్యంగా చెప్పాల్సింది ఏంటంటే సంఘ పరివార్ ఇలాంటి ప్రయోగాలన్నీ కర్ణాటకలోనే మొదట జరిపి తర్వాత మిగిలిన దేశమంతా విస్తరిస్తూ ఉంటుంది.

ఉదాహరణకు 2009లో లవ్ జిహాద్ పేరు మీద మంగళూరులోని బంత్వల్ తాలూకాలో ఘర్షణలు జరిగాయి. ప్రస్తుతం కాషాయ కండువాల నిరసనల వెనుక ఉన్న హిందూ జాగరణ వేదికె సంస్థే ముస్లింలు 700 మంది హిందూ అమ్మాయిల్ని ఎత్తుకుపోయి బలవంతంగా ముస్లిం మతం లోకి మార్చి బానిసలుగా పెట్టుకున్నారని చిన్న పుస్తకాలు అచ్చువేసి ఈ ప్రాంతమంతా పంచిపెట్టారు.

లవ్ జిహాద్ కి వ్యతిరేకంగా మొట్టమొదటి పెద్ద నిరసన 22 సంవత్సరాల అనితా మౌర్య అనే యువతి కనబడకుండా పోయినప్పుడు బంత్వల్ పోలీసులకు వ్యతిరేకంగా జరిగింది. బంత్వల్ పోలీసులు లవ్ జిహాద్ తీవ్రవాదులను కాపాడుతున్నారని ఆరోపిస్తూ వారికి వ్యతిరేకంగా ఈ నిరసన జరిగింది. అయితే పోలీసులు 20 రోజుల దర్యాప్తు తర్వాత ఈ కేసును ఛేదించారు. అనితనే కాకుండా మరో ఇరవైఒక్క మంది స్త్రీలను సైనైడ్ మోహన్ అనే సీరియల్ కిల్లర్ పెళ్లి పేరుతో వంచించి చంపాడని నిరూపించారు. వాళ్లందరికీ ఆ హంతకుడు టీలో సైనైడ్ కలిపి ఇచ్చి హత్య చేశాడు. అలా సంఘ్ పరివార్ 'లవ్ జిహాద్' కట్టుకథలని పోలీసులు ఛేదించారు. కాని ఆ కట్టుకథ నుంచి సంఘ్ పరివార్ సాధించిన ప్రతిఫలం చాల ఎక్కువ. అదే ఇవాళ దేశం మొత్తం మీద మనుషులను

చీలదీసే, భయ భీతావహం వ్యాపింపజేసే అంశం అయింది.

ఈ 'లవ్ జిహాద్' కట్టుకథ తర్వాత కర్ణాటక నమూనా నుంచి ఎగుమతి కాబోయే పెద్ద సరుకులు హిజాబ్ మీద రెచ్చగొట్టిన వివాదం, గోవధ నిరోధ చర్యలు, గోవుల రవాణా వ్యతిరేక చట్టం 2020, మతాంతరీకరణ వ్యతిరేక చట్టం 2021 (ఆశ్చర్యకరంగా దీని పేరు కర్ణాటక మత స్వేచ్ఛ చట్టం!) కాబోతున్నాయనే దాన్ని తోసివేయడం కష్టం.

ఇప్పటికే పొరుగున ఉన్న తమిళనాడులో భారతీయ జనతా పార్టీ, ఇతర సంఘ్ పరివార్ అనుబంధ సంస్థలు మత మార్పిడుల గురించి ఇల్లెక్కి అరుస్తున్నాయి. ఈ మధ్యనే మదురై దగ్గర మేలూరులో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో ఓటు వేయడానికి వెళ్లిన ఒక ముస్లిం మహిళను భారతీయ జనతా పార్టీ ఏజెంటు బురఖా తీసివేయమని అడిగాడు. మూకలను రెచ్చగొట్టడానికి హిజాబోఫోబియా ఒక శక్తిమంతమైన ఆయుధంగా మారనున్నట్టు కనబడుతున్నది.

ఫాసిజం సౌందర్య శాస్త్రం

ముస్సోలినీ ఇటలీలో అధికార సౌందర్యశాస్త్రం అనే అధ్యయనంలో సిమొనెట్టా ఫలాస్కా-జంపొని ఇటాలియన్ ఫాసిజం సమాజంలో కొన్ని చిహ్నాలనూ, ఆచారాలనూ ప్రదర్శనకు పెట్టి నాయకుడి పట్ల ఆరాధనను రూపొందించిందో ఎన్నో ఉదాహరణల ద్వారా చూపారు. మన స్వదేశీ హిందుత్వ ఫాసిజం కూడ ప్రజా రాశుల్లోకి తన ద్వేష రాజకీయాలను ప్రవేశపెట్టడానికి అటువంటి చిహ్నాల ప్రదర్శననే సాగిస్తున్నదో చూస్తే భయానకమైన పోలికలు కనబడుతున్నాయి.

ముస్లిం బాలికలను, స్త్రీలనూ బహిరంగంగా దుస్తులు విప్పమనడం, ఎంత బతిమిలాడుతున్నా లెక్కచెయ్యకుండా సంస్థల గేటు బైట హిజాబ్ తొలగించమని అడగడం, హిజాబ్ పీడక మూఢాచారమని చెపుతూ హిందూ మత శక్తులు తామే ముస్లిం స్త్రీల రక్షకులలా అభినయించడం, అన్నీ కూడ వాస్తవానికి ముస్లింలను రెండో తరగతి పౌరులుగా మార్చే హిందూ రాష్ట్ర పథకంలో భాగమైన స్పష్టమైన సూచనలే.

కషాయ కండువాలతో, తలపాగాలతో పథకం ప్రకారం జరిగిన నిరసన ప్రదర్శనలు, ఏకం చేసే నినాదంగా జై శ్రీరాం అనే అరుపులు, సనాతన ధర్మానికీ, ఆర్ ఎస్ ఎస్, భారతీయ జనతా పార్టీలకూ సొంత చిహ్నమైన భగ్వ (కాషాయ) జండాను శివమొగ్గ కాలేజీ మీద ఫిబ్రవరి 8న ఎగురవేయడం – ఈ చర్యలన్నీ కూడ ఈ ప్రదర్శనా రాజకీయాలలో భాగమే. అవి కొత్తగా కనిపెట్టిన హిందుత్వ చిహ్నాలను సంఘటితం చేసే హిందువులందరి చిహ్నాలుగా చూపే ప్రయత్నాలే. ఈ చర్యలు ప్రజల మెదళ్ల మీద హిందుత్వ చిహ్నాలను ముద్రించే తక్షణ, విషపూరిత, మౌలిక లక్ష్యాన్ని నెరవేర్చేవే.

(జి. విష్ణు ఉడుపిలో నివసించే ఫ్రీలాన్స్ రచయిత. మీనా కందసామి తమిళనాడుకు చెందిన కవి, రచయిత)

(తెలుగు: రాణి నిడదవోలు)



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం (91) ఊపిరితిత్తుల సమస్యతో దీర్ఘకాలంగా బాధపడుతూ మార్చ్ 19న హైదరాబాద్‌లో ఒక ప్రైవేటు ఆస్పత్రిలో మరణించారు. పాత నల్లగొండ జిల్లా తుంగతుర్తి సమీపం లోని రావిరాల కొత్తగూడెంలో 1931లో జన్మించిన స్వరాజ్యం తల్లి నుంచి ప్రజా ఉద్యమ భావాలు అలవరచుకున్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నాయకులైన భీమిరెడ్డి నరసింహ రెడ్డి చెల్లెలుగా పద్నాలుగు పదిహేను సంవత్సరాల వయసులోనే సాయుధ పోరాట కార్యకలాపాల్లో పాల్గొనడం మొదలు పెట్టారు. ఇరవయో శతాబ్ది తొలి అర్ధభాగంలో, స్త్రీల సామాజిక పాత్రకు అవకాశాలు అతి తక్కువగా ఉండిన వెనుకబడిన తెలంగాణలో ఆమె దళ సభ్యురాలుగా, గాయనిగా, తుపాకి పట్టి భూస్వాములను, ప్రభుత్వ బలగాలను గడగడలాడించారు. తెలంగాణ సాయుధ పోరాట విరమణ తర్వాత సాయుధపోరాట సహచరుడు మల్లు వెంకట నరసింహారెడ్డిని పెళ్లి చేసుకున్నారు. కమ్యూనిస్టు పార్టీలో 1964 చీలిక తర్వాత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) వైపు ఉండి, ఆ పార్టీ తరఫునే 1978లో, 1983లో తుంగతుర్తి నుంచి శాసనసభ్యురాలిగా ఎన్నికయ్యారు. చివరివరకూ పోరాటస్ఫూర్తిని కొనసాగిస్తూ వచ్చారు. ఆమె ఆత్మకథ 'నా మాటే తుపాకి తూటా' హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురణగా 2019లో వెలువడింది. మల్లు స్వరాజ్యం గారికి వినమ్ర జోహార్లు.

సీనియర్ జర్నలిస్టు, విప్లవాభిమాని నిమ్మకాయల శ్రీరంగనాథ్ (80) ఫిబ్రవరి 8న విజయవాడలో మరణించారు. ఉదయం, వార్త, ఆంధ్ర ప్రభ, ఆంధ్రప్రదేశ్ టైమ్స్ వంటి ఎన్నో పత్రికల్లో వివిధ హోదాల్లో పని చేసిన రంగనాథ్ తరిమెల నాగిరెడ్డి ప్రభావంలో విప్లవ రాజకీయాల అభిమానిగా ఉండేవారు. తరిమెల నాగిరెడ్డి ఇంగ్లిష్ కోర్టు ప్రకటనను 'తాకట్టులో భారతదేశం'గా అనువదించినవారిలో ఆయన కూడ ఉన్నారు. జర్నలిస్టుగా చేరకముందూ, ఆ తర్వాతా కూడ కార్మికోద్యమానికి విశేషమైన సేవలు అందించారు. నీటిపారుదల పథకాల గురించీ, పార్లమెంటరీ రాజకీయాల గురించీ, వామపక్ష రాజకీయాల గురించీ ఎన్నో రచనలు చేశారు.

కందికొండ పేరుతో సినిమా పాటల రచయితగా సుప్రసిద్ధుడైన కందికొండ యాదగిరి (48) గొంతు కాన్సర్ తో రెండు సంవత్సరాలుగా బాధ పడుతూ మార్చ్ 12న హైదరాబాద్ లో కన్నుమూశారు. వరంగల్ జిల్లా నర్సంపేట సమీపంలోని నాగుర్లపల్లికి చెందిన కందికొండ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు సినిమా పాటల మీద పి ఎచ్ డి చేశారు. 2001 లో మళ్లీ కూయవే గువ్వా పాటతో సినిమా రంగంలోకి ప్రవేశించిన కందికొండ ఈ ఇరవై సంవత్సరాల్లో యాభైకి పైగా సినిమాల్లోనూ, ప్రైవేట్ ఆల్బమ్స్ లోనూ వందలాది పాటలు రాశారు.

రాష్ట్ర విభజనపై మోడీ అప్రస్తుత ప్రసంగం

రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఎనిమిదేళ్లకు ఆ విభజన మీద ప్రధాన మంత్రి స్థాయి వ్యక్తి చేసిన అవమానకరమైన వ్యాఖ్యలను చర్చిస్తున్నారు **పబ్బతి వెంకటేశ్వర్లు**

తమ మాటల ద్వారా, చేతల ద్వారా ప్రజల మధ్య ఐక్యతను, సౌభ్రాతృత్వాన్ని వీలైనంతవరకు పెంచటం నాయకత్వ బాధ్యత. ఇది అధికారంలో ఉన్న లేదా పదవిలో ఉన్న నాయకులైన వాళ్లు మరీ పనిగట్టుకొని చేయాలి. భారత పాలనా వ్యవస్థలో అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తి సమసి పోతున్న పునర్విభజన గాయాల్ని మానని గాయాలుగా మార్చడానికి ప్రయత్నించడం శోచనీయం. స్వార్థం కోసం తమ అస్తిత్వం కాపాడుకోవడానికి, శత్రువును ద్వేషించడానికి ఎంతవరకైనా వెళ్తారు అనడానికి ఇది నిదర్శనం. ఇటీవల పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానానికి సమాధానమిస్తూ ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ వ్యాప్తంగా దుమారం రేపాయి. ప్రజలలో ఆగ్రహం వ్యక్తమైంది. బాధ్యతారహితమైన, అసంబద్ధమైన వ్యాఖ్యలు విడివడ్డ ఆంధ్ర, తెలంగాణ మధ్య వైషమ్యాలు రగిల్చేలా అత్యంత దారుణంగా ఉన్నాయి. ఈ వ్యాఖ్యల వెనుక అసలు ఉద్దేశ్యం ఏమిటో ప్రజలు గ్రహించాల్సి ఉంది.

ప్రధాని వ్యాఖ్యలు:

రాజ్యసభ వేదికగా కాంగ్రెస్‌ను విమర్శించడానికి ఆంధ్రప్రదేశ్ పునర్విభజనను తప్పుబడుతూ తెలంగాణ ఉద్యమం మీద, రాష్ట్ర ప్రజల మీద మోడీ విషం చిమ్మారు. ఆంధ్రప్రదేశ్ విభజన తీరు సరిగా జరగలేదని పార్లమెంట్ తలుపులు మూసి, పెప్పర్ స్ప్రేలు ఉపయోగించి, మైకులు ఆఫ్ చేసి అవమానకర రీతిలో రాష్ట్ర విభజన చేశారని అన్నారు. అసలు పార్లమెంటులో చర్చే జరగలేదని, ఇదేనా ప్రజాస్వామ్య పద్ధతి అంటూ తెగ బాధపడిపోయారు. తాము తెలంగాణ ఏర్పాటుకు వ్యతిరేకం కాదని అంటూనే తెలంగాణ ఏర్పాటు చేసిన విధానం సరిగా లేదని విమర్శించారు. రాష్ట్ర విభజన సరిగా చేసి ఉంటే ఆంధ్ర, తెలంగాణ మధ్య సమస్యలు వచ్చి ఉండేవి కావని అన్నారు. ఇప్పటికీ తెలంగాణ, ఆంధ్ర ప్రజల మధ్య విద్వేషాలున్నాయని, అవి రెండు రాష్ట్రాలకు నష్టం కలిగిస్తున్నాయని అన్నారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న కాలంలో ఏర్పాటు చేసిన ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల ఏర్పాటులో ఏ సమస్యలు రాలేదని అందుకు ఆనాటి ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుందని, శాంతియుతంగా రాష్ట్రాల విభజన జరిగిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హడావుడిగా నిర్ణయాలు తీసుకోవడం వల్ల రాష్ట్రాల మధ్య సమస్యలు వస్తున్నాయని అన్నారు. ఇదంతా కాంగ్రెస్ అహంకారంతో చేసిన పనుల ఫలితం అన్నారు.

ఎనిమిదేళ్ల కింద ఏర్పడిన రాష్ట్రాల మధ్య సమసిపోతున్న చిన్నచిన్న సమస్యల గాయాలను తిరిగి రెచ్చగొట్టేలా చేసిన ఉపన్యాసం ప్రధానమంత్రి స్థాయిని దిగజార్చేలా ఉందన్న విమర్శలు వెల్లువెత్తాయి. మనసులో తెలంగాణా పట్ల ఉన్న ఆక్రోశం, వ్యతిరేకత ప్రతి మాటలో తన హావభావాలలో కనిపిస్తున్నది. ఏడేండ్ల పాలనానుభవం ద్వారా ఎంతో సంయమనాన్ని నేర్చుకోవాల్సిన ప్రధాని ఆవేశాన్ని ఆపుకోలేక పోతున్నారు. కొన్ని విషయాలు గంభీరంగా మాట్లాడే ప్రధాని మోడీ రాజకీయ అంశాలు వచ్చేసరికి తన స్థాయిని మరిచి ఎటువంటి నీచమైన ఆరోపణలు చేయడానికైనా వెనుకాడరు అన్న ఆరోపణలు రాజకీయవర్గాల్లో ఉన్నాయి. ప్రస్తుత అనుచిత అసంబద్ధ మాటలు తూటాలకన్నా ప్రమాదకరమైనవి. దేశ ప్రధాని మాట్లాడే మాటలు ప్రజల మధ్య శాంతిని, ఐక్యతను చేకూర్చేలా ఉండాలి. కానీ దానికి భిన్నంగా వ్యవహరించిన తీరు ఆక్షేపణీయం. కాంగ్రెస్ అహంకారంతో విభజన చేసింది అంటే ఇప్పుడు ప్రధాని చేసిన వ్యాఖ్యలు దేనిని సూచిస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. కాంగ్రెస్‌ను విమర్శించడానికి చేసిన వ్యాఖ్యలు బూమెరాంగ్ అయి బిజెపిని బలంగానే తాకాయి. బిజెపి వర్గాలు కూడా ఈ వ్యాఖ్యల పట్ల అసంతృప్తికి గురి అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా అసంతృప్త జ్వాలలు ఎగిసిపడ్డాయి.

ప్రధాని వ్యాఖ్యల పట్ల వెల్లువెత్తిన నిరసన:

ఏక్ భారత్ అని గొప్పగా నినాదాలిచ్చే ప్రధాని చేసిన పై వ్యాఖ్యల పట్ల దాదాపు అన్ని రాజకీయ పార్టీలు, మేధావులు, తెలంగాణ వాదులు, ఉద్యమకారులు తీవ్రంగా స్పందించారు. ఆ వ్యాఖ్యలు ప్రాంతాల మధ్య ద్వేషాల్ని పెంచే విధంగా ఉన్నాయని అన్నారు. కాంగ్రెస్, టిఆర్ఎస్ లకు బిజెపిపై విమర్శలు చేయడానికి మోడియే ఒక పదునైన అస్త్రాన్ని అందించినట్లయ్యింది. టిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చాయి. రాష్ట్రంలోని బీజేపీ శ్రేణులు స్వీయ రక్షణలోకి నెట్టి వేయబడ్డాయి. ఈ

మధ్యకాలంలో బిజెపి, టిఆర్ఎస్‌ల మధ్య పోటాపోటీ రాజకీయ పోరు జరుగుతున్న క్రమంలో వచ్చిన ఈ వ్యాఖ్యలు బిజెపి శ్రేణుల్ని హతాశుల్ని చేశాయి. సమర్థించుకోవడానికి బిజెపి ఎంత ప్రయత్నించినా అది మిస్ ఫైర్ అయ్యింది. రాహుల్ గాంధీని ఎదుర్కోలేక ఆయన చేసిన విమర్శలకు జవాబు చెప్పలేక పాత అంశాల్ని తిరగతోడుతుందని కాంగ్రెస్ విమర్శించింది. తెలంగాణ వాదులు మేధావి వర్గం నుండి కూడా ప్రధాని మోడీ వ్యాఖ్యల పట్ల వ్యతిరేకత వ్యక్తమయ్యింది. న్యాయవాదులు, ఉద్యమకారులు, విద్యార్థులు, దాదాపు తెలంగాణ ఉద్యమాన్ని సమర్థించి పోరాటంలో పాల్గొన్న ప్రతి ఒక్కరు తమ ప్రాణాలు అడ్డు పెట్టి చేసిన ఉద్యమాన్ని మోడీ వ్యాఖ్యలు అవమాన పరిచేలా ఉన్నాయని విమర్శించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంపై, ప్రధాని స్థాయిలోని వ్యక్తి అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆ పదవికి అగౌరవమని సోషల్ మీడియా వేదికగా తెలంగాణ వాదులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు ట్విట్టర్ ద్వారా తమ ఆగ్రహాన్ని వెలిబుచ్చారు. “మోడి ఎనిమీ ఆఫ్ తెలంగాణ” (మోదీ తెలంగాణ శత్రువు) అనే హాష్ ట్యాగ్ ట్రెండింగ్ లో మొదటి స్థానంలో కనిపించింది. ధర్నాలకు, నిరసనలకు మోడీ దిష్టి బొమ్మ దహనాలకు కాంగ్రెస్, టిఆర్ఎస్, విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. ఆందోళనలు చేపట్టాయి.

ప్రధానిపై సభా హక్కుల ఉల్లంఘన:

ఎమెర్జెన్సీ తర్వాత సభా హక్కుల ఉల్లఘన నోటీసు ఎదుర్కొన్న మొదటి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ. రాజ్య సభలో మోడీ చేసిన వ్యాఖ్యలు సభా హక్కుల ఉల్లంఘన కిందికి వస్తాయని 187వ నిబంధన కింద రాజ్య సభ సెక్రెటరీకి టిఆర్ఎస్ ఎంపీలు నోటీసు ఇచ్చారు. అత్యంత దుర్మార్గంగా, అవమానకర రీతిలో ఉభయ సభల్లో ఆమోదం పొందిన బిల్లు పట్ల వ్యతిరేకత చూపటం, మాట్లాడటం నిజానికి సభాహక్కుల ఉల్లంఘనే. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన బిల్లు ఆమోదం సమయంలో ప్రిసైడింగ్ అధికారులు సభ నిర్వహణ కోసం అనుసరించిన విధానాలను ప్రధాని లాంటి వ్యక్తి తప్పుపట్టడం సభా హక్కుల ఉల్లంఘన కిందికి వస్తుందని నోటీసు ఇచ్చి స్పీకర్ ఎటువంటి నిర్ణయం తీసుకోక పోవడంతో వాకౌట్ చేశారు. గత ప్రభుత్వాలు చేసిన చట్టాలపై రాష్ట్రపతి ఆమోదం పొందిన చట్టాలపై విమర్శలు చేయడం సభా హక్కుల ఉల్లంఘన కిందికే వస్తుంది.

ఏదైనా ఒక అంశం పట్ల సీరియస్ చర్చ జరిగి సభ్యులు గందరగోళం సృష్టిస్తున్నప్పుడు పార్లమెంట్ సభల నియమ నిబంధనల ప్రకారం ప్రిసైడింగ్ అధికారులు తలుపులు మూయటం చేస్తారు. ఈ విషయం ప్రధానికి తెలియనిది కాదు. అయినా ఇరు రాష్ట్రాల పట్ల తన వ్యతిరేకతను అయిష్టతను వెలిబుచ్చారు. కాంగ్రెస్ తప్పిదాలను ఎత్తి చూపే క్రమంలో తనకు వ్యతిరేక భావమున్న ఆంధ్రప్రదేశ్ విభజనను ఈ సందర్భంగా వాడుకొని తెలుగు ప్రజల మధ్య మళ్లీ చిచ్చు పెట్టే ప్రయత్నం చేశారు. ఒక్కసారిగా దీనిపై చెలరేగిన అసంతృప్తి, వ్యతిరేక జ్వాలలు మోడిని బలంగా తాకాయి. బిజెపి రాష్ట్ర నాయకులకు కూడా గొంతులో వెలక్కాయ పడింది. టిఆర్ఎస్‌కు అనుకోని అస్త్రం దొరికింది.

ప్రధాని వ్యాఖ్యల వెనుక మర్మం ఏమిటి?

రాజకీయ నాయకులు చేసే ప్రతి రాజకీయ విమర్శ వెనుక ఏదో ఒక ప్రయోజనం ఉంటుందన్నది జగమెరిగిన సత్యం. అయితే మోడీ వ్యాఖ్యల ద్వారా ఆంధ్ర, తెలంగాణలో పొందే ప్రయోజనాలు ఏమిటి? బిజెపి ఏమి ఆశిస్తున్నది? ఇంతకు ముందు చెప్పినట్లు రాజకీయ అంశాలకు వచ్చేసరికి మోడీ ఎంతకైనా దిగజారుతారు అన్నది ఇక్కడ కూడా రుజువైంది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ విభజన మీద తీవ్ర విమర్శలు చేశారు. ఆంధ్రప్రదేశ్ విభజన సరిగ్గా జరుగ లేదు, చర్చే జరగలేదని అంటున్న ప్రధానికి ఈ విభజన చట్టానికి బీజేపీ బేషరతు మద్దతు పలికిన విషయం కాంగ్రెస్‌ను తూలనాడే ఆవేశంలో మరిచిపోయి ఉంటారు. తమ పార్టీ మద్దతు లేకుండా తెలంగాణ ఏర్పాటు సాధ్యం కాదని తెలిసి వ్యతిరేకించని బిజెపి, ఎనిమిదేళ్ల తర్వాత ఎందుకు మాట్లాడుతుందో అర్థం చేసుకోవాలి. ఎందుకు తెలుగు రాష్ట్రాల మధ్య విద్వేషాలు రగల్చడానికి ప్రయత్నిస్తున్నదో, దీని వెనుక ఉన్న మర్మమేమిటో గుర్తెరుగాల్సి ఉన్నది. ఏపీలో ఏనాడు బిజెపికి పెద్దగా ఓట్లు రాలేదు. ఈ వ్యాఖ్యల వల్ల ఆంధ్ర ప్రజల మద్దతు దొరుకుతుందేమోనని భ్రమపడి ఉండవచ్చు. కానీ, ఈ వ్యాఖ్యల తరువాత ఆంధ్ర ప్రజల నుండి అసలు స్పందనే కానరాలేదు. ఇంతగా కన్నీరు కారుస్తున్న ప్రధాని ఆంధ్ర ప్రజలకు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేరలేదన్న విషయం వారికి బాగానే జ్ఞానం ఉండి ఉంటుంది. నామ మాత్రమైన అనుకూల స్పందన వస్తుందని భావిస్తే అది నిష్ప్రయోజనమైంది.

ఇక తెలంగాణలో ఆంధ్రప్రదేశ్ విభజనకు బిజెపి సహకరించడం వల్ల తెలంగాణ వచ్చిందని ఆ పార్టీ చేసుకున్న విపరీతమైన ప్రచారం వల్ల, ప్రజలు నమ్మినందువల్ల కొన్ని ఓట్లు, సీట్లు వచ్చాయి. ఈ వ్యాఖ్యల వల్ల ఏపీలో పెద్దగా ప్రయోజనం రాకపోగా తెలంగాణలో నష్టం జరిగే అవకాశం ఎక్కువగా ఉంది. నమ్మి ఓట్లేస్తే తమను దూషించటం పట్ల నిరసనలు వ్యక్తమయ్యాయి. మొదటి నుండి కూడా మోడీకి రాష్ట్ర విభజన పట్ల ఇష్టం లేదు. అప్పుడప్పుడు వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నారు. గతంలో తల్లి నుంచి బిడ్డను తీశారు అని వ్యాఖ్యానించారు. బాహాటంగా బిల్లుకు మద్దతు పలికి అండగా నిలబడ్డ సుష్మా స్వరాజ్, వెంకయ్యనాయుడు బిజెపి నిర్ణయానికి వ్యతిరేకంగా పని చేశారా? బిల్లుకు మా మద్దతు లేకపోతే తెలంగాణ ఏర్పడేది కాదు, మా వల్లనే తెలంగాణ వచ్చిందని చెప్పుకొని బిజెపి ఓట్లు సంపాదించుకున్నది నిజంకాదా? బిల్లుకు మద్దతు ఇచ్చి తప్పు చేశామని బిజెపి ఒప్పుకుంటుందా? రాబోయే ఎన్నికల్లో ఈ విషయం రాజకీయ ప్రచార వేదికలో మాట్లాడుతుందా?

అంత ధైర్యం బిజెపికి ఉందా? విభజన జరిగిన విధానం సరిగా లేదు అంటే దాంట్లో బిజెపి పాత్ర ఉన్నట్లే కదా. మూసిన తలుపు లోపల బిజెపి కూడా ఉన్నది. ఎందుకు మూసేశారు అని వాళ్ల నాయకులు ఆనాడు ఎందుకు ప్రశ్నించలేదు? ఇవాళ ఎందుకు ప్రశ్నిస్తున్నది? లోక్‌సభలో తలుపులు మూస్తే రాజ్యసభలో ఎందుకు వ్యతిరేకించలేదో మోడికే ఎరుక.

ఆంధ్రప్రదేశ్ విభజన వల్ల ఎపికి నష్టం జరగకుండా ఆనాటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ప్రత్యేక హోదా ఇస్తామని లోక్‌సభ సాక్షిగా హామీ ఇస్తే ఆ హామీని బిల్లులో చేర్చాలని బిజెపి పట్టుబట్ట లేదు, లేదా తాము అధికారంలోకి వచ్చాకనైనా ఆ ప్రత్యేక హోదా ఇవ్వవచ్చు కానీ ఇవ్వలేదు. ఇంకా ఎపికి ఇస్తానన్న కడప స్టీల్ ఫ్యాక్టరీ, పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా, గిరిజన విశ్వవిద్యాలయం, ఐఐఎం ఏర్పాటు, పెట్రో కాంప్లెక్స్, విద్యాసంస్థల ఏర్పాటుతో పాటు రెవెన్యూ లోటు తీర్చడానికి సహాయం చేస్తానన్న హామీలన్నీ హామీలుగానే మిగిలిపోయాయి. విభజన తర్వాత అధికారం లోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం వీటిల్లో ఏ ఒక్కటి నెరవేర్చలేదు. ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణం కోసం ఇంతవరకు ఒక్క పైసా విదిలించింది లేదు.

ఆంధ్రప్రదేశ్ విభజనతో తాత్కాలిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఇరు రాష్ట్రాలకు సహాయం చేయాల్సిన బాధ్యత ఆనాడు బిల్లుకు మద్దతు పలికిన ప్రస్తుత బిజెపి ప్రభుత్వానిదే. కానీ, ఇవన్నీ నెరవేర్చకుండా విభజన సరిగా జరగలేదని ఇవాళ గుండెలు బాదుకోవడం ఎవరికి కూడా న్యాయంగా కనబడటం లేదు. ఎపి విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన మోడీ మొదటి కేబినెట్ మీటింగ్‌లోనే పోలవరం ప్రాజెక్ట్ ముంపు మండలాలు ఏడింటిని దాదాపు రెండు లక్షల ఎకరాలను ఆర్డినెన్సు ద్వారా ఎవరితో చర్చించకుండానే ఆంధ్రప్రదేశ్‌లో కలుపుతూ నిర్ణయం తీసుకొని తెలంగాణ భౌగోళిక స్వరూపం మార్చారు. ఆ రోజు విభజన సక్రమంగా కనబడి, ఇవాళ అక్రమమయ్యిందా? అలాగే తెలంగాణకు ప్రభుత్వం ఇచ్చిన ఐటీఐఆర్ ప్రాజెక్టును వెనక్కి తీసుకున్నారు. నవోదయ, ఉక్కు కర్మాగారం, రైల్వే కోచ్ ఫ్యాక్టరీలు నెలకొల్పుతామని హామీ ఇచ్చి వాటి ఊసే ఎత్తడం లేదు. ఇది కొత్తగా పురుడుపోసుకున్న తెలంగాణకు మోడీ అందించిన స్నేహహస్తం. విభజన చట్టంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత అధికారంలో ఉన్న ప్రస్తుత ప్రభుత్వానిదే. ఇవి ఎందుకు నెరవేర్చలేదో ఏలిన వారే చెప్పాలి. ఇతర రాష్ట్రాల మెట్రో పథకాలకు డబ్బులు ఇచ్చి తెలుగు రాష్ట్రాలకు ఉత్త చేతులు చూపించారు. ఇన్ని సమస్యలు తిష్ట వేసుకుని ఉంటే ఎక్కడా వీటిని సరిదిద్దడానికి మోడీ ప్రయత్నించలేదు. ప్రతిపక్ష పార్టీని దూషించడం కొరకు తెలుగు రాష్ట్రాల మధ్య విభజన చిచ్చు తిరిగి లేపటం ప్రధాని లాంటి వ్యక్తి చేయాల్సిన పని కాదు.

ఈ మధ్య కాలంలో రాజకీయ నాయకుల్లో కనిపిస్తున్న కొత్త ట్రెండ్ ఏమిటంటే తమ పథకాలు గొప్పవని, తమ పనుల వల్లనే అభివృద్ధి జరుగుతుందని చెప్పుకోవటం మొదలైంది. అలాగే అభివృద్ధి జరగలేదన్న సందర్భం వచ్చినా, ప్రజలు ఇబ్బందులు పడ్డ సందర్భాలు వచ్చినా ఇంతకుముందు ప్రభుత్వాలు చేసిన నిర్వాకం మూలంగానే ఇదంతా జరిగిందని గత ప్రభుత్వాలపై దుమ్మెత్తి పోస్తున్నాయి. ఈ నేరాన్ని వాటి మీదకు తోసి దోషిగా నిలబెట్టడానికి శతథా ప్రయత్నిస్తున్నాయి. అది టిఆర్ఎస్ ప్రభుత్వమైనా, బిజెపి ప్రభుత్వమైనా లేదా మరే ఇతర ప్రభుత్వాలైనా అన్నీ ఒక తాను గుడ్డలే. మోడీ కూడా ఆ కోవలోకే చేరే మొదటి వ్యక్తి గానే చూడాలి.

ప్రధాని మోడీ రాష్ట్ర విభజనపై చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించేవిగా ఉన్నాయి. హడావిడిగా విభజన చేశారన్న కుయుక్తి పొల్లు మాటలు ప్రధాని పదవికి మరకలంటించేవిగా ఉన్నాయి. విభజన కోసం ప్రణబ్ ముఖర్జీ, శ్రీ కృష్ణ కమిటీ లాంటి కమిటీలు వేసి ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు. నానారకాల సర్వేలు చేశారు. ఏకాభిప్రాయం పేరుతో సాగతీత ధోరణి కాంగ్రెస్ కూడా చేసింది. ఎంత కాలయాపన చేసినా, ప్రకటించిన తెలంగాణను వెనక్కి తీసుకున్నా హింసకు తావివ్వకుండా శాంతియుతంగా చేసిన ప్రజల పోరాటం మోడికి కనబడక పోవటం ఆశ్చర్యకరం. ఇది హడావిడి నిర్ణయం ఎట్లా అవుతదో వారే చెప్పాలి. తెలంగాణ ప్రజల పోరాటాన్ని అర్థం చేసుకొని ఎన్నో రకాల విశ్లేషణ చేసి ఉభయసభల్లో చర్చలు జరిపి, దానికి దాదాపు అన్ని రాజకీయ పక్షాలు బిజెపి సహా, మద్దతు పలకడం జరిగింది. అసలు చర్చే జరగలేదు అనడం తెలంగాణను అవమానించడమే. బిజెపి పార్టీ 1999లో తెలంగాణ ఏర్పాటును సమర్థిస్తూ కాకినాడలో ఒక ఓటు రెండు రాష్ట్రాలు అనే నినాదాన్ని ఎత్తుకుంది. కానీ దాని కోసం పోరాటం చేసిన దాఖలాలు లేవు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ కొత్తగా మూడు రాష్ట్రాలను ఏర్పాటు చేసి తెలంగాణా ఏర్పాటును, కాకినాడ తీర్మానాన్ని గాలికొదిలేసింది. తెలంగాణలో ఉద్యమం తీవ్ర దశకు చేరుకున్న తరువాత బిజెపి రంగప్రవేశం చేసింది. మోడీ, అద్వానీ ఎప్పుడూ తెలంగాణ వ్యతిరేక భావాన్నే కలిగి ఉన్నారు. విభజన చట్టంలో చెప్పిన ఏ హామీలు నెరవేర్చలేదు. ఆంధ్రప్రదేశ్‌ను పెద్దగా ఆదుకున్న దాఖలాలు కానరావు. తెలంగాణలో అధికారంలోకి రావాలని అనుకుంటున్న బిజెపి ప్రవర్తిస్తున్న తీరు జుగుప్సను కలిగిస్తున్నది. తెలంగాణ పట్ల వ్యతిరేకతను గుండెల్లో నింపుకొని అవకాశం దొరికితే అన్యాయం చేసేలా ప్రవర్తిస్తూ, మరొక వైపు భవిష్యత్తులో తెలంగాణా పరిపాలనా బాధ్యతలు చేపట్టి అద్భుతాలు చేస్తామంటున్న నాయకుల పట్ల జాగరూకులై ఉండాల్సింది అంతిమంగా ప్రజలే.

(రచయిత డిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్) వీ

'సాయుధ శాంతి స్వప్నం' జప్తు చెల్లదు: హైకోర్టు తీర్పు

రామకృష్ణ రచనల, ఆయన మీద సంస్మరణ రచనల సంకలనాన్ని ఆవిష్కరణకు ముందే జప్తు చేసి, కేసు పెట్టిన పోలీసుల చర్యను తప్పుపడుతూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పులో ప్రధాన భాగాలు

2021 అక్టోబర్‌లో మరణించిన మావోయిస్టు నాయకుడు రామకృష్ణ సంస్మరణలో వెలువడిన కవితలు, వ్యాసాలు, జ్ఞాపకాలు, గతంలో ప్రభుత్వంతో చర్చల సందర్భంగా రామకృష్ణ రాసిన వ్యాసాలు, ఇచ్చిన ఇంటర్వ్యూలు, ప్రకటనలు కలిపి ఆయన సహచరి శిరీష 'సాయుధ శాంతి స్వప్నం' అనే పుస్తకం సంకలనం చేశారు. ఆ పుస్తకావిష్కరణ సభ నవంబర్ 14న హైదరాబాద్‌లో జరగవలసి ఉండింది. ఆ ఆవిష్కరణ సభకు రెండు రోజుల ముందు నవ్య ప్రింటింగ్ ప్రెస్ మీద దాడిచేసిన పోలీసులు అచ్చయిన పుస్తకాలనూ, ప్రింటింగ్ ప్రెస్ సామగ్రినీ కూడ జప్తు చేశారు. ఆవిష్కరణ సభ జరగకుండా హాలు యజమానుల మీద ఒత్తిడి తెచ్చారు. ప్రింటింగ్ ప్రెస్ యజమాని రామకృష్ణారెడ్డి మీద, ఆయన సహచరి సంధ్య మీద కేసు పెట్టారు. ఆ పుస్తకాల జప్తును, ఆవిష్కరణ సభ మీద ఆంక్షలను సవాల్ చేస్తూ శిరీష దాఖలు చేసిన కేసు (రిట్ పిటిషన్ నం. 6479/2022) లో తాను ప్రచురించిన పుస్తకం నేరం కాదని ప్రకటించాలని, ఆ పుస్తకాలను జప్తు నుంచి విడిపించి తనకు తిరిగి ఇప్పించాలని, పుస్తకావిష్కరణ సభను అడ్డుకోకుండా చూడాలని హైకోర్టును కోరారు. తమ ప్రెస్ మీద దాడిని, తమ మీద కేసును సవాల్ చేస్తూ ప్రెస్ యజమానులు దాఖలు చేసిన మరొక కేసు (క్రిమినల్ పిటిషన్ 659/ 2022) లో తమ మీద తెలంగాణ ప్రజా భద్రతా చట్టం కింద అంబర్ పేట పోలీసులు పెట్టిన కేసును రద్దు చేయాలని కోరారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె లక్ష్మణ్ ఈ రెండు వ్యాజ్యాలను కలిపి విచారించి, మార్చ్ 11న తీర్పు వెలువరించారు. ఈ కేసులలో పిటిషనర్ల తరఫున న్యాయవాదులు నందిగం కృష్ణారావు, డి. సురేష్ కుమార్ వాదించగా, ప్రభుత్వం తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఖాజా విజారత్ అలీ, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఎస్ రామమోహన రావు వాదించారు. తీర్పులోని ప్రధాన భాగాలు:

కేసు వివరాలు:

అక్కిరాజు హరగోపాల్ @ రామకృష్ణ @ ఆర్ కె ఫొటోలతో కూడిన 'సాయుధ శాంతి స్వప్నం' అనే పుస్తకాన్ని అచ్చువెయ్యబోతున్నారని, ఆ పుస్తకం నిషిద్ధ మావోయిస్టు భావజాలాన్ని ప్రచారం చేస్తుందని, ఆ పుస్తకం అచ్చుపనిని అక్కిరాజు హరగోపాల్ @ రామకృష్ణ @ ఆర్‌కె భార్య కోరిక మేరకు చేపట్టారని, నిషిద్ధ మావోయిస్టు పార్టీ పట్ల సానుభూతితో ఉచితంగా చేపట్టారని పిటిషనర్ల మీద ఆరోపణలు.

పోలీసులు ప్రెస్ నుంచి జప్తు చేసుకున్న వస్తువులు: 1. బైండింగ్‌కు ముందు దశలో ఉన్న 513 పుస్తకాలు (50 కాపీల చొప్పున ఉన్న 10 కట్టలు, విడిగా 13 కాపీలు). 2. 1000 కాపీలు పుస్తకం ముఖచిత్రం . 3. దాదాపు 487 కాపీలు ఇంకా పుస్తకాలుగా ఎత్తిపెట్టని విడి ఫారాలు. 4. 25 అల్యూమినియం ప్రింటింగ్ షీట్లు. 5. (ఏమీ రాయలేదు). 6. (ఏమీ రాయలేదు). 7. రెండు డెల్ డెస్క్‌టాప్ కంప్యూటర్లు, రెండు సిపియు లు. 8. ఒక డివిఆర్. 9. ఎం ఎస్ ఎం ఇ సర్టిఫికెట్. 10. ఒక పెన్ డ్రైవ్. 11. రెండు బిల్ బుక్స్.

తెలంగాణ ప్రజా భద్రతా చట్టం సెక్షన్ 8 (2) కింద నేరం చేశారని పిటిషనర్ల మీద ఆరోపణ.

పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు 1:

1. 12.11.2021న నమోదైన ఫిర్యాదులో ఉన్న విషయాలు తెలంగాణ ప్రజా భద్రతా చట్టం సెక్షన్ 8 (2) కిందికి రావు.

2. ఆ చట్టంలోని సెక్షన్ 9 (2) ప్రకారం జారీ చేయవలసిన నోటిఫికేషన్ జారీ చేయలేదు.

3. సోదా జరుపుతున్నప్పుడు ఏయే విధివిధానాలను పాటించాలని క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ నిర్దేశించిందో ఆ విధానాలను పోలీసులు పాటించలేదు.

4. తాము 12.11.2021ననే హైదరాబాద్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ తరఫున నోటిఫికేషన్ జారీ చేశామని ప్రాసిక్యూషన్ ఇప్పుడు చెపుతున్నది గాని, అటువంటి నోటిఫికేషన్ ప్రస్తావన 12.11.2021 నాటి ఫిర్యాదులో లేదు. జప్తు చేసిన సామగ్రిని తమకు తిరిగి ఇవ్వాలని కోరుతూ పిటిషనర్లు కింది కోర్టులో వేసిన పిటిషన్‌కు పోలీసులు ఇచ్చిన జవాబులో కూడ ఆ నోటిఫికేషన్ ప్రస్తావన లేదు.

5. అలాగే, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 165 కింద హైదరాబాద్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ జారీ చేసిన సర్చ్ వారంట్ లో కూడ ఆ నోటిఫికేషన్ ప్రస్తావన లేదు.

6. ఈ మొత్తం సోదా, జప్తు వ్యవహారంలో, నేరాన్ని నమోదు చేయడంలో పోలీసులు చట్టబద్ధంగా నిర్దేశితమైన పద్ధతిని పూర్తిగా ఉల్లంఘించారు.

7. తన భర్త స్మృతిలో ఆ పుస్తకాన్ని వెలువరిస్తున్నానని శిరీష కోరగా, పిటిషనర్లు అచ్చువేశారు.

8. ఆ పుస్తకంలో ఇప్పటికే అచ్చయిన, ప్రసార సాధనాల్లో వెలువడిన వ్యాసాలు, నివేదికలు, సంపాదకీయాలు, ఉత్తరాలు, ఇంటర్వ్యూలు ఉన్నాయి.

9. ఆ పుస్తకంలో అభ్యంతరకరమైన అంశాలేమీ లేవు.

10. ఆ పుస్తకంలో ఏముందో చూడకుండానే, ఆ పుస్తకంలోని విషయాలు అభ్యంతరకరమైనవి అవుతాయనే నిర్ధారణకు రాకుండానే పోలీసులు పుస్తకాలను జప్తు చేశారు.

11. పోలీసులు మొత్తం ప్రింటింగ్ ప్రెస్‌నే జప్తు చేశారు. 44 మంది సిబ్బంది పనిచేసే ప్రింటింగ్ ప్రెస్ పూర్తిగా నిలిచిపోయింది.

12. పిటిషనర్ల మీద జరగనున్న నేర విచారణను ఈ వాదనల ఆధారంగా కొట్టివేయాలని న్యాయవాది కోరారు.

పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు 2:

1. పోలీసులు చేసిన సోదాలో, సామగ్రి జప్తులో చట్టం నిర్దేశించిన నిర్దిష్ట పద్ధతులను పాటించలేదు. నిందితుల మీద చేసిన ఆరోపణలను సమర్థించే వివరాలేవీ ఫిర్యాదులో లేవు.

2. సదరు పుస్తకంలో అభ్యంతరకరమైన విషయాలేమీ లేవు.

3. ప్రింటింగ్ ప్రెస్‌ను, పుస్తకాలను, సామగ్రిని జప్తు చేయడం భారత రాజ్యాంగం అధికరణం 14, 19 లను ఉల్లంఘించడమే.

4. పి వెంకటేశ్వర్లు వర్సస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసు (వాసిరెడ్డి సీతాదేవి నవల మరీచిక నిషేధం కేసు) లో అప్పటి ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పులో నిర్ధారించిన సూత్రం మీద ఆధారపడాలి.

5. ఈ వాదనల ఆధారంగా, సదరు నేరారోపణపై విచారణను కొట్టివేయాలనీ, జప్తు చేసిన సామగ్రిని, వెయ్యి పుస్తకాలనూ పిటిషనర్ కు తిరిగి ఇవ్వాలనీ, పుస్తకావిష్కరణ సభ నిర్వహణకు ఆటంకాలు కల్పించగూడదని పోలీసులను ఆదేశించాలనీ కోరారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు:

1. సోదాలో, ఆస్తి జప్తులో పోలీసులు చట్టం నిర్దేశించిన పద్ధతిని, ప్రత్యేకంగా క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ నిర్దేశించిన పద్ధతిని పాటించారు.

2. మావోయిస్టు పార్టీ అనే నిషిద్ధ సంస్థ పొలిట్ బ్యూరో, కేంద్రకమిటీ సభ్యుడు అక్కిరాజు హరగోపాల్ ఏ రామకృష్ణ ఏ ఆర్ కె ఫొటోతో, అభ్యంతరకరమైన విషయాలతో పిటిషనర్లు/నిందితులు పుస్తకం అచ్చువేస్తున్నారని పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. సదరు పుస్తక ప్రచురణ సమాజం మీద, ప్రత్యేకించి యువత మీద దుష్ప్రభావం కలగజేస్తుంది.

3. దర్యాప్తు అధికారి పద్నాలుగు మంది సాక్షులను విచారించి వాంగ్మూలాలు నమోదు చేశారు. దర్యాప్తు ఇంకా సాగుతున్నది.

4. అందువల్ల ఈ నేరాన్ని నమోదు చేయడంలో, సోదా జరిపి, సామగ్రి జప్తు చేయడంలో ఎటువంటి చట్టవ్యతిరేకత లేదు.

5. నీహారికా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ వర్సస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో సర్వోన్నత న్యాయస్థానం నిర్ధారించిన సూత్రం మీద ఆధారపడుతూ, ఈ దశలో ఎఫ్ ఐ ఆర్ ను కొట్టివేయడం అవసరం లేదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించారు.

గవర్నమెంట్ ప్లీడర్ వాదనలు

1. నవ్య ప్రింటర్స్ మీద 12.11.2021న హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ నోటిఫికేషన్ విడుదల చేశారని, అంబర్‌పేట పోలీస్ ఇనస్పెక్టర్ ఇచ్చిన సమాచారం కోర్టుకు తెలియజేశారు.

2. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 165 కింద సోదా నిర్వహించడానికి అదే రోజు మలక్ పేట డివిజన్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ నుంచి అనుమతి పొందారనీ, ఆ మేరకే సోదా, జప్తు జరిపి, పంచనామా తయారు చేశారనీ చెప్పారు.

3. ఈ ప్రక్రియలో అపసవ్యత గాని, చట్టవ్యతిరేకతగాని ఏమీ లేదు. కనుక ఈ రిట్ పిటిషన్ ను కొట్టివేయాలని కోరారు.

న్యాయస్థానపు నిర్ధారణలు

1. ఎంతో సమయం ఇచ్చినప్పటికీ, ముఖ్యంగా ఏడు సార్లు వాయిదాలు వేసినప్పటికీ, పోలీసులు తమ ప్రతివాదన పత్రాలు దాఖలు చేయలేదు. చివరికి 2022 ఫిబ్రవరి 14న అంబర్‌పేట్ పోలీసు ఇనస్పెక్టర్ నుంచి తనకు అందిన పత్రాలను అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ కోర్టుకు సమర్పించారు. అందులో 12.11.2021 న అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ఇచ్చిన నోటిఫికేషన్, సోదాకు అనుమతులు, పంచనామా, సిఆర్ పి సి సెక్షన్ 41-ఎ కింద ఇచ్చిన నోటీసు, సెక్షన్ 161 కింద నమోదు చేసిన సాక్షుల వాంగ్మూలాల ప్రకటనలు ఉన్నాయి.

2. ఫిర్యాదు, పంచనామా, సోదా అనుమతులు, సాక్షుల వాంగ్మూలాలు మొదలైన ఈ పత్రాలన్నిటినీ పరిశీలిస్తే ఈ కింది వరుస క్రమం కనబడుతుంది:

ఎ. అంబర్‌పేట పోలీస్ స్టేషన్ డిటెక్టివ్ ఇనస్పెక్టర్‌కు 12.11.2021న సాయంత్రం 5 గంటలకు ఒక విశ్వసనీయ సమాచారం అందింది.

బి. అదే రోజు సాయంత్రం 5.15కు ఆ డిటెక్టివ్ ఇనస్పెక్టర్ అంబర్‌పేటలోని నవ్య ప్రింటర్స్‌లో నిషిద్ధ మావోయిస్టు భావజాలాన్ని ప్రోత్సహించే, యువతను మావోయిజం వైపు ఆకర్షించే పుస్తకాలు అచ్చవుతున్నాయని అసిస్టెంట్ పోలీసు కమిషనర్‌కు సమాచారం అందించారు.

సి. 12.11.2021 రాత్రి 9 గంటలకు అంబర్‌పేట పోలీసు స్టేషన్ కు అడిషనల్ పోలీస్ ఇనస్పెక్టర్ నుంచి ఫిర్యాదు అందిందని ఎఫ్ఐఆర్‌లో రాశారు.

డి. సిఆర్‌పిసి సెక్షన్ 161 కింద డిటెక్టివ్ పోలీస్ ఇనస్పెక్టర్ ఇచ్చిన వాంగ్మూలంలో, తాను సోదా జరపడానికి ఇద్దరు మధ్యవర్తులను పంపించమని తహసీల్దార్‌కు ఉత్తరం రాశానని, తహసీల్దారు ఇద్దరు ప్రభుత్వోద్యోగులను పంపారని చెప్పారు.

ఇ. ఒప్పుదల ప్రకటన, పంచనామా రెండూ సోదా 12.11.2021న సాయంత్రం 6.30కు జరిగిందని నమోదు చేశాయి. పైన చెప్పిన ఇద్దరు మధ్యవర్తులు అంబర్‌పేట పోలీసు స్టేషన్ కు వెళ్లి డిటెక్టివ్ ఇనస్పెక్టర్ నుంచి ఆ సమాచారం తెలుసుకున్నారని నమోదయింది.

3. అలా, మొత్తం వివాదం సాయుధ శాంతి స్వప్నం అనే శీర్షిక గల పుస్తకం ముద్రణ చుట్టూ తిరుగుతుంది.

4. ఈ నేరం తెలంగాణ ప్రజా భద్రతా చట్టం సెక్షన్ 8 (2) కింద నమోదయింది. (తీర్పు ఆ చట్టంలోని సంబంధిత సెక్షన్లను

పూర్తిగా ఉటంకించింది).

5. ఏదైనా ఒక ప్రాంతంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నాయని సమాచారం వస్తే, ఆ ప్రాంతాన్ని నోటిఫై చేసి, తమ అదుపులోకి తీసుకుని, సోదాలు జరిపే అధికారాన్ని ఆ చట్టంలోని సెక్షన్ 9 రాష్ట్ర ప్రభుత్వానికి/ పోలీసు కమిషనర్‌కు/ జిల్లా మెజిస్ట్రేట్‌కు కట్టబెట్టింది. ఆ సమాచారం మీద ఒక అభిప్రాయానికి రావడం, నోటిఫికేషన్ విడుదల చేయడం అనేవి సెక్షన్ 9 ప్రకారం కీలకమైన చర్యలు.

6. సెక్షన్ 9లో చెప్పిన 'నోటిఫై చేయడం', 'నోటిఫై చేసిన' అనే మాటలు అదే చట్టంలో సెక్షన్ 2 (డి) కింద నోటిఫికేషన్ అనే నిర్వచనానికి లోబడినవి. అంటే అవి గెజిట్‌లో ప్రచురితమైన నోటిఫికేషన్ కు సంబంధించినవి.

7. అంబర్‌పేట పోలీసు ఇనస్పెక్టర్ దాఖలు చేసిన లిఖిత సూచనలలో 12.11.2021ననే నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందని అంటూ, ఆ నోటిఫికేషన్ ప్రతిని జత చేశారు.

8. అసలు పోలీసు కమిషనర్ ఆ నోటిఫికేషన్ ఇవ్వనే లేదని, సోదా, జప్తు అనే తమ చట్టవ్యతిరేక చర్యలను కప్పిపుచ్చుకునేందుకు, ఆ తర్వాత పాత తేదీతో ఒక కాగితం సృష్టించారని పిటిషనర్ల న్యాయవాదులు నందిగం కృష్ణారావు, డి సురేష్ కుమార్ వాదించారు. వారి వాదనను పరిశీలించడానికి ఆ నోటిఫికేషన్ పత్రాన్ని పరిశీలించవలసి ఉంది. (కోర్టు ఆ పత్రం పూర్తి పాఠాన్ని తీర్పులో చేర్చింది).

9. 12.11.2021న జారీ అయిందని చెపుతున్న ఈ నోటిఫికేషన్ చట్టంలోని సెక్షన్ 9 ప్రకారం జారీ కాలేదని పిటిషనర్ల న్యాయవాదులు చేసిన వాదనలో బలం ఉంది. అది చట్టబద్ధమైన నోటిఫికేషన్ అయి ఉంటే తెలంగాణ గెజిట్‌లో ప్రచురితమై ఉండవలసింది. కాని అది తెలంగాణ గెజిట్‌లో ప్రచురితం కాలేదని పైపైన చూసినా తేలిపోతుంది.

10. అంతేకాదు, ఒక ప్రాంతాన్ని తమ అదుపులోకి తీసుకోవడం అనే చర్య, నోటిఫికేషన్ ఇచ్చే అధికారి నిర్ధారిత అభిప్రాయం మీద ఆధారపడి ఉండాలని చట్టం లోని సెక్షన్ 9 నిర్దేశిస్తున్నది. అభిప్రాయాన్ని నిర్ధారించుకోవడం అంటే ఆ అభిప్రాయానికి రావడానికి తగిన కారణాలు ఉండాలి. తాను ఆ అభిప్రాయానికి ఏ కారణాలవల్ల వచ్చానో స్పష్టంగా తెలియజేయాలి. అభిప్రాయానికి రావడానికి దారి తీసిన కారణాలు వివరించడమే చట్టం నిర్దేశించిన పద్ధతిలో భాగం. అలాగే అది రాజ్యం చేసే నిరంకుశ చర్యల నుంచి రక్షణగా కూడ పనిచేస్తుంది.

11. ప్రస్తుత సందర్భంలో, 12.11.2021 తేదీ ఉన్న నోటిఫికేషన్ కేవలం మావోయిస్టు భావజాలాన్ని సమర్థించే, శాంతి భద్రతలకు, ప్రజా శాంతికీ భంగకరమైన పుస్తకాలను నవ్య ప్రింటర్స్‌లో అచ్చువేస్తున్నారనే మాట తప్ప మరేమీ లేదు. ఆ అభిప్రాయానికి రావడానికి కారణాలేమిటో ఆ నోటిఫికేషన్‌లో లేదు. ఆ పుస్తకాలు ప్రచురించడం శాంతి భద్రతలను ఎట్లా భంగపరుస్తుందో చూపడానికి నోటిఫికేషన్ లో ఏమీ లేదు.

12. సిఆర్‌పిసి సెక్షన్ 95 కింద జారీ చేసిన ఇటువంటి నోటిఫికేషన్ సందర్భంలోనే మనీషి జాని వర్సస్ స్టేట్ ఆఫ్ గుజరాత్ కేసులో గుజరాత్ హైకోర్టు ఫుల్ బెంచి ఇచ్చిన తీర్పును, అందులో ఉటంకించిన వేరువేరు సుప్రీం కోర్టు తీర్పులను కోర్టు ప్రస్తావించింది.

13. అలాగే, ఒక సమాచారాన్ని పరిశీలించకుండా, పరీక్షించకుండా, తెలుసుకోకుండా దాని గురించి ఒక అభిప్రాయం ఏర్పరచుకోవడం సాధ్యం కాదని, తత్సంబంధిత అధికారులు ఆ సమాచారాన్ని పరీక్షించిన తర్వాత మాత్రమే అభిప్రాయం ఏర్పరచుకోవచ్చునని హర్నామ్ దాస్ వర్సస్ స్టేట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్ కేసులో సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. (కోర్టు ఆ తీర్పును వివరంగా ఉటంకించింది).

14. పైన చెప్పిన ప్రకారం, మావోయిస్టు భావజాలాన్ని ప్రోత్సహిస్తున్నారు అనే నిర్ధారణకు రావడానికి కారణాలు చెప్పడంలో ఆ నోటిఫికేషన్ విఫలమైంది. ఆ నోటిఫికేషన్, ఆ పుస్తకాలలో తమ నిర్ధారణకు తగిన భాగాలను ఉటంకించడం అలా ఉంచి, కనీసం ఆ పుస్తకాల పేర్లు కూడ ప్రస్తావించలేదు. తన ముందుకు వచ్చిన సమాచారాన్ని పరీక్షించకుండా కమిషనర్ ఆ పుస్తకాలు మావోయిస్టు భావజాలాన్ని ప్రోత్సహిస్తున్నాయనే నిర్ధారణకు రాజాలరు. ఆ మేరకు తనకు సమాచారం రావడమే చట్టం లోని సెక్షన్ 9 కింద తాను చర్య తీసుకోవడానికి కారణం కాజాలదు. ఆ పుస్తకాలలో ఉన్న సమాచారాన్ని పరిశీలించి, పరీక్షించి, అప్పుడు మాత్రమే ఏ నిర్ధారణకైనా రావలసి ఉంటుంది. ఆ నిర్ధారణకు రావడానికి కారణాలను నమోదు చేయవలసి ఉంటుంది. అందువల్ల, 12.11.2021న జారీ అయిన నోటిఫికేషన్ చట్టం నిర్దేశించిన సెక్షన్ 9 ప్రకారం వెలువడలేదు.

15. ఈ సందర్భంలో పోలీసులు సోదా నిర్వహించడానికి అధికారం ఇచ్చిన సిఆర్‌పిసి సెక్షన్ 165 గురించి కూడ చర్చించడం అవసరం. (సిఆర్‌పిసి నుంచి ఆ సెక్షన్‌ను పూర్తిగా ఉటంకించారు).

16. పైన వివరించిన ప్రకారం, నేర నమోదు 12.11.2021 రాత్రి 9 గంటలకు జరిగింది. మలక్‌పేట అసిస్టెంట్ కమిషనర్ ను అంబర్‌పేట అడిషనల్ పోలీస్ ఇనస్పెక్టర్ సాయంత్రం 5.15కు కలిశారని సోదా అనుమతి పత్రంలో ఉంది. అంటే సిఆర్‌పిసి సెక్షన్ 165 కింద సోదా అనుమతి ఇచ్చే సమయానికి నేరం నమోదు కాలేదు. అంటే స్పష్టంగా, పోలీసులు చేసిన సోదా గాని, జప్తు గాని సిఆర్‌పిసి సెక్షన్ 165 నిర్దేశించిన పద్ధతికి ఉల్లంఘనలుగానే జరిగాయి.

17. పోలీసులు చేపట్టిన అన్ని చర్యలలోను ఆ రోజునే వెలువడిందని అంటున్న నోటిఫికేషన్ గురించి ప్రస్తావన కూడ లేదని గుర్తించడం అవసరం.

18. 12.11.2021న జారీ అయిందని చెపుతున్న నోటిఫికేషన్‌ను అదే రోజు నమోదైన ఫిర్యాదులో గాని, అదే రోజు ఇచ్చిన సోదా అనుమతి పత్రంలో గాని ప్రస్తావించలేదు. తన దగ్గర జప్తు చేసిన వస్తువులు తిరిగి తనకు ఇవ్వాలని పిటిషనర్ కింది కోర్టులో వేసిన వ్యాజ్యంలో పోలీసులు 29.11.2021న దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్‌లో కూడ ఆ నోటిఫికేషన్ గురించి ప్రస్తావించలేదు. మొట్టమొదటిసారి ఈ కోర్టులోనే ఆ నోటిఫికేషన్ ప్రతిని సమర్పించారు.

19. అసలు ఆ నోటిఫికేషన్ 12.11.2021న జారీ అయి ఉండడం అసంభవమని ఈ కోర్టు భావిస్తున్నది. ఆ నోటిఫికేషన్ గనుక ఆ రోజే జారీ అయి ఉంటే, ఇప్పటివరకూ జరిగిన ప్రక్రియలో ఎప్పుడైనా

పోలీసులు దాన్ని ప్రస్తావించి ఉండవలసింది. ఎందుకంటే, అసలు ఆ నోటిఫికేషన్ పునాది గానే సోదా, జప్తు వంటి తర్వాత చర్యలన్నీ జరిగాయి. ఆ నోటిఫికేషన్ గురించి అంతకు ముందు ప్రస్తావనలు ఎందుకు రాలేదో వివరించడంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ విఫలమయ్యారు. అందువల్ల, ఈ కోర్టు అభిప్రాయంలో, ఆ నోటిఫికేషన్‌ను 12.11.2021న జారీ చేయలేదు. కేవలం ఆ తర్వాత సవరింపు చర్యగా మాత్రమే తయారు చేశారు.

20. అలాగే, ఈ సోదా, జప్తులకు సంబంధించిన మొత్తం ఘటనల పరంపరను చర్చించవలసిన అవసరం కూడ ఉంది. పోలీసులు చెపుతున్న ప్రకారం, పోలీసు ఇనస్పెక్టర్‌కు మొట్టమొదటి సమాచారం సాయంత్రం 5 గంటలకు అందింది. ఆ ఇనస్పెక్టర్ ఆ సమాచారాన్ని బషీర్‌బాగ్‌లో ఉన్న పోలీసు కమిషనర్‌కు వెంటనే తెలియజేసి, అప్పుడే వివాదాస్పద నోటిఫికేషన్ తీసుకున్నారు. అదే సమయంలో ఆయన తనకు అందిన సమాచారాన్ని మలక్ పేట డివిజన్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్‌కు తెలియజేసి సోదా అనుమతి తీసుకున్నారు. సోదా అనుమతి సంపాదించగానే అంబర్‌పేట తహసీల్దార్ కు ఇద్దరు మధ్యవర్తులను పంపించమని ఉత్తరం రాశారు. మధ్యవర్తులు పోలీసు స్టేషన్‌కు చేరగానే వారికి సమాచార వివరాలు చెప్పి, ఆ తర్వాత సోదాలు నిర్వహించారు. సాయంత్రం 6.30కు పంచనామా పత్రం నమోదు చేశారు.

21. అంటే, ఈ మొత్తం వ్యవహారం ఒక గంటా ముప్పై నిమిషాల వ్యవధిలో, 12.11.2021 సాయంత్రం 5 గంటల నుంచి 6.30 వరకు జరిగిపోయింది. ఈ వ్యవహారంలో పోలీసులు చెపుతున్న ఘటనల పరంపర వారు చెప్పినట్టుగా జరగడం ఎంతమాత్రమూ సంభవం కాదని ఈ కోర్టు అభిప్రాయపడుతున్నది.

22. ఇక్కడ క్రైం నం. 439/2021 విషయంలో, నిందితుల మీద ప్రజా భద్రతా చట్టం సెక్షన్ 8 (2) కింద నేరం నమోదైందని గుర్తించడం అవసరం. శిరీష విజ్ఞప్తి మేరకు నిందితుడు ఆ పుస్తకం ప్రచురించాడని ఆరోపణ. కాని చట్టం ప్రకారం ఏ వ్యక్తి అయినా ఏ చట్టవ్యతిరేక సంస్థనైనా, దాని సభ్యులనైనా నిర్వహించినా, దానికి సహకరించినా, ప్రోత్సహించినా, ఏదైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేయడానికి ఆ సంస్థకు, దాని సభ్యులకు సహకరించినా నేరం అవుతుంది. కాని పైన వివరించిన ప్రకారం, ఒక పుస్తక ప్రచురణ దానికదిగా ఒక చట్టవ్యతిరేక సంస్థకో, లేదా చట్టవ్యతిరేక కార్యకలాపానికో సహకరించడం, ప్రోత్సహించడం ఎలా అవుతుందో చూపడంలో పోలీసులు విఫలమయ్యారు. సెక్షన్ 8 (2) కింద నేరం జరిగిందని ప్రాథమికంగా రుజువు కావడం లేదు.

23. ఈ నేరానికి నిర్దేశించిన శిక్ష ఏడు సంవత్సరాల లోపేనని గుర్తించడం అవసరం. అందువల్ల, దర్యాప్తు అధికారి ఇప్పటికే సిఆర్‌పిసి సెక్షన్ 41-ఎ కింద నోటీసులు ఇచ్చారు. 14 మంది సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేశారు. ఇంకా దర్యాప్తు సాగవలసి ఉంది. అయినా సరే, హడావుడిగా సోదాలు జరిపి, జప్తు చేయడం చట్టం ప్రకారం గాని, సిఆర్‌పిసి ప్రకారం గాని నిర్దేశించిన ప్రక్రియకు తీవ్రమైన ఉల్లంఘనే అవుతుంది.

24. పైన చెప్పిన ఘటనాక్రమాన్ని బట్టి చూస్తే, పోలీసుల మొత్తం పనితీరు నిరంకుశమైన పద్ధతిలో సాగింది. వ్యక్తి స్వేచ్ఛనూ, భావప్రకటనా స్వేచ్ఛనూ అరికట్టే ఇటువంటి నిరంకుశ చర్య దర్యాప్తు ప్రక్రియను దుర్వినియోగం చేయడమే. స్టేట్ ఆఫ్ హర్యానా వర్సస్ భజన్ లాల్ కేసులో సుప్రీంకోర్టు నిర్దేశించిన ప్రాతిపదికల ఉల్లంఘనే. (ఆ కేసు వివరాలను వివరంగా ఉటంకించారు)

25. అందువల్ల, ఏ కోణం నుంచి చూసినా, ఈ నేరారోపణ కేసును కొట్టివేయకతప్పదు. అదే విధంగా కొట్టివేస్తున్నాం. జప్తు చేసిన తమ సామగ్రిని తమకు తిరిగి ఇప్పించాలని కోరుతూ నాంపల్లి నాలుగవ అడిషనల్ చీఫ్ మెట్రొపాలిటన్ మెజస్ట్రేట్ కోర్టులో ఈ పిటిషనర్లు ఒక కేసు దాఖలు చేశారని, ఆ అభ్యర్థనను ఆ కోర్టు కొట్టి వేసిందని, అయినా పిటిషనర్లు ఆ తీర్పును సవాలు చేయలేదని అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఈ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. అలా సవాలు చేయలేదు గనుక ఆ సామగ్రి తమకు ఇప్పించాలని కోరే అర్హత వారికి లేదని వాదించారు. అయితే కింది కోర్టు ఉత్తర్వులను పరిశీలిస్తే, ఆ కోర్టు అసలు పోలీసులు ఆ సామగ్రిని తమకు సమర్పించలేదని, అందువల్ల తాము ఏ నిర్ణయం తీసుకోలేమని అంటూ ఆ కేసు కొట్టివేసిందని తెలుస్తున్నది. కనుక అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ వాదనకు అవకాశం లేదు.

26. ఈ మొత్తం వ్యవహారం పుస్తక ప్రచురణకు సంబంధించినది గనుక భారత రాజ్యాంగంలోని అధికరణం 19 వెలుగులో పరీక్షించవలసిన అవసరం ఉంది. భావప్రకటనా, వ్యక్తీకరణ స్వేచ్ఛ మౌలిక మానవహక్కులలో ఒకటి. ఒకరి అభిప్రాయాలనూ, భావాలనూ రాజ్యపు నిరంకుశ జోక్యం లేకుండా స్వేచ్ఛగా వ్యక్తీకరించడానికి ఉన్న హక్కును అధికరణం 19 గుర్తించింది. భావప్రకటన మీద ఆంక్షలను చాల పరిమితంగా వ్యాఖ్యానించవలసి ఉంటుంది. అవి అధికరణం 19 (2) లో చూపిన కారణాలకు మాత్రమే పరిమితమైనవి. అధికరణం 19 కింద రచయితలకూ, ప్రచురణకర్తలకూ సంక్రమించిన హక్కుల మీద కేవలం శాంతి భద్రతల సమస్యలు తలెత్తవచ్చుననే ఊహతో ఆంక్షలు విధించడం సరికాదు. శాంతి భద్రతల నిర్వహణ రాజ్యపు బాధ్యత. అసాధారణమైన సందర్భాలలో మాత్రమే భావప్రకటనా స్వేచ్ఛ మీద ఆంక్షలు విధించవచ్చు.

27. కళాత్మక స్వేచ్ఛా హక్కు అధికరణం 19 నుంచే ఆవిర్భవిస్తుంది. భారతదేశం వంటి ప్రజాస్వామ్య దేశానికి అది చాల ముఖ్యమైనది. పుస్తకాల నిషేధాల విషయంలో ఎన్ రాధాకృష్ణన్ వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు ఈవిధంగా నిర్దేశించింది: (సుప్రీం కోర్టు తీర్పును వివరంగా ఉటంకించారు).

28. ప్రస్తుత సందర్భంలో, రెండవ కేసులో పిటిషనర్ అక్కిరాజు హరగోపాల్ @ రామకృష్ణ @ ఆర్ కె భార్య. ఆమె చెపుతున్న ప్రకారం, ఆమె భర్త అనారోగ్య కారణాలతో 14.10.2021న మరణించారు. ఆమెకు ఆ వార్త పత్రికల ద్వారా, ఎలక్ట్రానిక్ ప్రచార సాధనాల ద్వారా తెలిసింది. ఆయన పీపుల్స్ వార్ పార్టీ రాష్ట్ర నాయకుడుగా ఉండేవారు. 2004లో వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నక్సలైట్లకూ ప్రభుత్వానికీ మధ్య జరిగిన శాంతి చర్చలలో పాల్గొన్న పీపుల్స్ వార్ పార్టీ బృందానికి ఆయన

నాయకత్వం వహించారు. ఆ చర్చల సందర్భంలో పత్రికలలో, ఎలక్ట్రానిక్ ప్రచార సాధనాలలో ఆ చర్చల వార్తలు విస్తృతంగా వచ్చాయి గనుక ఆమె భర్త ప్రతి ఇంట్లో పరిచితుడిగా మారారు. జీవితమంతా ప్రజల సేవలో గడిపిన తన భర్తను ఆమె గౌరవించదలిచారు. ఆయన జ్ఞాపకాల ద్వారా ప్రజలకు ప్రేరణ ఇవ్వదలిచారు. ఆమె అమరుల బంధుమిత్రుల సంఘం సభ్యురాలిగా ఉన్నారు. ఆ సంస్థలో ఉన్న మిత్రులు, బంధువుల సహాయంతో ఆమె ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా, ఆలకూరపాడు అనే తన స్వగ్రామంలో 24.10.2021న ఆర్‌కె సంస్మరణ సభ జరిపారు. పోలీసులు నిఘా పెట్టినప్పటికీ దాదాపు వెయ్యి మంది ఆ సభకు హాజరయ్యారు. ఆర్‌కె గురించి జ్ఞాపకాలతో, ఆయన రచనలతో ఒక పుస్తకం ప్రచురిస్తే బాగుంటుందని అక్కడ ఒక ప్రతిపాదన వచ్చింది. ఆర్ కె గురించి పాటలు, కవితలు, జ్ఞాపకాలు పంపించమని ఆ సభలోనే పిలుపు ఇచ్చారు. అలాగే ఆయన రాసిన వ్యాసాలు, పత్రికలకు ఇచ్చిన ఇంటర్వ్యూలు, ప్రకటనలు కూడ సేకరించి అవన్నీ కలిపి పుస్తకం తయారు చేశారు. తన భర్త ప్రభుత్వానికీ నక్సలైట్లకూ మధ్య జరిగిన శాంతి చర్చలకు నాయకత్వం వహించారు గనుక, ఆ పుస్తకానికి 'సాయుధ శాంతి స్వప్నం' అని పేరు పెట్టాలని ఆమె నిర్ణయించుకున్నారు. ఆ పుస్తకాన్ని హైదరాబాద్‌లో ప్రచురించి, 14.11.2021న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పుస్తకావిష్కరణ సభ నిర్వహించాలనుకున్నారు.

29. ఆ పుస్తకంలో అభ్యంతరకరమైన విషయమేదీ లేదని ఆమె అంటున్నారు. ఆ పుస్తకంలో ఉన్నవి తన భర్త వార్తాపత్రికల్లో రాసిన వ్యాసాలు, ఇంటర్వ్యూలు, ప్రకటనలు మాత్రమేనంటున్నారు. పోలీసులు ఎటువంటి విచారణ జరపకుండా, పుస్తకంలో ఉన్న విషయాలను ధ్రువీకరించుకోకుండా, అది అభ్యంతరకరమైనదనే నిర్ధారణకు వచ్చి, నవ్య ప్రింటర్స్ లో నిరంకుశంగా, చట్టవ్యతిరేకంగా సోదాలు చేసి, జప్తు చేశారని ఆమె అంటున్నారు.

30. పైన చెప్పినట్టుగా పోలీసులు పుస్తకంలో ఏమి ఉన్నదో చూడకుండానే, పుస్తకం ప్రతులు జప్తు చేశారు. పిటిషనర్లు చెపుతున్న ప్రకారం పుస్తకంలో ఇదివరకే పత్రికల్లో అచ్చయిన అక్కిరాజు హరగోపాల్ @ రామకృష్ణ రాసిన వ్యాసాలు, ఇంటర్వ్యూలు, సంపాదకీయాలు, ప్రకటనలు, వగైరా ఉన్నాయి. చర్య తీసుకునే ముందు అధికారులకు సమంజసమైన కారణాలు ఉండి ఉండవలసింది. ఈ కేసులో పోలీసులు, చట్టం నిర్దేశించిన ప్రక్రియను పాటించకుండా, అచ్చువేసిన నవ్య ప్రింటర్స్ 1991 నుంచీ వ్యాపారంలో ఉన్నదనే వాస్తవాన్ని పట్టించుకోకుండా, వారి యంత్రాలనూ, ఇతర సామగ్రినీ గంటన్నర లోపల జప్తు చేశారు. పోలీసుల ప్రవర్తన నిరంకుశంగా, చట్టవ్యతిరేకంగా ఉన్నది. తెలంగాణ ప్రజా భద్రతా చట్టం, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ లు నిర్దేశించిన ప్రక్రియకు ఉల్లంఘనగా ఉన్నది.

31. పునరుక్తి అయినప్పటికీ, ఈ కోర్టు మరొకసారి నొక్కి చెప్పదలచినదేమంటే, ఈ చట్టం కింద నేరాలు తీవ్రమైన స్వభావం కలిగినవి. అవి ఎంత తీవ్రమైనవో సెక్షన్ 12 ద్వారా స్పష్టమవుతుంది. ఈ చట్టం కింద కేసులో ప్రతి సవరణ పిటిషన్‌ను హైకోర్టులో ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం మాత్రమే వినవలసి ఉంటుంది. అంటే, ఈ నేరపు తీవ్రత గురించి చట్టసభ ఎంత తీవ్రంగా ఆలోచించిందో చాల స్పష్టంగా ఉంది.

32. హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వంటి సీనియర్ పోలీసు అధికారి, వేధింపు, శిక్ష వంటి పర్యవసానాలకు దారి తీసే 12.11.2021 నోటిఫికేషన్ జారీ చేసే ముందు ఈ చట్ట నిబంధనలను ఒకసారి చదివి ఉంటారని ఆశిస్తాము. చట్టం నిర్దేశించిన విధంగా గెజిట్‌లో ప్రచురించకుండా, తన కింది అధికారులు సోదాలతో, జప్తులతో ముందుకు పోవడానికి ఆయన అనుమతించడం తెలంగాణ ప్రజా భద్రతా చట్టం, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ నిర్దేశించిన విధివిధానాలకు తీవ్రమైన ఉల్లంఘన.

33. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ 12.11.2021న నోటిఫికేషన్ జారీ చేయకుండానే జారీ చేసినట్టు చెపుతున్నారు గనుక అది ప్రమాణం చేసి చెప్పిన అబద్ధం అనే నేరం కిందికి వస్తుందని వాదనల క్రమంలో పిటిషనర్ల న్యాయవాది నందిగం కృష్ణారావు వాదించారు. ప్రమాణం చేసి అసత్యం పలకడం అనే నేరం చేసినట్టు రుజువు కావాలంటే:

ఎ. ఆ ప్రకటన చేసిన వారు సత్యప్రమాణకంగా నిజమే చెపుతామని ప్రమాణం చేసి ఉండాలి.

బి. ఆ ప్రమాణాన్ని ఉల్లంఘిస్తూ ఉద్దేశపూర్వకంగా అబద్ధ ప్రకటన చేసి ఉండాలి.

సి. తాను చేస్తున్న ప్రకటన సత్యం కాదని ప్రకటనకర్తకు తెలిసి ఉండాలి.

డి. ఆ ప్రకటన ఒక భౌతిక వాస్తవానికి సంబంధించినది అయి ఉండాలి.

ప్రస్తుత సందర్భంలో ఈ నాలుగు అంశాలూ వర్తించవు గనుక, పోలీస్ కమిషనర్ ఆ నేర పరిధిలోకి రారని భావిస్తున్నాం.

ముగింపు

పైన జరిగిన చర్చను దృష్టిలో ఉంచుకుని, ఈ రెండు పిటిషన్లను ఈ కింది విధంగా ఆమోదిస్తున్నాం:

1. నవ్య ప్రింటర్స్ మీద పోలీసులు జరిపిన సోదా, జప్తు మొత్తంగా చర్య చట్టవ్యతిరేకం, తెలంగాణ ప్రజాభద్రతా చట్టం, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లు నిర్దేశించిన విధివిధానాలకు వ్యతిరేకం.

2. పిటిషనర్లకు వ్యతిరేకంగా అంబర్‌పేట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును (క్రైం నం. 439/2021) కొట్టి వేస్తున్నాం.

3. నవ్య ప్రింటర్స్‌కు వేసిన తాళాలు తొలగించాలనీ, పిటిషనర్లు ఆ ప్రాంగణంలో పని చేసుకోవడానికి ఎటువంటి సమస్యలు సృష్టించగూడదని పోలీసులను ఆదేశిస్తున్నాం.

4. ఈ కేసులో పోలీసులు జప్తు చేసుకున్న సామగ్రినంతా పిటిషనర్లకు తిరిగి అప్పగించి, వారి నుంచి తగిన రశీదు పొందాలని పోలీసులను ఆదేశిస్తున్నాం. వీ

(తెలుగు: ఎన్ వేణుగోపాల్)

తెలుసుకోవలసిన ఇటీవలి కోర్టు తీర్పులు

గడిచిన నాలుగు వారాలలో వివిధ రాష్ట్రాల న్యాయస్థానాలలో రాజ్య హింసకూ వేధింపులకూ సంబంధించిన కేసులపై కొన్ని ఆసక్తికరమైన తీర్పులు వచ్చాయి. వివరాలు క్లుప్తంగా...

మజ్దూర్ సంఘటన్ సమితి నిషేధం కొట్టివేత

జార్ఖండ్‌లోని మజ్దూర్ సంఘటన్ సమితి (ఎంఎస్ఎస్) అనే కార్మిక సంఘాన్ని మావోయిస్టు పార్టీ అనుబంధ సంఘంగా ప్రకటిస్తూ అప్పటి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రభుత్వం 2017 డిసెంబర్ 22న నిషేధం విధించింది. ఆ నిషేధాన్ని సవాల్ చేస్తూ ఎంఎస్ఎస్ కార్యదర్శి బచ్చా బాబు సింగ్ దాఖలు చేసిన వ్యాజ్యంపై విచారణ జరిపిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీ చంద్రశేఖర్ ఫిబ్రవరి 11న ఆ నిషేధాన్ని కొట్టివేశారు. "సమితి సిపిఐ (మావోయిస్టు) అనుబంధ సంస్థ అనీ, అది తీవ్రవాద కార్యకలాపాలు సాగిస్తున్నదనీ, నక్సలైట్ల ఆశయాలను ప్రచారం చేస్తున్నదనీ ఆరోపిస్తూ, దాన్ని నిషేధిస్తూ క్రిమినల్ లా అమెండ్మెంట్ సెక్షన్ 16 కింద జారీ చేసిన నోటిఫికేషన్ ను సమర్థించే ఆధారాలను వేటినీ ప్రభుత్వం సమర్పించలేకపోయింది" అని తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసులో అఫిడవిట్లలో పూర్తి సమాచారం ఇవ్వకపోవడం, ఎన్ని అవకాశాలు ఇచ్చినా సమయానికి ప్రమాణపూర్వకమైన పత్రాలు సమర్పించకపోవడం, కొన్ని సందర్భాలలో అసలు అఫిడవిట్లే సమర్పించకపోవడం వంటి ప్రభుత్వ వ్యవహార శైలిని కోర్టు తప్పు పట్టింది. అప్పటి ప్రభుత్వం ఎంఎస్ఎస్ పత్రాలను జప్తు చేసి, కార్యాలయాలకు తాళాలు వేయడంతో కార్మిక సంఘం తన సామాజిక, సాంస్కృతిక కార్యకలాపాలను ఆపివేసింది. అయితే తీర్పు వెలువడి నెల గడిచినప్పటికీ పోలీసులు ఇంకా తమ కార్యాలయాల తాళాలు తెరవలేదని, తమ పత్రాలు తిరిగి ఇవ్వలేదని బచ్చా సింగ్ అన్నారు.

సోని సోరి పై రాజద్రోహం కేసు కొట్టివేత

ఆదివాసి కార్యకర్త సోని సోరి, ఆదివాసి జర్నలిస్టు లింగారామ్ కొడోపి, కాంట్రాక్టర్ బి కె లాలా, ఎస్సార్ అధికారి డివిసిఎస్ వర్మల మీద ఐపిసి 124-ఎ (రాజద్రోహం), 121 (భారత ప్రభుత్వం మీద యుద్ధం), 120-బి నేరపూరిత కుట్ర, యుఎపిఎ, ఛత్తీస్ గడ్ స్పెషల్ పబ్లిక్ సెక్యూరిటీ ఆక్ట్ కింద తీవ్రమైన ఆరోపణలతో పోలీసులు 2011లో పెట్టిన కేసు 11 సంవత్సరాల విచారణ తర్వాత దంతెవాడ ప్రత్యేక న్యాయమూర్తి వినోద్ కుమార్ దేవాంగన్ మార్చ్ 14న కొట్టివేశారు. ఎస్సార్ కంపెనీ తరఫున కాంట్రాక్టర్ లాలా సోని సోరికి, లింగారామ్ కొడోపికి రు. 15 లక్షలు ఇచ్చారని, అవి మావోయిస్టు పార్టీకి చేర్చడానికని పోలీసులు ఆరోపించారు. "నిందితుల మీద ఆరోపించిన నేరాలను ఎటువంటి సందేహమూ లేని రీతిలో ప్రాసిక్యూషన్ నిరూపించలేకపోయింది" అని కోర్టు తీర్పు ప్రకటించింది. "నన్ను తప్పుడు కేసులలో ఇరికించారు. నిరపరాధినని రుజువు చేసుకోవడానికి నేను పదకొండేళ్లు పోరాడవలసి వచ్చింది. ఈ కేసులు నా జీవితాన్ని, నా ప్రతిష్టను, నా కుటుంబాన్ని భగ్నం చేశాయి. కోల్పోయిన ఆ 11 సంవత్సరాలను నాకు ఎవరు తెచ్చి ఇస్తారు" అని సోని సోరి ప్రశ్నించారు.

రూపేష్ మీద మూడు యుఎపిఎ కేసులు కొట్టివేత

కేరళకు చెందిన మావోయిస్టు నాయకుడు రూపేష్ మీద రాజద్రోహం, నిషిద్ధ సంస్థలో సభ్యత్వం ఆరోపణలపై యుఎపిఎ కింద నమోదైన మూడు కేసులను కేరళ హైకోర్టు మార్చ్ 18న కొట్టివేసింది. యుఎపిఎ కింద కేసు పెట్టాలంటే చట్టప్రకారం ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అని, ఈ కేసులలో ఆ అనుమతిని ఆరు నెలల తర్వాత తీసుకున్నారని, కాని చట్టం నిర్దేశించిన ప్రకారం వారం లోపలే ఆ అనుమతి తీసుకోవాలని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె వినోద్ చంద్రన్, జస్టిస్ సి జయచంద్రన్ అన్నారు. ఈ కేసుల్లో రూపేష్, తదితరులు వైనాడ్ జిల్లా ఆదివాసి ప్రాంతాల్లో దేశద్రోహకరమైన కరపత్రాలు పంచారని, స్థానిక ప్రజలను ఆహారం అడిగారని, బెదిరించారని, చట్టవ్యతిరేకంగా గుమిగూడారని, అక్రమంగా ఆయుధాలు కలిగి ఉన్నారని అనేక నేరారోపణలు ఉన్నాయి. అయితే ఈ మూడు కేసులు కొట్టివేసినప్పటికీ రూపేష్ మీద కేరళ, తమిళనాడు, కర్ణాటకల్లో 40కి పైగా యుఎపిఎ కేసులు ఉన్నాయని తెలుస్తున్నది.

మోహన్ విశ్వకర్మకు పదేళ్లకు బెయిల్ !!

మోహన్ విశ్వకర్మ అనే మావోయిస్టు అగ్రనాయకుడిని దక్షిణ కలకత్తా, వాట్ గంజ్ లో అరెస్టు చేశామని 2012 జూలై 27న పోలీసులు ప్రకటించారు. ఆయన సెంట్రల్ టెక్నికల్ కమిటీకి, టెక్నికల్ రీసర్చ్ అండ్ ఆర్మ్స్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ కు బాధ్యుడని, ఆయన దగ్గర మావోయిస్టు సాహిత్యం, ఒక హాండ్ గ్రెనేడ్, ఉత్తరాలు స్వాధీనం చేసుకున్నామని, ఆయన దగ్గర దొరికిన సమాచారంతో బారానగర్‌లో వర్క్ షాప్ మీద, ట్రాన్స్ పోర్ట్ ఏజెన్సీ మీద దాడి చేసి మరెన్నో ఆయుధాలు, ఆయుధ సామగ్రి స్వాధీనం చేసుకున్నామని పోలీసులు ఆర్భాటంగా ప్రకటించారు. వెంటనే యుఎపిఎ కింద, ఆయుధాల చట్టం కింద కేసు పెట్టారు. తొమ్మిది సంవత్సరాల ఎనిమిది నెలల తర్వాత కూడా కేసు అంగుళం ముందుకు కదలలేదు. చివరికి మార్చ్ 22న కలకత్తా హైకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. చట్టప్రకారం కేసులు త్వరితగతిన పూర్తి చేయాలని, అలా చేయకపోవడం రాజ్యాంగ అధికరణం 21 హామీ ఇచ్చిన జీవన స్వేచ్ఛకు వ్యతిరేకమని కోర్టు వ్యాఖ్యానించింది. ఆయన జైలుకు వెళ్ళేనాటికి వయసు 60 సంవత్సరాలు. ఆ నేరారోపణలు, కేసు అంత తీవ్రమైనవే అయితే పది సంవత్సరాలు విచారణ పూర్తి చేయకుండా ఎందుకున్నారు? అవి విచారణ జరిగి ఉంటే కొట్టుడుపోయే ఆరోపణలే

అయితే, ఈ పది సంవత్సరాల జీవితాన్ని, కోల్పోయిన ఆరోగ్యాన్ని ఎవరు వెనక్కి తెచ్చి ఇస్తారు?

ఇష్రత్ జహాన్‌కు రెండేళ్ల తర్వాత బెయిల్

పదిహేను సంవత్సరాలకు పైగా ఢిల్లీలో పని చేస్తున్న న్యాయవాది, 2012 ఎన్నికల్లో భారత జాతీయ కాంగ్రెస్ నుంచి ఎన్నికైన ఢిల్లీ మునిసిపల్ కౌన్సిలర్ ఇష్రత్ జహాన్‌ను సిఎఎ వ్యతిరేక ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొన్న సందర్భంగా 2020 ఫిబ్రవరి 26న అరెస్టు చేశారు. ఆ కేసులో బెయిల్ మీద మార్చ్ 21న జైలు నుంచి బైటికి రాగానే మళ్లీ అరెస్టు చేసి యుఎపిఎ కింద కేసు పెట్టారు. 2020 ఫిబ్రవరిలో ఈశాన్య ఢిల్లీలో జరిగిన మత ఘర్షణలను రెచ్చగొట్టే ఉపన్యాసాలు చేసిందని నేరారోపణ చేశారు. 2020 మేలో ఆమె పెళ్లి సందర్భంగా 10 రోజుల మధ్యంతర బెయిల్ ఇచ్చి, ఆ బెయిల్ పొడిగించడానికి నిరాకరించి మళ్లీ జైలుకు పంపారు. ఈ రెండు సంవత్సరాల్లో అనేకసార్లు బెయిల్ నిరాకరించారు. రెండు సంవత్సరాల నిర్బంధం తర్వాత మార్చ్ 14న అదనపు సెషన్స్ జడ్జి అమితాభ్ రావత్ బెయిల్ మంజూరు చేశారు. వీ

వీక్షణం రచయితల సమావేశం

వీక్షణం పది, పన్నెండు సంవత్సరాలుగా క్రమం తప్పకుండా తన పాఠకులతో, అభిమానులతో, రచయితలతో వార్షిక సంభాషణగా జరుపుతున్న 'వీక్షణం రచయితల సమావేశం' ఈ సంవత్సరం విభిన్నంగా జరిగింది. ఆర్థిక కారణాలు, కోవిడ్ వల్ల విస్తృతంగా జరపడానికి అవకాశం లేకపోవడం, వార్షిక సమావేశాల సమీక్షలో గ్రహించిన విషయాల ఆధారంగా ఈసారి కేవలం వీక్షణం రచయితలతో మాత్రమే సమావేశం జరిగింది. హైదరాబాద్‌లో వీక్షణం కార్యాలయంలో మార్చ్ 6న జరిగిన ఈ సమావేశం పత్రిక ఉద్దేశాలనూ పనితీరునూ సమీక్షించుకోవడానికీ, వీక్షణంలో అచ్చవుతున్న రచనల నాణ్యతా ప్రమాణాలు పెంచడానికీ, రచనలలో తీసుకోవలసిన జాగ్రత్తలు చర్చించుకోవడానికీ పరిమితమైంది.

వీక్షణం కలెక్టివ్ నిర్వహించిన ఈ సమావేశానికి ఎ. నరసింహారెడ్డి అధ్యక్షత వహించారు. పదిహేడు సంవత్సరాలుగా వీక్షణం నిర్వహణలో ప్రధాన భాగస్వామిగా ఉండి, పత్రిక ఆర్థిక పరిస్థితి వల్ల, ఖర్చు తగ్గింపు చర్యలలో భాగంగా మరొక ఉద్యోగ అన్వేషణలో వీక్షణం నుంచి వైదొలగిన సహాయ సంపాదకుడు వై రామచంద్రంకు సమావేశం ఘనంగా వీడ్కోలు పలికింది. పదిహేడు సంవత్సరాలుగా కలెక్టివ్ సభ్యులందరూ వీక్షణం మూలస్తంభంగా ఉండిన రాము సేవలను గుర్తుచేసుకుని కృతజ్ఞతలు, కొత్త ఉద్యోగానికి అభినందనలు తెలిపారు. అనివార్య కారణాలవల్ల వీక్షణం నుంచి తప్పుకోవలసి వస్తున్నా, వీక్షణంతో తన అనుబంధం యథాతథంగా ఉంటుందని రాము అన్నారు.

ఇరవై సంవత్సరాల కింద వీక్షణం ప్రారంభించినప్పుడు ఏ ఉద్దేశాలతో, ఏ ఆలోచనలతో ప్రారంభించామో, కాలక్రమంలో వాటిలో కొన్ని మారడం, కొన్ని అభివృద్ధి చెందడం ఎలా జరిగిందో వీక్షణం కలెక్టివ్ సభ్యులు బి.ఎస్. రాజు గుర్తు చేశారు. ప్రస్తుత సామాజిక, రాజకీయార్థిక సంక్షోభ పరిస్థితిలో వీక్షణం బాధ్యత మరింత పెరుగుతున్నదని, మరింత స్ఫూర్తిదాయకమైన, విశ్లేషణాపూర్వకమైన వ్యాసాలు రావాలని ఆయన కోరారు.

వీక్షణం ఉద్దేశాల గురించి, ఆ ఉద్దేశాలకు అనుగుణంగా రావలసిన రచనల గురించి, రచనల్లో పాటించవలసిన నాణ్యతా ప్రమాణాల గురించి సంపాదకుడు ఎన్ వేణుగోపాల్ వివరించారు. 'యథాస్థితి మారాలనే కోరికను వ్యక్తం చేయడం, మార్చవచ్చు, మార్చగలం అనే ఆత్మవిశ్వాసం కలిగించడం, యథాస్థితిలోని లోపాల గురించి సూక్ష్మ అంశాల నుంచి స్థూల అంశాల దాకా ఎప్పటికప్పుడు వివరణ, విశ్లేషణ చేయడం, ప్రత్యామ్నాయాలను సూచించడం వీక్షణం లక్ష్యాలు' అని అన్నారు. "మన ప్రధాన కార్యక్షేత్రం యథాస్థితి మీద విమర్శ, ప్రత్యామ్నాయ ఆలోచనలు. యథాస్థితికి సూచికలుగా ఉండే ప్రధాన పరిణామాల మీద వ్యాఖ్యల ద్వారా ఆ పని చేయవచ్చు. ఆ పరిణామాలను ఇతర ప్రచార సాధనాలు చూపిన పద్ధతి కన్న భిన్నమైన పద్ధతిలో, ప్రత్యామ్నాయ పద్ధతిలో చూపాలి. ప్రధాన సామాజిక పరిణామాల మీద ప్రచార సాధనాలలో వచ్చేదాన్ని ప్రజా, ప్రత్యామ్నాయ కోణం నుంచి చూడాలి. ప్రచార సాధనాలలో అసలే రాని, పట్టించుకోని సామాజిక పరిణామాలకు ప్రాచుర్యం కలిగించాలి. ప్రచార సాధనాలలో వచ్చినవైనా, రానివైనా, సామాజిక పరిణామాలను మొత్తంగా చూడవలసిన దృక్కోణం ఏమిటో చెప్పాలి" అన్నారు. "రూపాన్ని వివరిస్తూనే సారాన్ని విప్పిచెప్పడం వీక్షణం చేయదలచుకున్న, చేయవలసిన పని. ప్రధాన సామాజిక పరిణామాలలో ఏ ఒక్కదాన్నీ మనం విస్మరించగూడదు. అలా విస్మరిస్తే సమాజ చలనంతో మన సంబంధమే ప్రశ్నార్థకమవుతుంది. అదే సమయంలో ఆ ప్రధాన స్రవంతి వార్తలే, ఆ పద్ధతే మనకు ఏకైకం కాగూడదు. ఆ సమాచారం ఇస్తూనే, దాని సారంలోకి వెళ్లి విశ్లేషించాలి. ప్రధానస్రవంతి పట్టించుకోని వార్తలూ పరిణామాలూ రాయాలి. అందుకోసం ప్రత్యామ్నాయ వనరులను అన్వేషించాలి. జాతీయ, అంతర్జాతీయ ప్రత్యామ్నాయ వెబ్ సైట్లు, స్థానిక, జాతీయ ప్రజాసంఘాల, సామాజిక కార్యకర్తల వార్తలు, క్షేత్ర పరిశోధన, సమాజంతో నిత్య సంబంధం ద్వారా ప్రత్యామ్నాయ రచనలు చేయాలి. అసలు ఏ వార్తలోనైనా, పరిణామంలోనైనా చూడవలసినవి ఏమిటి అనే దృక్పథాన్ని, ప్రశ్నను ప్రోత్సహించడానికి ప్రయత్నించాలి. తాత్విక, రాజకీయార్థిక, సామాజిక దృక్పథాల ప్రాధాన్యత పెంచాలి" అన్నారు. ఆ తర్వాత రచనల నాణ్యత గురించి ఉదాహరణలతో వివరిస్తూ ఏ అంశాల మీద దృష్టి కేంద్రీకరించాలో చెప్పారు. వీ

మోషా దుర్మార్గాల చిట్టాలో ఒక పేజీ

నరేంద్ర మోడీ, అమిత్ షా ల దుర్మార్గాలను దగ్గరి నుంచి చూసి ఎదిరించడానికి, ప్రపంచానికి నిజాలు చెప్పడానికి సాహసించినందుకు అంతులేని వేధింపులను, శిక్షలను ఎదుర్కొన్న పోలీసు అధికారి సంజీవ్ భట్ సహచరి శ్వేత రాసిన లేఖ

నా పేరు శ్వేతా సంజీవ్ భట్.

గుజరాత్ మారణహోమానికి ఇరవై ఏళ్లు నిండబోతున్న సందర్భంగా, గడిచిన సంవత్సరాల వైపు వెనక్కి తిరిగి చూడకుండా ఉండలేకపోతున్నాను. ఆ సంవత్సరాలలో సంజీవ్ భట్, ఆయన లాంటి మరికొందరు సాహసికులు నిరంకుశ సామ్రాజ్యం మీద సర్వశక్తులతో పోరాడారు. గడిచిన రెండు దశాబ్దాలను అవలోకించేటప్పుడు, ఈ తలపుల తోవలో నాతోపాటు నడవమని మిమ్మల్ని కోరుతున్నాను. అందువల్ల సంజీవ్ ఎటువంటి మనిషో, ఈ ఫాసిస్టు రాజ్యం మీద ఆయన చేసిన పోరాటం ఏమిటో మీరు తెలుసుకోగలరు. ఆ రాజ్యం నా కన్న మీ కన్న చాల పెద్దది.

సంజీవ్, నేను, నా పిల్లలు ఈ ఇరవై సంవత్సరాలుగా, ఇవాళ్టికి కూడ ఈ పాలకుల చేతిలో, ఎదుర్కొంటున్న బెదిరింపుల జుగుప్సాకరమైన వివరాలు చెప్పి మిమ్మల్ని విసిగించను. సంజీవ్ మీద, ఆయన కుటుంబ సభ్యులమైన మామీద ఈ ఇరవై ఏళ్లలో ఈ పాలకులు జరిపిన హత్యాయత్నాల, కక్షపూరిత బీభత్సపు వివరాలు చెప్పి మీ సమయం వృథా చెయ్యను. హృదయం బలహీనంగా ఉన్నవారు ఆ వివరాలు విని తట్టుకోలేరు.

ఆ బీభత్సం జరుగుతున్నప్పుడు సంజీవ్ ఉద్యోగానికి రాజీనామా చేయడమో, లేదా గుజరాత్‌కు బైట మరో రాష్ట్రానికి బదిలీ చేయించుకోవడమో సులభమైన పనిగా ఉండేది. అంటే న్యాయం కోసం జరిపే పోరాటం తనది కాదనుకుని దాన్ని వదిలేయడం అన్నమాట. ఈ ఫాసిస్టు ప్రభుత్వాన్ని సంతృప్తి పరచడానికి, ఈ దుర్మార్గ పాలకుల ఇష్టాయిష్టాలకు తలొగ్గి, వెన్నెముక లేని ఇతరులందరిలాగనే మతిమరపు నటించడమో, చట్టం ఎదుట సత్యప్రమాణకంగా వాస్తవాలు చెప్పడానికి నిరాకరించడమో చేసి ఉంటే సౌకర్యంగా ఉండేది.

సంజీవ్ ఆ సులభమైన పనినో, సౌకర్యవంతమైన పనినో ఎంచుకున్నాడా?

లేదు. ఆయన ఆ పని ఎంతమాత్రమూ చెయ్యలేదు!

అందుకు బదులుగా సంజీవ్ ఈ దుర్మార్గ, కక్షపూరిత ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలనే తన నిర్ణయానికి ఎటువంటి ఊగిసలాట లేకుండా కట్టుబడి ఉన్నాడు. 2002 నుంచి ఇవాళ్టిదాకా సాహసికంగా పోరాటం కొనసాగించాడు. అదంతా గుజరాత్ మారణకాండ బాధితులకు న్యాయం సాధించడం కోసం. ఆ కాలమంతా ఆయన ఈ ఫాసిస్టు పాలకుల ప్రతీకార చర్యలకు బలి అవుతూ వచ్చాడు. ఏ ఒక్కరోజూ తన నిర్ణయాన్ని సందేహించలేదు, వెనక్కి తగ్గలేదు, తల వంచలేదు.

యుద్ధం వాస్తవికంగా, భయానకంగా మారినప్పుడు యుద్ధరంగం నుంచి పారిపోయి, స్వగృహంలో, సురక్షితమైన స్థలంలో కూచుని వ్యాఖ్యలు చేయడం చాల సులభం. కాని, యుద్ధరంగం లోనే నిలబడి, ఒక అసమాన, దీర్ఘకాలిక యుద్ధాన్ని సాహసంతో, చిత్తశుద్ధితో కొనసాగించడానికి పూర్తిగా భిన్నమైన వ్యక్తిత్వం కావాలి.

నా తలపుల తోవలో నాతో పాటు నడవండి...2002 నుంచి సంజీవ్ జీవిత దృశ్యాన్ని పైపైన అయినా చూడండి...

2002: ఆ సంవత్సరమే సంజీవ్‌ను గుజరాత్ రాష్ట్ర ఇంటిలిజెన్స్ బ్యూరోలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ఇంటిలిజెన్స్‌గా నియమించారు. ప్రభుత్వం రచించిన ప్రణాళిక మేరకు ఊచకోత జరిగిన ఆ సంవత్సరంలోనే సెప్టెంబర్‌లో ముఖ్యమంత్రి నరేంద్ర మోడీ గౌరవయాత్ర పేరుతో ఒక విజయ యాత్ర నడిపాడు. వెళ్లినచోటల్లా ముస్లిం మైనారిటీ సమూహం మీద విషపూరితమైన, ఉద్రేకాలకు దారితీసే ఉపన్యాసాలు చేశాడు. రాష్ట్రంలో అప్పటికే ఉన్న మత ఉద్రిక్తతలను మరింత ఎగసన దోశాడు. ఆ అంశాల మీద దర్యాప్తు జరుపుతున్న జాతీయ మైనారిటీల కమిషన్ ఆ ఉపన్యాసాల రికార్డింగ్‌లు కావాలని అడిగింది. ఇంటిలిజెన్స్ బ్యూరో సాధారణ కార్యకలాపాల్లో భాగంగానే ఆ ఉపన్యాసాలన్నీ రికార్డ్ అయి ఉన్నాయి. అసలు ఆ రికార్డింగ్‌లను ఇంటిలిజెన్స్ బ్యూరో దగ్గర నిల్వ ఉండే రికార్డులలో భద్రపరచవద్దని తీవ్రమైన రాజకీయ ఒత్తిడి వచ్చింది.

అధికారులలో అత్యధికులు ఆ ఒత్తిళ్లకు లొంగిపోగా, సంజీవ్, మరికొందరు ఐబి అధికారులు ఆ ఒత్తిడిని ఎదుర్కొని జాతీయ మైనారిటీ కమిషన్ అడిగిన రికార్డింగ్ లను అందజేశారు.

మోడీ ప్రభుత్వం చెప్పిన మాట విననందుకు సంజీవ్‌నూ మరొక ఇద్దరు ఐబి ఉన్నతాధికారులనూ రాత్రికి రాత్రి బదిలీ చేశారు. బదిలీ చేయడం మాత్రమే కాదు, ''శిక్ష''గా భావించే పదవుల్లో నియమించారు.

ఇదిగో ఇతను పద్ధతి ప్రకారం తన బాధ్యతలు నిర్వర్తించే అధికారి, మోడీ, షాలు ఏమి చెపితే అది గుడ్డిగా అనుసరించి, రాజకీయ ఒత్తిళ్లకు లొంగే అధికారి కాదు అని ఒక ఉదాహరణను సృష్టించారు.

2002 చివరిరోజుల్లో, గుజరాత్ మాజీ హోం మంత్రి హరేన్

పాండ్యా హత్య జరిగింది. జస్టిస్ కృష్ణ అయ్యర్ నాయకత్వంలోని స్వతంత్ర కమిషన్ ఎదుట హరేన్ పాండ్యా గుజరాత్ మారణకాండకు రూపకల్పన చేయడంలో మోడీ పాత్ర గురించి రహస్యంగా వాంగ్మూలం ఇచ్చిన కొన్ని నెలల్లోనే ఆ హత్య జరిగింది.

2003: ఆ సంవత్సరం సంజీవ్‌ను సాబర్మతి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌గా నియమించారు. హరేన్ పాండ్యా హత్య కేసులో ముద్దాయి అయిన అస్గర్ అలీ అనే ఖైదీ అప్పుడు ఆ జైలులోనే ఉన్నాడు. హరేన్ పాండ్యాను చంపినది తుల్సీరాం ప్రజాపతి అనే వ్యక్తి అని అస్గర్ అలీ స్వచ్ఛందంగా ముందుకువచ్చి సమాచారం ఇచ్చాడు. ఆ తుల్సీరాం ప్రజాపతిని 2006లో ఒక బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపారని గుర్తుంచుకోవడం ముఖ్యం.

పద్ధతి ప్రకారం తనకు అందిన సమాచారాన్ని సంజీవ్ వెంటనే అప్పటి గుజరాత్ హోం మంత్రికి (అంటే ఇప్పుడు కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు) తెలియజేశాడు. అస్గర్ అలీ ఇస్తున్న సమాచారం మీద ఆధారపడి కేసును మళ్లీ తెరవాలనీ, హరేన్ పాండ్యా హత్య కేసును మళ్లీ దర్యాప్తు చేయాలనీ రాశాడు. ఈ వ్యవహారానికి సంబంధించిన ఆధారపత్రాలన్నిటినీ ధ్వంసం చేయమని సంజీవ్‌కు పైనుంచి ఆదేశాలు వచ్చాయి.

ఆ పని చేయడానికి సంజీవ్ నిరాకరించాడు. అంత మాత్రమే కాదు, అస్గర్ అలీ చెప్పిన కీలక సమాచారాన్ని, చెప్పిన విషయాలనూ, వాటితో పాటు తనకూ అమిత్ షాకూ మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలనూ కేంద్ర ప్రభుత్వానికి, కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు పంపించాడు.

తన విధ్యుక్త ధర్మాన్ని కచ్చితంగా, నిజాయితీతో నిర్వర్తించినందుకు శిక్షగా సంజీవ్ ను రాత్రికి రాత్రే సాబర్మతి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ పదవి నుంచి బదిలీ చేశారు.

సంజీవ్ ను అలా బదిలీ చేయడం తప్పుడు పద్ధతి అనీ, రాజకీయ దురుద్దేశపూరితమైనదనీ హైకోర్టులో అఫిడవిట్లు దాఖలు చేయడంతోపాటు ఆ జైలులోని వేలాది మంది ఖైదీలు ఆ బదిలీకి నిరసనగా నిరాహార దీక్ష చేశారు. అటువంటి ఘట్టం ఆధునిక భారత చరిత్రలో మొట్టమొదటిసారిగా జరిగింది. ఆ జైలు సూపరింటెండెంట్‌గా సంజీవ్ అనేక జైలు సంస్కరణలు చేపట్టాడు, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశాడు. శిక్ష పడిన ఖైదీలతో, విచారణలో ఉన్న ఖైదీలతో మానవీయంగా ప్రవర్తించాలనీ, వారి మానవ హక్కులను కాపాడాలనీ చర్యలు తీసుకున్నాడు.

ఇద్దరు దుష్ట రాజకీయ నాయకుల దుర్మార్గమైన కోరికలను తిరస్కరించినందుకు, సంజీవ్‌ను వరుసగా ప్రతి అడుగులోనూ “శిక్షా పదవుల”కు బదిలీ చేయడం, పదోన్నతులను అవమానకరంగా ఆలస్యం చేయడం కొనసాగింది.

మోడీ, షాల రాజకీయ ప్రాబల్యం బలపడిన కొద్దీ, తమ దుర్మార్గ కోరికలకు తలఒగ్గని వారిమీద విధించే శిక్షల పద్ధతులూ, సాధనాలూ మరింత ప్రమాదకరమైన కక్ష సాధింపుగా మారాయి.

ఈ పాలకులు గుజరాత్ రాష్ట్ర అధికారులలో భయ భీతావహాన్ని, పద్ధతుల ఉల్లంఘననూ పెంచడానికి ప్రయత్నిస్తున్నకొద్దీ, సంజీవ్ 2002 బాధితులు న్యాయం కోసం చేస్తున్న పోరాటానికి సహాయం అందించడం కొనసాగించాడు. ఆ బాధితులు గుజరాత్ మారణకాండ మీద సక్రమమైన న్యాయవిచారణ జరుగుతుందని 2002 నుంచి 2009 వరకూ వేచి చూస్తూ వచ్చారు.

పదవీ బాధ్యతలలో ఉన్న ఇండియన్ పోలీస్ సర్వీస్ అధికారిగా సంజీవ్ కు చాల సున్నితమైన, అధికారిక సమాచారం చాల తెలుస్తూ ఉండేది. ఆ సమాచారాన్ని బైట పెట్టబోనని ప్రమాణం తీసుకున్నందువల్ల, తనకు తెలిసిన ప్రభుత్వ, రాజ్య సమాచారాన్ని ఆయన తగిన అధికారవేదికలు అడిగితే తప్ప మరెక్కడా బైట పెట్టలేదు. తగిన అధికార వేదిక అంటే ఏదైనా న్యాయస్థానం లేదా న్యాయస్థానం నియమించే కమిటీ.

2009లో గుజరాత్ మారణకాండలో రాజ్యాంగ యంత్రపు పాత్ర గురించి దర్యాప్తు చేయమని న్యాయస్థానం ఒక స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (ఎస్ఐటి) ని నియమించింది.

రాష్ట్ర అధికారులలో చాల మంది ఎస్ఐటి ముందు మాట్లాడుతూ, అప్పుడు జరిగిన సంగతులు తమకు గుర్తు లేవని చెప్పారు. లేదా ఎస్ఐటి ముందు తమ వాంగ్మూలం ఇవ్వడానికి నిరాకరించారు. కాగా, సంజీవ్ భట్ ఒక్కడే ధైర్యంగా ముందుకు వచ్చి, తన ప్రాణానికీ, ఉద్యోగ జీవితానికి ప్రమాదం వచ్చినా సరే అని, ఎస్ఐటి ముందు, నానావతి – మెహతా కమిషన్ ముందు ప్రమాణపూర్వకంగా వాంగ్మూలం ఇచ్చాడు.

2009: గుజరాత్ మారణకాండలో రాజ్యాంగయంత్రపు సానుకూల పాత్ర గురించీ, పనితీరు గురించీ దర్యాప్తు చేస్తున్న ఎస్ఐటి ముందు, నానావతి – మెహతా కమిషన్ ముందు సంజీవ్ వాంగ్మూలం ఇవ్వడం ప్రారంభించాడు.

ఆ వాంగ్మూలాలు 2009 నుంచి 2011 దాకా సాగాయి. ఆయన ఇచ్చిన ప్రకటనలు, ఆయన సమర్పించిన సాక్ష్యాధారాలు వెంటవెంటనే బైటికి పొక్కడం మొదలయింది. ఎస్ఐటి, కమిషన్ ముందు వాంగ్మూలం ఇస్తున్న వ్యక్తుల ప్రకటనలను పూర్తిగా అధికారిక, రహస్య సమాచారంగా చూడాలని, దర్యాప్తు సంస్థకు తప్ప మరెవరికీ అవి అందగూడదని చట్టం చెపుతున్నప్పటికీ, ఏ గుజరాత్ ప్రభుత్వ పాత్ర గురించి విచారణ సాగుతున్నదో, ఆ గుజరాత్ ప్రభుత్వానికే ఆ సమాచారం ఎప్పటికప్పుడు అందుతూ వచ్చింది. అంటే ఆ సమాచారం బైటికి పొక్కేలా చేసిన ఎస్ఐటికీ గుజరాత్ ప్రభుత్వానికీ మిలాఖత్తు ఉందని తేటతెల్లమయింది.

ఈ కమిషన్‌ల ముందు సంజీవ్ మాట్లాడగూడదని నిరుత్సాహ పరచడానికి, బెదిరించడానికి రాష్ట్ర ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు లెక్కలేనన్ని ప్రయత్నాలు చేశారు. రాజకీయ యజమానుల కోరిక మేరకే ఆ ఉన్నతాధికారులు ఆ పని చేసి ఉంటారు. కాని సంజీవ్ మాత్రం క్రమం తప్పకుండా, ధైర్యంగా తన వాంగ్మూలాలు ఇస్తూ వెళ్లాడు. తన వ్యక్తిగత, ఉద్యోగపర మూల్యం చెల్లించడానికైనా సిద్ధపడి 2002 హింసాకారకుల మీద న్యాయపరమైన శిక్షలు పడాలని

కోరుకున్నాడు.

2011: అప్పటికే కొనసాగుతున్న వాంగ్మూలాలలో భాగంగా, సంజీవ్ సుప్రీం కోర్టులోనూ, జాతీయ మైనారిటీల కమిషన్ ముందూ. ఒక సమగ్రమైన, ప్రమాణపూర్వకమైన వాంగ్మూలం సమర్పించాడు. ఆ వాంగ్మూలంలో గుజరాత్ మారణకాండలో రాష్ట్ర ప్రభుత్వంలోని అత్యున్నత అధికారుల పాత్ర, పనితీరు గురించీ, అప్పటికి గుజరాత్ రాష్ట్ర హోం మంత్రి అయిన హరేన్ పాండ్యా హత్య గురించీ, అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రిని "పరిరక్షించడం" కోసం అనే పేరుతో రాష్ట్రంలో జరిగిన ఎన్నో చట్టాతీత హత్యల గురించీ, బూటకపు ఎన్ కౌంటర్ల గురించీ సవివరంగా రాశాడు.

నరేంద్ర మోడీ పాత్ర గురించి వివరిస్తూ సుప్రీం కోర్టులో ఆ అఫిడవిట్ దాఖలు చేసిన వెంటనే సంజీవ్ ను ఉద్యోగం నుంచి సస్పెండ్ చేశారు.

2002 నుంచీ సంజీవ్ మీద కక్ష సాధింపు చర్యలు సాగుతున్నప్పటికీ, 2011 తర్వాత అవి మరింతగా పెచ్చుమీరాయి.

సంజీవ్‌తో పాటు, మా కుటుంబం కూడ ప్రస్తుత పాలకుల నుంచీ, మతవాద శక్తుల నుంచీ లెక్కలేనన్ని బెదిరింపులను ఎదుర్కొన్నాం. సంజీవ్ నోరు నొక్కడానికీ, ఆయన నిశ్చయాన్ని భంగపరచడానికీ చేసే ప్రయత్నాల్లో భాగంగా ప్రస్తుత పాలకులు ఉపయోగిస్తున్న ప్రధాన సాధనం న్యాయవ్యవస్థ నుంచి వేధింపులు.

ఆ వేధింపులు క్రమక్రమంగా పెరిగిపోతూ వచ్చాయి. మోడీ అధికార ప్రాబల్యం పెరుగుతున్న కొద్దీ అవి మరింత దూకుడుగా, ప్రమాదకరంగా మారాయి.

సత్యం మాట్లాడడానికి సాహసిస్తే, తక్షణ ఫలితమేమంటే సంజీవ్ మీద ముప్పై ఏళ్ల కిందటి రెండు పాత కేసులను దురుద్దేశాలతో తవ్వి తీయడం. వాటితో పాటే సంజీవ్‌పై అక్రమంగా సస్పెన్షన్ విధించడం. ఆ రెండు పాత కేసుల గురించి తెలుసుకోవడం ముఖ్యం. వాటిలో ఒకటి 1990 నాటిది, రెండోది 1996 నాటిది. ఆ రెండు కేసులనూ ప్రస్తుత ప్రభుత్వం సంజీవ్ ను వేటాడడానికి, తప్పుడు పద్ధతుల్లో ఇరికించడానికి, జైలుకు పంపడానికి వాడుకుంటున్నది. అయితే ఆ రెండు కేసుల మీదా అప్పుడే సంపూర్ణమైన దర్యాప్తు జరిగింది. ఇరవై ఏళ్ల కిందనే వాటి మీద అత్యున్నత న్యాయస్థానం స్టే ఇచ్చింది. తన అధికారులను కాపాడుతూ 1996లోనే గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం రివిజన్ పిటిషన్ వేసింది. కాని హఠాత్తుగా, 2011లో, సంజీవ్ సుప్రీంకోర్టులో మోడీకి వ్యతిరేకంగా ప్రమాణపూర్వకమైన అఫిడవిట్ దాఖలు చేయగానే, గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం తన 1996 పిటిషన్ నుంచి తలకిందులుగా వాదించింది. ఆ రివిజన్ పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నానని 16 సంవత్సరాల తర్వాత సుప్రీం కోర్టుకు చెప్పడం పూర్తిగా దురుద్దేశంతో కూడినదే.

రాష్ట్ర ప్రభుత్వానికి సంజీవ్‌ను సస్పెండ్ చేయడానికి అధికారం ఉంది గాని, ఆ తర్వాత చర్యలు తీసుకోవడానికి అధికార పరిధి లేదు. ఎందుకంటే ఐపిఎస్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కారు, వారు కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి అరువు మీద వచ్చే ఇండియన్ పోలీస్ సర్వీస్ అధికారులు. వారి మీద చర్యలు తీసుకోవడానికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు మాత్రమే అధికారమూ శక్తీ ఉన్నాయి.

అందువల్ల సంజీవ్ సత్య స్వరాన్ని నొక్కడానికి, తద్వారా ఒక బలమైన ఉదాహరణను చూపడానికి రాష్ట్రప్రభుత్వం ఆ సమయానికి తన చేతిలో ఉన్నదంతా చేసింది. అంటే సస్పెండ్ చేసింది.

2014: భారత ప్రధాన మంత్రిగా నరేంద్ర మోడీ అధికారం చేపట్టాడు. ఇప్పుడిక ఆయనకు హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ మీద అధికారం వచ్చింది.

2015: మోడీ ప్రధాన మంత్రి అయిన కొద్ది రోజుల్లోనే సంజీవ్‌ను పదవీ బాధ్యతల నుంచి పూర్తిగా తొలగించారు. అందుకు వారు చూపినది "అనుమతి లేకుండా గైరుహాజరు కావడం" అనే హాస్యాస్పదమైన కారణం. ఆయన గైరుహాజరు అయ్యారని చెపుతున్న కాలంలో ఆయన గుజరాత్ మారణకాండలో రాజ్యాంగ యంత్రం పాత్ర, పనితీరుల గురించి దర్యాప్తు చేస్తున్న ఎస్ఐటి ముందర, నానావతి – మెహతా కమిషన్ ముందర హాజరై వాంగ్మూలం ఇవ్వడం తన న్యాయపరమైన, నైతికమైన బాధ్యత అనీ, విధ్యుక్త ధర్మమనీ అనుకున్నాడు.

సంజీవ్ ను శిక్షించడం కేవలం 2002 గుజరాత్ మారణకాండలో కొందరు అత్యున్నతాధికారం గలవాళ్ల పాత్ర గురించీ పని తీరు గురించీ భయానకమైన సత్యాన్ని బైటికి తీసుకువచ్చే ధైర్యం చేశాడని మాత్రమే కాదు, ఏ రాష్ట్ర ప్రభుత్వపు చర్యలను దర్యాప్తు చేయడానికి ఎస్ఐటి నియామకం జరిగిందో ఆ రాష్ట్ర ప్రభుత్వం తోనే ఆ ఎస్ఐటి చేతులు కలిపిందనే వాస్తవాన్ని వెలికి తేవడానికి ప్రయత్నించినందుకు కూడ.

2015–2018: కక్షపూరిత వేధింపు కొనసాగింది.

2018: మోడీకి పాత్రలేదని చెల్లు చీటీ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ శ్రీమతి జకియా జాఫ్రీ సుప్రీం కోర్టులో ఒక అఫిడవిట్ దాఖలు చేశారు. 2002 మారణకాండలో మోడీ, ఆయన ప్రభుత్వం నిర్వహించిన పాత్ర గురించి, పని తీరు గురించి మళ్లీ దర్యాప్తు జరిపించాలని అత్యున్నత న్యాయస్థానాన్ని అభ్యర్థించారు.

2002 మారణకాండలో రాజ్యపు సానుకూల పాత్ర, పనితీరుల గురించి ప్రధాన సాక్షి సంజీవే.

ఒక పక్క శ్రీమతి జాఫ్రీ అభ్యర్థనను వినడానికి సుప్రీం కోర్టు ఆలస్యం చేస్తూ, విచారణను వాయిదా వేస్తూ వచ్చింది. మరొక పక్క, సంజీవ్ కేసులో మాత్రం అత్యంత వేగంగా తప్పుడు ఆరోపణలు తయారు చేశారు, చౌకబారు కారణాలతో ఆయనను అరెస్టు చేశారు. అంటే 2002 గుజరాత్ మారణకాండలో మోడీ పాత్ర గురించి ప్రత్యక్షంగా చెప్పగల ఏకైక ప్రధాన సాక్షి నోరు నొక్కడానికి, ఆయన విశ్వసనీయతను దెబ్బతీయడానికి ప్రయత్నించారు.

2018 జూలై: ఎటువంటి ముందస్తు హెచ్చరిక, వివరణ లేకుండా అకస్మాత్తుగా సంజీవ్ భద్రతా సిబ్బందిని తొలగించారు. నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా సంజీవ్ వాంగ్మూలం ఇచ్చిన తర్వాత సుప్రీం కోర్టు

సంజీవ్‌కు, మా కుటుంబ సభ్యులకు రాగల ప్రమాదాన్ని అంచనా వేసి ఆయనకు తక్షణమే వై–కాటగరీ భద్రత కల్పించాలని గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిందని చెప్పడం ఇక్కడ ముఖ్యం. అయితే సుప్రీం కోర్టు ఆదేశాలను బహిరంగంగా ఉల్లంఘిస్తూ, గుజరాత్ పోలీసులు ఆ భద్రతా వలయం ఏర్పాటు చేయనేలేదు. తమకు అంత మానవ వనరులు లేవని, మౌలిక సౌకర్యాలు లేవని అన్నారు. అందుకు బదులుగా కనీసమైన భద్రత, అంటే ఇద్దరు జవాన్లను మాత్రం, కల్పించారు. ఈ కనీస భద్రతను కూడ ఎటువంటి ముందస్తు హెచ్చరిక, వివరణ లేకుండా అకస్మాత్తుగా 2018 జూలైలో తొలగించారు.

2018 ఆగస్ట్: సంజీవ్ భద్రతా సిబ్బందిని అకస్మాత్తుగా తొలగించిన కొద్ది రోజులకే, మునిసిపల్ కార్పొరేషన్ చట్టవ్యతిరేకంగా మా ఇంట్లోకి జొరబడి, మా ఇంట్లో గణనీయమైన ప్రాంతాన్ని కూల్చివేసింది. అది “అక్రమ” నిర్మాణమని తప్పుడు కారణం చెప్పారు. కాని ఆ ఇంట్లోనే మేం గత 23 సంవత్సరాలుగా ఉంటున్నాం.

2018 సెప్టెంబర్ 5: రెండు దశాబ్దాల వెనుకటి కేసు గురించి ప్రశ్నించడానికనే సాకుతో సంజీవ్‌ను తెల్లవారు జామున తీసుకుపోయారు. ఆ కేసులో అంతకు ముందే పూర్తి దర్యాప్తు జరిగింది, న్యాయస్థానాలు ఇరవై ఏళ్ల కిందనే స్టే ఇచ్చి ఉన్నాయి. ఆ కేసులో ప్రశ్నించడానికని తీసుకుపోయి, ఆ తర్వాత కారణమేదీ చూపకుండానే, సరైన పత్రాలు లేకుండానే ఆయనను అరెస్టు చేసినట్టు చూపారు.

సెప్టెంబర్ 2018 తర్వాత: న్యాయస్థానంలో కాలయాపన సాగించడానికి, చట్టబద్ధ విచారణను తలకిందులు చేయడానికి ఈ ప్రభుత్వం చెయ్యని ప్రయత్నం లేదు. అతి తేలికపాటి కారణాలతో సంజీవ్‌కు బెయిల్ నిరాకరించారు. అంతేకాదు, మొత్తంగా న్యాయవ్యవస్థనే తలకిందులు చేస్తూ న్యాయమైన విచారణ తిరస్కరించారు. ఆయన ఎన్నడూ చేయని ఒక నేరంలో తప్పుడుగా ఇరికించారు.

2019 జూన్ 20: న్యాయస్థానాల ద్వారా వేధింపు అనే బెదిరింపు సాధనాన్ని వాడుతున్నారు. ప్రభుత్వం సంజీవ్‌ను ఇరవై సంవత్సరాల కిందటి కేసులో ఇరికించి ఆయన దాని చుట్టూ తిరిగేలా చేసింది. కాని ఆకేసు కేవలం ఊహాజనితమైనది. ఏ ఒక్క సాక్ష్యాధారమూ లేనిది. న్యాయ భావనను సంపూర్ణంగా ధ్వంసం చేసేది. ఒకవైపు ఈ పని చేస్తూనే, మరొక వైపు ఒక 30 సంవత్సరాల అక్రమ కేసును తవ్వి తీసి అత్యంత వేగవంతంగా విచారణ జరిపారు. ఆ కేసులో కూడ ఇసుక రేణువంత సాక్ష్యాధారం లేదు. కాని సంజీవ్ కు తన తరఫున సాక్షులను పిలిపించుకునే అవకాశం కూడ ఇవ్వలేదు.

పూర్తిగా తలకిందులుగా సాగిన న్యాయప్రక్రియలో సంజీవ్‌ను తప్పుగా ఇరికించి ఆయన ఎన్నడూ చేయని నేరానికి ఆయనకు యావజ్జీవ శిక్ష విధించారు. ఆయన చేసిన నేరం ఒకే ఒక్కటి – రాజకీయ ఒత్తిడికి లొంగకపోవడం. సత్యం కోసం ధైర్యంగా నిలబడడం. ఫాసిస్టు పాలనలో బాధితులైన వేలాది మందికి న్యాయం జరగాలని పోరాడడం.

మత కల్లోలాల సంక్షుభిత వాతావరణంలో కేవలం తన విధ్యుక్త ధర్మానికి ఆదర్శవంతంగా, ఉదాహరణ ప్రాయంగా కట్టుబడిన, సంపూర్ణంగా నిరపరాధి అయిన ఒక వ్యక్తి మీద కక్షసాధింపు విచారణకు ఇంతకన్న కొట్టవచ్చినట్టు చెప్పగల ఉదాహరణ మరొకటి ఉండదు.

తమ గళం విప్పి, ఈ దుర్మార్గ ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి సాహసిస్తున్న ఆదర్శవంతులైన స్త్రీలనూ పురుషులనూ ఉదాహరణగా చూపి ప్రజలను భయపెట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

సంజీవ్ ప్రాతినిధ్యం వహించిన సత్యం, నిజాయితీ, నిశ్చయం ఈ ఫాసిస్టు పాలకులకు కొరకరాని కొయ్యలుగా మారాయి. దేశంలో అత్యంత శక్తిమంతమైన అధికార స్థానాలు ఆక్రమించి కూడ, వారు నిజాయితీ గల, సత్యశీలత గల ఒక అధికారి నోరు నొక్కడానికి, ఆ గళం ఎప్పటికీ వినిపించకుండా చేయడానికి, ఆయన చెప్పే సత్యం బైటికి రాకుండా ఉండడానికి ఏ ఒక్క ప్రయత్నాన్నీ వదిలిపెట్టడం లేదు.

అసాధారణమైన ఒత్తిడిలో, ప్రమాదంలో కూడ సంజీవ్ ఎన్నడూ వెనుకడుగు వేయలేదు, యుద్ధరంగాన్ని వదిలిపెట్టలేదు.

ఆయన తలచుకుంటే మరొక రాష్ట్రానికి బదిలీ సాధించి ఉండేవాడే, తన ఇంట్లో, మాతో, కుటుంబ సభ్యులతో అన్ని సౌఖ్యాలూ అనుభవిస్తూ సుఖంగా ఉండేవాడే. కాని అందుకు బదులుగా, అత్యంత తీవ్రమైన వ్యక్తిగత, ఉద్యోగ ప్రమాదాలను కూడ కొనితెచ్చుకుని ఆయన స్థిరంగా నిలబడి ఉండడానికే ఎంచుకున్నాడు. ద్వేషకారకులనూ, హింసాకారకులనూ ఎదిరించే పోరాటాన్ని కొనసాగించదలిచాడు. గుజరాత్ మారణకాండలో బాధితులైన వేలాది మంది వేదనకు ముగింపు పలకాలనీ, న్యాయం సాధించాలనీ ప్రయత్నించాడు.

ఇప్పుడు 2022లో ఉన్నాం. శ్రీమతి జాఫ్రీ కేసు సుప్రీం కోర్టు ముందర ఇంకా ఎదురుచూస్తూనే ఉంది.

ఈ ప్రభుత్వం అక్రమంగా సంజీవ్‌ను నిర్బంధించి ఇవాళ్టికి మూడు సంవత్సరాల, ఐదు నెలల, ఇరవై రోజులు, 1269 రోజులు.

న్యాయం కోసం మా అన్వేషణ కొనసాగుతూనే ఉన్నది.

సంజీవ్ చేసిన మహత్తర త్యాగాల మంచుకొండ అంచుల ఛాయలను నాతో పాటు మీరు నడిచిన ఈ తలపుల తోవలో మీ దృష్టికి తేగలిగాననుకుంటున్నాను. సంజీవ్ ఆ త్యాగాలు చేసిన ఆశయం ఏ ఒక్క వ్యక్తి కన్నా మహత్తరమైనది.

సంజీవ్ నాకు తెలిసినవారందరిలోనూ అత్యంత సాహసికుడైన, శక్తిమంతుడైన మనిషి. ఈ ద్వేష, హింసా కారకులను న్యాయం ఎదుటికి తేవాలని ఆయన చేస్తున్న పోరాటం కొనసాగుతూనే ఉంటుంది. ఆయన కుటుంబ సభ్యులుగా మేం ఆయనకు సంఘీభావం ప్రకటించే లక్షలాది మంది శ్రేయోభిలాషులతో కలిసి స్థిరంగా ఆయన నిశ్చయంతో నిలిచే ఉంటాం.

మా ఒంటి నిండా నెత్తుటి గాయాలుండవచ్చు. మేం క్షతగాత్రులమై ఉండవచ్చు. మేం దెబ్బలు తిని ఉండవచ్చు. కాని మేమింకా విరిగిపోకుండా, తల వంచకుండా, చెదిరిపోకుండా నిలిచే ఉన్నాం.

(తెలుగు: ఎన్ వేణుగోపాల్) వీ

మన కాలపు సామ్రాజ్యవాదం: యుక్రెయిన్‌పై రష్యా యుద్ధం

వర్తమాన సామ్రాజ్యవాదానికి ఉన్న లక్షణాల నేపథ్యంలోనే యుక్రెయిన్‌పై రష్యా యుద్ధాన్ని అర్థం చేసుకోవలసి ఉంటుందని అంటున్నారు **శుభం శర్మ**

యుక్రెయిన్‌పై రష్యా దురాక్రమణను ఒక సామ్రాజ్యవాద దాడిగా, యుక్రెయిన్‌కున్న స్వయంనిర్ణయాధికార హక్కును ప్రత్యక్షంగా కట్టడి చేసే చర్యగా అభివర్ణించవచ్చును. తన చర్యలను సమర్థించుకోవడానికి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రెండు వాదనలు చేస్తున్నాడు. ఒకటి, యుక్రెయిన్ ఒక 'బోగస్' దేశం. అది అఖండ రష్యాలో భాగంగా వుండవలసింది. ఇది అతడి దురహంకారానికి నిదర్శనం. సోవియట్ యూనియన్ ప్రభుత్వాధినేతగా వ్లాదిమిర్ లెనిన్ ఉన్నప్పుడు బోల్షివిక్‌లు జాతీయ స్వయం నిర్ణయాధికారం అనే లోప భూయిష్టమైన ఊహాలోకాల్లో మునిగి వుండడమే దీనికి కారణమని ఆయన నిందిస్తున్నాడు. రెండు, రష్యా సరిహద్దులకు సమీపంగా నాటో దేశాల అప్రతిహత పురోగతి, రష్యాను ఆ దేశాలు సైనికపరంగా చుట్టుముడతాయనే ఆందోళనను పుతిన్‌లో కలిగించాయి. ఇది వాస్తవం.

భగ్న ఒడంబడికల చరిత్ర :

సోవియట్ యూనియన్ పతనమైన తరవాత, అప్పటివరకు రహస్యంగా వున్న కొన్ని డాక్యుమెంట్లు బహిరంగమయ్యాయి. అప్పటి అమెరికా విదేశాంగమంత్రి జేమ్స్ బేకర్, అప్పటి సోవియట్ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి మైఖేల్ గోర్బచేవ్‌కు నాటో తూర్పు దిశగా వ్యాప్తి చెందదని వాగ్దానం చేసినట్టుగా ఆ పత్రాల్లో తెలుస్తోంది. ఫిబ్రవరి 9, 1990 తేదీ గల ఒక నోట్‌లో సూటిగా ఇలా వుంది. "తూర్పువైపు ఒక్క అంగుళం కూడా" జరిగేది లేదు. 1989 డిసెంబర్‌లో అమెరికా అధ్యక్షుడు డబ్ల్యు. బుష్, గోర్బచేవ్‌ల మాల్టా శిఖరాగ్ర సమావేశం జరిగింది. తూర్పు ఐరోపా రాజ్యాలలో జరుగుతోన్న తిరుగుబాట్లను రష్యా భద్రతకు ప్రమాదం కలిగించే రీతిలో అమెరికా ఉపయోగించుకోదని బుష్ వాగ్దానం చేశాడు. ప్రసిద్ధి చెందిన 1990 బాన్ కేబుల్ కూడా, అప్పటి పశ్చిమ జర్మనీ విదేశాంగమంత్రి వ్యూహాత్మక ఆలోచనను పునరుద్ఘాటించింది. నాటో వ్యాప్తి 'సోవియట్ భద్రతా ప్రయోజనాలను బలహీనపరిచేదిగా వుండకూడదని' ఆయన అభిప్రాయపడ్డాడు.

ఇవన్నీ ఇలా వున్నప్పటికీ, నాటో సామ్రాజ్యవాదం తన పరిధిని పెంచుకొనే క్రమంలో ఇంతకుముందు సోవియట్ యూనియన్‌లో భాగంగా వున్న రిపబ్లిక్‌లను తన పరిధిలోకి తెచ్చుకున్నది. నాటో కొనసాగిస్తున్న ఈ సామ్రాజ్యవాద విస్తరణను సమర్థిస్తూ అప్పటి బ్రిటిష్ ప్రధాని మార్గరెట్ థాచర్ ఇలా అన్నారు. "గత 12 నెలల కాలంలో మీరుంటున్న సందులో దొంగతనాలు తగ్గాయి కాబట్టి మీరు మీ ఇంటి భద్రతకోసం చేయించుకున్న ఇన్సూరెన్స్ పాలసీని రద్దు చేయించుకోరు కదా". 'ఐరోపాలో వ్యూహాత్మక సమతుల్యతను కాపాడుకోవడం' నాటో కూటమికి ప్రధాన లక్ష్యం అయింది. సైనిక స్నేహంగా ప్రారంభమైన ఆ కూటమి క్రమంగా ఒకే రకమైన విలువలను పంచుకుంటున్న ట్రాన్స్ అట్లాంటిక్ రాజ్యాల వ్యవస్థాగత వ్యక్తీకరణగా అభివృద్ధి చెందింది.

2019లో యుక్రెయిన్ నాటోలో సభ్యత్వాన్ని తన రాజ్యాంగంలో రాసుకుని తప్పుచేసింది. ఇది రష్యాకు కోపం తెప్పించింది. దీనికంటే ముందు 2017లో ప్రైమరీ పాఠశాల స్థాయివరకు కేవలం యుక్రేనియన్ భాషలోనే విద్యాబోధన జరగాలని మరొక చట్టాన్ని కూడా వాళ్లు చేశారు. నిజానికి యుక్రేనియన్ పౌరులలో 30 శాతం మందికి రష్యన్ సొంత భాష అయినప్పటికీ, యుక్రెయిన్‌లోని తీవ్ర జాతీయవాద సెంటిమెంట్లను సంతృప్తిపరచడానికే వాళ్లు ఆ చట్టం చేశారు. దీని కారణంగా యుక్రెయిన్‌లో నివసిస్తున్న రష్యన్ జాతి ప్రజల్లో రష్యన్ దురహంకారం తలెత్తింది. వాళ్లతో పాటు హంగేరియన్లు, యూదులు, తార్తార్లు వంటి ఇతర మైనారిటీ జాతులకు కూడా ఈ చట్టం కోపం తెప్పించింది. తన దేశంలోని డాన్స్క్, లుహాన్స్క్ ప్రాంతాలకు మరింత స్వయం ప్రతిపత్తిని కలిగించాలనే 2015 మిన్స్క్ ఒడంబడికను అమలుపరచడంలో కూడా యుక్రెయిన్ విఫలమైంది.

రష్యా దురాక్రమణ గురించి యుక్రెయిన్ ప్రభుత్వానికి ఇంతకు ముందే స్పష్టమైన అంచనా ఉన్నది. ఎందుకంటే, 2008లో జార్జియా నాటోలో చేరకుండా నిరోధించడానికి పుతిన్, జార్జియాలోని అఖాజియా, దక్షిణ వొస్సెటియా అనే రెండు ప్రాంతాలలో జరుగుతోన్న వేర్పాటు ఉద్యమాలకు మద్ధతుగా దురాక్రమణను నిర్దేశించాడు. ఆ రెండు ప్రాంతాలను స్వతంత్ర దేశాలుగా ప్రకటించుకోమని రెచ్చగొట్టాడు. పుతిన్ 2014లో యుక్రెయిన్ నుండి క్రిమియాను బలవంతంగా స్వాధీనం చేసుకొన్నాడు. ఇది 1994లో యుక్రెయిన్‌కు ఇచ్చిన బుడాపెస్ట్ భద్రతా వాగ్దానాల ఉల్లంఘన. ఆ అంగీకారం ప్రకారం యుక్రెయిన్ తన ఆధీనంలో ఉన్న 1900 వ్యూహాత్మక అణ్వాయుధాలను వదులుకున్నది. దానికి బదులుగా రష్యా, అమెరికా, బ్రిటన్‌లు "యుక్రెయిన్ స్వాతంత్ర్యాన్ని, సార్వభౌమాధికారాన్ని, సరిహద్దుల్ని గౌరవిస్తామని" అంగీకరించాయి. దానికి వ్యతిరేకంగా "బలప్రయోగాన్ని చేయబోమని" కూడా ప్రకటించాయి. ప్రస్తుతం జరుగుతున్న దురాక్రమణలో జోక్యం చేసుకోవడానికి నిరాకరిస్తున్న అమెరికా బుడాపెస్ట్ అంగీకారం రాజకీయమైనదేగాని, న్యాయబద్ధమైనది గాని వాదిస్తూ తనపై వస్తున్న విమర్శలను తప్పించుకుంటున్నది.

ద్రవ్యపెట్టుబడి పాత్ర :

బోరిస్ ఎల్ట్సిన్ పాత సోవియట్ రిపబ్లిక్‌లలో జోక్యం చేసుకోననే సూత్రాన్ని బహిరంగంగా ప్రకటించాడు. పుతిన్– బోరిస్ ఎల్ట్సిన్ కాదు. అంతేకాదు సోవియట్ యూనియన్, బోల్షివిక్‌ల ఆదర్శాలను ఎత్తిపట్టే వ్యక్తీ కాదు. జార్ పాలన అంతమైన తరవాత రష్యా, యుక్రెయిన్‌కు స్వయం నిర్ణయాధికారపు హక్కును ఇచ్చినందుకు లెనిన్‌ను నిందించడం

జార్ చక్రవర్తుల సామ్రాజ్యవాద తత్వాన్ని గుర్తుకు తెస్తున్నది. అమెరికాతో, యూరోపియన్ యూనియన్‌తో పోల్చుకుంటే రష్యా ఆర్థికంగా బలహీనంగా వుందికాబట్టి దాన్ని ఒక సామ్రాజ్యవాద శక్తిగా ఊహించుకోవడానికి అవకాశమే లేదు. ఒకప్పుడు సోవియట్ యూనియన్‌లో భాగంగా వున్న ప్రాంతాలతో సహా మరెక్కడా అది సామ్రాజ్యవాద శక్తిగా అవతరించాలనే ఆలోచన ఆచరణ రూపం ధరించే అవకాశం కూడా లేదు. అమెరికా నాయకత్వంలోని నాటో సామ్రాజ్యవాద విస్తరణ పుతిన్‌లో ఇలాంటి సామ్రాజ్యవాదపు ఆలోచనలకు ఇంధనాన్ని సమకూర్చింది.

వర్తమాన సామ్రాజ్యవాద స్వభావం గురించి ఈ మధ్యకాలంలో విస్తృతమైన సాహిత్యం వెలువడింది. మార్క్సిస్టు అర్థశాస్త్రవేత్తలయిన ప్రభాత్, ఉత్సా పట్నాయక్‌ల 'సామ్రాజ్యవాదం గురించి ఒక సూత్రీకరణ' (2017) వీటిల్లో ప్రధానమైనది. వాళ్లు ఆదాయాల తరుగుదల పైన దృష్టి కేంద్రీకరించారు. సమశీతోష్ణ దేశాల అభివృద్ధి చెందిన ఆర్థికవ్యవస్థలు, ఉష్ణమండల దేశాలలో దొరికే సరుకులను పెద్ద మొత్తంలో కొనుగోలు చేయడం ద్వారా ఉష్ణమండల ప్రాంతాలలోని దేశాల ఆదాయాలలో తరుగుదలను కలిగిస్తున్నారు. ఈ వస్తువులేవీ సమశీతోష్ణ దేశాలలో ఉత్పత్తి కావు. అదే సమయంలో అవి వారి జీవికకు అత్యంత అవసరమైనవి. పట్నాయక్‌లు తమ వాదనలో 19వ శతాబ్దపు చివర భాగంలోనూ, 20వ శతాబ్దపు తొలి అర్థభాగంలోను ఆవిష్కృతమైన సామ్రాజ్యవాదానికున్న భూభౌగోళిక రాజకీయ స్వభావాన్ని తక్కువచేసి చూపారు. ఆ కాలంలో ప్రతి జాతి రాజ్యం 'జాతి' ద్రవ్య ప్రయోజనానికి ప్రాతినిధ్యం వహించింది. ఆ రాజ్యాలు 'సామ్రాజ్యవాద–పెట్టుబడిదారీ అంతర్ శత్రుత్వాల' పోటీలో నిమగ్నమై ఉండేవి. జాతులను, సరిహద్దులను గుర్తించని ద్రవ్యపెట్టుబడికి వుండే 'అంతర్జాతీయ' స్వభావం కారణంగా మనం అంతర్ సామ్రాజ్యవాద శత్రుత్వానికి, యుద్ధానికి ముగింపు పలికే శకంలోకి ప్రవేశించామని కూడా వాళ్లు ఊహించారు.

మరి, ఒక పెద్ద యుద్ధంగా లేదా అమెరికా రష్యాల మధ్య అణు విస్ఫోటనాలకు దారితీసే అవకాశం ఉన్నట్లుగా కనపడుతున్న ప్రస్తుత సంక్షోభం పట్నాయక్‌ల ఈ ప్రతిపాదనలకు భిన్నంగా లేదా? అవును, కాదు అని సమాధానం.

అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి చేతిలో ప్రధాన సాధనమైన అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) పోషిస్తున్న పాత్ర, అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడికి వుండే సామ్రాజ్యవాద స్వభావం గురించి పట్నాయక్‌ల వాదాన్ని బలపరుస్తోంది. యుక్రెయిన్‌లో అధికారం నుంచి తొలగించబడ్డ అధ్యక్షుడు విక్టర్ యానుకోవిచ్ ఐరోపా యూనియన్‌తో వాణిజ్యపరంగా తన దేశాన్ని కలిపివేయడానికి ఐఎంఎఫ్‌తో చర్చలు ప్రారంభించాడు. అయితే ఆ సంస్థ, ఆ ప్రభుత్వం అనేక పొదుపు చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేసింది. అందుకు యానుకోవిచ్ సిద్ధంగా లేడు. అతడు రష్యావైపు చూడడం మొదలుపెట్టాడు. దీని ఫలితంగా ఆ దేశంలోని అతిమితవాద శక్తులకు అమెరికా సహాయం చేసి 'మైదాన్' తిరుగుబాటులో అతడిని 2014లో పదవి నుండి బలవంతంగా దించివేసింది. అతని స్థానంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఐఎంఎఫ్ కుటిల డిమాండ్లకు తలొగ్గి 17.5 బిలియన్ డాలర్ల అప్పును తీసుకున్నది. దీని ఫలితంగా ఆ దేశ పౌరులకు ఇస్తున్న గ్యాస్ సబ్సిడీలో సగానికి పైగా కోత విధించాల్సి వచ్చింది. సాధారణ యుక్రెయిన్ ప్రజలు ఇక్కట్ల పాలయ్యారు.

రష్యా దురాక్రమణకు స్పందిస్తూ ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరక్టర్ యుక్రెయిన్‌కు 1.4 బిలియన్ డాలర్ల అత్యవసర నిధిని తప్పకుండా ఇస్తానని ప్రకటించాడు. ఇంతకు ముందు, గత డిసెంబర్ నెలలో ఇచ్చిన 700 మిలియన్ అమెరికన్ డాలర్లకు ఇది అదనం. యుద్ధం అంతమయ్యాక యుక్రెయిన్ తన దేశంలో దొరికే ప్రధాన ఖనిజమైన సహజవాయువును మెట్రోపాలిటన్ (అభివృద్ధి చెందిన) రాజ్యాలకు అమ్ముకోవడం ద్వారా ఈ అప్పును తీర్చాల్సి వుంటుంది. రష్యా 2014 ఫిబ్రవరిలో క్రిమియాపై ఆక్రమణ యుద్ధం ప్రారంభించిన సందర్భంలో కూడా, అమెరికా, యూరోపియన్ యూనియన్‌లు రష్యా ఆర్థిక లావాదేవాలపై విధించిన ఆంక్షల నుండి లండన్ నగరాన్ని మినహాయించాలని బ్రిటన్ పట్టుబట్టటం అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి శక్తి గురించి పట్నాయక్‌ల వాదనలకు బలం చేకూరుస్తుంది.

పట్నాయక్‌ల వాదనలో ఉన్న ఖాళీలు భూభౌగోళిక రాజకీయ పార్శ్వంలో వెల్లడి అవుతున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలో, రాజ్యం పెట్టుబడి చేతుల్లో ఒక పనిముట్టు కాకపోయినప్పటికి, ఆ వ్యవస్థ సజావుగా సాగడంలో దాని పాత్ర అతి ప్రధానం. పెట్టుబడిదారీ రాజ్యం అంతర్జాతీయ వాణిజ్యానికి, సరిహద్దులకు అతీతంగా పెట్టుబడుల చలనానికి సంబంధించిన షరతులను నిర్ణయిస్తున్న వర్తమాన కాలానికి కూడా ఇది వర్తిస్తుంది. తనకు అనుకూలంగాలేని రాజ్యాల నుండి అతి ముఖ్యమైన సరుకులను కొనుగోలు చేయకుండా మిత్ర రాజ్యాలను ఆకర్షించడానికి పెట్టుబడిదారీ దేశం ప్రయత్నిస్తుంది. ఉదాహరణకు, రష్యా యుక్రెయిన్‌లో ముందుకు సాగుతున్న దృష్ట్యా జర్మనీకి అతి ముఖ్యమైన నార్డ్ స్ట్రీమ్ II పైప్‌లైన్ పథకాన్ని నిలిపివేయాలని అమెరికా వత్తిడిచేస్తోంది. ఆ పైప్‌లైన్ జర్మనీకి ఎంతో అవసరమైంది. ప్రారంభంలో అమెరికా వత్తిడిని ఒకమేరకు తట్టుకున్న జర్మనీ అంతిమంగా దానికి లొంగిపోయి ఆ పథకాన్ని ఆపివేస్తున్నట్టుగా పోయిన మాసంలో ప్రకటించింది. గత సంవత్సరం నుంచి అమెరికా సహజవాయువును ఉత్పత్తి చేస్తూ ఐరోపా దేశాలకు అమ్ముతూ వుండడం దీనికి కారణం. ఇప్పటికే చైనా, జపాన్, దక్షిణకొరియాలు ఆ సహజవాయువును పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తున్నాయి. అంతేగాక అమెరికా తన సహజవాయువు మార్కెట్‌ను విస్తరించుకోవడానికి శతవిధాల ప్రయత్నిస్తోంది. అయితే ఈ అంశంలో అమెరికా ఏ మేరకు రిస్క్ తీసుకుంటుందనేది ఈ సంక్షోభం పెరిగేదాన్ని బట్టిగాని అర్థం కాదు.

రెండవది, ద్రవ్యపెట్టుబడి సామ్రాజ్యవాదం ఏక ముఖంగా అమలుపరుస్తున్న పథకంలో వివరించబడకుండా మిగిలిన అంశం నానాటికీ పెరుగుతున్న ఆయుధాల మార్కెట్. మామూలు మాటల్లో చెప్పాలంటే ద్రవ్యపెట్టుబడి చలనం గురించి దేశాలు పరస్పరం ఘర్షణ పడకపోతే, అవి అణు, సాంప్రదాయక ఆయుధాలను ఎందుకు పెద్ద ఎత్తున కూడబెట్టుతున్నట్లు? సైనిక– పారిశ్రామిక కాంప్లెక్స్ ఉనికిలో వుండడమో లేదా కేవలం ఇతర దేశాలు తమపై దాడిచేయకుండా కట్టడి చేయడంకోసమో ఇలా చేస్తున్నాయని వివరించడం సరైంది కాదు.

2020 నాటికి మొత్తం ప్రపంచదేశాలన్నింటి రక్షణ ఖర్చు రెండు ట్రిలియన్ డాలర్లు. వాస్తవంగా చూస్తే ఇది గతంలో కంటే 2.6 శాతం ఎక్కువ. అమెరికా ఆయుధాల మీద పెడుతున్న ఖర్చు 4.4 శాతం పెరగగా, రష్యా ఖర్చు 2.5 శాతం పెరిగింది. ప్రస్తుత సంక్షోభ నేపథ్యంలో తన రక్షణ బడ్జెట్‌ను చైనా 7.1 శాతం పెంచుతున్నట్లు ప్రకటించింది. అమెరికా నాయకత్వంలోని ఆకస్ తనను చుట్టుముట్టే ప్రమాదం ఉంది కాబట్టి

ఎవరి యుద్ధమిది? ఎవరిపై యుద్ధమిది?

ఈ యుద్ధంలో ఏదో ఒక పక్షాన్ని సమర్థించడం కాక, ఇది ఎవరి యుద్ధమో మౌలిక ఆలోచనలు చేయాలని, మొత్తంగా సామ్రాజ్యవాదాన్ని ఓడించే శ్రామిక శక్తిని కూడగట్టాలని అంటున్నారు బి.ఎస్. రాజు

కొందరికి యుద్ధం ఎంతో ముద్దు. అంతేకాదు, వారికి యుద్ధం ఓ నిత్య నూతన, నిత్య యవ్వన సుందరాంగి. మరవలేని, మరపురాని ప్రియురాలు. ఆమె గాఢ పరిష్వంగంలో వారు ప్రపంచాన్నే మరిచిపోతారు. యావత్ ప్రపంచం వద్దన్నా, అది తప్పన్నా, మేం తగలడి పోతున్నాం తగదన్నా, వారు వినరు. తమ ముద్దుల ప్రియురాలి ఆలింగనం వీడరు.

వారికి యుద్ధమనే ప్రియురాలిపై ఎందుకంత ముద్దు, విరహం, వ్యామోహం? ఎందుకంటే, అది అతి తక్కువ సమయంలో అతి ఎక్కువ లాభాలను, ధనరాశులను వర్షిస్తుంది కాబట్టి.

యుక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రకటించి ఇప్పటికి అంటే మార్చ్ 17 నాటికి 23 రోజులు గడిచింది. ఫిబ్రవరి 24వ తేదీన మొదలైన రష్యా సైనిక దాడి ఇంకా ఎన్నిరోజులు కొనసాగుతుందో చెప్పలేం! రష్యా, యుక్రెయిన్ దేశాలు రాజీ కుదుర్చుకుని కుదుటపడాలని కోరుకున్నా, సామ్రాజ్యవాద అమెరికా ఈ కాష్టాన్ని అంత తేలికగా చల్లారనిస్తుందా? తానే సృష్టించిన పుటిన్, తన చెప్పుచేతల్లో లేకుండా, తను చెప్పినట్లు వినకుండా స్వతంత్ర శక్తిగా బలపడటం, ఎదగడం అమెరికా సహిస్తుందా? సహించదు. పశ్చిమ, తూర్పు యూరోప్ దేశాలకు, గత సోవియెట్ యూనియన్ ఉమ్మడి కుటుంబంలో సభ్య రిపబ్లిక్‌లుగా ఉండి, 1991 తరువాత వేరు వేరు కుంపట్లు పెట్టుకున్న యురేషియా దేశాలకు ఇప్పుడు రష్యాను పెనుబూచిగా చూపించి, ఓ ఉపద్రవంగా వల్లించి ఆయుధాలు అమ్ముకునే సదవకాశాన్ని అమెరికా వదులు కుంటుందా? వదులుకోదు.

దాన్ని నుండి కాపాడుకోవడానికి తన రక్షణ ఖర్చును పెంచుతున్నట్లు అది చెబుతోంది.

రష్యా విముక్తి ప్రదాత కాదు:

యుక్రెయిన్ రష్యాతో రాజీపడబోతుందని, నాటోలో చేరాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటుందని వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో సామ్రాజ్యవాద దేశాల సహజ స్వభావానికి అనుగుణంగా రష్యా కూడా యుక్రెయిన్ తూర్పు ప్రాంతాలైన డాన్స్క్, లుహాన్స్క్‌లను స్వతంత్ర రాజ్యాలుగాను, క్రిమియాను రష్యన్ భూభాగంగాను, యుక్రెయిన్ గుర్తిస్తే తప్ప యుద్ధం అంతం కాదని డిమాండ్ చేస్తోంది. ప్రస్తుతం క్రిమియా, పుతిన్‌కు చెందిన మితవాద తీవ్ర జాతీయవాద పార్టీ అయిన యునైటెడ్ రష్యా ప్రభావంలో వుంది. క్రిమియా స్టేట్ కౌన్సిల్‌లోని 75 మంది సభ్యులలో 60 మంది ఆ పార్టీకి చెందినవాళ్లే. అక్కడ యుక్రేనియన్ పార్టీలు పనిచేయడాన్ని నిషేధించారు. అంతేగాక ఆ ప్రాంతపు ప్రధాన కార్యనిర్వహణాధికారిని ఎన్నుకునే హక్కు రష్యా అధ్యక్షుడు నిర్ణయించినవాళ్ళకే వుండేటట్లుగా రష్యా ఒక నిర్ణయం చేసింది. ఇది అత్యంత అప్రజాస్వామిక పద్ధతి. అంతేగాక శాసనసభకు జరిగే ఎన్నికలలో చట్టబద్ధంగా పనిచేస్తున్న ప్రతిపక్ష పార్టీలు పోటీ చేయడానికి వీలుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవడాన్ని నిషేధించారు. ఫలితంగా పోటీ చేసే అభ్యర్థులందరూ రష్యా అనుకూల అభ్యర్థులే అయ్యారు. వాళ్లకు ఓటు వేయడమా, వేయకపోవడమా అనేదే ప్రజలు నిర్ణయించాల్సింది. ప్రతిపక్షాన్నంతటినీ టెర్రరిస్టులుగా ప్రకటించే అతి మితవాద దుర్మార్గం రష్యాలో కూడా జరుగుతోంది. రష్యాలో వామపక్షానికి చెందిన ప్రతిపక్ష నాయకులను టెర్రరిస్టు నేరారోపణతో జైళ్లలో పెట్టారు. డాన్స్క్, లుహాన్స్క్‌ల పరిస్థితి కూడా ఇలానే తయారవుతుంది. గత 20 సంవత్సరాలుగా రష్యన్లకు నిరాకరించినట్టుగానే విడిపోయిన ఈ ప్రాంతాల ప్రజలకు కూడా ప్రజాస్వామికంగా ప్రభుత్వాన్ని ఎంచుకునే హక్కును పుతిన్ నిరాకరిస్తాడు.

ప్రజాస్వామ్యాన్ని 'రక్షించడానికి' అమెరికా ఇంతకాలంగా చేసిన కుటిల ప్రయత్నాలు ఇప్పుడు రష్యా చేస్తున్న ఈ చర్యలతో ఒక సంపూర్ణత్వాన్ని సంతరించుకున్నట్లు అయింది.

ప్రపంచవ్యాప్తంగా వున్న అభ్యుదయవాదులు, సామ్రాజ్యవాద వ్యతిరేకులు నడుం బిగించక తప్పదు. అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని విమర్శిస్తున్నంత తీవ్రంగానే రష్యన్ సామ్రాజ్యవాదాన్ని కూడా విమర్శించటానికి సిగ్గుపడకూడదు. సామ్రాజ్యవాదం, అది ఎన్ని వలసలను కలిగివుంది అనే సంఖ్యని బట్టి నిర్ణయమయ్యేది కాదు.

గతంలో బ్రిటన్, ఫ్రాన్సులతో పోల్చుకుంటే ఇటలీకి ఆఫ్రికాలో నాలుగు వలసలు మాత్రమే ఉండేవి. అయినప్పటికీ అది సామ్రాజ్యవాదమే. అదే విధంగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా సైనిక స్థావరాల విస్తృతితో పోల్చితే రష్యన్ సామ్రాజ్యవాదం బలహీనమైనదిగా కనిపించవచ్చు. కాని, ఇతర దేశాల స్వయం నిర్ణయాధికార హక్కును పరిమితం చేసే లక్ష్యంతో కూడిన దురహంకారపూరిత లక్ష్యం రష్యాకు కూడా ఉన్నది.

(రచయిత కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలోని ప్రపంచ చరిత్రశాఖలో రీసెర్చ్ స్కాలర్

(గొప్ప మార్క్సిస్టు పరిశోధకుడు ఐజాజ్ అహ్మద్ (1941 – మార్చ్ 9, 2022)కు ఈ వ్యాసాన్ని అంకితం చేస్తున్నాను.)

(కామ్రేడ్ నీ స్ఫూర్తి సదా కొనసాగాలి! నీవులేని లోటు పూడ్చలేనిది)

(అనువాదం : సి.యస్.ఆర్. ప్రసాద్) వీ

యుక్రెయిన్ అధ్యక్షుడు, అమెరికా ఆటబొమ్మ జెలెనిస్కీచే శాంతి చర్చల్లో తైతక్కలాడిస్తూనే రష్యాను ఆర్థికంగా, మిలటరీ పరంగా చక్రబంధంలో ఇరికిస్తుంది. తను జోరుగా ఆయుధ వ్యాపారం చేసుకుంటుంది. దేశాల మధ్య ఐక్యత, సఖ్యత, సామరస్యత, శాంతియుత సహజీవనం, ఉభయతారక వ్యాపారం కొనసాగకుండా తన ఏకధ్రువ రాజనీతిని, డాలరు ఆధిపత్యాన్ని నిలబెట్టుకునేందుకు యుద్ధవాతావరణం సద్దుమణగనీయదు. రష్యా-చైనాలు ఇరుసుగా రూపుదిద్దుకుంటున్న మరో కూటమిని దెబ్బతీయడానికి యుక్రెయిన్‌పై రష్యా దాడిని వాడుకుంటుంది.

ఇక రష్యా విషయానికి వస్తే, 1956 నుండి అది సోషలిస్టు పంథాను వదులుకుంటూ సోషల్ సామ్రాజ్యవాదిగా మారింది. 1991లో సోవియెట్ యూనియన్ బాహ్యరూపం రద్దయి, పుటిన్ అధికారంలోనికి వచ్చిన తరువాత రష్యన్ జాతీయవాదం, సామ్రాజ్య, వాణిజ్య విస్తరణ, ప్రపంచ ఆధిపత్య పోటీ ప్రధాన ధోరణులుగా మారి ఒకనాటి సోవియెట్ రష్యా సామ్రాజ్యవాద రష్యాగా స్థిరపడింది.

1991 నాటి ప్రచ్ఛన్న యుద్ధానంతర ఒప్పందాలను కాలదన్నిన అమెరికా, నాటో కూటమి అల్లిన సైనిక వలయంలో చిక్కుకుని రష్యా చాలా ఒత్తిడికి గురౌతోంది. రష్యా ఈ ఒత్తిడికి తూట్లు పొడవక, గండికొట్టక తప్పదు. ఇంకా అమెరికా, నాటో కూటమి యుక్రెయిన్ భూభాగాన్ని రష్యా వ్యతిరేక కార్యకలాపాలకు వాడుకుంటోంది. దీనితో రష్యాకు ఊపిరాడని పరిస్థితి. యుక్రెయిన్‌లో అమెరికా అనుకూల నియో-నాజీ వేటగాళ్లను, తోలుబొమ్మ ప్రభుత్వాన్ని నియంత్రించే సామరస్య పద్ధతులు విఫలమవ్వడంతో, వేరేదారి దొరకని స్థితిలో, రష్యా యుక్రెయిన్‌పై సైనిక చర్యకు దిగింది. రష్యాను అటువంటి స్థితికి నెట్టిన అమెరికా వ్యాపార, మిలటరీ విస్తరణ నీతి ప్రపంచ ప్రజల ప్రథమ శత్రువు. ఈ శత్రువుతో అంటకాగిన మాఫియా ఆలిగార్క్ ముఠాల మూల విరాట్ పుటిన్ రెండో శ్రేణి శత్రువు.

అమెరికా, నాటో సైనిక కూటమి యుద్ధాలకు కాలు దువ్వడంలో ముందుంటుంది. ప్రపంచమంతటా సామాన్య శ్రామిక ప్రజలు యుద్ధాలను వద్దన్నా వినని, వినిపించుకోని, లక్ష్యపెట్టని పొగరుబోతు కూటమి ఇది. యుద్ధాలకు హద్దులు, పద్దులు, సరిహద్దులు ఉండనే ఉండవంటారు ఈ కూటాల నాయకులు. శ్రీ శ్రీ అన్నట్లు వీరు ఋణం ఇచ్చి రణం తెచ్చే పెంటగన్ల తుంటరులు. అణుబాంబుల అధిపతులు. మదించిన యుద్ధోన్మాదులు. భూగోళపు సమస్త వనరులు, సరుకులు, విపణులు, బజార్లు తమవేనని, వీటిపై గుత్తాధిపత్యం తమదేనని యుద్ధ భేరీలు మోగిస్తూ ప్రకటిస్తుంటారు. ప్రపంచమంతటా దోచి, కొల్లగొట్టి పోగేసుకున్న ధనరాశులతో, విధ్వంసకర అస్త్రశస్త్ర విజ్ఞానంతో, అండపిండ బ్రహ్మాండాన్నంతా తమ గుప్పెట పడతామని విర్రవీగుతారు. వారి ఎదుట, యుద్ధం వద్దనే జనఘోష, మృత్యు ఘోషగా మారిపోతుంది. నిర్జీవ శవాల గుట్టలుగా, విషాద ఘట్టంగా ప్రతి యుద్ధం చరిత్ర పుటల్లో మూలుగుతూ మిగిలిపోతుంది. మళ్ళా శ్రీ శ్రీ యే అన్నట్లు నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం, రణరక్త ప్రవాహసిక్తం.

ఆదిమ మానవ దశ నుండి ఈ నాటి ఆధునిక మానవ దశ వరకు జరిగిన పరిణామ క్రమంలో యుద్ధాలనేవి వీడని నీడలా మానవులను అంటిపెట్టుకునే ఉన్నాయి. వదలక పీడిస్తున్న జాడ్యంలా యుద్ధాలు మానవ సమూహాల మధ్య కొనసాగుతూ పరిణామం చెందుతూ వచ్చాయి. ఈ యావత్ పరిణామమంతా యుద్ధ భీభత్సకరమే.

ఆదిమ మానవుల రాతిమొన బల్లెం నుండి, విల్లంబు నుండి, గద, ఖడ్గం నుండి, మందుగుండు తుపాకి నుండి మర ఫిరంగి, మిస్సైల్, అణుబాంబు, విషవాయు ప్రయోగ దుర్మార్గం వరకు ఎదిగిన యుద్ధ శస్త్ర-అస్త్రాలన్నీ వనరుల, భూభాగాల, జనసమూహాలపై ఆధిపత్యానికి జరిగిన, జరుగుతున్న యుద్ధాల్లో అంతర్భాగమే! వీటన్నిటా ప్రజలే పావులు. ప్రజలే సమిధలు.

పెట్టుబడి విస్తరణ, సామ్రాజ్యవాద యుద్ధమంటేనే కబ్జా! దురాక్రమణ! విధ్వంసం. ఈ దురాక్రమణల, వనరుల దోపిడీలో, పంపకాల్లో ఇరు రాజ్యాల మధ్యగాని, ఇరు శిబిరాల మధ్యగాని ఏర్పడే స్పర్థ, యుద్ధం ద్వారా పరిష్కారాన్ని కోరుకుంటుంది. గెలుపు ఓటముల మధ్య యుద్ధం తాత్కాలిక శాంతిగా బయట పడుతుంది. అది తాత్కాలికమే కాబట్టి, ఆ తాత్కాలిక శాంతిలో యుద్ధం ఓ విరామ పర్వంగా పొంచే ఉంటుంది. యుద్ధం-తాత్కాలిక శాంతి-విరామం-తిరిగి యుద్ధం. వర్గ సమాజంగా ఉన్న మానవ సమాజంలో ఈ గతిక్రమం కొనసాగుతూనే ఉంటుంది. ఈ ఆధిపత్య యుద్ధాలకు విరుగుడు ప్రజాయుద్ధాలే తప్ప వేరే ప్రత్యామ్నాయం ఉండదు. వలస వాదుల,సామ్రాజ్యవాదుల, ఫాసిస్టుల, నియంతల, పెట్టుబడి గుత్తాధిపతుల, టెక్ సామ్రాజ్యాధీశుల అధికార పీఠాలను కూల్చనిదే, మానవ సమాజాలు వర్గరహితం కానిదే, యుద్ధాలు రద్దయి శాంతి ప్రభవించదు. సామ్రాజ్యవాద యుద్ధాలకు విరుగుడు శ్రామికవర్గ ప్రజాయుద్ధాలే! ఈ శ్రామిక వర్గాలు కూడా వర్గాలను రద్దుచేసే దిశలో కొనసాగకపోతే తిరిగి యుద్ధాలు సంభవించక తప్పదు.

యుద్ధాల పరంపర, రెండు భయానక ప్రపంచ యుద్ధాలు జరిగిన తరువాత కూడా ఇంకా కొనసాగుతూనే ఉంది. మానవాళికి యుద్ధాల ముప్పు పోలేదని, అది పొంచే ఉందని, మూడో ప్రపంచ యుద్ధం మన ముంగిటనే ఉందని ప్రపంచ పరిణామాలను అధ్యయనం చేసే రాజకీయ విశ్లేషకులు చెబుతూనే ఉన్నారు.

పెట్టుబడికి, సామ్రాజ్యవాదానికి స్వాభావికంగా ఉండే శ్రమ దోపిడీ, వనరుల దోపిడీ, భౌగోళిక విస్తరణ, మార్కెట్ల విస్తరణ అనే లక్షణాలు నిరంతర యుద్ధాలకు దారితీస్తాయని, ఈ శక్తిని ఓడించనిదే యుద్ధభీతి పోయి శాంతి సామరస్యాలు శాశ్వతంగా మనలేవని చరిత్ర పదే పదే రుజువు చేస్తున్నది.

గడచిన రెండు ప్రపంచ యుద్ధాలు రెండు ప్రత్యర్థి శిబిరాలకు లేక రెండు ప్రత్యర్థి శక్తుల కూటాల ఏర్పాటుకు దారితీసాయి. ఒకటి పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద శక్తుల, దేశాల కూటమి లేక శిబిరం. ఈ శిబిరానికి మొనగాడిగా, అత్యంత బలీయమైన సామ్రాజ్యవాద శక్తిగా అమెరికా కొనసాగుతూ వచ్చింది. రెండవది సోషలిస్టు శక్తుల,

దేశాల కూటమి లేక శిబిరం. ఈ శిబిరానికి సోవియెట్ రష్యా లేక సోవియెట్ యూనియన్ నాయకత్వం వహించేది. ఈ రెంటి మధ్య అలీన దేశాల కూటమి అనే ఓ తటస్థ వలస విముక్త దేశాల కూటమి కూడా ఉండేది.

పెట్టుబడికి శ్రామిక శక్తికి మధ్య జరిగే వర్గ సంఘర్షణకు ప్రతిరూపాలుగా ఈ శిబిరాలు వెలిశాయి. ఉత్పత్తి సాధనాలు సమాజపరమై, శ్రామిక శ్రేయో సోషలిస్టు వ్యవస్థలు ప్రపంచమంతా ఏర్పడాలనే శ్రామికవర్గ రాజ్యాధికార దృక్పథంతో ఏర్పడ్డ శిబిరం ప్రపంచ చరిత్రలో మొట్టమొదటి వర్ధమాన శక్తిగా, పెట్టుబడికి ధీటైన ప్రత్యర్థిగా నిలబడింది. ఈ వర్ధమాన శిబిరానికి సోవియెట్ రష్యా, సోవియెట్ యూనియన్ నాయకత్వం వహించింది. 1956 నుండి అంతర్గతంగా మొదలైన సోవియెట్ యూనియన్ పతనం, 1991 నాటికి పరాకాష్టకు చేరుకుని, పూర్తిగా విచ్ఛిన్నమై, ముక్కచెక్కలైపోయింది. సోవియెట్ యూనియన్ విచ్ఛిన్నమంటే ప్రపంచంలోనే మొట్టమొదటి సారి పలు జాతుల, ఉప జాతుల మధ్య భిన్న మతాల, భిన్న సంస్కృతుల మధ్య, ఐరోపా–ఆసియా ప్రాంత ప్రజల మధ్య పాదుకొని, పెనవేసుకొన్న ఓ అద్భుత, స్నేహ సుందర మానవ సమతా లతా విచ్ఛిన్నమే! ఈ విచ్ఛిన్నానికి విరామ మెరుగక శ్రమించిన దేశం, సామ్రాజ్యవాద అమెరికా, దాని తోకలు ఐరోపా దేశాలు, 'నాటో' కూటమి, ఈ కూటమి రచించి అమలు చేసిన ప్రచ్ఛన్న యుద్ధం. శాంతియుత సహజీవనం, శ్రామికవర్గ రాజకీయ ఆర్థిక సాంస్కృతిక నిర్మాణం, జాతుల కలయిక, ఐక్యత ఇవేవీ సామ్రాజ్యవాద పెట్టుబడి సహించదు. అటువంటి మొక్కలు ఎక్కడ పాదుకుంటున్నా, వికసిస్తున్నా, విస్తరిస్తున్నా, వాటి అంతు చూసే వరకు ఈ సామ్రాజ్య – వాణిజ్య విస్తరణ కూటములు నిద్రపోవు.

ఇపుడు రష్యా సైనిక దాడికి గురైన యుక్రెయిన్ 1991 వరకు సోవియెట్ యూనియన్లో అంతర్భాగంగా ఉండేది. గతించిన సోవియెట్ యూనియన్‌లో రష్యన్ జాతీయుల తరవాత రెండో అతిపెద్ద స్లావిక్ జాతి సమూహం, యుక్రెయిన్. మేలైన మానవ, ప్రాకృతిక వనరులు, సారవంతమైన భూములు కల్గిన యుక్రెయిన్, సోవియెట్ సోషలిస్టు యూనియన్‌లో భాగంగా అద్భుతమైన పారిశ్రామిక ప్రగతిని సాధించింది. అయితే యుక్రెయిన్ బూర్జువా జాతీయవాదం సోషలిస్టు నిర్మాణ దశలో కూడా అంతర్లీనంగా కొనసాగినట్టు సోవియట్ కమ్యూనిస్టు పార్టీ 19వ కాంగ్రెస్ పత్రాల ద్వారా రుజువౌతున్నది.

ఈ 19వ కాంగ్రెసులో యుక్రెయిన్ బూర్జువా జాతీయ వాదంపై జరిగిన చర్చ, పార్టీ బాధ్యుల ప్రసంగాలు ఓ సారి నెమరు వేసుకుంటే, ఇప్పుడు యుక్రెయిన్ ప్రజలు ఎదుర్కొంటున్న విషాదానికి మూలం ఏమిటో అర్థం చేసుకోవచ్చు. సామ్రాజ్యవాదం, బూర్జువా జాతీయ వాదాలు యుద్ధాలను ఎలా సృష్టిస్తాయో, జాతుల మధ్య చిచ్చుపెట్టి ప్రజలను ఎలా కొల్లగొడతాయో, వారి జీవితాలను ఎలా సర్వనాశనం చేస్తాయో ఇప్పుడు యుక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధ భీభత్సం మరో తాజా ఉదాహరణగా నిలుస్తుంది. సోవియెట్ యూనియన్ విచ్ఛిన్నమై, గడిచిన మూడు దశాబ్దాల్లో, సామ్రాజ్యవాద అమెరికా సృష్టించిన బీభత్సం ఎంతటిదో ఎవరైనా లెక్కగట్ట గలరా?

సోవియెట్ యూనియన్ విచ్ఛిన్నం నుండే కదా పుటిన్ అనే వ్యక్తి పుట్టుకొచ్చింది! సోవియెట్ యూనియన్ ప్రజల సుందర దృశ్యాన్ని చిదిమేసే కదా, ప్రజా సంపదను కొల్లగొట్టే కదా, ఆలిగార్క్ గజదొంగల మాఫియా సామ్రాజ్యం వెలిసింది!

ఇప్పుడు, ఉక్రెయిన్ – రష్యా మధ్య స్పర్ధను కార్మిక వర్గ దృక్పథంతో చూడాల్సిందే తప్ప ఉదారవాద సెంటిమెంట్‌తోనో, పుటిన్ తోకపట్టుకునో, బైడెన్ అంగీ పుచ్చుకునో వేలాడడంతో కాదు. జీ జిన్పింగ్ కనుగుడ్లలో ఎర్రజీరలు చూసి మురిసిపోవడంతో కాదు.

సోవియెట్ యూనియన్ తిరిగి మొలుస్తుందా? విడిపోయిన ముక్కలు తిరిగి అతుక్కుంటాయా? పుటిన్ కొత్త జార్ చక్రవర్తా? నియంతా? రష్యన్ జాతి రత్నమా? చైనా రష్యాలు సోషలిస్టు దేశాలా? సామ్రాజ్య వాద దేశాలా, కాదా? ఇవి కావు వేసుకోవాల్సిన ప్రశ్నలు.

ఏ వర్గ ప్రయోజనాలకు ఏ ప్రజల ప్రాణాలను ఎవరు బలిపెడుతున్నారు? ఎవరి అధికారం కోసం ఎవరు యుద్ధాలు చేస్తున్నారు? చేయిస్తున్నారు? ఎవరీ పాత, కొత్త సామ్రాజ్యాధీశులు? ఎవరీ యుద్ధ ప్రభువులు? వీరు, వీరి పాలన కొనసాగాలా? అంతమవ్వాలా?

ఇతరుల మాట ఎలా ఉన్నా, ఈ విషయంలో కమ్యూనిస్టుల బాట ఒకటే కావాలి. ప్రపంచ శ్రామిక సమూహాలను ఓ మహత్తర శ్రామిక వర్గంగా, పోరాట శక్తిగా మల్చి పెట్టుబడిని, సామ్రాజ్యవాదాన్ని ఓడించే శక్తిగా పెంపొందించడమే ఆ మార్గం. ప్రపంచ శ్రామిక వర్గం తన వర్గ ప్రయోజనాలను నెరవేర్చుకోవడానికై పెట్టుబడి కోరలు పీకి, దాని అధికారాన్ని తన నియంత్రణలోనికి తీసుకోవాల్సిందే తప్ప వేరే వయా మీడియాలు ఉండవు.

ప్రస్తుత ప్రపంచంలో కమ్యూనిస్టులకు మావో చెప్పినట్టు, చైనాలో ఓ పిచ్చిమారాజైన వృద్ధుడు మహాపర్వతాలను తవ్విపోసేంత పని ఉంది. మళ్లా అట్టడుగు నుండి, ఓనమాల నుండి పని చెయ్యాల్సిన అగత్యముంది.

ఒక ముఠా నగ్న యుద్ధ పిపాసి, ముద్రపడ్డ సామ్రాజ్యవాది. మరికొన్ని ముఠాలు సోషలిస్టు ద్రోహులుగా పెట్టుబడి శిబిరంలో చేరినవి. వాళ్ల మధ్య స్పర్ధలు, పంపకాల కొట్లాటలు రావడంలో ఆశ్చర్యం లేదు. వీరంతా ప్రపంచ శ్రామికవర్గపు ద్రోహులే కదా! ప్రపంచ శ్రామిక వర్గాన్ని అణచిపెట్టడంలో వీరంతా మిత్రులే కదా! అంచేత కమ్యూనిస్టులు ఈ యుద్ధాలను, ఈ యుద్ధ ప్రభువులను, వీళ్ల దోపిడీ కూటాలను కూల్చే ప్రజాయుద్ధ నిర్మాణంలో నడవాలితప్ప, ఇటో ఆటో వంత పాడాల్సిన, కొమ్ము కాయాల్సిన పనిలేదు. ప్రపంచ కమ్యూనిస్టులకు దోపిడీ పెట్టుబడిని, సామ్రాజ్యవాదాన్ని కూల్చేపని తప్ప వేరే పనేముంటుంది?

(రచయిత శ్రామికనేస్తం సంపాదకులు) వీ

ఆధిపత్యం కోసమే యుక్రెయిన్‌పై రష్యా దాడి

యుద్ధ కాలం వర్తమానం, యుద్ధ క్షేత్రం యుక్రెయిన్ అయినా ఈ యుద్ధానికి గల చారిత్రక, రాజకీయార్థిక కోణాలు ఎంత లోతైనవో చర్చిస్తున్నారు **ఎ. నర్సింహారెడ్డి**

కార్పేథియన్ పర్వత సానువుల నుంచి నల్ల సముద్రం వరకు విస్తరించిన సుందర దేశం యుక్రెయిన్. భౌగోళికంగా యుక్రెయిన్ యూరప్‌కు వ్యాపార వాణిజ్యం కోసం కీలక ప్రాంతం. రష్యా నుండి యూరప్ వెళ్లడానికి ముఖద్వారం. 1924 నుండి పూర్వపు సోవియట్ రష్యాలో ఒక రిపబ్లిక్‌గా ఉన్న యుక్రెయిన్ 24.8.1991న వేరుపడి స్వతంత్ర దేశంగా ఏర్పడింది. ఇటు రష్యా అటు నాటోలకు సమదూరంలో ఉండాలని మొదట్లో భావించింది. కాని, యుక్రెయిన్ పార్లమెంటులో నాటో, అమెరికా మద్దతుదార్లు అధిక సంఖ్యలో ఉండడంతో పరిస్థితులు మారాయి. రష్యాకు వ్యతిరేకంగా యుక్రెయిన్‌ను నిలబెట్టేందుకు అమెరికా, ఐఎంఎఫ్, పశ్చిమ దేశాలు భారీగా పెట్టుబడులు అందించాయి. సైనిక సాయం అందించాయి. ఈ క్రమంలో యుక్రెయిన్ అమెరికాకు, నాటోకు చేరువైంది.

యుక్రెయిన్‌లో 30 శాతం వరకు రష్యన్ జాతివారున్నారు. వీరిపై అణచివేత, దోపిడీ, పీడన, వివక్ష పెరిగింది. వీరికి రష్యా అండగా నిలిచింది. రష్యా నుండి యుక్రెయిన్ విడిపోయిన నాటి నుంచి నేటి వరకు అంతర్గతంగా ఏదో ఒక ఆందోళన సాగుతున్నది. యుక్రెయిన్‌లోని మూల వాసులు, అణగారిన జాతుల సమస్యలను పరిష్కరించాల్సిన యుక్రెయిన్ ప్రభుత్వం ఆ పని చేయకపోవటంతో అక్కడ ఘర్షణాత్మక పరిస్థితులను అంతర్యుద్ధంగా రాజేసి, దానిని నాటో దేశంగా చేర్చుకోవాలని అమెరికా ఎత్తులు వేస్తోంది. రక్షణ కల్పించే పేరుతో యుక్రెయిన్‌లో పాగా వేస్తే తూర్పు ఐరోపాపై పట్టు సాధించవచ్చునన్నది దాని పన్నాగం. ఈ పన్నాగాన్ని తిప్పికొట్టే ప్రయత్నంలో యుక్రెయిన్‌పై రష్యా సైనిక చర్యకు దిగింది. దీంతో ప్రపంచ దేశాలు అమెరికా–రష్యా అనుకూల శిబిరాలుగా ఏర్పడ్డాయి. చివరికి ఏ కూటమి గెలిచినా ఓడినా యుక్రెయిన్ ప్రజలకు జరిగే మేలు ఏమి ఉండదు. యుద్ధాలన్నిటి వెనుక పెట్టుబడిదారుల ప్రయోజనాలే దాగి ఉంటాయి. పెట్టుబడిదారుల లాభాపేక్ష మానవాళి రక్త మాంసాలను నంజుకు తింటుంది.

సామ్రాజ్యవాద దేశంగా రష్యా

1953 స్టాలిన్ మరణానంతరం సోవియట్ యూనియన్ రివిజనిస్టు కృశ్చేవైట్ ముఠా నాయకత్వాన బ్యూరోక్రాట్ పెట్టుబడిదారీ రాజ్యంగా, ఆ తర్వాత బ్రెజ్నెవ్, కొసిగిన్‌ల నాయకత్వాన సోషల్ సామ్రాజ్యవాద దేశంగా, 1970ల నాటికి ఒక అగ్రరాజ్యంగా మారింది. 1970 దశకం నుండి సోవియట్ రష్యా క్షీణ దశ ప్రారంభమైంది. ఉత్పత్తి క్షీణించింది, సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ నిరంకుశత్వం పెరిగింది. క్రమంగా ప్రజలకు దూరమైంది. నిత్యావసర వస్తువుల కొరత ఏర్పడింది. సోషలిస్టు ఆర్థిక విధానం పెట్టుబడిదారీ ఆర్థిక విధానంగా మారింది. గోర్బచెవ్ ప్రవేశపెట్టిన గ్లాస్నోస్ట్ (స్వేచ్ఛ), పెరిస్త్రోయికా (పునర్నిర్మాణం)లతో అనూహ్య పరిణామాలు సంభవించాయి. దీంతో సోవియట్ ఆర్థిక రంగంలో రెండు మార్పులు చోటు చేసుకున్నాయి. ఒకటి పరాధీనత, అంటే విదేశీవ్యాపారం, విదేశీ మార్కెట్లు, విదేశీ పెట్టుబడులపై ఆధారపడటం జరిగింది. మొత్తంగా ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక రంగంతో మమేకం గావడం జరిగింది. రెండు, సోవియట్ ఆర్థిక రంగం మరింతగా మిలిటరీకరించడం జరిగింది. ఫలితంగా సోవియట్ యూనియన్‌లో అంతర్గతంగా వచ్చిన మార్పుల వల్ల ప్రభుత్వ గుత్త పెట్టుబడి విధానంగా మారింది.

రాజకీయార్థిక సంస్కరణలు, రష్యనేతర భాషల, సంస్కృతుల మీద నిర్బంధం వల్ల నవంబర్ 1989లో బెర్లిన్ గోడ కూలింది. సోషలిజం నిర్మాణంలో కమ్యూనిస్టు పార్టీలు చేసిన తప్పులు, అమెరికా కుట్రల ఫలితంగా సోవియట్ యూనియన్‌లోని 14 రిపబ్లిక్కులు 1991లో స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నాయి. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైన తర్వాత రష్యా అమెరికాకు సవాలుగా మారింది. ఆర్థిక, సైనిక, సాంకేతిక రంగాలలో అమెరికాతో ఢీ అంటే ఢీ అనగల స్థితిలో ఉంది. ఆయుధ విక్రయంలో రెండవస్థానంలో ఉంది. ప్రపంచ చమురు ఉత్పత్తిలో 10 శాతం రష్యానే చేస్తుంది. ఇప్పుడు రష్యా పాలన అలిగార్కి (సంపన్న వర్గాల ముఠా) చేతిలో కొనసాగుతోంది. 1991 ఆగష్టు నాటికి సోవియట్ యూనియన్ అంతరించి ప్రజావ్యతిరేక సంపన్న వర్గాల (అలిగార్కి) పాలన మొదలైంది. రష్యాలో ఇప్పుడు కమ్యూనిస్టు పార్టీ అధికారంలో లేదు. గోర్బచెవ్, అమెరికా మధ్య 1990లో జరిగిన చర్చల్లో ఆనాటికి ప్రచ్ఛన్న యుద్ధానికి మూలమైన నాటోను రద్దు చేసుకోవాలని, అలాగే సోషలిస్టు దేశాల మధ్య ఉన్న వార్సా సైనిక ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలన్న అవగాహన కుదిరింది. వార్సా ఒప్పందం రద్దయినది. అయినా, అమెరికన్ సామ్రాజ్యవాదం, యూరోపియన్ యూనియన్ దేశాలు నాటోను రద్దు చేయకపోగా, రష్యాను పాదాక్రాంతం చేసుకోవాలన్న దుష్ట తలంపుతో నాటోను పూర్వపు తూర్పు యూరప్ దేశాలకు విస్తరించారు. ఇదంతా

యుక్రెయిన్ యుద్ధానికి నేపథ్యం.

స్వతంత్ర దేశంగా యుక్రెయిన్ :

యుక్రెయిన్‌లో మతం వైవిధ్యమైంది. 70 శాతం ప్రజలు క్రైస్తవులు. క్రైస్తవం ఒకే మతమైనా అది ఒకటి కాదనడానికి యుక్రెయిన్ ఒక నిదర్శనం. తూర్పు, పశ్చిమాల క్రైస్తవాల మధ్య, సనాతన క్రైస్తవానికి పాశ్చాత్య కాథలిజానికి మధ్య అది చీలిపోయింది. మరోవైపు యుక్రెయిన్‌లో జాతీయవాదం పెల్లుబికింది. యుక్రెయిన్ అధ్యక్షుడు లియోనిడ్ ప్రభుత్వ అవినీతిని బయట పెట్టినందుకు యుక్రెయిన్స్కా ప్రావ్దా అనే పత్రిక వ్యవస్థాపకుడు జార్జి గోంగాడ్జేను17 సెప్టెంబర్ 2000లో హత్య చేశారు. 2004లో ఆ దేశ అధ్యక్ష ఎన్నికల్లో అక్రమాలు జరిగినందుకు నారింజ విప్లవం వచ్చింది. ప్రజలు ఆ రంగు దుస్తులతో వీధుల్లోకి వచ్చి నిరసనలు వ్యక్తం చేశారు. యుక్రెయిన్‌లో ఫాసిస్టు శక్తులు, అమెరికా సామ్రాజ్యవాద అనుకూల శక్తులు తలెత్తాయి. 2011లో చట్టబద్ధంగా ఎన్నికైన రష్యా అనుకూలుడైన యానుకోవిచ్ ప్రభుత్వాన్ని కూల్చి 2014లో సామ్రాజ్యవాద అనుకూల ప్రభుత్వాన్ని ఏర్పరచడంలో అమెరికా కీలక పాత్ర పోషించింది.

2011లో ఎన్నికలను రిగ్ చేసి రష్యా తన దేశానికి సన్నిహితంగా ఉన్న డాన్‌బాస్‌కు చెందిన యానుకోవిచ్ నేతృత్వంలో కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే ఎన్నికల్లో అక్రమాలు జరిగాయంటూ అమెరికా ప్రోద్భలంతో యుక్రెయిన్ ప్రజలు తీవ్రంగా ప్రతిఘటించారు. 2014లో రష్యా ఒత్తిడితో యానుకోవిచ్ యూరోపియన్ యూనియన్‌తో ఆర్థిక ఒప్పందం కుదుర్చుకోనందుకు లక్షల సంఖ్యలో జనం వీధుల్లోకి వచ్చారు. ఈ ఆందోళన వెనుక అమెరికా ప్రేరణ ఉంది. రష్యన్ ఆధిపత్యానికి నిరసనగా లెనిన్ విగ్రహాన్ని సైతం కూలదోశారు. ప్రభుత్వ నియంతృత్వం, అవినీతి, మానవ హక్కుల హననం, పోలీసుల హింసాకాండ, ప్రజాగ్రహానికి ఆజ్యం పోశాయి. కీవ్‌లోని సెంట్రల్ స్క్వేర్‌లో జరిగిన ఈ ఉద్యమాన్ని యూరోమైదాన్‌గా అభివర్ణిస్తారు. యుక్రెయిన్ ప్రజాగ్రహానికి తట్టుకోలేక యానుకోవిచ్, ఆయన ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు మాస్కో పలాయనం చిత్తగించారు. నిరసనకారులు అధ్యక్ష భవనాన్ని, యానుకోవిచ్ ప్రైవేట్ ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత వ్యాపారవేత్త పెట్రో పొరొషెంకో అధ్యక్షుడయ్యాడు.

యుక్రెయిన్‌కు పశ్చిమాన ఉన్న డాన్‌బాస్‌తో పాటు అనేక ప్రాంతాల్లో యుక్రెయిన్ సైన్యానికి ఆ దేశ వ్యతిరేక వేర్పాటు వాదుల మధ్య హింసాకాండ జరిగింది. పోరోషెంకో హయాంలో యుక్రెయిన్ యూరోపియన్ యూనియన్‌లో విలీనమయ్యే క్రమం ప్రారంభమైంది. యూరోపియన్ యూనియన్, నాటోలలో యుక్రెయిన్ సభ్య దేశంగా మారేందుకు రాజ్యాంగ సవరణపై కూడా సంతకం చేశాడు. యుక్రెయిన్‌ను రష్యా నుండి శాశ్వతంగా దూరం జేసేందుకు అన్నట్లు 1200 పేజీల చారిత్రక రాజకీయ, వాణిజ్య, సైనిక ఒప్పందంపై 27-06-2014న ఇయు - యుక్రెయిన్‌లు సంతకాలు చేశాయి. అప్పటి నుంచి అమెరికా, పాశ్చాత్య దేశాలకు రష్యాకు మధ్య ఘర్షణ వాతావరణం తలెత్తింది. 2019 ఎన్నికల్లో జెలెన్స్కీని అధ్యక్షుడుగా ఎన్నుకున్నారు. ఇయన ఇయు-నాటోలో యుక్రెయిన్‌కు సభ్యత్వం ఇవ్వాలని కోరుతున్నారు. ఫలితంగా యూరప్‌కు గేట్‌వేగా పేరొందిన యుక్రెయిన్, రష్యా తన భద్రతను కాపాడుకునే పేరిట ప్రదర్శిస్తున్న ఆధిపత్య వాదానికి, అమెరికా, నాటో దేశాల విస్తరణ వాదానికి మధ్య నలిగిపోతోంది. యుక్రెయిన్ ప్రస్తుత దుస్థితికి ఈ విస్తరణవాదమే ప్రధానకారణం.

అగ్రరాజ్యాల మధ్య తీవ్రమైన ఆధిపత్య పోరు :

సామ్రాజ్యవాదం అంటేనే యుద్ధం. యుద్ధం అంటేనే విధ్వంసం, విస్తరణ. భౌగోళిక ఆధిపత్యం కోసం, సహజ వనరులపై ఆధిపత్యం నెలకొల్పడానికి సామ్రాజ్యవాదుల మధ్య అంతర్గత యుద్ధాలు జరుగడం సహజమే. గత 70 సంవత్సరాలలో అమెరికా 100 దేశాలపై యుద్ధం చేసింది. దేశాల మధ్య యుద్ధాలు, అంతర్యుద్ధాలను ప్రోత్సహించి ఆయుధ వ్యాపారంతో లాభాలు దండుకుంది. అమెరికా తన సిఐఎ కుట్రల ద్వారా ఎంతో మంది దేశాధినేతలను హత్య చేయించింది. పెట్టుబడిదారీ దేశాలు తమ ఆధిపత్యం, వాణిజ్య ప్రయోజనాల కోసం యుద్ధాలు చేయడం మనం చూస్తూనే ఉన్నాం. కార్మికశక్తి ఐక్యతను విచ్ఛిన్నం చేసి లాభాలు గడించేందుకు పెట్టుబడిదారీ వ్యవస్థ చేసే కుట్రలకు ప్రతిరూపమే యుద్ధం. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసి సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాలు ఉనికిలోకి వచ్చాక సామ్రాజ్యవాద శిబిరాల మధ్య భౌగోళిక రాజకీయ ఆధిపత్యం కోసం పోటీ పెరిగి, వాటి కేంద్రీకరణ క్రమం నాటో నుండి ఆకస్ వైపు, అట్లాంటిక్ నుండి ఇండో ఫసిపిక్ వైపు, పడమర నుండి తూర్పు వైపు, యూరప్ నుండి ఆసియా వైపు మారే పరిణామాన్ని సూచించేదే యుక్రెయిన్- రష్యా యుద్ధం.

సామ్రాజ్యవాద అమెరికా - రష్యా లోని గుత్తపెట్టుబడిదారుల మధ్య పోటీ ఇది. దీన్ని రాజకీయ, ఆర్థిక, సైనిక పోటీగా చూడాలి. అమెరికా, దాని నాటో మిత్ర కూటమి యూరప్‌లోనూ, ప్రపంచంలోనూ తమ పోటీదారులైన రష్యాకు వ్యతిరేకంగా పోరాడేందుకు యుక్రెయిన్ ప్రభుత్వాన్ని పావుగా వాడుకుంటున్నాయి. యుక్రెయిన్‌ను వెనుకేసుకొస్తూ రష్యాను యుద్ధంలోకి దించాయి. అమెరికా రష్యాను బూచిగా చూపించి జర్మనీ, ఫ్రాన్స్‌లను తమ వైపునకు తిప్పుకోగలిగింది. మరోవైపున ఆయుధ పరిశ్రమలపై ఆధారపడిన అమెరికా ఆర్థికవ్యవస్థను నిలబెట్టుకొనే ప్రయత్నం కూడా జరిగింది. అమెరికా 10వేల బిలయన్ డాలర్లు అంటే 76లక్షల కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని యుక్రెయిన్‌కు ప్రకటించింది. అంటే 76 లక్షల కోట్లతో యుక్రెయిన్ అమెరికా సూచించిన కంపెనీల నుండే ఆయుధ సామాగ్రి కొనాలి. ఆ డబ్బు తిరిగి అమెరికన్ ఆయుధ కంపెనీలకే చేరుతుంది. అదేవిధంగా యూరోపియన్ యూనియన్ 500 మిలియన్ పౌండ్ల (రూ॥5,00,000 కోట్లు) సహాయాన్ని ప్రకటించింది. యూరప్ దేశాలు కూడా విడిగా ఆర్థిక సహాయాన్ని ప్రకటించాయి.

ఈ డబ్బంతా చివరికి ఆయుధ వ్యాపారుల దగ్గరనే చేరుతుంది.

1990 దశకం నుంచి సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల అమలు వల్ల గత రెండు దశాబ్దాలలో చైనా, రష్యా వంటి నూతన ప్రపంచ ఆర్థికశక్తుల ఆవిర్భావానికి, అవి వేగంగా శక్తివంతం కావడానికి దారి తీసిందనే వాస్తవాన్ని గుర్తించాలి. ఈ శక్తులు అంతర్జాతీయ మార్కెట్‌లో తమ వాటా పెరగడాన్ని హక్కుగా కోరుకుంటున్నాయి. ఇవి ఆర్థికంగా ఎదిగిన కారణంగా వాటి రాజకీయ, సైనికశక్తి కూడా అభివృద్ధి చెందక తప్పలేదు. ఇది సామ్రాజ్యవాద భౌగోళిక చదరంగ యవనికపై ఇప్పుడున్న పావుల స్థానాలను మార్చడానికి దారితీయనుంది. అంతేగాక, ఇప్పటివరకు అప్రతిహతంగా ఆధిక్యతలో ఉన్న అమెరికా, యూరోపియన్ యూనియన్ వంటి శక్తులతో పోటీ తీవ్రతరమైంది. ఈ తీవ్రతరమైన సామ్రాజ్యవాద పోటీ వ్యక్తీకరణనే నేడు ఉక్రెయిన్‌లో, తూర్పు యూరప్‌లో యుద్ధరూపంలో చూస్తున్నాం. అయితే అమెరికా ప్రోత్సాహంతో యుద్ధానికి సై అంటున్న యూరప్ దేశాల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది. యూరప్‌కు అమెరికా కంటే రష్యాతోనే సన్నిహిత సంబంధాలున్నాయి. రష్యా చమురు, గ్యాస్ పరిశ్రమకు యూరప్‌తో విడదీయరాని అనుబంధం ఉంది.

2000 తర్వాత అమెరికా కోల్పోయిన ఆధిపత్యాన్ని ప్రపంచ దేశాలలో తిరిగి నిలబెట్టుకునేందుకే యూరోపియన్ దేశాలను రష్యాకు వ్యతిరేకంగా ప్రేరేపిస్తోంది. ఇటీవలనే అమెరికా, ఆస్ట్రేలియా, భారత్, జపాన్‌లతో కూడిన 'క్వాడ్'ను చైనాకు వ్యతిరేకంగా, అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియాలతో కూడిన 'ఆకస్'ను రష్యాకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసింది. ప్రపంచ మార్కెట్లోకి రష్యాను ప్రవేశించకుండా, తూర్పు యూరప్ దేశాలతో పాత శతృత్వం తగ్గకుండా అమెరికా వ్యూహాత్మకంగా పావులు కదుపుతుంది. రష్యాకు వ్యతిరేకంగా అమెరికా తన చాకచక్యమైన చర్యలతో అంతర్జాతీయ వేదికల వద్ద ఉద్రిక్తతలను పెంచుతూ, భయాందోళనలను సృష్టిస్తూ, ప్రపంచంలో సుస్థిరత అనే దానిని బలిపెడుతూ తన ఆధిపత్య ప్రయోజనాల కోసం వ్యవహరిస్తోంది.

అమెరికా, నాటో మిత్ర దేశ బలగాల కుటిలయుక్తులన్నీ కలిసి కీవ్‌లోని యుక్రెయిన్ ప్రభుత్వాన్ని మొండిగా మార్చాయి. అధ్యక్షుడు జెలెన్స్కీ డాన్‌బాస్ ప్రాంతంలోని డొనెట్స్క్, లుహన్స్క్‌లలోని జాతీయవాద శక్తులతో చర్చలు జరిపేందుకు బదులుగా వారిపై దాడులను ప్రారంభించాడు. ఈ పరిస్థితుల్లో డాన్‌బాస్ ప్రాంతంలో గతకాలపు సోవియట్ యూనియన్‌లో పరిపాలనా ప్రాంతాలైన పశ్చిమ యుక్రెయిన్‌లోని దొనేట్స్క్, లూహాన్స్క్ ప్రాంతాలకు రష్యా గుర్తింపునివ్వటంతో పాటు యుద్ధాన్ని ప్రకటించింది. భద్రతాహామీ లేకుండా రష్యా ఇరుగుపొరుగు దేశాల హద్దుల వరకు నాటో విస్తరించకుండా నియంత్రించాలని, ఈ ప్రాంతంలోని పశ్చిమ దేశాల సైనిక బలగాలను వెనక్కు పంపాలని, ఈ ప్రాంతంలో ఆయుధాల సమీకరణను నిలిపివేయాలని కూడా రష్యా డిమాండ్ చేస్తోంది.

యుక్రెయిన్‌పై రష్యా దాడికి కారణాలు :

రష్యా యుక్రెయిన్ యుద్ధానికి అనేక స్వల్పకాలిక, దీర్ఘకాలిక కారణాలున్నాయి. 1991లో విడిపోయాక తటస్థ వైఖరి అనుసరించిన యుక్రెయిన్ రష్యా, ఇతర రిపబ్లిక్‌లతో పరిమిత సైనిక భాగస్వామ్యం కలిగి ఉంది. భిన్నభాషలు, జాతులు, మతాల ప్రజలను కలుపుకుపోయే విధానాలను విడనాడిన అతి జాతీయవాద ప్రభుత్వాలు ఏకపక్ష ధోరణులు అనుసరించాయి. అన్ని వర్గాల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోలేదు. రష్యన్లు అధికంగా ఉండే పశ్చిమ యుక్రెయిన్ ప్రాంతాలపై వివక్ష చూపి అణచివేతకు గురిచేసాయి. రష్యన్ భాషను అధికార భాషల నుండి తొలగించడం, రష్యన్ టి.వి ఛానల్స్ రద్దు చేయడం, రష్యాకు వ్యతిరేకంగా యూరోపియన్ యూనియన్, అమెరికాలతో సంబంధాలు పెంచుకోవడం, రష్యన్ల ప్రయోజనాలను కాపాడుతామనే హామీ ఇవ్వకపోగా రష్యాకు వ్యతిరేకంగా పశ్చిమ దేశాలతో కలిసి యుక్రెయిన్ పాలకులు కుట్రలకు తెరలేపారు. యుక్రెయిన్ విధానాల వల్ల నల్లసముద్రం ప్రాంతంలో అధికార సమతౌల్యం దెబ్బతింటుందన్నది రష్యా భయం.

భౌగోళిక వ్యూహాత్మక కేంద్రంగా ఉన్న నల్ల సముద్రం చుట్టూ ఉన్న దేశాలలో రష్యా, యుక్రెయిన్ తప్ప మిగిలినవన్నీ 'నాటో' కూటమిలో చేరాయి. అందువల్ల బఫర్‌జోన్ కోసం అమెరికా, ఇయు ప్రయత్నిస్తున్నాయి. యుక్రెయిన్ నాటోలో చేరితే నల్లసముద్రంపై నాటో ఆధిపత్యం నెలకొని ఆయుధ నౌకలు, సరుకు నౌకలు స్వేచ్ఛగా సంచరించే అవకాశం ఉంది. ఇది రష్యా భద్రతకు ప్రమాదకరమంటూ 18.3.2014న యుక్రెయిన్ రాష్ట్రమైన క్రిమియాను ఆక్రమించుకొని రష్యాలో విలీనం చేసుకుంది. ఆ తర్వాత 2014లో తూర్పు యుక్రెయిన్ రాష్ట్రాలైన డొనెట్స్క్, లూహాన్స్క్ స్వతంత్రత ప్రకటించుకోవడానికి రష్యా అన్ని రకాల సాయం చేయడమేకాక అధికారిక గుర్తింపునిచ్చింది. రష్యన్లు అధికంగా ఉన్న ఈ ప్రాంతాన్ని డాన్‌బాస్ ప్రాంతం అని కూడా పిలుస్తారు. డాన్‌బాస్‌లో వేర్పాటువాదుల యుద్ధం, క్రిమియా ఆక్రమణలు యుక్రెయిన్‌లో అభద్రతను పెంచాయి. రష్యా, యుక్రెయిన్‌ల మధ్య సైబర్‌వార్, హ్యాకింగ్, సమాచార వ్యవస్థలపై దాడులు సర్వసాధారణంగా మారాయి. క్రిమియా ఆక్రమణ తర్వాత రష్యాపై ఆంక్షలు విధించిన పశ్చిమ దేశాలు రష్యాను జి-8 నుండి తొలగించి జి-7గా మార్చటం రష్యా ప్రతీకార ధోరణికి కారణమైంది. డాన్‌బాస్ యుద్ధం తర్వాత కుదిరిన మిన్స్క్ శాంతి ఒప్పందం ఒకటి, రెండు(2014, 2015) గడువు 2022 ఫిబ్రవరి 21తో ముగియడంతో ఫిబ్రవరి 24న తాజా యుద్ధానికి నాంది పడింది.

నాటో సభ్యత్వానికి ఉక్రెయిన్ కట్టుబడి ఉండటం, యుద్ధ నేరాల కింద రష్యాపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు విచారణ ప్రారంభించడం, జెలెన్స్కీ ఐరోపా పార్లమెంట్ మద్దతు కోరటం పరిస్థితిని మరింత విషమం చేసింది. ఐరోపా, యురేషియాలో విస్తరించి ఉన్న ప్రాదేశిక భూభాగాలపై ఆధిపత్యం కోసం ప్రచ్ఛన్న యుద్ధకాలం నుండి అగ్ర దేశాలైన అమెరికా, రష్యాల మధ్య కొనసాగుతూ వచ్చిన పోరులో

మలి దశ ప్రారంభానికి సూచిక యుక్రెయిన్‌పై రష్యా యుద్ధం. 2014లో క్రిమియా ఆక్రమణ తర్వాత రష్యా నుండి ముప్పు తప్పదని భావిస్తున్న యుక్రెయిన్ నాటోలో తమను చేర్చుకోవాలని అభ్యర్థించింది. రష్యా 2021 డిసెంబర్‌లో యుక్రెయిన్‌కు సభ్యత్వం ఇవ్వవద్దని నాటోను డిమాండ్ చేసింది. దీనిని నాటో కూటమి తిరస్కరించింది. ఇది తాజా తక్షణ కారణం. నాటోలో చేరకుండా యుక్రెయిన్‌ను కట్టడి చేయాలని రెండు లక్షల సైన్యాన్ని తరలించింది. నిజానికి నాటో కూటమిలో చేరాలా వద్దా అన్నది ఒక సార్వభౌమాధికార దేశంగా పూర్తిగా యుక్రెయిన్ ఇష్టాయిష్టాలపైనే ఆధారపడి ఉంటుంది. ఆ విషయాన్ని అ దేశ ప్రజలు నిర్ణయించుకోవాలి. అయితే, యుక్రెయిన్ స్వయం నిర్ణయాధికారాన్ని గుర్తించడానికి అంగీకరించని రష్యా తెంపరితనమే ఐరోపాలో తాజా యుద్ధాన్ని రాజేసింది.

యుక్రెయిన్‌లో తీవ్ర మానవ సంక్షోభం :

ఫిబ్రవరి 24, 2021న యుక్రెయిన్‌పై రష్యా బాంబుదాడులతో ప్రారంభమైన యుద్ధంవల్ల పదివేల పైగా మరణించారు, క్షతగాత్రులైన వారి సంఖ్య యాభైవేలు దాటింది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం తీవ్ర మానవ సంక్షోభానికి దారితీస్తోంది. భీకర క్షిపణి, బాంబు దాడులతో దిక్కుతోచని స్థితిలోకి జారిపోయిన నిస్సహాయ పౌరులు గూడు చెదిరి, గుండె పగిలి పొట్టచేత బట్టుకొని పరాయి దేశాలకు వలసపోతున్నారు. రక్తపాతం, విధ్వంసానికి దూరంగా కొత్త జీవితాన్ని ప్రారంభించేందుకు ఉద్యుక్తులవుతున్నారు. యుద్ధం ఆరంభమైన నెలరోజుల్లోనే ఈ శరణార్థుల సంఖ్య 30 లక్షలు దాటిపోయింది. యుక్రెయిన్ వీడేవారిలో ఎక్కువ మంది పశ్చిమాన ఉన్న పోలాండ్, మాల్డోవా, స్లోవేకియా, రొమేనియా, హంగరీలకు వెళ్తున్నారు.

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఐరోపాలో ఇంత భారీ స్థాయిలో వలసపోవడం ఇదే మొదటిసారని ఐరాస హై కమీషనర్ ఫర్ రెఫ్యూజీస్ (యూఎన్‌హెచ్‌సిఆర్) తెలిపింది. ఈ సంఖ్య 70 లక్షలకు చేరొచ్చని ఐరోపా సంక్షోభ నిర్వహణ విభాగం కమీషనర్ పేర్కొన్నారు. 1.8 కోట్ల మంది యుక్రెయిన్ వాసులపై ఈ యుద్ధ ప్రభావం పడొచ్చని తెలిపారు. ఇది ఈ శతాబ్దంలోనే అతిపెద్ద శరణార్థి సంక్షోభంగా మారొచ్చని ఐరాస హెచ్చరించింది. యుక్రెయిన్‌లో యుద్ధం వల్ల గూడు చెదిరి, స్వదేశంలోనే ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నవారూ ఎక్కువగానే ఉన్నారు. యూఎన్‌హెచ్‌సిఆర్ అంచనా ప్రకారం వీరి సంఖ్య 1.6 లక్షల మేర ఉండొచ్చు.

పౌర నివాసాలపై బాంబుల వర్షం :

యుక్రెయిన్‌లోని ప్రధాన నగరాలైన కీవ్, లివీవ్, మారియుపోల్ సహా మరికొన్ని నగరాలపై రష్యా సేనలు క్షిపణి దాడులు, షెల్లింగ్‌లతో విరుచుకుపడ్డాయి. జన నివాసాలు, ఆసుపత్రులు, బడులతో పాటు యుద్ధ బాధితులు తలదాచుకుంటున్న శిబిరాలను కూడ లక్ష్యంగా చేసుకుని బాంబుల వర్షం కురిపించాయి. యుక్రెయిన్‌లోని అజోవ్ సముద్ర తీరంలో ఉన్న మారియుపోల్ నగరం ఇప్పుడు రష్యా దాడులతో అనవాళ్లు కోల్పోయింది. 90 శాతం నగరం పూర్తిస్థాయిలో ధ్వంసమైంది. ఎక్కడ చూసినా, శవాల దిబ్బలు, సామూహిక ఖననాలు! ఏ వీధిలో చూసినా మొండి గోడలతో దర్శనమిచ్చే ఇళ్లు. ఈ నగరాన్ని పునర్నిర్మించడం దాదాపుగా అసాధ్యమే. మారియుపోల్‌లో ఇప్పటికే చిన్నారులు సహా 2,700 మంది పౌరులు చనిపోయారు. రష్యా వైమానిక దళాల దాడిలో ధ్వంసమైన మూడంతస్తుల డ్రామా థియేటర్ శిథిలాల కింద సుమారు 1,300 మంది చిక్కుకుపోయారని, 130 మందిని వెలికితీశామని యుక్రెయిన్ పార్లమెంట్ మానవ హక్కుల కమీషనర్ ల్యూద్మిలా డెనిసోవా తెలిపారు.

ముగింపు :

యుక్రెయిన్ నుంచి ఎలాంటి కవ్వింపు చర్యలు లేకుండానే ఇవాళ రష్యా ఎందుకు దాడి చేస్తోంది? యుక్రెయిన్ యురోపియన్ యూనియన్, నాటోలో చేరాలని రెండేళ్లుగా ఉవ్విళ్లూరుతున్నది. అదే జరిగితే రష్యా ఆధిపత్యానికి, అభద్రతకు పెద్ద ప్రమాదమే వస్తుందని రష్యా అంటోంది. అందువల్లనే యుక్రెయిన్‌ను నాటోలో చేర్చుకోవద్దని రష్యా కోరుతున్నది. నాటో నుండి ఏలాంటి సమాధానం రానందున తన బలమేమిటో అమెరికాకు, నాటోకు చూపించాలన్నది పుతిన్ భావన. డాన్‌బాస్ ప్రాంతాన్ని విముక్తం చేస్తానని చెప్పి యుక్రెయిన్‌పై యుద్ధం ప్రకటించాడు. దీనర్థం అమెరికా తోలుబొమ్మ యుక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ని తొలగించి తన తోలుబొమ్మ అధ్యక్షుడిని అక్కడ పెట్టాలన్న తపన కన్పిస్తోంది. ఈ మొత్తం వ్యవహారాన్ని గమనిస్తే రష్యా నల్ల సముద్రంపైన, క్రిమియాలోని చమురుపైనా, డాన్‌బాస్‌లోని ఖనిజ సంపదపైనా సంపూర్ణ ఆధిపత్యం సాధించాలన్న లక్ష్యంతో రష్యా పావులు కదుపుతున్నట్లు స్పష్టమవుతున్నది. ఇందుకు రష్యా పరోక్షంగా చైనా సహకారాన్ని తీసుకుంటున్నది. బీజింగ్‌లో వింటర్ ఒలింపిక్స్ సందర్భంగా పుతిన్ బీజింగ్ వెళ్లాడు. చైనా అధ్యక్షుడు జి జిన్పింగ్, పుతిన్ మధ్య ఫిబ్రవరి 4న ఒక ఒప్పందం కుదిరింది. 5200 పదాలతో రాసుకున్న ఆ ఒప్పంద పత్రం ప్రపంచ భౌగోళిక రాజకీయాల్లో బలాబలాల పొందికలో మార్పును కోరేవిధంగా ఉంది. కొంత కాలంగా ప్రపంచ మార్కెట్ పునఃపంపిణి కోసం చైనా, రష్యాలు పోటీ పడుతున్నాయి.

రష్యా-యుక్రెయిన్‌ల యుద్ధం పైకి రెండు దేశాల మధ్య యుద్ధంగా కన్పించినా, అది సారాంశంలో అమెరికా-రష్యా సామ్రాజ్యవాద దేశాల ఆధిపత్య అంతర్యుద్ధంగా చూడాలి. రెండు శిబిరాల మధ్య అత్యంత భయంకరంగా కొనసాగే యుద్ధమిది. ఇది యుక్రెయిన్‌తోనే ముగిసే యుద్ధం కాదు. అందువల్ల యుద్ధమూలాలు యుక్రెయిన్ యుద్ధ క్షేత్రంలో దొరకవు. దాని పర్యవసానాలు యుక్రెయిన్‌కి మాత్రమే పరిమితం కావు. ప్రపంచ ఆర్థిక, రాజకీయ, భౌగోళిక స్థితిగతులలో యుక్రెయిన్-రష్యా యుద్ధ కారణాలు ఉన్నాయి. రెండు అగ్రరాజ్యాలు తమ భౌగోళిక రాజకీయ అవసరాల రీత్యా చేపడుతున్న యుద్ధం వల్ల యుక్రెయిన్ ప్రజలు సమిధలవుతున్నారు.

ఆర్థిక అసమాతలు, సంక్షోభాలు, యుద్ధాలు పెట్టుబడిదారీ

కార్ల్ మార్క్స్ కాపిటల్ నిత్య ప్రాసంగికత

మార్క్స్ ఉద్గ్రంథం కాపిటల్‌లో శ్రామికవర్గానికీ, ఇవాళ్టి ఆర్థిక వ్యవస్థకూ నిత్య ప్రాసంగికమైన అంశాలేమిటో వివరిస్తున్నారు **సాగర్ సన్యాల్**

కార్యకర్త, పత్రికా రచయిత, చరిత్రకారుడు, తత్వవేత్త, అర్థశాస్త్రవేత్త – తన జీవిత కాలంలో మార్క్స్ చాలా పాత్రలు పోషించాడు. అర్థశాస్త్రంలో ఆయన కృషికి శిఖరాయమానమైన విజయం మూడు సంపుటాల కాపిటల్. పెట్టుబడిదారులు ఆర్జించడానికి తీవ్రంగా ప్రయత్నించే పెట్టుబడి గురించి ఒక అర్థవంతమైన సిద్ధాంతాన్ని మొట్టమొదటిసారి ఆ మూడు సంపుటాలు విప్పిచెప్పాయి.

కాపిటల్ అన్నిటికన్న ఎక్కువగా పెట్టుబడి సంచయనం గురించిన ఒక పకడ్బందీ శాస్త్రాన్ని మనకు అందిస్తుంది. ఆ శాస్త్రాన్ని తమ విముక్తి కోసం కార్మికవర్గం జరిపే పోరాటంలో శస్త్రంగా ధరించాలని మార్క్స్ ఉద్దేశించాడు. ఒక ఆయుధంగా దానికి ఉన్న శక్తి గురించిన ఎరుక మొదటి నుంచీ ఉంది. మార్క్సిస్టు చరిత్రకారుడు డేవిడ్ రైజనోవ్ చెప్పినట్టు, 1867లో కాపిటల్ మొదటి సంపుటం ప్రచురణ అయిన వెంటనే ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ (మొదటి ఇంటర్నేషనల్) ఆమోదించిన ఒక తీర్మానంలో, "వివిధ దేశాల కార్మికులు కాపిటల్ ను అధ్యయనం చేయాలని" పిలుపునిచ్చింది. "పెట్టుబడిని శాస్త్రీయ విశ్లేషణకు గురిచేసిన, దాని మౌలిక అంశాలను కనిపెట్టిన మొట్టమొదటి అర్థశాస్త్రవేత్త" అనే గౌరవం మార్క్స్‌కు దక్కుతుందని ఆ తీర్మానం చెప్పింది.

ఇవాళ్టికి కూడా విప్లవకారులకు కాపిటల్ ఉపయోగం ఎంతమాత్రం తగ్గకుండా అలాగే నిలిచి ఉంది. ఈ పుస్తకం రాయడంలో మార్క్స్ పెట్టుకున్న రెండు ప్రధాన కర్తవ్యాలను పరిశీలించండి. మొదటిది, పెట్టుబడిదారీ సమాజంలో ఉండే ఆర్థిక వ్యవస్థను వివరించడం. రెండవది, కాలక్రమంలో ఆ పెట్టుబడిదారీ సంచయానికి ఉండే సంక్షుభిత చలన తర్కాన్ని వర్ణించడం. ఈ రెండు రంగాలలో మార్క్స్ సాధించిన లోచూపు ఇవాళ్టికీ విప్లవకారులకు తాము పనిచేస్తున్న రాజకీయ, ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవడానికి, ఆ పరిస్థితిని రూపొందిస్తున్న సామాజిక శక్తులను అర్థం చేసుకోవడానికి, భవిష్యత్ పరిణామాలను ఊహించడానికి ఒక మార్గదర్శిలా పనిచేస్తుంది.

పెట్టుబడిదారీ విధానం అనేదాన్ని ఒక సమగ్రమైన మొత్తంగా, ఒక ప్రపంచ వ్యవస్థగా అర్థం చేసుకోవాలని మార్క్స్ వాదించాడు. బడా వ్యాపారాలకూ కార్పొరేషన్లకూ (పెట్టుబడులకూ) మధ్య, ఆ పెట్టుబడులకు చోటిచ్చే పెట్టుబడిదారీ రాజ్యాల మధ్య పోటీయే ఆ ప్రపంచ వ్యవస్థకు చోదకశక్తి అని మార్క్స్ వాదించాడు. అందులోని వేరువేరు భాగాలు వేరువేరుగా ఎందుకు ప్రవర్తిస్తాయో అర్థం చేసుకోవాలంటే వాటిని ఆ సమగ్ర మొత్తంలో భాగంగా చూసినప్పుడు మాత్రమే సాధ్యమవుతుంది. పెట్టుబడీ, దానికి "సేవ చేసే, పరిరక్షించే" రాజ్యాలూ సంపూర్ణమైన అంతస్సంబంధాలలో ఉంటాయి. ఎందుకంటే పెట్టుబడీ, రాజ్యమూ రెండూ వర్గ విభజనతో ఉన్న సామాజిక వ్యవస్థలో "పాలక" పక్షం మీదనే లేచి నిలిచి ఉంటాయి.

ఆ వ్యవస్థ ఎట్లా రూపొందిందో మార్క్స్ వర్ణిస్తాడు. పెట్టుబడిదారీ విధానం తలెత్తక ముందు, యూరప్ ఒక భూస్వామ్య సమాజంగా ఉండేది. భూస్వామ్య ప్రభువులు, చర్చ్, రాచరికం అనే భూయాజమాన్య వర్గపు కార్యనిర్వాహక ప్రతినిధిగా రాజ్యం పని చేసేది. వాళ్లు ఏకమై ఇతర వర్గాలన్నిటి మీద, అంటే వర్తకుల మీద, చేతివృత్తుల వారి మీద, రైతుల మీద అధికారం చలాయించే వారు. పశ్చిమ యూరప్‌లో కొన్ని ప్రాంతాల్లో పద్నాలుగో శతాబ్ది నుంచీ పెట్టుబడిదారీ వర్గపు బృందాల సంపదా, అధికారమూ పెరగడం మొదలయింది. మొదట ఇది వర్తకులలో, బ్యాంకర్లలో జరిగింది. ఆ తర్వాత పదిహేడో శతాబ్ది తర్వాత నుంచీ పారిశ్రామిక వేత్తలలో జరిగింది.

ఈ దశలో పెట్టుబడిదారీ విధాన ఆవిర్భావం ఎంతమాత్రమూ శాంతియుతంగా, సంతోషకరంగా ఏమీ జరగలేదు. కాపిటల్ మొదటి

వ్యవస్థలో అంతర్భాగం. నిత్యం ఏదో ఒకచోట వనరుల కోసం, ఆధిపత్యం కోసం స్వతంత్ర దేశాలపై అగ్రరాజ్యాలు యుద్ధోన్మాదంతో వ్యవహరిస్తున్నాయి. అమెరికా, రష్యాలు తమ రాజకీయ, ఆర్థిక ప్రయోజనం కొరకు, తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడం కోసం ఈ యుద్ధం జరుగుతున్నది. ఇది యుక్రెయిన్ కార్మిక వర్గానికి గానీ, రష్యా కార్మిక వర్గానికి గానీ మేలు చేసేది కాదు. ఈ యుద్ధం ద్వారా పుతిన్ యుక్రెయిన్‌ను మూడుముక్కలు చేయాలని చూస్తున్నాడు. పుతిన్ జాతీయోన్మాదాన్ని రెచ్చగొడుతున్నాడు. దేశంలో అసమ్మతిని, రాజకీయ ప్రత్యర్థులను నియంతృత్వ పోకడలతో అణచివేస్తూ, రాజ్యాధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికి చేస్తున్న ప్రయత్నాల్లో భాగమే ఈ దాడి. కనుక ప్రపంచ కార్మిక వర్గం, ప్రపంచ ప్రజలు యుద్ధాన్ని ఆపాలని డిమాండు చేయాలి. రష్యా, యుక్రెయిన్ కార్మికవర్గం అమెరికా, రష్యా యుద్ధోన్మాద సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాలి. నాటో విస్తరణవాదాన్ని వ్యతిరేకించాలి. ప్రపంచవ్యాప్తంగా యుద్ధం వద్దు, శాంతి కావాలన్న నినాదం మారుమోగాలి. యుద్ధానికి వ్యతిరేకంగా శాంతి ఉద్యమం నిర్మించాల్సిన సందర్భం ఇది.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, రాజనీతిశాస్త్ర విద్యార్థి)

సంపుటంలో మార్క్స్ రాసినట్టు, "అమెరికాలో బంగారం, వెండి కనిపెట్టడం, మూలవాసి ప్రజానీకాన్ని నిర్మూలించడం, బానిసలుగా మార్చడం, మృతదేహాలతో గనులు నింపడం, తూర్పు ఇండీస్‌ను జయించి కొల్లగొట్టడం, నల్ల చర్మాల మనుషుల వ్యాపార వేట కోసం ఆఫ్రికాను వేటస్థలంగా మార్చడం, ఇవీ పెట్టుబడిదారీ ఉత్పత్తి యుగాన్ని ఉజ్వలంగా ఉదయింపజేశాయి".

హింసాత్మక విజయంతో, బానిసత్వంతో కూడిన ఆ "ఉజ్వల ఉదయం" వర్తకుల చేతుల్లో విస్తారమైన డబ్బు కుప్పలను పోగుచేసి పెట్టింది. ఆ డబ్బుకుప్పలను ఏం చేసుకోవాలి? భూభాగాల కోసం, ఓడరేవుల కోసం, వర్తకమార్గాల కోసం జరిపే యుద్ధాలకు పెట్టుబడిగా వాళ్లు తమ రాజ్యాలకు అప్పు పెట్టారు. ఆ విధంగా, "సమాజపు సాంద్రీకృత, సంఘటిత శక్తి" అని మార్క్స్ నిర్వచించిన రాజ్యపు అధికారాన్ని, "భూస్వామ్య ఉత్పత్తి విధానం పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంగా మారే ప్రక్రియను హడావుడిగా వేగవంతం చేయడానికి, ఆ పరివర్తనా కాలాన్ని తగ్గించడానికి వాడుకున్నారు. ఆ వర్తకులే పారిశ్రామికవేత్తలకు కూడా పెద్ద మొత్తాలు అప్పు పెట్టి, వారు భూస్వామ్య సమాజంలో పరిశ్రమను నిర్దేశించిన చేతివృత్తులవారి శ్రేణులతో పోటీ పడడానికి దోహదం చేశారు. అలా కార్ఖానాలలో శ్రమ ప్రక్రియను పునస్సమీకరించడానికి, ఇంకా కఠినమైన అధికారిక అదుపు తీసుకురావడానికి దోహదం చేశారు.

మరొకవైపు తమ పారిశ్రామికవేత్తలు మార్కెట్లను ఆక్రమించడానికి, పోటీదార్లను గల్లంతు చేయడానికి రాజ్యాలు సహాయం చేశాయి. ఉదాహరణకు పద్దెనిమిదో శతాబ్దిలోని బ్రిటిష్ పారిశ్రామిక విప్లవం వస్త్రాలతో ముడిపడి ఉంది. బ్రిటిష్ వస్త్రాలు భారతదేశం నుంచి ఎగుమతి పోటీని ఎదుర్కొన్నాయి. అప్పటికి భారతదేశమే వస్త్ర ఎగుమతుల దేశంగా అగ్రస్థానంలో ఉంది. భారతదేశంలో బ్రిటిష్ పాలన బ్రిటిష్ వస్త్ర తయారీదార్ల కోసం భారతదేశపు వస్త్ర పరిశ్రమను దెబ్బతీసింది. మరొకవైపు ఆ బ్రిటిష్ వస్త్ర తయారీదార్లు అమెరికా దక్షిణ రాష్ట్రాలలోని పెట్టుబడిదారులు బానిసలతో నడిపించిన క్షేత్రాల నుంచి పత్తి సంపాదించారు. అలా శక్తిమంతమైన యూరపియన్ దేశాల పెట్టుబడులూ, రాజ్యాలూ ఒక ప్రపంచ ఆర్థిక వ్యవస్థను నిర్మించాయి.

పద్దెనిమిదో శతాబ్దిలో పారిశ్రామికవేత్తలు ఉత్పత్తి ప్రక్రియ స్వరూపాన్ని మార్చడం మొదలు పెట్టినప్పటి నుంచీ, నిర్దిష్ట మొత్తపు డబ్బును మరింత డబ్బుగా మార్చే ఒక క్రమపద్ధతిని కనిపెట్టారు. అది తాము వారం పొడవునా పనిచేయించుకున్న శ్రామికులకు వేతనాలు ఎలా చెల్లిస్తారనేదానిమీద ఆధారపడింది. ఇది వివరించడానికి ఒక సులభమైన ఉదాహరణ: మీరూ మీ ప్రత్యర్థీ ఒక శ్రామికుడిని ఒక వారం కోసం పనికి తీసుకున్నారనుకోండి. ఆ సమయంలో మీరు మీ శ్రామికుడి నుంచి మీ ప్రత్యర్థి రాబట్టినదాని కన్న ఎక్కువ సరుకులు రాబట్టగలిగితే, అప్పుడిక మీరు మార్కెట్ లో మీ ప్రత్యర్థి ధరల కన్నా తక్కువ ధరలకు సరుకులు అమ్మగలరు. కాలక్రమంలో ప్రత్యర్థి మార్కెట్ వాటాను ఆక్రమించగలరు. ఈ పోటీ ఉరవడి పారిశ్రామికవేత్తలు తమ శ్రమవారపు కాలాన్నీ, తీవ్రతనూ పెంచుతూ పోవడానికి, ఒకే సమయంలో ఎక్కువ సరుకులు ఉత్పత్తి చేయడానికి దారి తీసింది.

ఉత్పాదకతను పెంచడానికి మరొక సాధనం ఉత్పత్తి ప్రక్రియలో అంతకంతకూ ఎక్కువ శ్రమ విభజనను ప్రవేశ పెట్టడం. తద్వారా ఒకే శ్రామికుడు ఎన్నో పనులు చేసే బదులు, ఒక్కొక్క శ్రామికుడికి ఒక్కొక్క పని ఇవ్వడం జరిగింది. చివరికి, పందొమ్మిదో శతాబ్ది మొదటి అర్ధభాగానికల్లా ఉత్పత్తి ప్రక్రియలోకి మరిన్ని యంత్రాలను ప్రవేశపెట్టడం ద్వారా అంతకంతకూ ఎక్కువ పోటీ పడ్డారు. ఇచ్చిన ముడి సరుకులతో ఒక శ్రామికుడు ఒక రోజులో తయారు చేయగల ఉత్పత్తుల పరిమాణాన్ని విస్తరించారు. దానితో పరిణతి చెందిన పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానం రూపొందింది. దాన్నే మార్క్స్ సైద్ధాంతీకరించాడు. ఆ పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానమే ఇవాళ్టికి కూడ మనతో కొనసాగుతున్నది.

ఈ పెట్టుబడి సంచయం క్రమంలో ఏ నిర్దిష్ట ఆర్థిక నియమాలు, ధోరణులు తలెత్తుతాయో మార్క్స్ కాపిటల్ లో చూపాడు. ఈ నియమాలు మనకు పైపైన కనబడే ఉపరితల దృగ్గోచరాంశాలలో తమంతట తామే ప్రత్యక్షంగా వ్యక్తం కావు. అందుకు భిన్నంగా, లోలోతుల్లో సాగే ప్రవాహాలకూ ఉపరితలానికీ మధ్య మధ్యవర్తిత్వ శక్తులు ఉన్నాయి. ప్రత్యేక, నిర్దిష్ట ఉపరితల దృగ్గోచరాంశాలను అర్థం చేసుకోవాలంటే మనం సమగ్ర మొత్తాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. లోలోతుల ఆర్థిక ధోరణులు మధ్యవర్తిత్వ ప్రవాహాలతో, ఉపరితల చలనాలతో అంతస్సంబంధంలోకి వచ్చి తద్వారా సామాజిక వాస్తవికతను ఎలా రూపొందిస్తాయో చూపడమే సామాజిక శాస్త్రాలలో మార్క్స్ సాధించిన అద్భుత విజయాలలో ఒకటి. ఈ నేపథ్యంలో కాపిటల్ మొదటి, మూడవ సంపుటాలలో ఉన్న మూడు అంతస్సంబంధాల నియమాలను పరిశీలించండి.

మొదటిది, "విలువ నియమం". సరుకుల ధరలు తమను తయారు చేయడంలో వెచ్చించిన శ్రమ కాలపు పరిమాణం ద్వారా తమలో నిక్షిప్తమై ఉన్న విలువను ప్రతిఫలిస్తాయి. దీని అర్థం ధరలు విలువను ప్రత్యక్షంగా ప్రతిఫలిస్తాయని కాదు. అది ఒక మధ్యవర్తిత్వ పద్ధతిలో జరుగుతుంది. ఆ విలువకు సంబంధించిన ధర ఆ విలువకు అటూ ఇటూ ఊగిసలాడడానికి, డిమాండ్, సప్లైలలో స్వల్పకాలంలో జరిగే మార్పులు దోహదం చేయవచ్చు.

రెండవది, "పెట్టుబడి సంచయపు సాధారణ నియమం". ఇది పోటీ వల్ల ఉత్పత్తి పద్ధతులు అంతకంతకూ ఎక్కువగా యంత్రాలను ఉపయోగించే దిశలోకి నెట్టబడే కొద్దీ వెలికివచ్చే నియమం. ఈ క్రమం సమాజాన్ని రెండుగా – అసహ్యకరమైనంత సంపద కలిగిన అతి చిన్న, నానాటికీ తగ్గిపోయే పెట్టుబడిదారుల వర్గం ఒకటీ, అతి విశాలమైన, నానాటికీ పెరిగిపోయే అత్యధిక సంఖ్యాక శ్రామికవర్గం మరొకటీగా విభజిస్తుంది. ఇది ఎందువల్ల జరుగుతుందంటే ఉత్పత్తి యాంత్రీకరణ పెరిగిపోతున్నకొద్దీ, అది స్వతంత్ర సరుకుల ఉత్పత్తిదారుల, చేతివృత్తుల వారి, రైతుల అవసరాన్ని కత్తిరిస్తూ, వారిని నిర్వాసితులను చేస్తూ, వారిని కార్మికులుగా మారుస్తూ ఉంటుంది. ఉత్పత్తి ప్రక్రియ పరిమాణమూ, సాంకేతిక పరిజ్ఞాన ఆధునీకరణా పెరిగిన కొద్దీ, కేవలం పెద్ద పెట్టుబడిదారులు, భారీ యంత్ర సామగ్రి మీద పెద్ద ఎత్తున మదుపు పెట్టగలవారు మాత్రమే మిగిలిపోతారు.

ఈ ప్రక్రియ ఎప్పటికప్పుడు కార్మికవర్గంలో కొన్ని భాగాలను అవసరం లేనివారిగా మార్చేస్తూ ఉంటుంది. వారి శ్రమను యంత్రాలు చేస్తూ ఉంటాయి. ఎక్కువ హేతుబద్ధంగా సంఘటితమైన సమాజంలో ఈ పరిణామం మంచిదే. అది అందరికీ ఎక్కువ విశ్రాంతి కాలం దొరకడానికి దారి తీస్తుంది. కాని అందుకు భిన్నంగా, పెట్టుబడిదారీ విధానంలో అది కేవలం కొందరు కార్మికులను నిరుద్యోగపు చెత్త కుండీలోకి తోసివేస్తూ ఉంటుంది. కార్మికులుగా మిగిలినవారు ఎక్కువ శ్రమ చేసే స్థితి కల్పిస్తుంది.

ఈ కఠోర ఆర్థిక క్రమపు మానవ ముఖాన్ని మార్క్స్ కాపిటల్ మొదటి సంపుటంలో క్లుప్తంగా ఎలా చెపుతాడంటే: "పెట్టుబడిదారీ విధానం లోపల, శ్రమ యొక్క సామాజిక ఉత్పాదకతను పెంచడానికి తీసుకొచ్చే అన్ని పద్ధతులకూ వ్యక్తిగత కార్మికుడే మూల్యం చెల్లించవలసి వస్తుంది. ఉత్పత్తిని అభివృద్ధి చేసే సాధనాలన్నీ తమను తాము ఉత్పత్తిదారుల మీద ఆధిపత్యం సాధించే, దోపిడీ చేసే సాధనాలుగా మార్చుకుంటాయి. అవి కార్మికుడిని ఒక మనిషిలోని ముక్కగా ఛిద్రం చేస్తాయి. ఒక యంత్రానికి అనుబంధంగా కుదించిపారేస్తాయి. అతని శ్రమలోని సౌందర్యపు ప్రతి అవశేషాన్నీ ధ్వంసం చేసేస్తాయి, చివరికి తన శ్రమను తానే ద్వేషించే చాకిరీగా మార్చేస్తాయి."

మూడవది, పెట్టుబడిదారీ విధానం కింద ఉత్పత్తి పద్ధతులు అంతకంతకూ ఎక్కువగా యాంత్రీకరణ పొందుతాయి గనుక, యావత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో లాభాల రేటు పడిపోయే ధోరణి తలెత్తుతుంది. ఇది శతాబ్దాలపాటు సాగే మందకొడి పరిణామంగా ఉంటుంది. అలాగే అది ప్రతి కొన్ని దశాబ్దాలకు ఒకసారి ఉత్థాన పతనాలలో వేగవంతమైన పరిణామంగా కూడా వ్యక్తమవుతుంది. పదే పదే తలెత్తే ఈ ఆర్థిక, సామ్రాజ్యవాద సంక్షోభాల వలయాలలో కార్మికులు నిరుద్యోగానికి గురవుతారు. జీవన ప్రమాణాలను తగ్గించే పాలకవర్గ దాడులకు గురవుతారు, అభివృద్ధి నిరోధక జాతీయవాద ఉరవడికి గురవుతారు. యుద్ధానికి గురవుతారు. 2007–08 ప్రపంచ ద్రవ్య సంక్షోభం తర్వాత నిస్సారమైన ఆర్థిక పునరుద్ధరణ జరిగిన గత దశాబ్దంలో అక్షరాలా ఇవన్నీ జరగడం మనం చూశాం.

ఈ నియమాల ప్రాధాన్యత ఏమిటి? అన్నిటికన్న ముఖ్యంగా, అవి కార్మికవర్గ విప్లవ అవసరాన్ని బలోపేతం చేస్తాయి. కాపిటల్‌లో మార్క్స్ విశ్లేషణ మిగిలిన వాటికన్న ఎక్కువగా చూపేదేమంటే, పెట్టుబడిదారీ విధానం కింద కార్మికవర్గానికి శ్రేయోదాయకమైన ముగింపుకు అవకాశం లేదు అని. అలాగే పెట్టుబడిదారీ విధానం కింద ప్రపంచానికి శాంతియుతమైన, సుస్థిరమైన భవిష్యత్తు లేదు అని. పెట్టుబడిదారీ సంచయపు ధోరణులను వాటి మానాన వాటిని వదిలేస్తే, ప్రపంచ పెట్టుబడిదారీ వర్గం మొత్తంగా కార్మికులు ఉత్పత్తి చేసే సంపదను ఇంకా ఎక్కువగా ఆక్రమిస్తూ పోతుంది. అంటే కార్మికుల మీద తన అధికారాన్ని పెంచుకుంటూ పోతుంది. ఇంకా ఎక్కువ శక్తిమంతమైన సైనిక బలగాలు, ఇంకా ఎక్కువ పోలీసు బలగాలు, ఇంకా ఎక్కువ నిఘా, ఇంకా ఎక్కువ ప్రచారంతో సరుకులను అంటగట్టడం, విలాస నౌకలు, సొంత జెట్ విమానాలు, రోదసీ వాహనాలు వంటి వాటి మీద వనరులను వృథా చేసే శతకోటీశ్వరుల విలాసాలు సాగిపోతూనే ఉంటాయి.

అదే సమయంలో, పెట్టుబడి సంచయానికి ఉండే పోటీ చలనతర్కం వల్ల జరిగిపోయే విధ్వంసం ఇంకా ఇంకా ఎక్కువ పరిమాణాలకు పెరిగిపోతుంది. మనం ఇంకా ఇంకా ఎక్కువ విధ్వంసకరమైన యుద్ధాలనూ, పర్యావరణ వినాశనాన్నీ చూస్తాం. మనుషుల స్థాయిలో మరింత పరాయీకరణను, రోజువారీ దోపిడీ తిరగలిలో నలిగి వికలమై పోయిన శరీరాలనూ మనసులనూ చూస్తాం. సాధారణ మానవసంబంధాలలో మరింత హింసనూ, ఉత్పాతాన్నీ చూస్తాం. ఈ వ్యవస్థ ఎంత పెద్దదిగా, ఎంత శక్తిమంతంగా మారుతూపోతుందో, అంతగా అత్యధిక సంఖ్యాక ప్రజానీకమూ, వారు ఆధారపడి ఉన్న భూగోళమూ బాధలకు గురవుతారు.

ఈ రాజ్యాన్ని మనం ధ్వంసించినప్పుడు మాత్రమే, సమాజపు ఉత్పత్తి సాధనాలను మన చేతుల్లోకి తీసుకున్నప్పుడు మాత్రమే, సామాజిక వనరులను ప్రజానీకపు ప్రయోజనాల దిశగా మళ్లించినప్పుడు మాత్రమే, మనం మానవజాతికి ఒక కొత్త మార్గాన్ని రూపొందించగలం. పెట్టుబడిదారీ విధానం గురించీ, దాని సంచయన చలన తర్కం గురించీ కాపిటల్ ఇచ్చిన దృక్కోణం ఈ కర్తవ్యంలో విప్లవ సంస్థలకు ఆసరా ఇచ్చే, మార్గదర్శకత్వం అందించే నిర్మాణాన్ని రూపొందిస్తుంది. యూనివర్సిటీ ప్రొఫెసర్లు, సోషల్ డెమొక్రటిక్ రాజకీయవేత్తలతో కూడిన సైన్యం కాపిటల్ ను భూస్థాపితం చేయడానికి నిరంతరాయంగా ప్రయత్నిస్తున్నారు. వాళ్లు కాపిటల్ విప్లవాత్మకతను తొలగించదలచారు. లేదా అది తప్పని రుజువైందనీ, అసమగ్రమనీ, కాలం చెల్లిందనీ, సంకుచిత, నిర్ణాయకవాదమనీ, వగైరా వగైరా ఎన్నో మాటలతో (అయితే ఆ మాటలన్నీ కూడా ఎప్పుడో తిరస్కారానికి గురైన తప్పుడు వ్యాఖ్యానాల మీద ఆధారపడినవే) ఊరికే దాన్ని తోసేయడానికి ప్రయత్నిస్తూ వచ్చారు. అయినా ఆ మహత్తర రచనను రాజకీయాల నుంచి శాశ్వతంగా తొలగించడం అసాధ్యమని రుజువైంది.

వాస్తవికతే కాపిటల్‌ను అటు ప్రధాన స్రవంతిలోనూ, ఇటు మౌలిక ఆలోచనాపరులలోనూ ఎప్పటికప్పుడు ప్రాసంగికం చేస్తున్నది. 2007–08 ప్రపంచ ద్రవ్య సంక్షోభాన్ని వివరించడానికి ప్రధానస్రవంతి ఆర్థిక వ్యాఖ్యాతలు మల్లగుల్లాలు పడుతున్నప్పుడు, వారిలో కొందరు పెట్టుబడిదారీ విధానం గురించి మార్క్స్ చేసిన విశ్లేషణల్లో ఒకటో రెండో పనికొచ్చే సంగతులున్నాయేమో అనడం మొదలుపెట్టారు. అరబ్ స్ప్రింగ్ ఉద్యమాల నేపథ్యంలో, 2019 నుంచీ పెల్లుబుకుతున్న తిరుగుబాట్ల నేపథ్యంలో కొత్తగా విప్లవీకరణ చెందుతున్న యువతరం కాపిటల్ వైపు చూస్తున్నారు. కాపిటల్ అనేది పాలకవర్గాలను ఇంకా వెన్నాడుతున్న భూతంగానే ఉంది.

(రచయిత ఆస్ట్రేలియాలోని యూనివర్సిటీ ఆఫ్ మెల్ బోర్న్‌లో పరిశోధకులు. ఈ వ్యాసం ఆస్ట్రేలియాలోని మార్క్సిస్టు విప్లవ బృందం సోషలిస్ట్ ఆల్టర్నేటివ్‌కు చెందిన పత్రిక రెడ్ ఫ్లాగ్‌లో 2022 మార్చ్ 6న ప్రచురితమై, మంత్లీ రివ్యూ వెబ్ సైట్ మీద పునర్ముద్రణ జరిగింది. తెలుగు అనువాదం: ఎన్ వేణుగోపాల్) వీ

హత్యలు, అత్యాచారాలు - "గౌరవ దినం"

***ఆదివాసి ప్రాంతాలలో బీభత్సం సృష్టిస్తూ, ఆదివాసుల హక్కులను కొల్లగొడుతూ మరోవైపు ఆదివాసి గౌరవ దినం ప్రకటిస్తున్న పాలక కుటిల నీతిని వివరిస్తున్నారు* ఏమ్లా వాగాలు**

దండకారణ్య ప్రజలు ఎంతో ఉత్సాహంగా, పోరాట సంకల్పం, పట్టుదలలతో ఫిబ్రవరి 10 భూంకాల్ దినం గ్రామ గ్రామాన ఘనంగా జరుపుకున్నారు. భూంకాల్ దినం ఆదివాసీ ప్రజా రాజ్యాధికార దినానికి ఒక చారిత్రక సంకేతం. బ్రిటిష్ సామ్రాజ్యవాదులతో వీరోచితంగా పోరాడి వారిని తన్ని తరిమి 1910లో బస్తర్ ఆదివాసులు బార్సూలో తమ రాజ్యాన్ని ప్రకటించుకున్న రోజు ఫిబ్రవరి 10. దానిని వారు మాడియారాజ్‌గా ప్రకటించుకున్నారు. చరిత్రలో కేవలం 40 రోజులు మాత్రమే అది కొనసాగినప్పటికీ దాని చారిత్రిక ప్రాధాన్యత గొప్పది. చరిత్రలో పారిస్ కమ్యూన్ 72 రోజులే నిలిచినా అది ఈనాటికి శ్రామిక ప్రజలకు ఒక ఆశా కిరణం. అనుభవసారం. భవిష్యత్తు విప్లవోద్యమాలకు దారి చూపిన రక్తసిక్తమైన చరిత్ర.

మాడియారాజ్‌ను స్థాపించిన వీరయోధుల వారసులు నేటి ఆదివాసీ తరం. వారి పోరాట అడుగుజాడలలో నడుస్తూ తమ అధికారం కోసం అసమాన త్యాగాలతో పోరాడుతున్నారు. అనేక చోట్ల వారు తమ జనతన సర్కార్లను ఏర్పర్చుకున్నారు. పంచాయతీ, ఏరియా, డివిజన్ స్థాయిలలో అవి ఏర్పడి పని చేస్తున్నాయి. మరోవైపు, ఝార్ఖండ్‌లో అక్కడి ఆదివాసీ ప్రజలు బిర్సాముండా జయంతి రోజు ఉల్ గులాన్ స్ఫూర్తితో పోరాడుతున్నారు. వారు అక్కడ క్రాంతికారి కిసాన్ కమిటీలు ఏర్పర్చుకొని అనేక విజయాలు సాధించారు.

దేశంలోని ఆదివాసీ ప్రజల పోరాట విజయాలను వమ్ము చేయడానికి ప్రస్తుత హిందుత్వ శక్తులు దేశవ్యాప్తంగా ఆదివాసీ ప్రాంతాలలో ప్రహార్-3 పేరుతో భారీ అణచివేత కేంపెయినను కొనసాగిస్తున్నారు. ఈ ప్రాంతాలలో కార్పెట్ సెక్యూరిటీ పేరుతో అనేక పోలీసు క్యాంపులను, ఫార్వర్డ్ ఆపరేషనల్ బేసులను ఏర్పరుస్తూ లక్షలాది ప్రజలను ఖాకీల బందీఖానాలో తుపాకుల నీడలో చుట్టుముడు తున్నారు. ఆదివాసీ ప్రజా పోరాటాలను నిర్దాక్షిణ్యంగా అణచివేస్తున్నారు. ఆదివాసీ మహిళలపై ఎడతెరిపి లేకుండా అత్యాచారాలకు పాల్పడుతున్నారు. సామూహిక అత్యాచారాలకు పాల్పడి వారిని హత్య చేసిన ఘటనలు కోకొల్లలు. ఇవి నేడు ఆదివాసీ ప్రాంతాలలోని అతి సాధారణ దృశ్యాలు. వీటికి మసిబూసి మారేడుకాయ చేయడానికే మోదీ నవంబర్ 15 నాడు ఆదివాసీ గౌరవ దినాన్ని ప్రకటించాడు. మరోవైపు ఖాకీల దుశ్చర్యలతో దండకారణ్య ఆదివాసీ మహిళలు ఎదుర్కొంటున్న జీవన్మరణ సమస్యలను చూద్దాం.

సుక్మా జిల్లా కన్నయగూడెం ఉండం అయితే అనే మహిళపై నవంబర్ 11 నాడు అంటే కేవలం ఆదివాసుల గౌరవదినానికి మూడే రోజుల ముందు జగ గుండా సంత నుండి వస్తుండగా దారికాచిన పోలీసులు నలుగురు అత్యాచారం జరిపి వదిలారు. ఇక ఆ గౌరవ దినం ప్రకటించిన రెండు వారాల లోపే అంటే నవంబర్ 29 నాడు అదే జిల్లాలోని లైన్ పెల్లి గ్రామానికి చెందిన మాడ్వి ఊరే కూడ అలాంటి ఘాతుకానికి గురైంది. ఆ మహిళ అదే సంతకు వెళ్లి వస్తుండగా అడవి దారిలో దాగి ఉన్న పోలీసులు ఆమె తమ సమీపంలోకి రాగానే ఆమెపై బడి అపహరించి గబ గబా నడుస్తుండగా, ఆమె ప్రతిఘటిస్తూ కేకలు వేయడంతో వెనుక వస్తున్న మహిళల గుంపు విని వారంతా ఆమెను కాపాడడానికి పరుగెత్తుక రావడం చూసి ఖాకీలు ఆమెను వదలి పారిపోయారు.

2017లో పీఎల్‌జీఏ గెరిల్లాలు ప్రజల సహకారంతో బుర్కపాల్ గ్రామ సమీపంలో పోలీసులపై దాడిచేసిన పిదప ఖాకీలు వరుసగా ఆ ఊరిని తమ లక్ష్యంగా మార్చుకొని గ్రామస్తులను ఇప్పటికీ వేధిస్తున్నారు. ఆ దాడి జరిగిన వెంటనే పోలీసులు గ్రామస్తులను అరెస్టు చేసి తీసుకెళ్లారు. వారిలో నుండి ముచాకీ వామన్ అనే యువకున్ని హత్య చేసి శవాన్ని పాతరేశారు. కొద్ది రోజుల వరకు శవం జాడ కూడ దొరుకలేదు. కానీ, ఆ తరువాత శవాన్ని ప్రజలు వెతికి బయటకు తీసి తమ సంప్రదాయం ప్రకారం అంత్య సంస్కారాలు జరుపుకున్నారు. జైలు పాలైన 38 మంది బుర్కపాల్ గ్రామస్తులకు ఈనాటి వరకు కనీసం బెయిలైనా దొరకడం లేదు. వారి కుటుంబాలు, వారి వ్యవసాయం, వారి జీవితాలు ఖాకీల, కోర్టుల అన్యాయానికి గత ఐదేళ్లుగా బలవుతూనే ఉన్నాయి. ఆ ఘటన తరువాత కేంద్ర ప్రభుత్వం 2017 మేలో ఆపరేషన్ సమాధాన్ ప్రకటించింది. 2022లో ఆ సమాధాన్ గడువు ముగియవస్తున్నా, జైలు పాలైన ఆదివాసులకు మాత్రం ఖైదీఖానా నుండి విముక్తి లభించడం లేదు. కటకటాల మధ్య బందీలుగా జీవితాలీడుస్తున్న వారు నానా యాతనలను అనుభవిస్తుండగా, ఇక్కడ ఊళ్లో పోలీసుల అత్యాచారానికి మరెందరో మహిళలు బలవుతున్నారు.

గత ఐదేళ్లుగా బుర్కపాల్ ఊర్లో ఒంటరిగా మహిళ బయట కనపడడం అంటే ఆమె ఖాకీల అత్యాచారానికి సిద్ధం కావడం తప్ప గత్యంతరం లేని నికృష్ట వాతావరణం నెలకొంది. ఆ గ్రామానికి చెందిన ముచాకీ కుషీ అనే మహిళ ఊరి చెరువు వద్దకు మరో ఐదుగురు మహిళలతో కలిసి స్నానానికి వెళ్లగా ఆమెను ఒంటరి చేసి ఖాకీలు అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ ఊరికే చెందిన మరో మహిళ తన వెంట ఓ 12 ఏళ్ల పాపను తీసుకొని పొయిల కట్టెల కోసం

అడవికి వెళ్లగా ఆ పాప కళ్లెదుటే, ఆ పాప చూస్తు భయంతో బెదిరిపోయి ఏడుస్తుండగా నిర్దాక్షిణ్యంగా, అతి పాశవికంగా ఆ మహిళపై అత్యాచారం జరిపి ఆ క్రౌర్యాన్ని బయటికి పొక్కనిస్తే హతమారుస్తామని ఆమెను బెదిరించి వదిలారు! 2005 నాటి సల్వాజుడుం నుండి ఇలాంటివి ఆ ప్రజల జీవితాలలో విడదీయరాని భాగమయ్యాయి. వీటిని వారు ప్రపంచానికి అనునిత్యం విన్నవించుకుంటున్నారు. తమను ఆదుకోవాలని వారు ప్రపంచ ప్రజలను కోరుకుంటున్నారు. అయినప్పటికీ, దేశ వ్యాప్త ఆదివాసీ ప్రాంతాలలో మావోయిస్టుల అణచివేత పేరుతో నూతన పోలీసు క్యాంపుల నిర్మాణాలు ఆగడమే లేదు. కేంద్రం రాష్ట్రాన్ని నిందిస్తే, రాష్ట్రం కేంద్రాన్ని నిందిస్తుందే తప్ప అంతా తోడుదొంగలుగా నాటకమాడుతున్నారనే అసలు విషయం ప్రజలకు తెలువనిది కాదు. ఈ దుష్ట పోలీసు క్యాంపులు మా మధ్య వద్దనీ, మావోయిస్టులతో మాకే ప్రమాదం లేదనీ, వారంతా తమ పిల్లలేననే నిజాలు ప్రపంచానికి వెల్లడిస్తున్నారు. నిజానికి ఈనాడు తమకు లభిస్తున్న ఆత్మగౌరవం తమ పోరాటాల వల్లేకానీ సల్వాజుడుంలతోనో, గ్రీన్‌హంట్లతోనే కాదనీ, అవి తమ గ్రామాలను వల్లకాడులుగా మార్చాయనీ, తమ కుటుంబాలను విచ్ఛిన్నం చేశాయనీ, తాము పరాయీకరణ చెందుతున్నామనీ నిజాయితీగా, ధైర్యంగా విశ్వాసంతో ప్రకటిస్తున్నారు.

నరేంద్ర మోదీ రాంచీలో ఆదివాసీ ప్రజా వీరుడు ఉల్ గులాన్ (విప్లవం) నిర్మాత బిర్సాముండా జయంతి రోజు నవంబర్ 15న జాతీయ ఆదివాసీ గౌరవ దినాన్ని ప్రకటించిన తరువాత దాదాపు 40 రోజులకు జగ గుండా ఏరియా పూలనపల్లి అనే ఆదివాసీ కుగ్రామంలో చింతల్నార్, నర్సపురం, జగద్గుండా పోలీసు క్యాంపులనుండి వందలాది ఖాకీ జవాన్లు ఊరునంతా దౌర్జన్యంగా దోచుకొని తిరిగి వెళ్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. అడ్డుకున్న వారిలో ఎప్పటిలాగే, అంతటిలాగే, ఆదివాసీ మహిళలు ముందున్నారు. కానీ, ప్రజల సొమ్ముతో తెగబలసిన ఖాకీలు ముఖ్యంగా డీఆర్ గూండాలు 10-12 మంది మహిళలను విపరీతంగా బాది, వారితో అసభ్యంగా వ్యవహరించి వదిలారు. ఈ మహిళలతో చింతల్నార్ హిందీ మీడియా స్థానిక పాత్రికేయులు శంకర్ జరిపిన ఇంటర్వ్యూ అంతర్జాలంలో అందరికీ అందుబాటులో ఉంది. ఎవరైనా చూడచ్చు.

ఇదే బుర్కపాల్ పోలీసులు డిసెంబర్ 21 నాడు రాత్రి మింప, చింతల్నార్ పోలీసులతో కలిసి మోర్పల్లి, కుమ్మ తోంగ్, దారెల్లీ, ఇత్తగూడా గ్రామాలపై దాడి చేసి రైతులను అరెస్టు చేసి తీసుకెళ్తుంటే అడ్డుకున్న మహిళలలో నుండి ముగ్గురిని జైలుకు పంపారు. ఆ తరువాత పామేడ్ పోలీసులు గస్తీ పేరుతో ముత్తమడుగు, కంచాల్, ధర్మవరం గ్రామాలపై బడి రైతులను అరెస్టు చేసి తీసుకువెళ్తుంటే అడ్డుకున్న మహిళలను చావబాదారు. ఇదీ ఆదివాసులకు పాలకుల భద్రతా బలగాల నుండి దక్కుతున్న గౌరవం. ప్రధాని మోదీ ప్రకటించిన ఆదివాసీ గౌరవ దినానికి కొద్ది ముందు జరిగిన ఘటనను కూడా చూద్దాం. పామెడ్ ఏరియా మేదగూడెం గ్రామానికి చెందిన మాడ్వి ఉంగీ అనే మహిళ తొలకరి సమయంలో తన పొలానికి దున్నడానికి వెళ్తుండగా దారిలో దాగబడి ఉన్న పోలీసులు ఆమెపై బడి అత్యాచారం జరిపారు.

కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించిన ప్రహార్ 3 సైనిక దాడులు దేశవ్యాప్తంగా విప్లవోద్యమ ప్రాంతాలలోని ఆదివాసులపై తీవ్రతరమ వుతున్నాయి. అమిత్ షా చేపట్టిన ఆపరేషన్ ప్రహార్‌లో ఆదివాసుల జీవించే హక్కే లేకుండా పోతుండగా, ఇక గౌరవం ఎక్కడిది! 2022 జనవరిలో చింతల్నార్, నర్సపురం, జగ గుండా పోలీసు స్టేషన్లకు చెందిన పోలీసులు, సీఆర్పీఎఫ్ జవాన్లు 4 బ్యాచులుగా బయల్దేరి పెదబోడ్కెల్, చినబోడ్కెల్, రాయగూడా గ్రామాలపై దాడి చేసి 7 గురు రైతులను అరెస్టు చేసి తీసుకెళ్తుండగా అడ్డం తిరిగిన మహిళలను అత్యాచారానికి గురవుతారనీ డీఆర్ గూండాలు బహిరంగంగా హెచ్చరించడమే కాకుండా నిస్సిగ్గుగా ప్యాంట్లు విప్పారు. మరోవైపు 5 రౌండ్లు కాల్పులు జరిపారు. అయినప్పటికీ అలాంటి దుశ్చర్యలన్నీ యేళ్ల తరబడిగా ఎదుర్కొంటూ జీవితంలో అనివార్య భాగంగా మారిన మహిళలు వాటికి వెరవకుండా తమ గ్రామాల రైతులను విడిపించుకున్నారు.

కొంటా ఏరియా కొల్లాయ్ గూడా గ్రామంలో డిసెంబర్లో కొత్త పోలీసు క్యాంపు వెలువడింది. ఇక ఆ ఊరి మహిళల అవస్థలకు అవధులు లేకుండా పోయాయి. ఆ గ్రామానికి చెందిన సోడి వీరీ అనే మహిళను మిట్ట మధ్యాహ్నం బోరింగువద్దకు నీళ్లకు వెళ్లగా ఆమెపై బడి అత్యాచారానికి పాల్పడుతుండగా ఊరి రైతులు అక్కడికి చేరడంతో పోలీసులు తప్పుకున్నారు. వీరి బతికి బయటపడింది. అదే ఊర్లో ఒంచే దేవే అనే మహిళ తన ఇంట్లో పడుకోగా, రాత్రివేళ ఇంట్లోకి చొరబడిన పోలీసులు ఆమెను ఎత్తుకెళ్లిపోతుంటే ఆమె కేకలు వేయడంతో మేల్కొన్న గ్రామస్తులు పరుగు పరుగున వచ్చేసరికి పోలీసులు దేవేను వదిలి చీకట్లో పరుగుతీశారు. అదే ఊర్లో ఒక మైనర్ బాలిక జ్వరంతో నిప్పు దగ్గర కూచోని ఉండగా గస్తీ పేరుతో గల్లీ గల్లీ తిరుగుతున్న పోలీసులు ఆ పాపను బలవంతంగా ఎత్తుకెళు తుండగా పాప అరవడంతో తండ్రి గుతుప పట్టుకొని పరుగున వచ్చేసరికి పోలీసులు అక్కడి నుండి జారుకున్నారు. అదే ఊర్లో మాడ్వి ఉంగీని రాత్రి పడుకునే వేళ పట్టుకునే ప్రయత్నం చేశారు. మాడ్వి రంగీ అనే మహిళను అలాగే చేయ పూనుకున్నారు. ఒకే రోజు రాత్రి ఐదుగురు మహిళలపై కొత్త పోలీసు క్యాంపు పోలీసులు అత్యాచారానికి పాల్పడ్డారు.

గ్రామాలలో పోలీసు క్యాంపులు రావడంతో ప్రజల దైనందిన జీవితాలు నరకప్రాయ మవుతున్నాయి. మహిళల జీవితాలలో ఖాకీలు బుసలుకొడుతున్నారు. వీటిని భరించలేక గ్రామస్తులు పోలీసు క్యాంపుల వద్దకు వెళితే, ఆ పోలీసులను గుర్తిస్తే శిక్షిస్తామంటారు. కానీ అంతా ఆబోతుల్లా ఒకేలా ఉండి చీకట్లో అత్యాచారానికి పాల్పడుతున్న ఆ పోలీసు ముష్కరులను ఏ మహిళ గుర్తుపడుతుంది? చివరకు ఏవో మాయమాటలు చెప్పి ప్రజలను పై అధికారులు పంపిస్తుంటారు. ఇలాంటి పోలీసు చర్యలను వాళ్ల అధికార ప్రతినిధి డీఐజీ సుందర్ రాజ్ గతంలో పలుమార్లు అవన్నీ మావోయిస్టులు రెచ్చగొడుతూ

చెప్పిస్తున్న కథలని ప్రపంచాన్ని తప్పు తోవ పట్టించే ప్రయత్నం చేశాడు.

కడియుం అనే ఊర్లో ప్రజలకు తెలువకుండా రాత్రోరాత్రి పోలీసులు దిగి క్యాంపు వేశారు. తెల్లారి పోలీసులను చూసి అవాక్కయిపోయి ప్రజలు 'మా ఊళ్లో మీరెందుకు, మాకు మీ అవసరమే లేదు' అంటే, ఇక ఆ ఊరి ప్రజలకు చెప్పరాని కష్టాలు తప్పడం లేదు. హెల్లాడుమడుగు పోలీసులు ఇదే వరుసన ఆ ఊరి మహిళలతో వ్యవహరిస్తున్నారు. ఉదయాన్నే లేవగానే అడవికి వెళ్లకుండా గ్రామాల్లో ఆదివాసీ మహిళలకు పూట గడువదు. ఊళ్లో నీళ్లకు పోకుండా ఉండలేరు. వాగుకు, అడవికి పోకుండా పొద్దు గడవని ఆడపడచులకు పోలీసులు గ్రామాలలో పెద్ద గండంలా తయారయ్యారు. అందుకే వారంతా గ్రామాలలో పోలీసుల క్యాంపులు వద్దంటూ మొర పెట్టుకుంటున్నారు. కానీ, ఏ అధికారి, ఏ నాయకుడు వినడం లేదు. అందుకే ఇక ప్రజలు తామే పోరాడక తప్పదని తెగించి క్యాంపు వ్యతిరేక పోరాటాలకు దిగుతున్నారు. ఇక ఆ పోరాట వివరాలు చూద్దాం.

నేను గతంలో వీక్షణం పాఠకులకు సిలింగేర్ ప్రజా పోరాటం గురించి పరిచయం చేశాను. మా సోదరుడు కురుసం శంకర్ కూడ రాశాడు. ఆ తరువాతి విషయాలంటే ఆగస్టులో సిలింగేర్ ప్రజా ఉద్యమ నాయకత్వం మూలవాసీ బచావ్ మంచ్ మిత్రులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ముఖ్యమంత్రిని కలవడానికి వెళ్లారు. కానీ, ఆ ముఖ్యమంత్రి ఎంతసేపూ ప్రజలచే పోరాటాన్ని విరమింప చేయండంటూ ఉద్యమ నాయకత్వాన్ని వత్తిడి చేయడమే తప్ప వారు ముందుకు తెచ్చిన జీవన్మరణ సమస్య పట్ల ఇసుమంత కూడ సానుకూల స్పందన కనపర్చలేదు. చివరకు ప్రభుత్వ విధానాన్ని నగ్నంగా స్పష్టపర్చాడు. 'మీరు ఎంత పోరాడినా పోలీసు క్యాంపులు ఎత్తివేయడమనే ప్రసక్తే ఉండదు. మరిన్ని అదనపు క్యాంపులు వేస్తారే తప్ప వేసినవి తొలగించడం ఉండదు' అన్నాడు. మావోయిస్టుల నిర్మూలనకు పోలీసు క్యాంపులు వేయాల్సిందే అనే సందేశాన్ని ఇచ్చాడు. కొసమెరుపుగా అవన్నీ ఢిల్లీ సర్కార్ వేస్తున్న క్యాంపులు కాబట్టి తన చేతిలో ఏమీ లేదని తేల్చేశాడు.

ముఖ్యమంత్రితో విఫల చర్చల అనంతరం సిలింగేర్ పోరాట నాయకత్వం తిరిగి తమ ధర్నా స్థలానికి చేరుకొని ప్రజలకు తమ అనుభవాన్ని విన్నవించారు. ప్రజా పోరాటాన్ని ఆపకూడదని కోరారు. ఆ ప్రజలకు దేశవ్యాప్త ఆదివాసీ ప్రజా సంఘాలు, శ్రేయోభిలాషులు, సంయుక్త కిసాన్ మోర్చా వారు, ఇతర అనేక ప్రజాసంఘాలు, ప్రజాస్వామికవాదులు, సామాజిక కార్యకర్తలు, హక్కుల కార్యకర్తలు అండగా నిలిచారని తెలిపారు. దానితో వారు తమ ఉద్యమాన్ని కొనసాగించడానికే నిర్ణయించుకున్నారు.

సిలింగేర్ ప్రజా ఉద్యమ ప్రేరణతో ఏంపురంలో ప్రజలు తమ గ్రామంలో ప్రతిపాదిత పోలీసు క్యాంపును వ్యతిరేకిస్తూ ఆందోళనకు సిద్ధమయ్యారు. వారు ఆగస్టునుండి నేటి వరకు గత 7 మాసాలుగా తమ ధర్నాను కొనసాగిస్తున్నారు. సిలింగేర్‌తో పాటే నాపూడులో మొదలైన ధర్నా ఇప్పటికీ కొనసాగుతోంది. సిలింగేర్ మూలవాసీ బచావ్ మంచ్ మూడు జిల్లాలకు సుక్మా, దంతెవాడ, బీజాపుర్‌లకు విస్తరించింది. సిలింగేర్ ప్రజా పోరాటం నూతన పోలీసు క్యాంపులకు వ్యతిరేకంగా మొదలవగా, దాని ప్రేరణతో సార్కెగూడ, ఎడ్సమెట్టలలోని ప్రజలు తమ గ్రామాలలో దాదాపు దశాబ్ద కాలం క్రితం పోలీసులు గ్రామస్థులను హతమార్చి మావోయిస్టులని ప్రకటించడం, ఆ మారణకాండలపై రాష్ట్ర ప్రభుత్వం అగర్వాల్ కమిషన్‌ను నియమించడం, ఆ కమిషన్ తన రిపోర్టును ప్రభుత్వానికి సమర్పించి రెండేళ్లు దాటడం జరిగిపోయాయి. ఈ కాలంలో రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. బూటకపు ఎన్‌కౌంటర్లను ఆనాడు ఖండించినవారిలో కాంగ్రెస్ పార్టీ కూడ ఉంది. అగర్వాల్ కమిషన్ తనకు సమర్పించిన రిపోర్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి చర్య తీసుకోకుండా తన నైజాన్ని చాటుకుంటున్నది. కేవలం ఓట్ల రాజకీయంతోనే బూటకపు ఎన్‌కౌంటర్లపై ఆనాడు కాంగ్రెస్ ధ్వజం ఎత్తిందని ఈనాడు అది తన ఆచరణ ద్వార ప్రజలకు చెప్పకనే స్పష్టం చేస్తోంది.

సార్కెగూడలో 2012లో 17 మందిని (వీరిలో మహిళలు, పిల్లలు కూడ ఉన్నారు), ఎడ్సమెట్టలో 2013లో 7గురిని పోలీసులు హత్య చేశారు. అగర్వాల్ రిపోర్టు ఆధారంగా వారిని హత్యానేరం కింద శిక్షించాలనీ, మృతుల కుటుంబాలకు కోటి రూపాయల నష్ట పరిహారం చెల్లించాలనీ అక్టోబర్ 7 నుండి ఎడ్సమెట్ట ప్రజలు ధర్నా కొనసాగిస్తున్నారు. ఎడ్సమెట్ట ప్రజలతో పాటుగా పొంబాడ్ (పూన్నార్) ప్రజలు తమ ఊర్లోకి రానున్న నూతన పోలీసు క్యాంపును వ్యతిరేకిస్తూ గంగాలూర్ లో ధర్నా ప్రారంభించారు. వారు బీజాపుర్ వెళ్లి కలెక్టరు తమ విజ్ఞాపన పత్రాన్ని సమర్పించారు. ఈ క్రమంలోనే నవంబర్ 1 ఛత్తీస్ గఢ్ రాష్ట్ర ఆవిర్భావ దినం నాడు సిలింగేర్ మూలవాసీ బచావ్ మంచ్ దానిని రైతు అధికార దినంగా పాటించింది. ఆ రోజు ఢిల్లీ రైతు పోరాట నాయకులు సిలింగేర్ చేరుకొని ప్రజా ఉద్యమానికి తమ ప్రగాఢ సంఘీభావాన్ని ప్రకటించారు. డిసెంబర్ 10 అంతర్జాతీయ మానవ హక్కుల దినం రోజు గొంపాడు ప్రజలు తమ గ్రామంలో సభ జరుపుకున్నారు. అక్కడికి సామాజిక కార్యకర్త సోనీ సోడి వెళ్లి ఆ ప్రజలతో కలిసి గొంపాడు హత్యలపై న్యాయ విచారణ జరుపాలనీ, గొంపాడు ప్రజలకు న్యాయం చేయాలనీ కోరింది.

ఆ వరుసనే సింగారంలో పోలీసు కాల్పులలో అసువులు బాసిన 7గురు గ్రామస్థుల మృతిపై న్యాయ విచారణ జరిపించాలనీ, దోషులను కఠినంగా శిక్షించాలనీ ఆ ఊరి ప్రజల ధర్నా ప్రారంభమైంది. సిలింగేర్ ప్రజాపోరాట కీలలు వివిధ రూపాలలో అనేక గ్రామాల ఖాకీ పీడిత ప్రజలకు పోరాట వెలుగులందిస్తున్నవి. ఒకప్పుడు ఖాకీలన్నా, రెవెన్యూ అధికారులన్నా 'పాయికా' (పరాయివారు) అంటూ పరుగు తీసిన ఆదివాసులు ఇపుడు వారిని తమ మనుగడ కోసం సవాలు చేస్తూ తెగించి పోరాడుతున్నారు. ప్రాణత్యాగాలు చేస్తున్నారు. రోజులు మారుతున్నాయి. ప్రజలు మరింతగా ముందుకువస్తున్నారు.

(ఇంకా ఉంది)

(రచయిత సామాజిక కార్యకర్త) వీ

రజనీ పామీదత్ - 'ఫాసిజం - సామాజిక విప్లవం'

అనువాదం: రవీంద్రనాథ్ సూరి

(కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ గ్రేట్ బ్రిటన్‌కు చెందిన నాయకుడు, భారత కమ్యూనిస్టు ఉద్యమానికి సలహాదారు, వలస వ్యతిరేక జాతీయోద్యమ క్రమంలో భారతదేశం గురించి ఎన్నో రచనలు చేసిన రజనీ పామీదత్ 1934 మే లోనే, అంటే హిట్లర్ – ముస్సోలినీల ఫాసిజం తొలి రోజుల్లోనే దాని ప్రమాదాన్ని గుర్తించి 'ఫాసిజం అండ్ సోషల్ రెవల్యూషన్' అనే అద్భుతమైన విశ్లేషణాత్మక గ్రంథం రచించారు. నాటి గ్రతిశీల మేధా శిబిరంలో ఆ పుస్తకం ఎంత ఆదరణ పొందిందంటే ఆరు నెలలలోనే రెండవ కూర్పు రావల్సి వచ్చింది. ప్రస్తుత భారతీయ హిందుత్వ ఫాసిజం సందర్భంలో ఆ పుస్తకానికి చాలా ప్రాధాన్యత ఉంది. రజనీ పామీదత్ ఉటంకించిన గణాంకాలు, సమకాలీన రాజకీయ పరిణామాలు మారి ఉండవచ్చు కాని, స్థూలంగా ఆ విశ్లేషణ ఇవాల్టికి కూడా ఉపయోగపడుతుంది. తొమ్మిది దశాబ్దాల తర్వాత ఆ పుస్తకాన్ని తెలుగు పాఠకులకు అందించడానికి మిత్రులు రవీంద్రనాథ్ సూరి పూనుకున్నారు. రెండో కూర్పుకి పామీదత్ రాసిన ముందు మాట అనువాదంతో ఈ ధారావాహిక మొదలవుతుంది.)

ఈ పుస్తకానికి ఈ రెండవ ప్రచురణ, 1934 మే తరువాత ఆరు నెలల్లో ఫాసిజంలో ఫాసిస్ట్ వ్యతిరేక ఉద్యమంలో వచ్చిన మార్పులపై చిన్న వివరణనిచ్చే అవకాశం ఇస్తున్నది.

ఇటీవలి కాలంలో చాలా ప్రధానంగా కనపడుతున్న విషయమేమిటంటే ఫాసిస్ట్ ప్రపంచంలో ముంచుకొస్తున్న సంక్షోభం ప్రథమ దశ తాలూకు సంకేతాలు. అవి జర్మనీలో జూన్ 30 సంఘటనలలోను, జూన్ 25న విఫలమైన దుర్మార్గపు డోల్ఫస్ హత్య ప్రయత్నంలోనూ, పతాక స్థాయికి వెళ్లిన ఇటాలియన్ జర్మన్ యుద్ధ వాతావరణంలోనూ, ఇటలీలో అర్పినాటి సంఘటనలోనూ, (ఫాసిజం ఇంకా విజయం సాధించని దేశాలలోనూ) ఫ్రాన్స్‌లో ఫిబ్రవరి దాడుల తరువాత నెలలలో ఫాసిస్ట్ దూకుడుకు వ్యతిరేకంగా వచ్చిన ఎదురుదెబ్బలోనూ, బ్రిటన్‌లో ఒలింపియాలో, హైడ్ పార్క్‌లో కనిపించినట్టుగా మోస్లేకు కన్పించిన చుక్కెదురులోనూ, రోతర్‌మియర్‌మోస్లేల మధ్య బహిరంగమైన చీలికలోనూ, ఫాసిజానికి స్పానిష్ కార్మికుల ప్రతిఘటన బలంలోనూ ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. దీర్ఘకాలం సాగే లోతైన ప్రపంచ పోరాటంలో ఆటుపోటులను, ఏదో ఒక ఘటన ప్రాధాన్యతను అతిగా చేయడం, అతిశయోక్తులు చెప్పడం పొరపాటే కానీ, ఇటీవల ఫాసిజంలో ఇబ్బందులు, అంతర్గత వైరుధ్యాలు పెరిగిపోవడం, ఫాసిజాన్ని ప్రతిఘటించే శక్తుల చైతన్యం బలం పెరగడం ప్రస్ఫుటంగా కనిపిస్తున్న విషయం.

ఈ క్రమంలో కేంద్ర ప్రాముఖ్యత గలిగిన సంఘటనలు జర్మనీలో జూన్ 30న జరిగాయి, అవి ఫాసిజానికి మలుపుగా పరిగణించతగిన అంతర్జాతీయ ప్రాముఖ్యత కలిగినవి. జర్మన్ ఫాసిజం పోరాట దళాల నాయకులను, స్టార్మ్‌ట్రూపర్స్ ప్రధాన నాయకులను, ఫాసిజం అధికారంలోకి వచ్చిన 15 నెలలలోనే, జర్మనీ ఫినాన్స్ పెట్టుబడి డిమాండ్‌ల ప్రత్యక్ష రూపం అయిన రీచ్‌స్వెహర్ ప్రతినిధి, ఏజెంట్ అయిన హిట్లర్ కాల్చి చంపివేయవలసి వచ్చింది. స్టార్మ్‌ట్రూపర్లలో అత్యధికులను నిర్మూలించాల్సి వచ్చింది. అధికారం చేజిక్కించుకున్న తరువాత ఫాసిజం క్రమం ఎలా ఉంటుందన్నది, ఫినాన్స్ పెట్టుబడి చేతుల్లో పనిముట్లుగా, దూపులుగా ఉపయోగపడిన పెటీ బూర్జువాజీ, అర్ధ శ్రామిక శక్తులు, వారి రెండవ విప్లవం ఆకాంక్షలు గండికొట్టబడి, నిరాకృతం కాగా నిస్పృహకు లోనై దూరమౌతారని, తత్ఫలితంగా ఫాసిస్ట్ బలం సామాజిక పునాది పల్చబడుతుందని, ఫినాన్స్ పెట్టుబడి భయానక నియంతృత్వపు నిజస్వరూపం మరింతగా బహిర్గత మౌతుందని మనకు ప్రస్ఫుటంగా తెలుస్తున్నది. ప్రజా వ్యతిరేకత పెరుగుదల ఊపునూ అతిగా అంచనా వేసుకోవద్దన్న హెచ్చరిక గుర్తుంచుకుంటూనే, నాజీలకు అననుకూలంగా ఉన్న 1934 వసంతకాలపు ఫాక్టరీ ఎన్నికలలో ఒక సామాన్య ధోరణి వివిధ దశలను కలుపుతున్నదని గమనించాలి, "విమర్శకులకు, ఫిర్యాదులు చేసేవారికి" వ్యతిరేకంగా తీవ్రమైన కాంపైన్, తిరుగుబాటుగా పిలువబడుతున్న ఘటనలు, జూన్ 30 తీవ్రమైన అణచివేత, ఆగస్ట్‌లో ప్రజాభిప్రాయ ఫలితాల విడుదల (ఎన్నికల పూర్వ సంధ్యలో గత నవంబర్‌తో పోల్చితే ఒక్క ఓటు తగ్గినా అది ఉపద్రవమేనంటూ గోబెల్స్ చేసిన ప్రకటన తరువాత), 1933 నవంబర్‌లో 21 లక్షలు ఉన్న ప్రత్యక్ష వ్యతిరేక ఓటు 1934 ఆగస్ట్ నాటికి 43 లక్షలకు చేరుకొని ప్రధాన పారిశ్రామిక నగరాలలో సగటున 20 శాతానికి మించిపోవడం ఒక క్రమాన్ని సూచిస్తున్నాయి. దీనితో సమాంతరంగా క్రమంగా దిగజారుతున్న ఆర్థిక పరిస్థితి, ఇంతకు పూర్వం ఎగుమతుల మిగులు ఉన్నచోట పెరుగుతున్న వ్యతిరేక వాణిజ్య సమతౌల్యం, అత్యవసర ముడిసరుకుల దిగుమతి తగ్గింపు, యుద్ధ ప్రాతిపదికన వ్యవస్థను కఠిన పరచటం, రేషనింగ్, కష్టాలు, (1934 సెప్టెంబర్ 30న హిట్లర్ తన బుకర్బర్గ్ ఉపన్యాసంలో ధ్వనించిన "వాళ్లు మనను కాళ్లబేరానికి తేలేరు", "జరగరానిది జరిగితే" నడుస్తున్నాయి. నాజీ విధానాల కేంద్రీకరణ మొత్తంగా బాహాటంగా యుద్ధమే పరమావధిగా తీవ్ర ప్రయత్నాల వైపుగా ఉన్నదని స్పష్టం అవుతున్నది.

ఇంకొక వైపున, జర్మనీ ఆస్ట్రియాల ఉదాహరణ అన్ని దేశాలలో ఫాసిజానికి వ్యతిరేకంగా కార్మిక వర్గం, సాధారణ ప్రజానీకాన్ని మేల్కొల్పింది. ఇది, ఫాసిజానికి, యుద్ధ ప్రమాదానికి వ్యతిరేకంగా అనేక ప్రముఖ దేశాలలో కార్మికవర్గ ఐక్య సంఘటన త్వరితంగా అభివృద్ధి చెందేందుకు, ప్రత్యేకించి సోషలిస్ట్, కమ్యునిస్ట్ పార్టీల ఐక్య సంఘటన ముందుకు వెళ్లేందుకు దారి తీసింది. ఈ విధంగా ఐక్య కార్మికవర్గ సంఘటన ముందుకు వెళ్లడం 1934లో జరిగిన చాలా ముఖ్యమైన, ఆశావహమైన ముందడుగు. ఈ ముందడుగులో ఫ్రెంచ్ కార్మికవర్గం దారి చూపింది. 1934 జులై 27న ఫ్రెంచ్ కమ్యునిస్ట్ పార్టీ, సోషలిస్ట్ పార్టీలు ఐక్య సంఘటన ఒప్పందంపై సంతకాలు పెట్టినాయి, ఈ సంయుక్త సంఘటన బలమైన ప్రభావం మొత్తం కార్మిక వర్గాన్ని ఉత్తేజపరుస్తున్నది, సంఘటితపరుస్తున్నది. ఆత్మవిశ్వాసాన్ని, పోరాట పటిమను వ్యాపింపజేస్తూ 1934లో ఫ్రాన్స్‌లో ఫాసిజం ప్లాన్ చేసుకున్న దాడులు వెనుకంజ వేసేలా చేసింది. డౌమెర్గ్ –

టార్డియోల నేషనల్ కాన్సెంట్రేషన్ కాబినెట్ నవంబర్‌లో కూలిపోయిన తరువాత, ప్రజాస్వామ్య వ్యతిరేక రాజ్యాంగ మార్పుల కోసం అన్ని బూర్జువా పార్టీల సమిష్టి డిమాండ్లతో, సరికొత్త దాడి కోసం ఫాసిస్ట్ సమూహాల సన్నాహాలతో ఫ్రాన్స్‌లో ఐక్య కార్మిక వర్గం పోరాట పటిమకు బలమైన పరీక్ష ఎదురైంది.

అదే సమయంలో ఫిబ్రవరి పోరాట గుణపాఠాలు ఆస్ట్రియాలో కార్మికవర్గంలో లోతైన మార్పులను కొని తెచ్చాయి. చట్ట వ్యతిరేక కమ్యూనిస్ట్ పార్టీ వామపక్ష సోషల్ డెమోక్రటిక్, షుట్జబుండ్ శక్తులను ప్రముఖ కార్మికవర్గ ప్రాంతాలలోని అనేక సంస్థలను తనలో ఇముడ్చుకుంటూ విశాల ప్రజారాశుల పార్టీ స్థానంలోకి ముందడుగు వేయగలగింది.

మాజీ సోషల్ డెమోక్రటిక్ శక్తులతో కూడిన విప్లవ సోషలిస్ట్ కమిటీలు తరువాత ఐక్య సోషలిస్ట్ పార్టీని ఏర్పరచి, పాత రూపాలను, విదేశాలలో ఉన్న నాయకత్వంతో సంబంధాలను కొనసాగిస్తూ, రెండవ ఇంటర్నేషనల్‌తో సంబంధాలను కొనసాగిస్తూనే, కార్మికవర్గ నియంతృత్వ లక్ష్యాన్ని ప్రకటిస్తూ, పాత ప్రజాస్వామిక సంస్కరణవాద భ్రమలను తిరస్కరించాయి (1934 మే 20న వియెన్నా విప్లవ సోషలిస్టుల కేంద్ర కమిటీ బావర్‌కు, రెండవ ఇంటర్నేషనల్‌కు రాసిన "ఆస్ట్రియాలో కార్మికుల్లో ప్రబలి ఉన్న ప్రజాస్వామిక సంస్కరణవాద భ్రమలను ఫాసిస్ట్ నియంతృత్వం పటాపంచలు చేసింది" అన్న లేఖ). "ఆస్ట్రియన్ కార్మిక వర్గపు ఐక్య విప్లవవర్గ పార్టీ కార్మికవర్గపు విప్లవ నియంతృత్వం కొరకు" కమ్యూనిస్ట్ పార్టీ, ఆస్ట్రియా విప్లవ సోషలిస్టుల కేంద్ర కమిటీ, షుట్జబుండ్ కార్యాచరణ కమిటీ ఐక్య సంఘటనను ఏర్పాటు చేస్తూ, సమిష్టి ప్రణాళికను విడుదల చేశాయి.

సోషలిస్ట్ పార్టీ, కమ్యూనిస్ట్ పార్టీల ఐక్య సంఘటన ఇటలీలో, సార్‌లో (సెప్టెంబర్‌లో), స్పెయిన్‌లో ఏర్పాటయ్యాయి. అన్ని దేశాలలో కార్మిక యువ సంఘాలు ఐక్య సంఘటన విషయంలో చాలా ముందున్నాయి.

మరోవైపున, బ్రిటిష్ లేబర్ పార్టీ, ఇతర సోషల్ డెమోక్రటిక్ పార్టీలు ప్రధానంగా స్కాండినేవియన్, డచ్, బెల్జియన్, స్విస్, చెకొస్లోవాక్ పార్టీలు ఈ ఐక్య సంఘటనకు చురుకుగా వ్యతిరేకత వ్యక్తపరుస్తూ, అది వాస్తవరూపం దాల్చకుండా విస్తృత క్రమశిక్షణ చర్యలను సైతం ముందుకుతెచ్చాయి. 1934 అక్టోబర్‌లో స్పానిష్ కార్మికులకు మద్దతునివ్వాలని కోరుతూ సమిష్టి కార్యాచరణతో కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్ రెండవ ఇంటర్నేషనల్‌ను సంప్రదించింది. రెండవ ఇంటర్‌నేషనల్, వాండర్వెల్డ్, అడ్లర్ ప్రతినిధులతో సమావేశం అయితే జరిగింది, కానీ దానిలో తమ మధ్య తక్షణ సమిష్టి కార్యాచరణకు, తమ పార్టీలను వచనబద్ధులను చేసేందుకు గాని అంగీకారం కుదరలేదని అంటూనే, ఫ్రాన్స్‌లో జరిగినట్టుగా సమిష్టి కార్యాచరణకు ప్రాతిపదిక వేసేందుకు చర్చలు కొనసాగించాలని నిర్ణయించినట్టుగా ప్రకటించబడింది. మరొక వైపున రెండవ ఇంటర్నేషనల్‌లో అతిపెద్ద అంతర్భాగ సంస్థ అయిన బ్రిటిష్ లేబర్ పార్టీ, తన సౌత్ పోర్ట్ సమావేశంలో కమ్యూనిజంతో ఏ విధమైన ఐక్య సంఘటన కనీస అర్థంలో కలసి పనిచేయడాన్ని కూడా నిషేధిస్తూ ఒక కఠిన తీర్మానాన్ని ఆమోదించింది. అదే సమయంలో రెండవ ఇంటర్నేషనల్‌లో అలాంటి అంతర్భాగమే అయిన స్పానిష్ సోషలిస్ట్ పార్టీ కమ్యూనిస్ట్ పార్టీతో ఐక్య సంఘటన ఏర్పర్చుకోవడమే కాకుండా కార్మికవర్గ నియంతృత్వం నినాదం కింద సాయుధ పౌర యుద్ధంలో భాగస్వామి అయ్యింది.

రెండవ ఇంటర్నేషనల్‌లోని పార్టీల మధ్యలో తలెత్తిన తీవ్రమైన విస్తృత విభేదాలు, దిక్కుతోచని స్థితి నిర్ణయాలు, ఫాసిజం భౌతిక పాఠాల ప్రభావంతో సోషల్ డెమోక్రటిక్ కార్యకర్తలలో సంభవిస్తున్న పరిణామాలకు సంకేతం. ఈ పరిస్థితిలో మార్పు అంతర్జాతీయ కార్మిక వర్గ ఉద్యమానికి చాలా ముఖ్యమైనది.

దూకుడుగా వస్తున్న ప్రతిఘాతక మతవాద, సైనికవాద, భూస్వామ్యవాద, పెట్టుబడిదారీ శక్తుల ఉమ్మడి ఫాసిస్ట్ దాడికి వ్యతిరేకంగా స్పానిష్ విప్లవ ప్రజా పోరాటం 1934 అక్టోబర్‌లో బహిరంగ పౌర యుద్ధం దశకు చేరుకొని, ఆస్తురీయస్ రాష్ట్రంలో సోవియట్ నిర్మాణ దశకు అభివృద్ధి చెంది, ఫిబ్రవరిలో వియెన్నా పోరాటాల కంటే ఎక్కువగా అంతర్జాతీయ కార్మికోద్యమాన్ని ఎత్తులలోకి తీసుకొని వెళ్లింది. అంతిమ విజయానికి తగిన స్థాయిలో సంస్థాగతంగానూ, నాయకత్వ శక్తి రీత్యానూ అభివృద్ధి చెందకపోయినా పెద్ద ఎత్తున ప్రజారాశుల పాత్ర, ఐకమత్యం, విప్లవ లక్ష్యం గురించిన చైతన్యం ఉన్నత స్థాయిలో ఉన్నాయని విదితం అయింది. పోరాట ప్రారంభంలో ఆస్తురీయస్లో సోవియట్‌ల నిర్మాణం, స్పానిష్ ప్రభుత్వపు అన్నీ శక్తులతో దీర్ఘకాలపు విడుపులేని పోరాటం, 1919లో హంగేరియన్ – బవేరియన్ సోవియట్ రిపబ్లిక్ తరువాత పశ్చిమ యూరప్‌లో విప్లవోద్యమాన్ని అత్యంత ఉన్నత స్థాయికి తీసుకొని వెళ్లింది. ఆధునిక ప్రభుత్వాల సైనిక వనరులకు వ్యతిరేకంగా జరిగే సాయుధ పోరాటాలు అనివార్యంగా విఫలమవుతాయని చెప్పబోయే సంస్కారణవాదుల ధోరణి వాస్తవాలకు పూర్తిగా విరుద్ధంగా ఉన్నది. ఎందుకంటే స్పానిష్ ప్రభుత్వపు బలగాలన్నిటినీ, వారి ఆఫ్రికన్ కిరాయి బలగాలను ఒంటరిగా ఎదుర్కొంటున్న ఆస్తురీయస్ కార్మికుల దీర్ఘకాల ప్రతిఘటన, ఒకవేళ ఇతర ప్రధాన ప్రాంతాల కార్మికులు అంటే కటలోనియా, అండలూసియా, మాడ్రిడ్‌ల కార్మికులు ఏక కాలంలో అదే పట్టుదలతో అదే స్థాయి నాయకత్వం అందిస్తూ పోరాడి ఉంటే, ప్రభుత్వ బలగాలు పోరాటాన్ని ఎదుర్కొనేందుకు అశక్తమైపోయి సోవియట్ స్పెయిన్ విజయం సాధించి ఉండేది. 1934 మొదట్లో లో వియెన్నా, దాన్ని వెన్నంటి చివరలో స్పానిష్ విప్లవోద్యమం, ఇవి రెండు యూరప్ భవిష్యత్తుకు సంకేతాలు.

కానీ, భారీ పోరాటాలు ఇంకా ముందున్నాయి. ఇబ్బందులు పెరిగిపోతున్న నేటి అంతర్జాతీయ పరిస్థితుల్లో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్న ఫాసిజం పరువు మట్టిపాలు కావడం, అది విజయం సాధించిన దేశాలలో దాని వెనక జనబలం పలచబడడం, అది విజయం సాధించని దేశాలలో ప్రతిఘటనా శక్తులు బలం పుంజుకోవడం ఉదారవాద, సోషల్ డెమోక్రటిక్ శ్రేణులలో ఒక కొత్త భ్రమకు –ఫాసిజం వెనుకంజ వేస్తుందన్న భ్రమకు దారి తీసింది. ఫాసిజం అత్యున్నత స్థాయిని దాటి అధోముఖం పట్టిందని, ఫాసిజం భారీ ప్రమాదం గడిచిపోయిందని చెప్ప బడుతున్నది. సంవత్సరంన్నర కిందట రాజ్యమేలిన నిరాశావాద ఓటమి మనస్తత్వం స్థానంలో అంతే పునాదిలేని భ్రమజనిత ఆశావాద ఆత్మ సంతృప్తి అవరించు కుంటున్నది. సంవత్సరం కిందట దశాబ్దాల పాటు "ఫాసిస్ట్ దశ" ఉంటుందన్న భవిష్యవాణులు వినిపించాయి. కానీ నేడు ఒక సిటరీన్ కూడా "అన్ని దేశాలలో నియంతృత్వం తన అత్యున్నత దశను దాటిపోయింది, జర్మనీలో పాలకవర్గం స్థిరత్వాన్ని సంతరించు కున్నట్టుగా కనపడుతున్నది. కానీ మెల్లగానైనా మార్పు తప్పకుండా వస్తుందన్న నమ్మకం నాకు కలిగింది. అంతిమంగా ప్రజల ప్రజాస్వామిక హక్కులు పటిష్ట పడుతాయి" అని చెప్పగలిగాడు (1934 ఆగస్ట్

అంతర్జాతీయ దుస్తుల కార్మికుల సమావేశంలో ఉపన్యాసం).

సోషల్ డెమోక్రటిక్ నాయకత్వంలోని ఒక సెక్షన్‌లో ప్రబలి ఉన్న ఈ అభిప్రాయం వెనుక, అంతర్గత కష్టాలు, ప్రజలలో అసంతృప్తి ఎదుర్కొంటున్న ఫాసిజం సహాయం కోసం సోషల్ డెమోక్రసీ వైపు చూడక తప్పదని, ఫాసిజం ఏలుబడిలోనే ఏదో ఒక మేరకు సోషల్ డెమోక్రసీ, ట్రేడ్ యూనియన్ నాయకత్వానికి కార్యకలాపాలు సాగించే వెసులుబాటు దొరుకుతుందన్న అభిప్రాయం బలంగా ఉన్నది (హిట్లర్ పాలన ప్రారంభ కాలంలో హిట్లర్ కోసం మే 17 ఓటు సందర్భంగా సోషల్ డెమోక్రసీ ఆశించినట్టు, ట్రేడ్ యూనియన్ నాయకత్వం నాజీలను బతిమాలినట్టు). ఈ సంకేతాలు కనిపించినట్టుగా లేవు. ఈ కార్యకలాపాల గురించి అవగాహన కలిగిన (సోషల్ డెమోక్రసీ శ్రేణులతో ఎప్పుడూ సంబంధాలలో ఉండే) మాంచెస్టర్ గార్డియన్ ప్రత్యేక విలేఖరి, నాజీ ఫ్యాక్టరీ విభాగం కార్మికుల మద్దతును కూడగట్టటంలో విఫలమైనందున హిట్లర్ "రాజకీయేతర ట్రేడ్ యూనియన్"లు నిర్మించడం కోసం సోషల్ డెమోక్రసీ నాయకత్వాన్ని సంప్రదించాడని, ఈ విషయం ప్రేగ్‌లోని కార్యావర్గానికి నివేదించబడిందని, వెల్స్ మరింతగా సంప్రదింపులకు సుముఖంగా ఉన్నాడని (తర్వాత తాను హిట్లర్ ప్రతినిధిని కలవలేదని వెల్స్ ఖండించినా మధ్యవర్తి ఒక సోషల్ డెమోక్రసీ నాయకుడని తెలియడంతో గార్డియన్ కథనం నిజమేనని రుజువయ్యింది), కథనం రాశాడు. అదే విధంగా ఆగస్ట్ కాంఫ్ సంచికలో షుష్నిగ్ మతవాద ఫాసిస్ట్ ప్రభుత్వం "కార్మికవర్గంతో అవగాహన ద్వారా" వామపక్షంతో తన పునాదిని విస్తరించుకోవాలన్న బావర్ సూచనను గమనించాల్సి ఉంటుంది. అదే సమయంలో ఇటలీలో ముసోలిని మాజీ సోషలిస్ట్ నాయకులైన కాలదర, షియావిలను, వారి సహకారం కోసం, మిలన్‌లో అనుమతించబడిన సోషలిస్ట్ పత్రిక ప్రచురణ కోసం కూడా సంప్రదించాడు. ఇంతవరకు ఇవి సూచనలు మాత్రమే. ఇబ్బందులలో ఉన్న ఫాసిజం సోషల్ డెమోక్రసీలో ఒక వర్గంతోనూ, పాత ట్రేడ్ యూనియన్ నాయకత్వంతో అవగాహన కుదుర్చుకునే సంభావ్యతను పూర్తిగా తిరస్కరించలేం (స్పెయిన్‌లో డి రివేర, పోలాండ్‌లో పిలసుడస్కీ, బల్గేరియన్ ఫాసిజం చేసినట్టుగా).

పాత సోషల్ డెమోక్రటిక్ నాయకత్వపు సిద్ధాంతానికి, ఫాసిజానికి మధ్యన అడ్డుగోడ ఏది లేదనడానికి, హిట్లర్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి బ్రిటిష్ లేబర్ ఉద్యమంలో ప్రచారం చేస్తున్న జర్మన్ సోషల్ డెమోక్రసీ ప్రతినిధి అయినా ఈ. కొంజ్ చెప్పిన ఈ మాటలను ఉదహరించవచ్చు. ఆయన ఇలా రాస్తున్నారు:

"ఫాసిజం అనేది బడా పెట్టుబడిదారుల అంగీకారంతో సోషలిస్ట్ ప్రణాళికను ప్రవేశపెట్టేందుకు జరుగుతున్న వ్యవస్థీకృత ప్రయత్నం." (ఈ. కొంజ్, టైమ్ అండ్ టైడ్ జులై, 28,1934).


"ఫాసిస్ట్‌లకు 'పెట్టుబడిదారీ' లేబుల్ తగిలిస్తే నాకు అభ్యంతరం లేదు. అయితే నేను ఒక మాట చెప్పదల్చుకున్నాను, ఏమిటంటే జర్మన్ సంస్కరణ వాదం, కమ్యూనిజంల ఆత్మ వినాశక విధానాలు ఒక మేరకు ప్రజారాశుల ప్రయోజనాలకు పెట్టుబడిదారుల ప్రయోజనాలకు మధ్య తాత్కాలిక సౌమనస్యం కొనితెచ్చాయి, ఫాసిజం దానిని తన ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నది. ప్రజలకు మార్గాంతరం లేకపోతే, పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదాన్ని సమర్థించడమే వారికున్న ఒకే ప్రత్యామ్నాయం. (ఈ. కొంజ్బెబ్స్ అక్టోబర్ 1934).

ఫాసిజంను "బడా పెట్టుబడిదారుల అంగీకారంతో సోషలిస్ట్ ప్రణాళికను ప్రవేశపెట్టేందుకు జరుగుతున్న వ్యవస్థీకృత ప్రయత్నంగా చూసే" టిపికల్ సోషల్ డెమోక్రటిక్ ధోరణి నుండి "ఒక మేరకు ప్రజారాశుల ప్రయోజనాలకు పెట్టుబడిదారుల ప్రయోజనాలకు మధ్య తాత్కాలిక సౌమనస్యం తెచ్చి" ఫాసిజంతో సహకరించే ధోరణి వరకు దూరం ఎక్కువేమీ లేదు.

పాత సోషల్ డెమోక్రసీ నాయకత్వంలోని ఒక సెక్షన్‌లోని ఈ ఆశలకు, వాస్తవంలో సోషల్ డెమోక్రటిక్ కార్యకర్తలలోని ప్రధాన భాగంలో జరుగుతున్న మార్పుల క్రమానికి, కార్మికవర్గ సమరశీల పోరాటాల్లోనూ, కార్మికవర్గ ఐక్యతలోనూ మెరుపు వేగంతో వస్తున్న మార్పులకు ఎట్టి సంబంధం లేదు.

నిర్ణాయక పోరాటం లేకుండానే, కార్మికవర్గ విప్లవం లేకుండా, అంతిమంగా కార్మికవర్గ నియంతృత్వం స్థాపించబడకుండానే ఫాసిజం వెనుకంజ వేస్తుందనే భ్రమ కంటే ప్రమాదకరమైన భ్రమ వేరొకటి ఉండదు. ఫాసిజం అనివార్యమనే భ్రమను, అది విజయం సాధించిన దేశాలలో దీర్ఘకాలం ఫాసిజం పాలన అనివార్యమనే భ్రమను తిప్పికొట్టడం ఎంత ముఖ్యమో తాత్కాలిక ఒడిదొడుకులు, ఇంకా అది విజయం సాధించని దేశాలలో ఫాసిజం ప్రమాదాన్ని వెనుకంజ వేసేల చేస్తాయని, మటుమాయం చేస్తాయనే భ్రమలను తిప్పికొట్టడం కూడా అంతే అవసరం. అందుకు భిన్నంగా ఇబ్బందులు ఎంత తీవ్రంగా ఉంటాయో ఫాసిజం చేసే జీవన పోరాటం కూడా అంతే తీవ్రంగా ఉంటాయి. కార్మికవర్గ ఐక్య సంఘటన బలం పెరగడమంటే ఫాసిజం ఓడిపోవడం కాదు, ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడే శక్తుల బలం పెరగడం, అంతిమ విప్లవం కోసం పోరాడే శక్తుల బలం పెరగడం.

ఫాసిజం అనేది ఆధునిక సమాజంలోని ఒక ఉద్యమం వ్యక్తీకరణ లేదా ఒక పార్టీ వ్యక్తీకరణ మాత్రమే కాదు, నశించిపోతున్న ఆధునిక పెట్టుబడిదారీ విధానం అత్యంత పరిపూర్ణ వ్యక్తీకరణ, కార్మికవర్గ విప్లవాన్ని ఓడించేందుకు జరుగుతున్న అంతిమ ప్రయత్నమూ, వినాశనం పునాది పైన సమాజాన్ని పునర్నిర్మించడానికి చేస్తున్న ప్రయత్నమేనని రుజువు చేయడమే ఈ పుస్తకం ముఖ్య ఉద్దేశం. ఈ ధోరణి మినహాయింపు లేకుండా అన్ని పెట్టుబడిదారీ దేశాలలో కనబడుతున్నదే, బాహాటంగా బహిరంగ ఫాసిజం అధికారంలోకి రావడం పూర్తయిన సంపూర్ణ వ్యక్తీకరణ. కార్మిక వర్గానికి వ్యతిరేకంగా దాడులు, కార్యనిర్వాహక వర్గం, పోలీసు అధికారాలను పటిష్ట పరచడం (ఇంగ్లాండ్‌లో రాజద్రోహ నేరం చట్టం, ఫ్రాన్స్‌లో రాజ్యాంగ సంస్కరణలు, అమెరికాలో కొత్త అత్యవసర నియంతృత్వ రూపాలు), వర్గ సహకారాన్ని రుద్ది లోపల నుండి కార్మికవర్గ సంస్థలను బలహీన పరచే ప్రయత్నాలు, విప్లవ శక్తులన్నిటిపై యుద్ధం (సోషల్ ఫాసిజం), యుద్ధ ప్రయత్నాలు, మొత్తం ఆర్థిక, సామాజిక, రాజకీయ నిర్మాణాన్ని యుద్ధోన్ముఖంగా మార్చివేయడం, ప్రజాస్వామ్య దేశాలుగా చెప్పుకునే బరితం, ఫ్రాన్స్, అమెరికా లాంటి దేశాలతో సహా అన్నీ దేశాలలో దూకుడుగా వెళ్లడం అన్నీ ఫాసిజం తాలూకు వ్యక్తీకరణలే. ఫాసిజంకు వ్యతిరేకంగా పోరాటం అంటే ఆధునిక పెట్టుబడిదారీ విధానం అవలంబిస్తున్న ఈ మొత్తం క్రమానికి వ్యతిరేకంగా పోరాడడమే. ప్రతి దేశంలోనూ యుద్ధోన్మాదం, ఫాసిస్ట్ సంస్థాగత రూపాల దిశగా దూకుడు, యుద్ధానికి తయారు కావడంతో సహా ప్రస్తుత దశ తాలూకు ప్రధాన లక్షణంగా మరింతగా విదితమౌతున్నది.



లక్ష్మణ్‌గా, సేటుగా అనేకమందికి సన్నిహితుడిగా వరంగల్ ప్రజా జీవితంలో అనితర సాధ్యమైన ప్రభావం వేసిన పులుకంటి లక్ష్మీనారాయణ (82) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మార్చ్ 17 ఉదయం హైదరాబాద్‌లో కన్నుమూశారు. వరంగల్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదారాబాద్‌లో హెడ్ కాషియర్ గా పనిచేసిన లక్ష్మణ్ సిపిఐ కి అనుబంధంగా ఉండిన బ్యాంకు ఉద్యోగుల ట్రేడ్ యూనియన్ నాయకుడుగా ఉంటూనే, వరంగల్ లోని సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, కార్మిక, విద్యా రంగాల సంస్థలతో, వ్యక్తులతో కలిసి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో క్రియాశీలంగా పని చేశారు. సి రాఘవాచారి, వరవరరావు వంటి వారి సహవిద్యార్థిగా ఆయన 1960ల నుంచీ ప్రగతిశీల, వామపక్ష, విప్లవోద్యమ సమర్థకుడిగా ఉన్నారు. 1970ల తొలిరోజుల నుంచే ఎకనామిక్ అండ్ పోలిటికల్ వీక్లీ పాఠకుడిగా జాతీయ, అంతర్జాతీయ రాజకీయార్థిక, సామాజిక అంశాల మీద అవగాహన పెంచుకున్నారు. 1970 తర్వాత విప్లవ రాజకీయాల ప్రభావం లోకి వచ్చి 1973లో ప్రారంభించిన శ్రామికవర్గ ప్రచురణలు స్థాపకులలో ఒకరుగా ఉన్నారు. ఎమర్జెన్సీకి ముందు రెండు సంవత్సరాలు వరంగల్ లో శ్రామికవర్గ ప్రచురణలు పుస్తకాల దుకాణం కూడా నిర్వహించారు. ఎమర్జెన్సీకి ముందు వరంగల్ లో నడిచిన ఆదర్శ పాఠశాల స్థాపకులలో ఒకరుగా ఉన్నారు. ఎమర్జెన్సీ తర్వాత వరంగల్‌లో ప్రారంభించిన ప్రజా వైద్యశాలలకు అమరుడు డా. ఎ. రామనాథంతో పాటు వెన్నుదన్నుగా ఉన్నారు. కాకతీయ మెడికల్ కాలేజీ, చందా కాంతయ్య మెమోరియల్ కాలేజీ, చందా కాంతయ్య స్మారక ప్రసూతి ఆస్పత్రి వంటి సామాజిక సంస్థల అభివృద్ధిలో భాగం పంచుకోవడంతో పాటు, ఆజంజాహీ మిల్లు, తోళ్ల పరిశ్రమ, లారీ వర్కర్స్ యూనియన్, వరంగల్ మార్కెట్ కమిటీ, వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, ఇండో సోవియట్ కల్చరల్ సొసైటీ, వరంగల్ ఫిల్మ్ సొసైటీ, హేతువాద సంఘం, పౌరహక్కుల సంఘం, విప్లవ రచయితల సంఘం, సృజన సాహితీమిత్రులు వంటి అనేక సామాజిక జీవన రంగాలతో సన్నిహితంగా పని చేశారు. మిత్రద్రోహం వల్ల ఆర్థికంగా చితికిపోయి, అనారోగ్యం పాలై పది, పదిహేను సంవత్సరాలుగా బహిరంగ ప్రజా జీవితంలో క్రియాశీలంగా లేనప్పటికీ, చివరి వరకూ విప్లవోద్యమ అభిమానిగా, నిరంతరం సమాచారం తెలుసుకుంటూ, తన సలహాలు, సూచనలు చెపుతూ ఉన్నారు. వీక్షణం తొలి సంచిక నుంచీ చందాదారుగా, పాఠకుడిగా ఉన్నారు. పత్రిక అందడం రెండు మూడు రోజులు ఆలస్యమైనా వెంటనే ఆదుర్దాగా కనుక్కునేవారు. లక్ష్మణ్ సేటు స్ఫూర్తికి వీక్షణం కలెక్టివ్ వినమ్ర జోహార్లు చెపుతున్నది. కుటుంబానికి ప్రగాఢ సానుతాపం. వీ



తెలుగు సీమలో, దేశం లోని చాలా ప్రాంతాల్లో తన గళంతో, అభినయంతో లక్షలాది మందిని ఉత్తేజపరిచి, వారి హృదయాల్లో స్థిరమైన స్థానం ఏర్పరచుకున్న డప్పు రమేశ్ (61) హృద్రోగ సమస్యలతో బాధపడుతూ విజయవాడలో ఒక ప్రైవేటు ఆస్పత్రిలో మార్చ్ 18న కన్నుమూశారు. గుంటూరు జిల్లా తెనాలి సమీపంలోని అంగలకుదురులో పుట్టిన పట్టపు ఏలియాజర్, తెనాలి వి ఎస్ ఆర్ కాలేజీలో డిగ్రీ చదువుతున్న రోజుల్లో విప్లవోద్యమ ప్రభావం లోకి వచ్చి, 1980ల తొలిరోజుల్లో జననాట్యమండలిలో పూర్తికాలం కార్యకర్తగా, గాయకుడిగా చేరి రమేశ్ అయ్యారు. జననాట్యమండలి కార్యక్రమాల్లో, పాటల్లో అద్భుతంగా డప్పు వాయిస్తూ డప్పు రమేశ్ అయ్యారు. 1982-83 నుంచి 1992 దాకా రాష్ట్రవ్యాప్తంగానూ, దేశం లోని ప్రధాన నగరాల్లోనూ జననాట్యమండలి ప్రదర్శనల్లో పాల్గొన్నారు. కారంచేడు మారణకాండ మీద రాష్ట్రమంతటా ప్రదర్శించిన ఒగ్గుకథ రచయితల్లో ఒకరు. గంభీరమైన గళంతో వేలాది పాటలు పాడడంతో పాటు ఎన్నో పాటలు రాశారు. 1992లో విప్లవ పార్టీ మీద, ప్రజా సంఘాల మీద నిషేధం విధించినప్పుడు, జన నాట్య మండలి ప్రధాన కళాకారులతో పాటు ఆయన కూడా అజ్ఞాతవాసానికి వెళ్లి, మధ్య భారత అరణ్యాలలో, తూర్పు కనుమల అరణ్యాలలో సాయుధ గెరిల్లా దళ సభ్యుడిగా ఉంటూనే సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. జననాట్యమండలిలో సహ కళాకారిణి కుమారిని పెళ్లి చేసుకున్నారు. కుమారి మలేరియాతో 1997లో మరణించగా, ఆ తర్వాత సహ కళాకారిణి జ్యోతిని పెళ్లి చేసుకున్నారు. ప్రభుత్వానికీ, విప్లవకారులకూ మధ్య చర్చలు జరిగిన సందర్భంలో 2004లో అజ్ఞాతవాసం నుంచి బైటికి వచ్చి మళ్లీ ఒకసారి రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సమయంలో హృద్రోగ సూచనలు బైటపడి గుండెకు స్టెంట్ వేయించుకున్నారు. అనారోగ్యం వల్ల గతంలో లాగా తిరగడానికీ, ఉద్రేకంగా, ఉత్తేజకరంగా గొంతెత్తి పాడడానికీ అవకాశం లేకపోయినా చివరి దాకా తన గంభీర గళాన్ని విప్లవోద్యమ ప్రచారానికే అంకితం చేశారు. ఆయన మరణానికి కొన్ని వారాల ముందు కూడా ఎన్ ఐ ఎ పోలీసులు ఆయన ఇంటిమీద దాడి చేసి వేధించారు. డప్పు రమేశ్ అజరామర అరుణారుణ గానానికి వీక్షణం వినమ్రంగా జోహార్లు అర్పిస్తున్నది. వీ

ఫాసిజానికి, యుద్ధానికి వ్యతిరేకంగా అతి విశాల ఐక్య సంఘటన నిర్మించడం నేటి అత్యున్నత కర్తవ్యం. ఎల్లెడలా ఫాసిస్ట్ వ్యతిరేక, యుద్ధ వ్యతిరేక భావనలు విస్తృతంగా నెలకొని ఉన్నాయి. సంస్థాగత నిర్మాణమే ఇప్పుడు అత్యావశ్యకం. ఐక్య సంఘటనకు వ్యతిరేకతను అధిగమించాలి. విడివిడి, సమూహాల ప్రయోజనాలు దీనికి అడ్డు కారాదు. అందర్నీ కలుపుకొని వచ్చే, పెటీ బూర్జువా వర్గాన్ని, అసంఘటిత శక్తులను తనతో తీసుకొని వెళ్లే ఐక్య కార్మికవర్గ ఐక్య సంఘటన ప్రతి దేశంలోనూ నిర్మింపబడాలి. విశాల సమిష్టి సంఘటన మాత్రమే ఫాసిజాన్ని ఓడించగలదు. పోరాటం విజయం సాధించాలంటే సమస్యల వాస్తవ స్వరూపాన్ని అర్థం చేసుకోవడం, ఫాసిజాన్ని, యుద్ధాన్ని సోషలిస్ట్ విప్లవం ద్వారా ఓడించగల ఏకైక విప్లవ ప్రత్యామ్నాయాన్ని అర్థం చేసుకోవడం అతి ముఖ్యం.

ఈ పుస్తకం ప్రచురించబడిన ఆరు నెలల తరువాత ఈ విషయాల ప్రాముఖ్యత మరింతగా పెరిగింది. వీ

ఆత్మీయ పలకరింపు రామ్మోహన్ సార్

– విద్యాభూషణ్



రామ్మోహన్ సార్ అంటే ఓ ఆత్మీయ పలకరింపు, స్నేహపూరిత కరచాలనం. ఇంక ఈ రెండు అనుభూతులకు మొన్నటితో కాలం చెల్లింది. ఇలా అనుకుంటే ఏదో తెలియని బాధ మెలిపెట్టినట్టు అవుతుంది. సార్‌తో నా మొట్ట మొదటి పరిచయం 1993 మేడే దినోత్సవ సందర్భంగా, సారస్వత పరిషత్ హాల్‌లో సాయంత్రం 4 గంటలకు ఐఫ్‌టియు (ఇఫ్టు) ఆధ్వర్యంలో సభ. అప్పుడు నేను విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్‌లో ప్రూఫ్ రీడర్‌గా పనిచేస్తున్నా. సభకు వెళ్లాలని త్వరగా పని ముగించుకుని బైటపడ్డా. వెళ్లేసరికి సభ మొదలైంది. ఆ సభకు కాలేజీ నుంచి నేరుగా వచ్చారు రామ్మోహన్ సార్. అలసటను తీర్చుకోనివ్వకుండా ఉపన్యసించవలసిందిగా నిర్వాహకులు సార్‌ని పిలిచారు. వేదికనెక్కి అందరి ఉపన్యాసకుల్లా ఏ చికాగో కార్మిక పోరాటాన్నో, సామ్రాజ్యవాద పిడివాదాలనో వల్లించకుండా, 'ఇప్పుడే నేను కాలేజీ నుంచి వస్తున్నాను. వస్తుండగా మార్గ మధ్యంలో రోడ్డు వేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణంలో పది – పన్నేండేళ్ల వయసు బాలలు కాళ్లకు సరైన ఆచ్ఛాదన లేకుండా, మిట్ట మధ్యాహ్నం, ఎర్రని ఎండలో, చెమటలు కక్కుతూ మరిగే తారుని కాంక్రీట్‌పై పోస్తూ కొందరు, నడుస్తున్న రోలర్‌పై నీటిని చిలకరిస్తూ ఒకరిద్దరు పనిచేయడం చూశాను. సుమారు నలభై ఆరేళ్ల స్వాతంత్ర్యం వారి బతుకుల్నేలా వెళ్ల మార్చిందన్న ఆలోచన నాలో మెదిలింది. పలకా – బలపం పట్టుకుని మా చెంత చదువుకోవలసిన బాలలు, బతుకు పోరుకై ఇలా బాల కార్మికులుగా విలసిల్లవలసిందేనా? అన్న ప్రశ్న వెంటాడుతూ ఉంది. అందుకని ఈ కార్మిక దినోత్సవం రోజున నేను వారి తరపున మాట్లాడదల్చాను' అని కార్మిక చట్టాలు – బాల కార్మికుల స్థితిగతులపై ఓ గంట ఉపన్యసించారు. ఆ రోజున అందరి ఉపన్యాసాల్లో కెల్లా నన్ను అమితంగా ఆయన ఉపన్యాసం హత్తుకుంది. పదునైన భాష, మా కాశీపతిని తలపించే గంభీర స్వరం ఓ సజీవ జీవన చిత్రాన్ని ఆవిష్కరించినట్టయింది. ఉపన్యాసం ముగిసిన తరువాత నేరుగా ఆయన బైటకు పోయి తాపీగా సిగరెట్టు కాల్చుకుంటుంటే నేను వెళ్లి నన్ను నేను పరిచయం చేసుకున్నాను. 'యుఆర్ ఫ్రం విశాఖ' అంటూ అందించిన చేయి, క్రమంలో ఓ అలవాటుగా మారింది.

సామాజిక మార్పునాశిస్తూ ఉద్యమాలతో మమేకమైన వారంతా, తమ తమ జీవన శైలిలో ఆదర్శంగా ఎలా ఉండాలన్న దానికి రామ్మోహన్ సార్ ఓ ఉదాహరణ. ఎవరెవరు వారి వారి ప్రవృత్తుల్లో ఆదర్శవంతంగా, నిజాయితీగా పనిచేస్తే అదే ఆదర్శమవుతుంది. ఉపాధ్యాయుడుగా ఉంటూ ఆదర్శవంతంగా, నిజాయితీగా పాఠాలు చెప్తూ సందర్భోచితంగా ఫ్యూడల్ భావాల అరాచకాన్ని ఎండగడుతూ వేలాది విద్యార్థులకు దిశా నిర్దేశనం చేస్తూ మంచి ఉపాధ్యాయుడుగా పేరెన్నికగన్నారని నాకు ఆ తరువాత తెలిసింది, మా కాలనీలోని ఆయన శిష్యుల ద్వారా.

ఆ తదుపరి క్రమంలో నేను డిఎన్ఎఫ్ హనుమంతరావు గారి దగ్గర పనిచేస్తూనే, డిఎన్ఎఫ్ బాధ్యతల నుంచి విరమించుకునే సమయంలో సార్ వాళ్లబ్బాయి సృజన్ అక్కడ చేరాడు. మా మధ్య పరిచయం స్నేహంగా మారింది. మా ఈ స్నేహం, నాకూ సార్‌కూ మధ్య అంతరాలను మరికాస్తా కుదించింది. అడపా – దడపా సభల్లో కలుస్తుండడం – రాజకీయాల దగ్గర్నుంచి వ్యక్తిగత విషయాల వరకూ చర్చించుకునేవాళ్లం. సార్ నిష్పటి. ఏ విషయ చర్చల్లోనూ శృతిమించరు. తగు మోతాదులో తన అభిప్రాయాన్ని సూటిగా ఓ నవ్వు మన మోహాన పడేస్తారు. అవధి మీరి మనం ఓ మాట మీరినా 'అది సరికాదు కదా! ఎవరి అభిప్రాయం వాళ్లది' అని దాన్నక్కడ ఆపేస్తారు. సుమారుగా ఇద్దరం ఒకే రాజకీయాల నుంచి వచ్చినందుకు అనేకానేక అంశాలు ప్రస్తావనకు వచ్చేవి. భిన్నాభిప్రాయం స్వల్పంగా గోచరించేది. అయినా సార్ ధోరణి మా స్నేహానికి ఏనాడు అడ్డంకి కాలే.

సార్ వాళ్లబ్బాయి సృజన్‌కు వివాహం. ఆ సందర్భంగా నేనూ పెళ్లికి వెళ్లా. అలవాటుగా అనుకున్న సమయానికే నే పోవడం. నిర్వహణ కాస్తా ఆలస్యం అవడంతో సార్‌తో ముచ్చటించే వీలు కలిగింది. ముగ్గురు పిల్లల్లో సృజన్ మన కోవకి వస్తారు. మిగతా ఇద్దరు వ్యతిరేకం కాదు గాని, వాళ్ల ధోరణిలో వాళ్లుంటారు. మన సభలు – సమావేశాలు మన వాడికి కాస్తా అలవడ్డాయి అని చెప్పుకొచ్చారు. పైగా వివాహం మీటింగు పెళ్లి. అక్కడా ప్రారంభోపన్యాసంలో తన సహచరి భారతమ్మ గారు తమ సహజీవనంలో ఎలా సహకరించారో చెప్పుకొచ్చారు. ఉదయం 8 గంటలకు ఉద్యోగానికని బైటపడి స్కూలు/కాలేజీ ముగిసాక, ఇతరత్రా సంఘ నిర్వహణలు – సమావేశాలు చూసుకుని ఏ రాత్రికో చేరినా ఆమె ఏనాడూ ఒక్కమాట అనలేదని చెప్పారు. ఆమె సహకారం లేకుంటే నేనిలా మనగలిగేవాడిని కాదని చెప్పుకొచ్చారు. ఈ విషయం మరింతగా ఆయన పట్ల గౌరవాన్ని పెంచింది.

ఇక కుటుంబ సభ్యులతో ఆయన మసలిన తీరు అంతగా తెలియకపోయినా, ఒకటి రెండు సార్లు నేను ఇంటికి వెళ్లినట్టు గుర్తు. చైతన్యపురి సమీపంలో ఉన్నప్పుడు అప్పుడు నేగమనించిన మేరకు సృజన్‌తో స్నేహంగా అన్ని విషయాలూ చర్చిస్తూ ఉండడం చూశాను. తరువాతి క్రమంలో మిగతా ఇద్దరూ ఉద్యోగ రీత్యా బైట ఉంటున్న కారణంగా సృజన్‌తోనే ఆయన ఉంటుండేవారు. ఇద్దరూ కలిసి సమావేశాలకు రావడం – పోవడం జరుగుతూ ఉండేది.

ఏది ఏమైనా నాకున్న పరిచయస్తుల్లో, నా పరిశీలన మేరకు, ఆచరణ రీత్యా చెప్పుకోదగ్గ వ్యక్తి రామోహన్ సారే అనిపిస్తుంది. ఎందుకంటే ఎవరు ఏ సంస్థకు చెందిన వారికైనా ఆత్మీయంగా పలకరించి యోగ క్షేమాలు – అయినంతరం – అవసరం మేరకు రాజకీయాలను వ్యాఖ్యానించి, తగు పరిధిలో నిలిపేసేవారు. అందుకే ఆయనకింతమంది స్నేహితులు, శ్రేయోభిలాషులు. ఆయన మాత్రం అజాత శత్రువే. ఆచరణకు ఆయనో దిక్సూచి. మార్పు కోరుకునే నిఖార్సైన రివల్యూషనరీ. వీ

(రచయిత పాత్రికేయులు)

పదార్థపు నియమబద్ధ పరిణామమే ప్రపంచం

యు. ఎ. ఖారిన్ *రచించిన 'ఫండమెంటల్స్ ఆఫ్ డయలెక్టిక్స్' పుస్తకం లోని మూడవ అధ్యాయంలో మొదటి ఉపశీర్షిక : అనువాదం - రాజేంద్ర బాబు అర్విణి*

మార్క్సిస్టు–లెనినిస్ట్ సిద్ధాంతం పదార్థం అన్న అంశాన్ని శోధించడంతో ప్రారంభమవుతుంది. పదార్థం ప్రాథమికం, అంటాడు లెనిన్. ఆయన భావనలో "అనుభూతి, ఆలోచన, చైతన్యం అనబడే అద్భుతమయిన లక్షణాలు ఒక ప్రత్యేకమయిన పద్ధతిలో సమీకరించబడ్డ పదార్థం నుండి ఆవిర్భవించినవి. ఇది సాధారణంగా భౌతికవాదానికి సంబంధించిన భావజాలం. మార్క్స్, ఎంగెల్స్‌లు కూడా విశేషంగా అదే చెప్పారు" (వి.ఐ. లెనిన్ రచించిన 'మెటీరియలిజం అండ్ ఎంపీరియో–క్రిటిసిజం' అందుచేత గతితార్కిక భౌతిక వాద పునాదుల గురించిన అధ్యయనం 'పదార్థం' అన్న అంశానికి సంబంధించిన పరిశోధనతో ప్రారంభం కావాలి.

భౌతిక వాద తత్వ సారాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలంటే ఇది తప్పనిసరి అవసరం. వాస్తవమేమిటంటే 'భౌతికవాదం', 'భావ వాదం' అన్న సిద్ధాంతాలను చాలా తక్కువ సందర్భాలలో మాత్రమే సరి అయిన అర్థంలో ఉపయోగించడం చూస్తున్నాము. నిరాసక్త వైఖరి, సుగుణాలు కలిగి ఉండడం పట్ల నమ్మకం కలిగి ఉండడం, మనుషుల పట్ల ప్రేమ, దయ కలిగి ఉండడం, ఆదర్శాల పట్ల మక్కువ, భౌతిక వాదాన్ని అనుసరించే వారి కంటే విరుద్ధమయిన లక్షణాలను కలిగి ఉండడంగా 'భావ వాదా'న్ని సాధారణ చైతన్యం గలవారు అర్థం చేసుకుంటారు. ఆ రకంగా, భారతదేశంలో చాలా శతాబ్దాలు ఆధిపత్యం చలాయించిన ఛాందసవాద మత ప్రభోధకులు భౌతిక వాదాన్ని వక్రీకరించి అసంబద్ధమయిన రీతిలో ప్రజల ముందుంచే ప్రయత్నం చేశారు. భౌతిక వాద భావాలను సోమరితనం, అత్యాశ, తాగుబోతుతనం, చౌర్యం, చెడ్డ నడత, తిండిపోతు మనస్తత్వం, స్వార్థపరత్వం, పిసినారితనం లాంటి దోషాలతో సమానంగా పరిగణించి, తమ మతాన్ని ఆచరించే వారు భౌతిక వాద వాదనలు వినవద్దని, వారితో ఏ విధమయిన సంబంధాలు నెరపవద్దని నిషేధం విధించారు. భౌతిక వాదానికి సంబంధించి వక్రీకరణకు గురయిన ఈ వ్యాఖ్యానం భౌతిక వాదం భారతదేశ పరిస్థితులకు ఆమోదయోగ్యం కాదని, ఈ దేశంలో ఈ సిద్ధాంతం ఆచరణకు పనికి రాదని ఒక భావనను వ్యాప్తిలో పెట్టడానికి కారణభూతమైంది.

కానీ, భౌతికవాదం విషయంలో ఈ వక్రీకరణలు ఏవీ సరి అయినవి కావు. మానవతా వాదం, సౌందర్య ఆరాధన ఏ సూత్రాలమీద ఆధారడ్డాయో ఆ సూత్రాల కనుగుణంగా మానవ సంబంధాలను మార్చ గలిగే శక్తి పుంజుకోవడానికి బాటలు వేయగలిగేది భౌతిక వాదం మాత్రమే. భౌతికవాదం అన్న పదం భౌతికంగా ఉన్న పదార్థం అన్న భావన నుండి ఉద్భవించింది. తదనుగుణంగా, మనం ఇప్పుడు శాస్త్రీయమయిన భౌతిక వాద సారాంశం ఏమిటో వివరణలోకి వెళదాం.

1. 'పదార్థం' అన్న భావం ఉద్భవించిన పరిణామక్రమం

'పదార్థం' అన్న భావం వస్తుగత వాస్తవాన్ని సూచిస్తుంది. మన చుట్టూ ఉన్న ప్రపంచం భిన్న రకాలుగా, భిన్న రూపాలలో ఉన్నది. ప్రాణంతో ఉన్న ప్రకృతిలో లక్షల సంఖ్యలో ఉన్న వివిధ రకాలయిన మొక్కలు, క్రిములు, చేపలు, పక్షులు, జంతువులు ఉన్నాయి. నిర్జీవ మయిన వస్తువులు భిన్న రకాలయిన గుణాలు కలిగి ఉన్నాయి. అంతరిక్షంలో ఉనికిలో ఉండి, అద్భుతమయిన రీతిలో ప్రత్యేక లక్షణాలు కలిగిన వాటి గురించి ఆధునిక శాస్త్ర విజ్ఞానం పరిశోధనలలో పురోగమిస్తున్నది. ఉదాహరణకు ఒక చిన్న చెంచాలో ఇమడగలిగిన పదార్థం ఈ విశ్వంలోని కొన్ని ప్రదేశాలలో 20 కోట్ల ఏనుగులతో సమానంగా తూగుతుంది. మన చుట్టూ ఉన్న సమాజంలో కూడా, వివిధ సమూహాలుగా ఉన్న ప్రజలు వారి వారి భిన్న చారిత్రిక దశలలో వివిధ రకాలయిన ఉత్పత్తి సాధనాలు, వివిధ రకాలయిన ఆర్థిక, సామాజిక సంబంధాలు, వాటితో పాటు వివిధ రకాలయిన ప్రభుత్వాలు, భావజాలాలు, భిన్న మతాలు, భిన్న సంప్రదాయాలు, భిన్న ఆచారాలు మొదలగునవి కలిగి ఉండినారన్న వాస్తవం మనమెరుగుదుం. ఈ విభిన్నంగా ఉనికిలో ఉన్న దృగ్విషయాలు, వస్తువులు అన్నింటిలో సాధారణంగా ఉన్న విషయం ఏదయినా ఉందా? వివిధ రూపాలలో ఉనికిలో ఉన్న ఈ విషయాలలో ఏకీకృతం అయినవి, క్రమబద్ధంగా ఉన్న అంశాలు ఏవైనా ఉన్నాయా? పురాతన కాలం నుండి అడగబడుతున్న ఈ ప్రశ్నలకు తత్వవేత్తలు వివిధ రకాలుగా స్పందించారు.

ప్రపంచం ఏకంగా ఉంటుందన్న విషయాన్ని భావవాదులు పూర్తిగా నిరాకరిస్తారు (స్వీయాత్మక భావవాదం, ద్వంద్వ వాదం), లేదా సంపూర్ణమయిన జీవాత్మ, సంపూర్ణమయిన భావం, బ్రహ్మ, విశ్వవ్యాపితమయిన ఆత్మ లేదా భగవంతునిలో భాగంగా చూస్తారు (వస్తుగత భావవాదం). భౌతిక వాద తత్వవేత్తలు ప్రపంచంలోని ఏకత్వం దాని భౌతికతలో ఉందని నమ్ముతారు. పదార్థం అన్న భావం మొత్తంగా భౌతికవాద సిద్ధాంతం మాదిరి, గణనీయంగా మార్పు చెందింది.

ఉనికిలో ఉన్న వాటికి మూలం ఏమిటి, ఉనికిలో ఉన్నవి దేనితో ప్రారంభమవుతున్నాయి, ఏవిగా అవి మారుతున్నాయి అన్న విషయాల

గురించి పూర్వకాలంలో భౌతిక వాదులు తెలుసుకొనే ప్రయత్నం చేసారు. ఈ ప్రపంచం మొత్తం ఇలా నిర్మించబడడానికి పునాది ఏమిటి లేదా ఏ భౌతిక పదార్థం కారణభూతమైంది అన్న విషయాలను నిర్ధారించడానికి ప్రయత్నం చేసారు. ప్రారంభం నుండి అంటే ఆదిమ కాలం నుండి విస్తృతంగా ఉనికిలో ఉన్న వివిధ రకాలైన పదార్థం: నీరు, భూమి, గాలి, అగ్ని – వీటిని ప్రపంచానికి పునాది అని భావించారు. ఉదాహరణకు, సాంఖ్య వేదాంతం ప్రారంభ దశ (క్రీ. పూ. 7–6 శతాబ్దాల కాలం) లో ఆ సిద్ధాంత ప్రతిపాదకులు ప్రపంచం ఉనికికి అసలయిన ఆధారం ప్రకృతియే అని ప్రకటించారు. ప్రకృతి ప్రాథమికమయిన పదార్థం అని, ప్రకృతిలో సంభవించే మార్పులే ఈ విశ్వం ఆవిర్భవించడానికి కారణమని బోధించారు. అది సర్వసాక్షి, శాశ్వతమయినది కూడా. అది ఒకటి మాత్రమే. ప్రపంచ పుట్టుకకు కారణభూతమయినది అదే. ప్రపంచానికి సృష్టి కర్త ప్రకృతి యే. 'పురుష' (జీవాత్మ) దాని లక్షణం లేదా గుణం మాత్రమే. భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశం అనే అయిదు మూలసూత్రాలను ప్రకృతి కలిగి ఉంటుంది. ఈ పంచభూతాల కలయిక వలననే దేవుళ్లు, మనుషులతో సహా ప్రపంచం మొత్తం తయారయ్యింది. ప్రాథమిక పదార్థం గురించిన ఈ సిద్ధాంతం సహజంగా, ఏ ఇతర ప్రభావాలు లేకుండా సనాతన ఆలోచనాపరులలో ఉద్భవించిన స్పందన.

17–18వ శతాబ్దానికి చెందిన అధిభౌతిక వాదులు పదార్థం సహజంగా ఉనికిలో ఉందేదని, అన్నింటి సారం, అన్నింటికీ సార్వత్రిక ఆధారం పదార్థమేనని సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. పదార్థము దానికదే ఉద్భవిస్తుంది అది సంపూర్ణమయినది, దానికి చలనం లేదు, సృష్టించ డానికి వీలు లేనటువంటిది, దానిని నశింపజేయలేము, మార్పు చేయలేము, అది సజాతీయమయినది (అంటే మరే ఇతర జాతి లక్షణాలు ఉండవు). మార్పు చెందే గుణం, కనిపించి, ఒక్కో సారి కనిపించకుండా పోయే లక్షణాలు కలిగిన వస్తువుల లాగా కాకుండా ఇది వాటికి భిన్నమయినది. ప్రకృతిలో భౌతికంగా ఉనికిలో ఉన్న పూర్తి మొత్తం వస్తువుల గురించిన ఈ భావన ఆ కాలంలో రూపు దిద్దుకొని 19వ శతాబ్దం ఆరంభం వరకు ఉండింది. యాంత్రికమయిన రాశి, విస్తరణ, జడత్వం, చొరబడలేక పోవడం, అణువు–పరమాణువు నిర్మాణం, యాంత్రికమయిన చలనం లాంటి నిర్దిష్టమయిన భౌతిక లక్షణాలను పదార్థానికి ఆపాదించారు. ఆ కాలంలోని ఈ భావనలు సైన్సు ఇచ్చిన సమాచారానికి భిన్నంగా లేవు. కాని, ఆ శతాబ్దం ప్రారంభంలో భౌతిక శాస్త్రంలో విప్లవాత్మకమైన పరిశోధనలు జరిగి పదార్థం, దాని నిర్మాణం, దాని గుణాలకు సంబంధించిన సాంప్రదాయకమయిన ఆలోచనా ధోరణిలో ఎన్నో మార్పులు వచ్చాయి. రేడియోధార్మిక శక్తి గురించి, అణువులలో రూపాంతరం చెందే శక్తి, ఎలెక్ట్రాన్‌ల ఆవిష్కరణ లాంటి విషయాలను గతితార్కిక భౌతిక వాద పద్ధతిలో కాకుండా యాంత్రికంగా ఆలోచించే వారు వివరణలు ఇచ్చుకోలేకపోయారు. మన కళ్ల ముందు కనిపించే వస్తువులు వేగం పుంజుకున్నప్పుడు వాటిలోని పదార్థం ఎందుకు మార్పుకు లోనవుతుంది అన్న ప్రశ్నకు వారి వద్ద సమాధానం లేదు. పదార్థం 'అంతర్ధానం' అయిపోయిందని ఒక అభిప్రాయం సర్వత్రా వ్యాపించింది. రకరకాలుగా ఉన్న భావవాదులు నూతనంగా ఆవిష్కరించబడ్డ భౌతిక శాస్త్రం, భౌతిక వాదాన్ని 'తప్పని' నిర్ధారించింది అని తేల్చేసారు కూడా. అప్పుడు, గతంలో 'పదార్థం' అంటే ఉన్న అభిప్రాయం కాకుండా 'పదార్థం' అంటే ఏమిటో ఇంకా మెరుగయిన వివరణ ఇవ్వాల్సిన అవసరం వచ్చింది.

భావవాదులు చేస్తున్న ఈ విమర్శలకు లెనిన్ తన పుస్తకం 'మెటీరియలిజం అండ్ ఎంపిరియో–క్రిటిసిజం'లో సమాధానం ఇస్తూ అది 'అంతర్ధానం' అయిపోవడం కాదని, సహజ శాస్త్రాలలో విప్లవం సాధించినది, పదార్థం అంటే అంతకు ముందు ఉన్న అధిభౌతిక వాద భావనలను తుదముట్టించడమేనని కరాఖండిగా చెప్పాడు. గతితార్కిక భౌతిక వాద దృక్కోణం నుండి మాత్రమే ఆధునిక శాస్త్ర విజయాలతో సహా భౌతిక శాస్త్రంలోని ఈ నూతన ఆవిష్కరణలకు సరి అయినా అర్థం చెప్పవచ్చు. గతితార్కిక సూత్రాల గురించి అవగాహన లేని ప్రకృతి శాస్త్రవేత్తలు అనేక మంది 19 వ శతాబ్దం ప్రారంభంలో భౌతిక శాస్త్రంలో సంభవించిన పరిణామాల గురించి వివరించే ప్రయత్నం చేసారు. 'పదార్థం'ను వివరించడంలో వారు సంకుచితంగా ఆలోచించి చివరికి తప్పుడు అర్థాన్ని ఉచ్చారు.

'పదార్థం' గురించిన సూక్ష్మ పరిశోధనకు పురిగొల్పే ఏ నిర్వచనం విశ్వవ్యాప్తమయిన ప్రాపంచిక దృక్పథంతో జత కలుస్తుంది? లెనిన్ ఆ విధమయిన సూత్రీకరణ చేసాడు. "పదార్థం వస్తుగతమయిన వాస్తవాన్ని తెలియపరచే తాత్విక వర్గీకరణ. దానిని మనిషి తన ఇంద్రియ పరిజ్ఞానం ద్వారా గ్రహిస్తాడు. దాని అనుకరణ ఒకదానిని తయారు చేయవచ్చు. దాని చిత్రాన్ని గీయవచ్చు, భద్రపరచుకోవచ్చు. మన ఇంద్రియజ్ఞానంలో అది ప్రతిఫలిస్తుంది. ఆ పదార్థం ఇవేవి లేకుండా స్వశక్తితో మనగలుగుతోంది" (వి.ఐ. లెనిన్ మెటీరియలిజం అండ్ ఎంపిరియో–క్రిటిసిజం పేజీ 130). 'పదార్థం' గురించిన మార్క్సిస్టు తత్వ శాస్త్రం అవగాహనకు సంబంధించి రెండు ముఖ్యమయిన అంశాలపై దృష్టి సారిద్దాం.

తత్వ జ్ఞానానికి సంబంధించిన ప్రాథమికమయిన ప్రశ్న పరిధిలోనే 'పదార్థం' నిర్వచనం ఇమిడి ఉంటుంది. అదీ కూడా, పదార్థానికి 'చైతన్యం'తో ఉండే సంబంధం ఏమిటన్నది ప్రధానం. మారడానికి ఏమాత్రం వీలు లేని పదార్థమే మార్పుకు లోనవుతున్న వస్తువులకు పునాది లేదా ఆధారం అన్న వాదనను మార్క్స్ కంటే ముందు ఉనికిలో ఉన్న భౌతిక వాదం తిరస్కరించింది. చైతన్యంతో మాత్రమే కాకుండా పదార్థానికి కూడా ప్రత్యేకమయిన అస్తిత్వం ఉంటుందన్న విషయాన్ని శాస్త్రీయమయిన నిర్వచనం నొక్కి చెప్పింది. ఇది తత్వ శాస్త్రంలో అతి ముఖ్యమయిన అంశం.

మనిషి లేదా మానవజాతి చైతన్యానికి వెలుపల అన్ని వస్తువుల, అన్ని ప్రక్రియల స్వభావం మనగలుగుతోంది అన్న విషయాన్ని ఈ నిర్వచనం అన్నింటికీ మించి ప్రత్యేకంగా వివరించింది. పదార్థం కూడా ఒక వస్తుగత వాస్తవం, దానిని ఎవరూ సృష్టించ లేదు, అది ఉనికిలోకి రావటానికి ఏదీ కారణం కాదు, అది ఉనికిలోకి రావడానికి ముందస్తు అవసరాలు ఏవీ ఉండవు. ఈ అర్థంలో, మార్పుకు లోబడని గుణమే పదార్థానికి ప్రాథమికమని, దాని గణనీయమయిన దృఢత్వమే

దాని ప్రాధాన్యత తెలియపరుస్తుందని చెప్పవచ్చు. వస్తుగత ప్రపంచంలో వస్తువుల, పద్ధతుల అంతులేని బహురూపతకు పదార్థమే వనరు. చైతన్యం రూపుదిద్దుకోవడానికి అదే కారణం. చైతన్యమే పదార్థపు అత్యుత్తమ ఉత్పాదన.

చివరకు, బాహ్య ప్రపంచంలోని వస్తువులు, పద్ధతులు ఇంద్రియ జ్ఞానంతో సంబంధం ఉన్నవని, అత్యంత సహజమైనవని గతితార్కిక భౌతిక వాదం స్పష్టం చేసింది. అవి ఇంద్రియజ్ఞానానికి అతీతమయినవి కావని, వాటికి అతీంద్రియ శక్తులు లేవని తేల్చింది. మన చుట్టూ భౌతికంగా ఉన్న వస్తువులు, మనం చూస్తున్న వస్తువులకు సంబంధించిన విషయాలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మన ఇంద్రియ అవయవాలపై ప్రభావం కలగ జేస్తాయి, వాటిని మనం ఇంద్రియాల ద్వారా అవగాహన చేసుకుంటాము. ప్రపంచానికి ఉన్న భౌతికపరమయిన ఉనికిని దాని వ్యక్తీకరణకు ఉండే ఇంద్రియ సంబంధమయిన గుణం నుండి వేరు చేయలేము. పదార్థం ఒక వస్తుగత వాస్తవం. మనిషి ఇంద్రియ అనుభవం ద్వారా కాకుండా ఊహకు మాత్రమే పరిమిత మయిన బ్రహ్మ, పరిశుద్ధ ఆత్మ లేదా ఏ ఇతర మత సంబంధమయిన, ఊహాత్మక భావనలకు భిన్నంగా వస్తువు ఒక వస్తుగత వాస్తవం. భావవాదం తర్కంతో వాదించిన అంశాలు ఇంద్రియానుభవం లేకుండా ఊహలకు పరిమితమయినవే.

పైన పేర్కొన్న చర్చ మూలంగా పదార్థం గురించిన తాత్వికమయిన భావనలో ఏ విధమయిన ప్రత్యేక గుణాలను పదార్థానికి (భౌతిక, రసాయనిక మొదలయిన లక్షణాలు) ఆపాదించకూడదు అని ఎవరయినా పొరపాటు అవగాహనకు రావచ్చు. ఉదాహరణకు, పదార్థం అన్న భావనను వాయువు, ద్రవం, స్ఫటికం మొదలయిన వాటికి లేదా అణువు, పరమాణువు లాంటి వాటికి ఆపాదిస్తే అది సరి అయినది కాదు. విద్యుదయస్కాంత రంగం ఇతర వస్తువుల వలె వస్తుపరమయినది, ఇంద్రిజ్ఞానంతో అనుభవంలోకి వచ్చేది. కాబట్టి, వాటి గుణాలలో ఎంత వైవిధ్యం ఉన్నప్పటికీ వస్తువు, రంగం అనునవి రెండూ కూడా పదార్థం యొక్క ప్రత్యేకమయిన రూపాలు మాత్రమే. ప్రపంచంలో పదార్థం రకరకాల రూపాలలో ఉనికిలో ఉన్నది. అవి వాటి గుణాల రీత్యా ప్రత్యేకమయినవిగానే ఉన్నవి కాని, వాటి గురించి శాస్త్రీయ పరిశోధనలు ఇంకా జరగవలసి ఉన్నది. పదార్థం అంతులేని వైవిధ్యంతో కూడుకొని ఉన్నది. అది పరిమితమయిన రూపాలలో వ్యక్తీకరించి ఉన్నది.

పదార్థానికి లెనిన్ ఇచ్చిన నిర్వచనం

తత్వ శాస్త్రానికి సంబంధించిన మొదటి అంశం

అసలు పదార్థం అనేది ఉనికిలో ఉందా?

మనిషి మెదడు బయట ఉనికిలో ఉన్న వస్తుగత వాస్తవమే పదార్థం యొక్క ఏకైక 'గుణం'. తత్వశాస్త్రం ప్రవచించే భౌతికవాదం ఆ 'గుణం' వల్లనే గుర్తింపబడుతున్నది.

– లెనిన్

"మనిషి పదార్థాన్ని అర్థం చేసుకుంటాడు, అదేమిటో గ్రహిస్తాడు. అంతే కాని తనకు తెలియనిదానినో, ఆత్మ అని అనుకుంటున్నదానిని గ్రహించలేడు. పదార్థం అంటే మన జ్ఞానేంద్రియాలద్వారా మన అనుభవంలోకి వచ్చేది"

– లెనిన్

తత్వ శాస్త్రానికి సంబంధించిన రెండవ అంశం

తన ఇంద్రియ స్పృహ ద్వారా మనిషికి ఏ విషయం చేరుతుంది?

పదార్థం వస్తుగతమయిన వాస్తవాన్ని తెలియపరచే తాత్విక వర్గీకరణ. దానిని మనిషి తన ఇంద్రియ పరిజ్ఞానం ద్వారా గ్రహిస్తాడు. దాని అనుకరణ ఒకదానిని తయారు చేయ వచ్చు. దాని చిత్రాన్ని గీయవచ్చు, భద్రపరచుకోవచ్చు. మన ఇంద్రియ జ్ఞానంలో అది ప్రతిఫలిస్తుంది. ఆ పదార్థం ఇవేవి లేకుండా స్వశక్తి తో మనగలుగుతోంది.

– లెనిన్

పదార్థం ఉనికి ఇంద్రియ జ్ఞానంపై ఆధారపడి ఉండదు. పదార్థం ప్రాథమికం. స్పర్శ లేక ఇంద్రియాలతో దాని ఉనికిని గ్రహించడం, ఆలోచన, చైతన్యం – ఇవన్నీ పదార్థం నుండి ఉద్భవించి, ఒక ప్రత్యేకమయిన పద్ధతిలో సమీకరించబడ్డవి.

– లెనిన్

అనుభూతులు లేదా ఉద్వేగాలు సంకేతాలో, చిహ్నాలో కాదు, అవి బాహ్య ప్రపంచం ప్రతిరూపాలు. 'ఇంద్రిజ్ఞానంతో గ్రహించేవి బాహ్యప్రపంచం ప్రతిరూపాలన్న విషయాన్ని ఖండించే సిద్ధాంతాన్ని ఇంతవరకు ఎవరూ సూచించలేదు'

– లెనిన్

బహిర్గతంగా కనిపించే క్రమబద్ధత, ప్రతిదానికి ఒక కారణం ఉంటుందన్న సూత్రం, ప్రకృతి యొక్క సమాజం యొక్క అవసరం – వీటిని నిరూపించడం వరకు ప్రపంచానికి ఉండే భౌతిక గుణం పరిమితమయి ఉంటుంది. వస్తుగతంగా ఉనికిలో ఉన్న పదార్థం, దానిలో సంభవించే సూత్రబద్ధ పరిణామాలు, వాటి గుణాలు, వాటికి చెందిన అంశాలు ప్రతిఫలించని ఏ శాస్త్రమయినా అభివృద్ధి చెందే అవకాశమే లేదు.

– లెనిన్

ఆసరా పెన్షన్‌ల కోసం ధర్నా

21 సంఘాలతో ఏర్పడిన ఆసరా పెన్షన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 28న ఇందిరా పార్క్‌లోని ధర్నా చౌక్ వద్ద ధర్నా జరిగింది. పోలీసులు ఆంక్షలు విధించి, 100 మందితో మాత్రమే ధర్నా చేయాలని పర్మిషన్ లెటర్‌లో రాశారు. పర్మిషన్ ఇచ్చికూడా టెంట్ హౌజ్ వాళ్లను కుర్చీలు వేయకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. జిల్లాల నుండి వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలతో కలిపి 400 వరకు ఈ ధర్నాకు వచ్చారు. ఆసరా పెన్షన్‌ల కోసం 15 జిల్లాల నుంచి వచ్చిన వాళ్లలో 30 మంది దరఖాస్తు దారులు పబ్లిక్ హియరింగ్‌లో జ్యూరీకి తమ బాధలు వినిపించారు. జ్యూరీగా వ్యవహరించిన రిటైర్డ్ ఐఏఎస్ గోపాలరావు, మానవ హక్కుల వేదిక నాయకులు జీవన్ కుమార్, అమూమత్ సొసైటీ బాధ్యులు ఖలీదా పర్వీన్, ప్రొ. పద్మజా షా, మహిళా హక్కుల కార్యకర్త గిరిజ తమ స్పందన వ్యక్తం చేశారు. జ్యూరీ తరపున ప్రజల గోడును ప్రభుత్వానికి రిపోర్ట్ రూపంలో పంపిస్తామని ప్రకటించారు.

ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలి

సమ్మె చేశారన్న సాకుతో తెలంగాణ ప్రభుత్వం విధుల నుంచి తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్లను బేషరతుగా విధుల్లోకి తీసుకోవాలని ఫీల్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చింతా కృపాకర్ డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి రెండేళ్లయినా విధుల్లోకి తీసుకోకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇప్పటికే 70 మంది ఆత్మహత్య చేసుకున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఫీల్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్, టిఆర్ఎస్‌కెవి, ఐఎన్‌టియుసి కలిసి మార్చ్ 12న 'చలో అసెంబ్లీ' కార్యక్రమంలో పాల్గొనగా గన్‌పార్క్ వద్ద పోలీసులు అడ్డుకుని నారాయణగూడ పోలీసు స్టేషన్‌కు తరలించారు. రాష్ట్ర వ్యాప్తంగా 7,651 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను అకారణంగా తొలగించారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆర్‌టిసి కార్మికుల 'డిమాండ్స్ డే'

సుదీర్ఘకాలంగా ఉన్న పలు సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆర్‌టిసి జెఏసి పిలుపుమేరకు మార్చ్ 12న తెలంగాణ వ్యాప్తంగా బస్ డిపోల్లో కార్మికులు 'డిమాండ్స్ డే' పాటించారు. ఆర్థిక సంక్షోభంలో ఉన్న ఆర్‌టిసికి బడ్జెట్‌లో కనీసం 2 శాతం నిధులు కేటాయించి ఆదుకోవాలని, పెరిగిన డీజిల్ ధరల భారాన్ని రీయింబర్స్ చేయాలని, బకాయి ఉన్న రెండు పిఆర్‌సిలు, ఆరు విడతల డిఏ బకాయిలను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్‌టిసిలోని పలు కార్మిక సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో దాదాపు 80 డిపోల్లో కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి 'డిమాండ్స్ డే'లో పాల్గొన్నారు. కొత్త బస్సులు కొనేందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని, ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు ఖాళీలు భర్తీ చేసి ఉద్యోగులపై పనిభారం తగ్గించాలని జెఏసి ప్రతినిధులు డిమాండ్ చేశారు.

ప్రజాపంథా చలో అసెంబ్లీని అడ్డుకున్న పోలీసులు

తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలనే డిమాండ్‌తో సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమం నాయకుల, కార్యకర్తల అరెస్టుతో ఉద్రిక్తతకు దారి తీసింది. మార్చ్ 14న వివిధ జిల్లాల నుంచి నగరానికి చేరుకుంటున్న వారిని ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. హైదరాబాద్‌లోని విద్యానగర్ మార్క్స్‌భవన్ కార్యాలయాన్ని ఉదయమే పోలీసులు చుట్టుముట్టారు. నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రదర్శనగా అసెంబ్లీ వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

నిజాం చక్కెర ఫ్యాక్టరీ తెరవాలని రైతుల ఆందోళన

నిజాం చక్కెర ఫ్యాక్టరీని తెరవాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల రైతులు మార్చ్ 15న అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. తెలంగాణ వస్తే నిజాం చక్కెర ఫ్యాక్టరీని తెరుచుకుందామని నాడు కెసిఆర్ చెప్పిన మాట నేటికీ నిలబెట్టుకోలేదని రైతులు విమర్శించారు. రు. 100 కోట్లు వెచ్చిస్తే కర్మాగారం తెరుచుకుంటుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఫ్యాక్టరీ గురించి అసెంబ్లీలో ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

అప్పులు తీర్చలేక ఆత్మహత్యల వైపు మళ్లుతున్న రైతులు

తెలంగాణలో వ్యవసాయంలో పెట్టిన పెట్టుబడికి సరయిన దిగుబడిరాక, పండిన పంటకు గిట్టుబాటు ధర లేక చేసిన అప్పులు తీర్చే మార్గం లేక రైతులు నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ఆత్మహత్యలు చేసుకుంటున్న దుర్భరమైన పరిస్థితి నెలకొంది. మార్చ్ 15న రాష్ట్రంలో మరో ముగ్గురు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. మెదక్ జిల్లా మాసాయిపేట మండలం పొలిగుట్ట గిరిజన తండాలో కారంతోడు దశరథ(38), భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం స్తంభంపల్లి(పికె)లో పూజారి సురేష్(40), ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం కౌటలో కదరపు నాగన్న(52)లు అందరు చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలను పరిష్కారంగా ఎంచుకుంటున్న రైతుల జీవితాలకు ప్రభుత్వాలు భరోసాను కల్పించలేకపోతున్నాయి.

తెలంగాణలో మద్యం ఆదాయం మూడింతలు

తెలంగాణలో ప్రజల జీవన ప్రమాణాలు పెంచే ఉపాధి, విద్య, వైద్యంపై బడ్జెట్‌లో కోతలు విధించిన ప్రభుత్వం మద్యం అమ్మకాల ఆదాయం మాత్రం మూడింతలైందని కాగ్ తన నివేదికలో వెల్లడించింది. తెలంగాణ ఎక్సైజ్ శాఖ ఆదాయం 2015-16లో ఆదాయం రు. 3,809 కోట్లు కాగా అది రు.11,992 కోట్లకు పెరిగింది. ఈ లెక్కన నాలుగేళ్లలో మద్యం రాబడి దాదాపు మూడింతలు పెరిగినట్లు కాగ్ నివేదిక వెల్లడించింది.

ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధి కార్మికుల ఆందోళన

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో కార్మికులకు రావాల్సిన రు. 750 కోట్ల పెండింగ్ బకాయిలు చెల్లించాలని, రెండు పూటలా పని విధానాన్ని రద్దు చేయాలని, సమ్మర్ అలవెన్సు కొనసాగించాలని కోరుతూ రెండు కార్మిక సంఘాలు విజయవాడ రైల్వే స్టేషన్ వద్ద మార్చ్ 21న మహా ధర్నాకు పిలుపునిచ్చాయి. ధర్నాకోసం అనుమతిని కూడా తీసుకున్నారు. అదే రోజు అర్ధరాత్రి ధర్నాకు అనుమతి లేదంటూ టెంట్లను తొలగించి, కుర్చీలను తీసేయడం జరిగింది. సమాచారం తెలియకపోవడం వల్ల వచ్చిన కార్మికులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లాల్లో కార్మికులను ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. అయినా ధర్నా స్థలానికి 300 మంది కార్మికులు చేరుకొని ధర్నా చేస్తుంటే పోలీసులు వారిని అరెస్టు చేసి వివిధ పోలీసు స్టేషన్‌లలో నిర్బంధించారు.

నష్టపరిహారం కోసం నిర్వాసితుల ఆందోళన

అనంతపురం జిల్లా, గోరంట్ల మండలంలో కేంద్రం నిర్మిస్తున్న బిహెచ్ఇఎల్, నాసన్ కంపెనీల కోసం భూములు సేకరించిన గ్రామాల్లోని నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, నష్టపరిహారం చెల్లించాలని ఆర్ అండ్ ఆర్ కమిషనర్‌ను ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) డిమాండ్ చేసింది. కమిషనర్ కార్యాలయం ముందు మార్చ్ 23న ధర్నా నిర్వహించారు. 2014లో కంపెనీల నిర్మాణం కోసం 900 ఎకరాల భూమి బలవంతంగా తీసుకుని నేటికీ ప్రభుత్వం నిర్వాసితులకు పరిహారం, ప్యాకేజీ చెల్లించకపోవడం అన్యాయమన్నారు. 2013 భూసేకరణ చట్టానికి వ్యతిరేకంగా అమాయకుల భూములు లాక్కున్నారని, కంపెనీ గోడలు నిర్మించడంతో కార్మికులకు వ్యవసాయ పనులు లేవని, ఉపాధి పనులను రద్దు చేశారని తెలిపారు. వీ

ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు

ఐదు రాష్ట్రాల్లో 7 దశల్లో జరిగిన ఎన్నికల ఫలితాలు మార్చ్ 10న వెలువడ్డాయి. ఉత్తరప్రదేశ్‌లోని 403 అసెంబ్లీ స్థానాలకు బిజెపి కూటమి 273 స్థానాల్లో గెలిచి తిరిగి అధికారంలోకి వచ్చింది. పంజాబ్‌లోని 117 అసెంబ్లీ స్థానాలకు ఆమ్ ఆద్మీ పార్టీ 92 స్థానాల్లో గెలిచి మొదటిసారి అధికారంలోకి వచ్చింది. ఉత్తరాఖండ్‌లోని 70 అసెంబ్లీ స్థానాలకు బిజెపి 47 స్థానాల్లో నెగ్గి తిరిగి అధికారంలోకి వచ్చింది. గోవాలోని 40 అసెంబ్లీ స్థానాలకు బిజెపి 20 స్థానాల్లో గెలుపొంది స్వతంత్ర అభ్యర్థుల మద్దతుతో మూడవసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. మణిపూర్‌లోని 60 అసెంబ్లీ స్థానాలకు బిజెపి 32 స్థానాల్లో గెలుపొంది నేషనల్ పీపుల్స్ పార్టీ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్‌లు

జమ్మూ-కశ్మీర్‌లోని పుల్వామా, గందర్బాల్, కుప్వారా జిల్లాల్లో జరిగిన మూడు వేర్వేరు ఎదురుకాల్పుల ఘటనల్లో నలుగురు మిలిటెంట్లు భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో మరణించారు. మృతుల్లో పాకిస్థాన్‌కు చెందిన జైషే మహ్మద్ కమాండర్ కూడా ఉన్నారు. పుల్వామా జిల్లా చెవాక్లాలో మార్చ్ 11 రాత్రి జరిగిన కాల్పుల్లో జైషే మహ్మద్ కమాండర్ కమాల్ భాయ్‌తో పాటు మరో మిలిటెంట్ మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. మార్చ్ 12న గందర్‌బాల్ జిల్లాలో జరిగిన గాలింపు చర్యల్లో లష్కరే తోయిబాకు చెందిన మిలిటెంట్‌ని కాల్చిచంపినట్లు అధికారులు పేర్కొన్నారు. మరో ఘటనలో కుప్వారా జిల్లాలోని హంద్వారా కాల్పుల్లో లష్కరే తోయిబా మిలిటెంట్ చనిపోయినట్లు వెల్లడించారు.

పదోన్నతులు దక్కని న్యాయమూర్తి

రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా మార్చ్ 5న రాజస్థాన్ హైకోర్టు బార్ అండ్ బెంచ్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జస్టిస్ ఖురేషీ తన ప్రసంగంలో ఆయన పట్ల కేంద్ర ప్రభుత్వానికి ప్రతికూల అభిప్రాయాన్ని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వ ప్రతికూలత తన న్యాయవాద స్వతంత్రతకు సగౌరవ నిదర్శనంగా భావిస్తానన్నారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో రెండు స్థానాలు ఖాళీగా ఉన్నప్పటికీ దేశంలో అత్యంత సీనియర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదోన్నతి దక్కలేదు. అందుకు కారణం ఖురేషీ గతంలో ఇచ్చిన తీర్పులనే విషయం రంజన్ గొగోయ్ తన ఆత్మకథలో ప్రస్తావించారు. ప్రధానంగా రెండు తీర్పులు ప్రభుత్వాన్ని ఆగ్రహానికి గురిచేశాయి. అవి అప్పటి గుజరాత్ రాష్ట్ర హోం మంత్రి అమిత్ షాను సోహ్రాబుద్దీన్ షేక్ ఎన్‌కౌంటర్ కేసులో ట్రయల్ కోర్టు ఆదేశాలను పక్కనబెట్టి సిబిఐ కస్టడీకి అప్పగించారు, గుజరాత్ లోకాయుక్తగా హైకోర్టు మాజీ న్యాయమూర్తి మెహతాను మోదీ ప్రభుత్వ ఇష్టానికి వ్యతిరేకంగా గవర్నర్ నియమిస్తే, ఖురేషీ ఆ నిర్ణయాన్ని సమర్థిస్తూ తీర్పు ఇచ్చారు.

విద్యా సంస్థల్లో హిజాబ్ ధరించరాదన్న హైకోర్టు

హిజాబ్ ముస్లిం మతంలో అనివార్యంగా ఆచరించాల్సిన వస్త్రధారణ కాదని కర్ణాటక హైకోర్టు మార్చ్ 15న తేల్చిచెప్పింది. విద్యా సంస్థల్లో ఏకరూప వస్త్రాల నిబంధనలను పాటించాలన్న కర్ణాటక సర్కారు ఆదేశాన్ని సమర్థించింది. రాజ్యాంగంలోని అధికరణలు 19(1)(ఎ), 25లో ప్రస్తావించిన మౌలిక హక్కులకు అనుగుణంగానే ప్రభుత్వం ఆదేశాలిచ్చిందన్నారు. ఈ వివాదంపై దాఖలైన ఇతర పిటిషన్లను హేతుబద్ధంగా లేవని కొట్టివేసింది. సుదీర్ఘ విచారణల అనంతరం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రితురాజ్ అవస్థి, జస్టిస్ ఎస్. కృష్ణ దీక్షిత్, జస్టిస్ మొహియుద్దీన్ ఖాజీలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ ఆదేశాలిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఓ విద్యార్థిని సుప్రీంకోర్టులో మార్చ్ 15న పిటిషన్ దాఖలు చేశారు.

ఉత్తరప్రదేశ్‌లో జర్నలిస్టులపై దాడులు

ఉత్తరప్రదేశ్ పోలీసులు ఆగ్రాకు చెందిన విలేఖరి గౌరవ్ బన్సల్‌ని నిర్బంధించి చిత్రహింసలు పెట్టిన ఘటనపై కోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర దర్యాప్తు జరగాలని ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా మార్చ్ 21న డిమాండ్ చేసింది. ఈ మధ్య ముగిసిన ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని 'పంజాబ్ కేసరి' విలేఖరి బన్సల్ ఆరోపించడంతో మార్చ్ 15న ఆయన్ను అరెస్టు చేశారు. బన్సల్‌ను వెంటనే విడుదల చేయాలని ఎడిటర్స్ గిల్డ్ డిమాండ్ చేసింది. పోలీసు స్టేషన్‌లో సరిగ్గా నిలబడలేని, వణుకుతున్న స్థితిలో ఉన్న బన్సల్ వీడియో ఒక దానిని సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. గతంలోనూ యోగి ప్రభుత్వం జర్నలిస్టులపై కేసులు పెట్టి వేధించిన ఘటనలు ఉన్నాయి. హత్రాస్ ఘటనను కవర్ చేయడానికి వెళ్లిన ఇతర రాష్ట్రాల విలేఖరులపై కేసులు పెట్టి నిర్బంధించింది.

నదుల అనుసంధానాన్ని వ్యతిరేకిస్తూ గిరిజనుల ఆందోళన

గుజరాత్‌లో గిరిజనులు, ఆదివాసీలు బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా మార్చ్ 20న వ్యారాలో ఆందోళన చేపట్టారు. పార్ తపీ-నర్మదా నదుల అనుసంధానం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న పలు ప్రాజెక్టుల్లో కప్రదా, వల్సాద్, తాపీ, డాంగ్...తదితర జిల్లాల్లోని గిరిజనులు, ఆదివాసీలు పెద్ద ఎత్తున వ్యవసాయ భూములు, ఇండ్లు, ఇతర ఆవాసాల్ని కోల్పోతున్నారు. నిర్వాసితులకు నష్టపరిహారం అందజేస్తామని, పునరావాసం కల్పిస్తామని ఇటు రాష్ట్ర ప్రభుత్వం, అటు కేంద్ర ప్రభుత్వం అంటోంది కాని ప్రజలు నమ్మడం లేదు. గిరిజన, ఆదివాసీ సంఘాలు జిల్లా, తాలూకా కేంద్రాల్లో నిరసనలకు పిలుపునిచ్చాయి. నిర్వాసితులు రాష్ట్రంలో ఆందోళనబాట పట్టడం ఇది నాలుగోసారి. నర్మదా వాటర్ డెవలప్మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) ప్రాజెక్ట్ డిపిఆర్‌ను రూపొందించింది. ఈ నివేదిక ప్రకారం, నదుల అనుసంధానం ప్రాజెక్ట్‌లో భాగంగా అనేక చోట్ల రిజర్వాయర్లు నిర్మించబోతున్నారు. దాంతో గిరిజన, ఆదివాసీలకు చెందిన 6065 హెక్టార్ల వ్యవసాయ భూమి నీట మునుగుతుంది. మొత్తం 61 గ్రామాలు ప్రభావితం అవుతాయి.

మానవ హక్కుల కార్యకర్తల పట్ల ఆందోళన

భారతదేశ ప్రభుత్వం మానవ హక్కుల కార్యకర్తల పట్ల ప్రవర్తిస్తున్న తీరుపై యూరోపియన్ పార్లమెంట్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రధాని మోడీ, ఇతర ఉన్నతాధికారులకు లేఖ రాశారు. సామాజిక కార్యకర్తలను ఉగ్రవాదులుగా ముద్రవేసి జైలు పాలు చేస్తున్నారనీ ఈ సందర్భంగా మూడు కేసులను ఎత్తి చూపారు. ఎల్గార్ పరిషత్ కేసులో 16 మంది కార్యకర్తలు, విద్యావేత్తల అరెస్టు, పౌరసత్వ సవరణ చట్టం (సిఏఏ)కు వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టినందుకు కార్యకర్తలు, విద్యార్థులను అరెస్టు చేస్తూనే ఉండటం, కశ్మీర్ సామాజిక కార్యకర్త ఖుర్రం పర్వేజ్‌ను అదుపులోకి తీసుకోవడాన్ని ప్రస్తావించారు. అసమ్మతిని అణచివేసేందుకు చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా)ను వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. దీన్ని సిట్టింగ్, పదవీ విరమణ పొందిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సైతం ఖండించారని గుర్తు చేశారు. ఎల్గార్ పరిషత్ కేసులో నిందితుల్లో కొందరిని లక్ష్యంగా చేసుకోవడానికి పెగాసెస్ స్పైవేర్ ద్వారా నిందితుల కంప్యూటర్లో డిజిటల్ సాక్ష్యాలను ఏర్పాటు చేయడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నట్టు యూరోపియన్ సభ్యులు లేఖలో పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా నిర్బంధించిన వారిని తక్షణమే, బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వీ

భూగోళానికి ప్రమాద ఘంటిక

ఐక్యరాజ్యసమితిలోని ఇంటర్ గవర్నమెంట్ ప్యానల్ ఆన్ క్లైమేట్ ఛేంజ్ (ఐజిపిసిసి) తాజాగా ప్రకటించిన వాతావరణ మార్పుల ప్రభావ నివేదిక భూగోళానికి ముంచుకొస్తున్న ముప్పును మన కళ్ల ముందుంచింది. ఈ నివేదిక ప్రకారం పరిస్థితి ఇప్పటికే ప్రమాదకర స్థాయికి చేరింది. వాతావరణ మార్పులు భూగోళం మీది సమస్త ప్రాణికోటికి మరణ శాసనం రాస్తున్నాయి. చిన్నమొక్కలు, సముద్రపు నాచు వంటివి కూడా తీవ్రంగా ప్రభావితమౌతాయని పేర్కొనడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. పెరిగే సముద్ర మట్టాలు, మునిగే ప్రాంతాలు, భగ్గుమనే ఎండలు, కరువు రక్కసి కరాళ నృత్యాలు, ఎండే పొలాలు, రాలే ప్రాణులు ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ప్రకృతి బీభత్సాలు. పెట్టుబడిదారీ దోపిడీలో భాగంగానే ప్రకృతి వనరులను నాశనం చేశారు. మనిషి శ్రమ శక్తిని దోచినట్లే ప్రకృతిని అడ్డగోలుగా దోచి కార్పొరేట్లు తెగబలిశారు. మరోవైపు కోట్లాది మంది ప్రజలు వాతావరణ మార్పుల కారణంగా మనుగడ సమస్యను ఎదుర్కొంటున్నారు.

ఆహార సంక్షోభంలో ఆఫ్ఘనిస్తాన్

గతేడాది ఆగస్టులో ఆఫ్ఘనిస్తాన్ పగ్గాలు తాలిబన్ల వశమయ్యాయి. ఆర్థిక సంక్షోభం, కరువు ఇప్పుడు ఆ దేశాన్ని వేధిస్తున్నాయి. అమెరికా తన ఫెడరల్ బ్యాంకు, ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్‌లు ఆఫ్ఘాన్‌కు అందాల్సిన నిధులను స్తంభింపజేయడంతో ప్రజల జీవితాలు చిన్నాభిన్నమయ్యాయి. ఆహార సంక్షోభంతో ఆకలిచావులు పెరిగిపోయాయని ఐక్యరాజ్యసమితి ప్రపంచ ఆహార కార్యక్రమం చీఫ్ డేవిడ్ బేస్లీ ఆందోళన వ్యక్తం చేశారు. జనాభాలో 97 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన పడిపోవచ్చని ఆవేదన వ్యక్తం చేశారు. ఆఫ్ఘనిస్తాన్‌లో ప్రస్తుతం అనేక సమస్యలు తాండవం చేస్తున్నాయని, దాదాపు 3 కోట్ల మంది సంక్షోభ కోరల్లో చిక్కుకున్నారని ఐరాస కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ చెప్పారు.

పాక్ సైన్యానికి చైనా జే-10సీ ఫైటర్లు

ఫ్రాన్స్ నుంచి భారత్ రాఫెల్ యుద్ధ విమానాలను పొందిన నేపథ్యంలో, పాకిస్తాన్ తన మిత్రదేశం చైనా నుంచి జే-10సీ యుద్ధ విమానాలను కొనుగోలు చేసింది. మల్టీ రోల్ జెట్ ఫైటర్ జే-10సీ యుద్ధ విమానాల రాకను పురస్కరించుకుని పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ మాట్లాడుతూ, అమెరికా ఎఫ్-16 యుద్ధ విమానాలను ఇచ్చిన 40 ఏళ్ల తర్వాత మళ్లీ ఇన్నాళ్లకు అత్యాధునిక యుద్ధ విమానాలు పాక్ వాయుసేనలో చేరుతున్నాయని వివరించారు. చైనా కేవలం 8 నెలల వ్యవధిలోనే యుద్ధ విమానాలను సరఫరా చేసిందని అన్నారు. చైనా అభివృద్ధి చేసిన జే-10సీ యుద్ధ విమానంలో యాక్టివ్ ఎలక్ట్రానికల్లీ స్కాన్డ్ అర్రే (ఎఇఎస్ఎ) రాడార్ వ్యవస్థను పొందుపరిచారు. ఈ విమానం అప్‌గ్రేడ్ చేసిన నాలుగో తరం (4.5 జెనరేషన్) ఎయిర్ టు ఎయిర్ మిస్సైళ్లను కలిగి ఉంటుంది. అంతేకాదు, షార్ట్ రేంజ్ పీఎల్-10 క్షిపణులతో పాటు బియాండ్ విజువల్ రేంజ్ పీఎల్-15 క్షిపణులు కూడా దీంట్లో ఉన్నాయి.

జర్మనీ అధ్యక్షునిగా మరోసారి స్టెయిన్‌మెయర్

జర్మనీ అధ్యక్షుడు ఫ్రాంక్ వాల్టర్ స్టెయిన్‌మెయర్ మరో ఐదేళ్ల పాటు పదవిలో కొనసాగనున్నారు. పార్లమెంటు దిగువసభ సభ్యులు, 16 రాష్ట్రాల ప్రతినిధులతో కూడిన ప్రత్యేక అసెంబ్లీ సమావేశమై ఫిబ్రవరి 13న అయన్ను మరోసారి అధ్యక్షునిగా ఎన్నుకుంది. అధికార పక్షంతో పాటు అత్యధిక విపక్షాలు కూడా ఆయన అభ్యర్థిత్వానికి మద్దతు పలికాయి. మాజీ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్ హయాంలో స్టెయిన్‌మెయర్ రెండుసార్లు విదేశాంగ మంత్రిగా పని చేశారు. జర్మనీలో అధ్యక్ష పదవి లాంఛన ప్రాయమైనది.

బల్గేరియా అధ్యక్షుడిగా రెండవసారి రుమెన్ రదేవ్


బల్గేరియా అధ్యక్షుడిగా రుమెన్ రదేవ్ జనవరి 19న ప్రమాణ స్వీకారం చేశారు. దేశ రాజధాని నగరం సోఫియాలోని నేషనల్ అసెంబ్లీలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అధ్యక్ష బాధ్యతలు రదేవ్ చేపట్టడం ఇది 2వ సారి. రదేవ్ గతంలో బల్గేరియన్ వైమానిక దళానికి కమాండర్‌గా పనిచేశారు. తొలిసారి 2017 జనవరి 22న అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. గతంలో బల్గేరియా వైమానిక శాఖలో పనిచేసిన ఆయన 2021లో దేశంలో జరిగిన ఆందోళనలకు అనుకూలంగా మాట్లాడి అత్యంత ప్రజాదరణ పొందారు. యూరోపియన్ యూనియన్‌లో పేద దేశంగా బల్గేరియా నిలుస్తోంది.

దక్షిణ కొరియా అధ్యక్షుడిగా యూన్ సుక్ యోల్

దక్షిణ కొరియాలో అధ్యక్షుడి ఎన్నికల్లో పీపుల్ పవర్ పార్టీ అభ్యర్థి కన్జర్వేటివ్ యూన్ సుక్ యోల్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అధికార ప్రగతిశీల డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి లీ జే-మ్యూంగ్ ఓటమి చెందారు. ఈ సందర్భంగా యూన్ సుక్ మే నెలలో పదవీ బాధ్యతలు చేపట్టనున్నట్టు తెలిపారు. అనంతరం తన విదేశాంగ విధానం గురించి వెల్లడిస్తూ అమెరికాతో సంబంధాలను మరింత పటిష్టం చేసుకోనున్నట్టు స్పష్టం చేశారు. ఉత్తర కొరియా కవ్వింపులను సమర్థంగా ఎదుర్కొంటామని కిమ్‌కు వార్నింగ్ ఇచ్చారు. ప్రజల భద్రత, దేశ సార్వభౌమాధికార రక్షణ కోసం శక్తిమంతమైన సైన్యాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

పెషావర్‌లో ఆత్మాహుతి దాడి

పాకిస్థాన్‌లోని పెషావర్ నగరం మార్చి 4న బాంబు పేలుళ్లతో దద్దరిల్లింది. ప్రార్థన సమయంలో రద్దీగా ఉన్న ఓ షియా మసీదులో శక్తివంతమైన ఆత్మాహుతి బాంబు పేలుడు సంభవించింది. ఆత్మాహుతి దళ సభ్యుడు నల్లరంగు దుస్తులు ధరించి మసీదులోకి ప్రవేశించి కాల్పులు జరుపుతూ మసీదు ప్రధాన గదిలోకి ప్రవేశించి తనకు తాను పేల్చుకున్నాడు. ఈ ఘటనలో 57 మంది దుర్మరణం చెందగా, మరో 200కి పైగా మంది గాయపడ్డారు. ఆఫ్ఘాన్ సరిహద్దులో ఉన్న ఈ ప్రావిన్స్‌లో అతిదారుణమైన దాడుల్లో ఇది ఒకటి. ప్రార్థనలు చేస్తున్న వారిని లక్ష్యంగా చేసుకుని ఆత్మాహుతి దాడికి పాల్పడడం క్రూరమైన చర్యగా పలువురు ఖండించారు. వీ



నన్ను నడిపించిన చరిత్ర

వకుళాభరణం రామకృష్ణ

ఎమెస్కో బుక్స్ ప్రై.లి. ప్రచురణ

పేజీలు: 211

వెల: రు. 150

ప్రతులకు: ఎమెస్కో బుక్స్ ప్రై.లి.
33-22-2, చంద్రం బిల్డింగ్స్,
సి.ఆర్. రోడ్, చుట్టుగుంట,
విజయవాడ – 520004, ఫోన్ : 0866-2436643

స్వీయ చరిత్రలు వలసకాలపు ఆంధ్ర సమాజం

వకుళాభరణం రాజగోపాల్


అనువాదం: దుర్గెంపూడి చంద్రశేఖరరెడ్డి

ఎమెస్కో బుక్స్ ప్రై.లి. ప్రచురణ

ప్రతులకు: ఎమెస్కో బుక్స్ ప్రై.లి.
ఇ.నెం. 1-2-7, బానూ కాలనీ, గగన్‌మహల్ రోడ్, దోమలగూడ
హైదరాబాద్ – 500029, www.emescobooks.com

పేజీలు: 272

వెల: రు. 200





షాయర్ సాబ్

ఆశారాజు కవిత్వం

ఝరీ పొయిట్రి సర్కిల్ ప్రచురణ

పేజీలు: 272

వెల: రు. 200

ప్రతులకు: ఆశారాజు
ప్లాట్ నెం. 596, ఇ.నెం. 5-6-363,
వైదేహి నగర్, గడ్డి అన్నారం, దిల్‌సుఖ్‌నగర్,
హైదరాబాద్ – 500060, ఫోన్ : 9392302245

పిల్లల కోసం

పర్యావరణ శాస్త్రం

(పోటీ పరీక్షలకు)

ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి

ప్రతులకు: ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి
పరిశోధక విద్యార్థి, రాజనీతి శాస్త్ర విభాగం,
కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ – 506009,
ఫోన్ : 9908240768, అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో

పేజీలు : 112

వెల: రు. 113



VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 245 - April 2022 ● **ISSN 2231-6892**
● RNI Regn.No.APTEL/2003/11482 ● Published on 27/03/2022 ● Postal Regn. No. HD/1100/2020-22

Date of Posting : 29th, 30th

'Save Veekshanam' Campaign

వీక్షణంకు చేయూతనివ్వండి!

తెలుగు సమాజంలో రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణలో రెండు దశాబ్దాలుగా అసాధారణమైన కృషి చేస్తున్న మాసపత్రిక వీక్షణం ఆర్థిక పరిస్థితి ప్రమాదకరమైన స్థితికి చేరుకున్నది. కొవిడ్ లాక్ డౌన్ కు ముందు చందాల ద్వారా, పుస్తకాల అమ్మకాల ద్వారా, ప్రకటనల ద్వారా వచ్చిన ఆదాయానికి దాతల విరాళాలు జత కలిసి పత్రిక నడుస్తుండేది. ఏడాదిన్నరగా కొవిడ్‌తో జనజీవితమే సంక్షోభమయంగా ఉన్నందువల్ల చందాలు తగ్గిపోయాయి, పుస్తకాల అమ్మకాలు పూర్తిగా ఆగిపోయాయి, ప్రకటనలు రావడం లేదు. కేవలం దాతల విరాళాల మీదనే పత్రిక ఆధారపడవలసిన స్థితి వచ్చింది. ఏడాదిన్నరగా నెలకు యాభై వేల రూపాయల లోటుతో, అప్పులతో పత్రిక నడుస్తున్నది. ఇటువంటి స్థితిలో పత్రిక నడపలేమని నిర్వాహకులు భావిస్తున్నప్పటికీ, తెలుగు సమాజానికి ఇటువంటి ఆలోచనాస్ఫోరక పత్రిక చాల అవసరమని, ప్రస్తుత సంక్షోభ స్థితిలో ఆ అవసరం మరింత పెరుగుతున్నదని, పత్రికను ఎట్టి పరిస్థితిలోనూ ఆపగూడదని పాఠకులు, మిత్రులు, అభిమానులు కోరుతున్నారు. పందొమ్మిది సంవత్సరాలలో, 237 సంచికలలో, నాలుగున్నర వేల వ్యాసాలతో వీక్షణం ప్రాంతీయ, దేశీయ, అంతర్జాతీయ పరిణామాలెన్నిటినో విశ్లేషించి పాఠకుల అవగాహనలు పెరగడానికి తోడ్పడింది. ఆ మహత్తర కృషి ఆగిపోగూడదని మిత్రులు కోరుతున్నారు.

ఈ గడ్డు కాలాన్ని అధిగమించడానికి మరొకసారి మీదగ్గరికి రాక తప్పడం లేదు. మీరు ఇవ్వగలిగిన విరాళం ఎంతైనా సరే, వీక్షణం మనుగడకు అది ఉపయోగపడుతుంది. తెలుగు సమాజంలో ఒక అత్యవసరమైన ప్రయత్నానికి మీ వంతు చేయూత ఇవ్వండి. మీ వీలును బట్టి, మీ శక్తిని బట్టి మీ విరాళం ఎంత స్వల్పమైనా, ఎంత భూరి విరాళమైనా సరే. వీక్షణం మనుగడకు మీ చేయూతనివ్వండి. వీక్షణం చిరకాలం జీవించేందుకు తోడ్పడండి.

విరాళాలు పంపడానికి వివరాలు

వీక్షణం

చెక్/డిడి ద్వారా: వీక్షణం, జి1, మైత్రీ రెసిడెన్సీ,
3-6-394, స్ట్రీట్ నం. 3, హిమాయత్ నగర్, హైదరాబాద్ 500029,
ఫోన్ : 73307 95849, ఇమెయిల్ : veekshanam2003@gmail.com,
www.veekshanam.wordpress.com

ఎలక్ట్రానిక్ ట్రాన్స్ ఫర్ ద్వారా:

Veekshanam,
Account No. 013911011002175,
Union Bank of India, Gagan Mahal Brach, Hyderabad.
IFSC Code: UBIN0801399

ఈ అకౌంట్ నంబర్‌తో ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌ఫర్‌తో పాటు
గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎంల ద్వారా కూడా చెల్లించవచ్చు.

If undelivered please return to:

VEEKSHANAM
Mytri Residency, 3-6-394, St. No. 3,
Himayatnagar, Hyderabad - 500 029.
Phone: 73307 95849

To:
Mr./Mrs.________________________

____

____

____

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at NAVYA PRINTERS, 2-3-655/C/16/B, Durga Nagar, Amberpet, Hyderabad -500013 (New Declaration filed) for Charitha Impressions (as per RNI records) and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao